సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 243

శుక్రవారం 24-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'



ఆర్ట్ ఆఫ్ జోష్

ఫోర్బ్స్ 'టాప్ డిజిటల్ స్టార్స్-2023'లో చోటు సంపాదించిన జోషిపై కథనం. - 12లో



క్వార్టర్ ఫైనల్లో రష్మిక

మహిళల ప్రపంచ టెన్నిస్ టూర్ టోర్నీలో రష్మిక సింగిల్స్‌లో క్వార్టర్స్‌కు చేరింది. - 13లో

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 24-11-2023

ఫ్యాషన్



వివాహ వేడుకలకు ఎప్పుడూ ఒకే విధంగా ముస్తాబు అవడం బోర్ అనిపించినవారు ప్రయోగాత్మకంగా కొన్ని మార్పులు చేసుకోవచ్చు. రిసెప్షన్ మొదలుకొని సంగీత్, హల్దీ, బ్రైడల్‌షవర్ .. అంటూ పెళ్లి వరకు ఈ వింటర్ సీజన్‌లో జరిగే ఒక్కో వేడుకకు ఒక్కో స్పెషల్ డ్రెస్‌తో స్టయిలిష్‌గానూ, అందంగానూ కనిపించేలా వస్తున్న డిజైన్స్‌ని ఇలా ఫాలో అయిపోవచ్చు.

పెళ్లికి ప్రత్యేకం

లాంగ్ కోట్

శీతాకాలం వెల్వెట్ లేదా బ్రొకేడ్ ఎంబ్రాయిడరీ లాంగ్ కోట్స్ అన్ని వేడుకల్లో డ్రెస్సుల మీదకు ధరించవచ్చు. చలి నుంచి రక్షణతో పాటు ఇండోవెస్ట్రన్ లుక్‌తో మెరిసిపోతారు.

ఎంబ్రాయిడరీ ఫ్రాక్ స్టైల్

డ్రెస్సింగ్ గ్రాండ్‌గా ఉండాలనుకునేవారు ప్లెయిన్ పట్టు క్లాత్‌కి ఎంబ్రాయిడరీతో తీర్చిదిద్దుకోవచ్చు. లెహంగా, ఫ్రాక్, దుపట్టా పూర్తి ఎంబ్రాయిడరీ వేడుకలో రిచ్ లుక్‌ను సొంతం చేస్తుంది.

పట్టు కుర్తా లెహంగా

లాంగ్ స్లీవ్స్ కుర్తా, లెహంగా, దుపట్టా పట్టు కాంబినేషన్‌తో డిజైన్ చేయించుకుంటే వేడుకలో ప్రత్యేకంగా కనిపిస్తారు. ఐదురోజులు జరిగే పెళ్లి వేడుకకు ఏదో ఒకరోజు మీదైన ప్రత్యేకతను చూపించవచ్చు.

శారీ స్టైల్

ఒకేతరహాలో చీరకట్టు ప్రత్యేకత ఏముంది అనుకునేవారు లాంగ్ జాకెట్స్ లేదా సైడ్ కుచ్చుల అలంకరణతో స్టైలిష్ లుక్ తీసుకురావచ్చు.

కట్టులో ప్రత్యేకత

ఫ్లోరల్ డిజైన్స్ ఏ సీజన్‌కైనా బాగా నప్పుతాయి. సిల్క్ ఫ్లోరల్ శారీని ప్లెయిన్ వడ్డాణంతో కలిపి, అందంగా రాప్ చేస్తే.. వేడుకలో హైలైట్‌గా నిలవచ్చు.

కుర్తా పైజామా

క్యాజువల్ వేర్‌గా ఉండే ఈ డ్రెస్‌ను ఎంబ్రాయిడరీ, కలర్ కాంబినేషన్‌తో వెడ్డింగ్ ఔట్‌ఫిట్‌గా మార్చేయవచ్చు.

ధోతీ టాప్

ఎంబ్రాయిడరీ లాంగ్ స్లీవ్స్ టాప్, బాటమ్‌గా ధోతీ ప్యాంట్ వేడుకలో స్పెషల్ లుక్‌తో ఆకట్టుకునేలా చేస్తుంది. ధోతీ, టాప్‌లకు చిన్న జరీ అంచు వచ్చేలా డిజైన్ చేయించుకోవచ్చు.

కరువుతీరా ఏడ్చెయ్యండి!

వీపింగ్ బాయ్ తుడిచేస్తాడు!



కోపం, బాధ, సంతోషం వంటి భావోద్వేగాలను వ్యక్తం చేయడంలో ఇతర దేశాల వారికంటే జపాన్ వాసులు వెనుకబడి ఉన్నారు. దీంతో వారు చేసే ఉద్యోగ, వ్యాపారాల్లో సరిగా దృష్టి పెట్టలేకపోతున్నారు. దీని వల్ల ఆయా కంపెనీల రెవెన్యూలపై ప్రభావం పడుతోంది. ఇది గమనించిన అక్కడి కంపెనీలు 'హ్యాండ్‌సమ్ వీపింగ్ బాయిస్' పేరిట పరిష్కార మార్గం వెతికాయి. ఉద్యోగులు పెట్టే కన్నీరు తుడిచి వారిని ఓదార్చడమే ఈ హ్యాండ్‌సమ్ వీపింగ్ బాయిస్ పని. ఉద్యోగి మనసులోని భారం మొత్తం దిగిపోతే మరింత చురుగ్గా పనిచేస్తారు. దీని కోసం అందంగా ఉండే అబ్బాయిలను వీపింగ్ బాయిస్‌గా నియమించుకుంటున్నాయి.

ఏడ్పించి...

కంపెనీలోని కొంతమంది ఉద్యోగులను ఒక రూమ్‌లో కూర్చోబెడతారు. వీరందరికి ఏడుపు వచ్చే సినిమాలు చూపిస్తారు. వీటిలో పెంపుడు కుక్కలను బాధించేవీ,తండ్రీ కూతుళ్ల మధ్య ప్రేమానుబంధాలు వంటి సన్నివేశాలు ఉంటాయి. అవి చూస్తూ బాధ కలిగిన వెంటనే ఉద్యోగులు గొంతు విప్పి మనసారా ఏడవచ్చు. ఇలా ఏడుస్తోన్న వ్యక్తి కన్నీళ్లను హ్యాండ్‌సమ్ వీపింగ్ బాయ్ కాటన్ కర్చీఫ్‌తో ప్రేమగా తుడుస్తాడు. ఇలా అక్కడ ఉన్న వారందరి బాధను వీపింగ్ బాయ్ తన ప్రేమతో, ఓదార్పు మాటలతో పూర్తిగా ఓదార్చుతాడు. ఇలా కంపెనీ ఉద్యోగుల కన్నీరు తుడిచేసి మరీ చక్కగా పనిచేయించుకుంటున్నాయి జపాన్ కంపెనీలు. ఒకసారి నలుగురిలో కన్నీరు పెట్టడం అలవాటైతే వ్యక్తిగత జీవితంలో ఎదురయ్యే సమస్యలను చక్కగా పరిష్కరించుకోగలుగుతారు అని వారు చెబుతున్నారు.

టోక్యోకు చెందిన 'క్రైయింగ్ వర్క్‌షాపు' వ్యవస్థాపకుడు హిరోకి టెకాయ్‌కు వచ్చిన ఐడియానే వీపింగ్ బాయ్. ఆలోచన వచ్చిన తరవాత అనేక వర్క్ షాపులు నిర్వహించి ఈ వీపింగ్ బాయ్‌ను అమలులోకి తెచ్చి పరీక్షించాడు. మంచి ఫలితాలు రావడంతో తన ఆఫీసులోనే వీపింగ్ బాయిస్‌ను నియమించడం మొదలు పెట్టాడు. వర్క్‌షాపులను అందమైన అబ్బాయిలు చక్కగా నిర్వహించడంతో హ్యాండ్‌సమ్ బాయిస్‌ను వీపింగ్ బాయిస్‌గా ఎంచుకున్నాడు. అందమైన అబ్బాయిలు ఓదార్పునిస్తే కొత్త ఉత్సాహం కలుగుతుంది. అందుకే అందమైన అబ్బాయిలను ఈ పనికి ఎన్నుకున్నట్లు టెకాయ్ చెబుతున్నాడు.

ఆ మధ్య నవ్వడం నేర్చుకోవడం మొదలు పెట్టి జపాన్ ఉద్యోగులు నేడు నలుగురిలో సిగ్గుపడకుండా ఏడవడం నేర్చుకోవడం కాస్త విచిత్రంగా ఉన్నప్పటికీ... గుండెల్లో ఉన్న భారం దిగిపోతే ఆ ఆనందం వేరుగా ఉంటుంది. సిగ్గు, బిడియం, బాధ పోయినప్పుడు అందరితో కలిసి మెలిసి తిరగగలుగుతారు.

ఆట గెలిచింది



మేఘా గంభీర్

ఆటలు, సాంకేతిక పరిజ్ఞానం వేరు వేరు విషయాలు కాదు.

సాంకేతికత సహాయంతో ఆటల్లో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు... అనే లక్ష్యంతో హరియాణాలోని గురుగ్రామ్ కేంద్రంగా 'స్తూప స్పోర్ట్స్ ఎనలటిక్స్' అనే స్టార్టప్‌కు శ్రీకారం చుట్టి విజయపథంలో దూసుకుపోతోంది మేఘా గంభీర్.

ఎలాంటి ప్లాన్ లేకుండానే పెద్ద కార్పొరేట్ కంపెనీలో తాను చేస్తున్న ఉద్యోగానికి గుడ్‌బై చెప్పింది మేఘా గంభీర్. అదే సమయంలో ఆమె భర్త, టేబుల్ టెన్నిస్ కోచ్ దీపక్ మాలిక్ 'టెక్నాలజీ సహాయంతో ట్రైనీల పెర్‌ఫార్మెన్స్‌ను ఎలా మెరుగుపరచవచ్చు...' అనే అంశంపై ఆలోచిస్తున్నాడు. మేఘకు వెంటనే స్టార్టప్ ఐడియా తట్టింది.

డేటా, ఎనలటిక్స్ సహాయంతో ప్లేయర్స్ తమ ఆటతీరును మెరుగు పరుచుకోవడానికి రెండు సంవత్సరాల క్రితం 'స్తూప స్పోర్ట్స్ ఎనలటిక్స్' అనే స్టార్టప్‌కు శ్రీకారం చుట్టింది. దీనికిముందు అమెరికన్ ఎక్స్‌ప్రెస్, పెప్సికో... మొదలైన కంపెనీలలో పదిహేను సంవత్సరాల పాటు టెక్ కన్సల్టెంట్, ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేసింది. మేఘకు ఆటలు అంటే చాలా ఇష్టం. బ్యాడ్మింటన్ ప్లేయర్ కూడా.

ఆటలలో నిపుణులైన ఎంతోమందితో మాట్లాడిన తరువాత తన స్టార్టప్ ఐడియాను పట్టాలకెక్కించింది.

డేటాను కాప్చర్ చేసే ఆటోమేటెడ్ ఇంజిన్‌ను తయారు చేయడానికి సంవత్సరానికి పైగా టైమ్ పట్టింది. ఆటలో ప్రతి కోణాన్ని విశ్లేషించుకునేలా కోర్టులో 8–10 కెమెరా సెటప్‌కు రూపకల్పన చేశారు. కంపెనీకి సంబంధించి ప్రత్యేక టెక్నాలజీకి పేటెంట్ కూడా తీసుకున్నారు.

ప్రస్తుతం ఈ కంపెనీకి పదిహేనుకు పైగా గ్లోబల్ క్లయింట్స్ ఉన్నారు.

'టెక్నాలజీ వైపు నుంచి స్పోర్ట్స్ ఎనలటిక్స్ వైపు మేఘ రావడానికి కారణం ఏమిటి?' జవాబు ఆమె మాటల్లోనే...

'ఒక పెద్ద కంపెనీలో పెద్ద జీతంతో పనిచేస్తున్నప్పటికీ నేను చేస్తున్న ఉద్యోగంతో సంతోషంతో లేను. ఉద్యోగం కాకుండా నెక్స్ట్ ఏమిటి... అని ఆలోచించడానికి గ్యాప్ తీసుకోవాలనుకున్నాను. ఆ సమయంలో నా భర్త వల్ల స్టార్టప్ ఆలోచన వచ్చింది. స్పోర్ట్స్ సైన్స్ కాంగ్రెస్‌లో నా కాన్సెప్ట్‌ను ప్రెజెంట్ చేస్తే మంచి స్పందన వచ్చింది. జూనియర్స్, యూత్, సీనియర్స్... ఇలా రకరకాల విభాగాలు ఆటలో ఉంటాయి. ప్రతి మ్యాచ్‌కు, ప్రతి ప్లేయర్‌కు సంబంధించిన సమాచారాన్ని కాప్చర్ చేయడం కోచ్‌లకు కష్టం అవుతుంది. ట్రెనింగ్ సెషన్స్ ప్రారంభించడానికి వారి దగ్గర తగిన సమాచారం ఉండాలి. ఒక ప్లేయర్ టోర్నమెంట్‌కు సంబంధించి అయిదు లేదా పది మ్యాచ్‌లు చూడాల్సి వస్తే డేటా రాయడానికి రెండు మూడు వారాల సమయం పడుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్లేయర్స్ పెర్‌ఫార్మెన్స్ ఎనలటిక్స్‌కు ఉపయోగపడే ఏఐ ప్రాడక్ట్‌ను తీసుకువచ్చాం. దీనిద్వారా ప్లేయర్స్ తమ మ్యాచ్ వీడియోలను అప్‌లోడ్ చేసి విశ్లేషణ రిపోర్ట్‌ను తీసుకోవచ్చు. ఇదే సమయంలో కామెంటర్స్‌కు ఉపయోగపడే ఏఐ ప్రాడక్ట్స్ రూపొందించాం. టేబుల్ టెన్నిస్‌తో మొదలుపెట్టాం. బ్యాడ్మింటన్ లాంటి ఇతర ఆటల్లోకి కూడా విస్తరించే ప్రణాళికలతో ఉన్నాం' అంటుంది మేఘా గంభీర్.

నాణ్యతతో కూడిన వర్చువల్ కోచింగ్, ప్లేయర్స్‌కు ఉపయోగపడే సెన్సర్–బేస్డ్ టెక్నాలజీపై ప్రత్యేక కృషి పెట్టింది కంపెనీ. యూరప్ మార్కెట్‌లో పట్టు సంపాదించిన 'స్తూప' ఆసియా, యూఎస్ మార్కెట్‌లోకి కూడా విస్తరించడానికి తగిన ప్రణాళికలు రూపొందించుకుంది.

'మహిళా స్పోర్ట్స్ ఎంటర్‌ప్రెన్యూర్‌లు తక్కువగా కనిపిస్తారు. చాలామంది లైఫ్‌స్టైల్, ఫ్యాషన్, ఫుడ్‌లాంటి రంగాలను ఎంపిక చేసుకుంటారు. స్పోర్ట్స్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా నేను విజయం సాధించడానికి కారణం చక్కని సలహాలు ఇచ్చిన అనుభవజ్ఞులు, విషయ నిపుణులు, ప్లేయర్స్, కోచ్‌ల నుంచి తీసుకున్న ఫీడ్‌బ్యాక్' అంటుంది మేఘా గంభీర్.

వంటిల్లు

కమ్మని కార్తీకం

కార్తీక మాసం కావడంతో... కోవెళ్లు, లోగిళ్లు దీపాలతో కళకళలాడిపోతున్నాయి. మరో రెండు రోజుల్లో కార్తీక పౌర్ణమి. పగలంతా ఉపవాసం ఉన్నవారికి సాయంత్రం చంద్రోదయం కాగానే రుచిగా... శుచిగా కమ్మని వంటలతో ఉపవాస విరమణ చేయమని చెబుతోంది ఈ వారం వంటిల్లు.

కొబ్బరి పోలీ



కావలసినవి: **మైదా** – మూడు కప్పులు; **పసుపు** – పావు టీస్పూను; **నువ్వుల నూనె** – నాలుగు టేబుల్ స్పూన్లు; **బెల్లం తరుగు** – రెండు కప్పులు; **పచ్చికొబ్బరి తురుము** – నాలుగు కప్పులు; **యాలకుల పొడి** – అరటీస్పూను; **నెయ్యి** – నాలుగు టేబుల్ స్పూన్లు.

తయారీ: పెద్దగిన్నెలో మైదా, పసుపు వేసి కలపాలి. ● దీనిలో కొద్ది కొద్దిగా నీళ్లపోసుకుంటూ ముద్దలా కలపాలి. ● చివరగా నువ్వుల నూనె వేసి కలిపి మూతపెట్టి నలభై నిమిషాలపాటు పక్కన పెట్టుకోవాలి. ● మందపాటి బాణలిలో బెల్లం, అరకప్పు నీళ్లపోసి సన్నని మంట మీద కరగనివ్వాలి. ● ఐదు నిమిషాలకు బెల్లం కరుగుతుంది. బెల్లం నీటిని పలుచని వస్త్రం లేదా సన్నని చిల్లులున్న స్ట్రెయినర్‌తో వడగట్టాలి. ● వడగట్టిన బెల్లం నీటిని మళ్లీ స్టవ్ మీద పెట్టి మరిగించాలి. ఇందులో కొబ్బరి తురుము వేసి అడుగంటకుండా కలుపుతూ దగ్గరయ్యే వరకు ఉడికించాలి. ● మిశ్రమం దగ్గరపడి ఉండలా మారుతున్నప్పుడు యాలకుల పొడి వేసి మరోమారు కలిపి దించేయాలి. ● అరటి ఆకు లేదా బ్లాటింగ్ పేపర్‌కు కొద్దిగా నెయ్యి రాయాలి. కలిపి సిద్ధంగా ఉంచిన మైదాపిండిని చిన్న చిన్న ఉండల్లా చేయాలి. ● ఇప్పుడు ఒక్కో ఉండను పూరీలా వత్తాలి. కొబ్బరి మిశ్రమాన్ని పూరీ మధ్యలో పెట్టి, మిశ్రమం బయటకు రాకుండా చుట్టాలి. ● కొబ్బరి మిశ్రమం బయటకు కనబడకుండా మైదా పిండితో కప్పేయాలి. చేతికి నెయ్యి రాసుకుని వీటిని బొబ్బట్లలా వత్తుకోవాలి. ● ఇలా పిండినంతటనీ బొబ్బట్లలా వత్తుకున్న తర్వాత పెనం వేడి చేసి కొద్దిగా నెయ్యి వేసి మీడియం మంటమీద రెండు వైపులా కాల్చుకుంటే కొబ్బరి పోలీ రెడీ.

తినాయ్(కొర్ర) లడ్డు



కావలసినవి: **కొర్రలు** – కప్పు; **పల్లీలు** – కప్పు; **బెల్లం తరుగు** – కప్పు; **యాలకులు** – మూడు.

తయారీ: కొర్రలను శుభ్రంగా కడిగి అరగంట నానబెట్టాలి. ● అరగంట తరువాత నీటిని వంపేసి ఎండలో ఆరబోయాలి. ● తడిలేకుండా ఎండిన కొర్రలను బాణలిలో వేసి బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు దోరగా వేయించాలి. ● కొర్రలు వేగిన బాణలిలోనే పల్లీలను వేసి వేయించాలి. ● పల్లీలు చక్కగా వేగిన తరువాత పొట్టుతీసేసి పక్కన పెట్టుకోవాలి. ● ఇదే బాణలిలో బెల్లం, రెండు టేబుల్ స్పూన్ల నీళ్లపోసి సన్నని మంట మీద పెట్టాలి. ● బెల్లం కరిగిన తరువాత వడగట్టి పక్కన పెట్టుకోవాలి. ● ఇప్పుడు వేయించి పెట్టుకున్న కొర్రలు, పల్లీలు, యాలకులను మిక్సీజార్‌లో వేసి పొడి చేయాలి. ● కొర్రలు, పల్లీల పొడిని ప్లేటులో వేసుకుని, ఆ పొడిలో బెల్లం నీళ్ల వేస్తూ లడ్డులా చుట్టుకుంటే తినాయ్ లడ్డు రెడీ. ● బెల్లం ఇష్టపడని వారు తేనెతో లడ్డులా చుట్టుకోవచ్చు. ● ఈ లడ్డు మూడు నాలుగురోజులపాటు తాజాగా ఉంటుంది.

హబీసా దాల్మా



కావలసినవి: **పెసర పప్పు** – కప్పు; **అరటికాయ** – పెద్దది ఒకటి; **చేమదుంపలు** – నాలుగు; **టొమాటో** – ఒకటి; **పచ్చిబొప్పాయి** – చిన్నది ఒకటి; **అల్లం** – అంగుళం ముక్క; **నెయ్యి** – మూడు టేబుల్ స్పూన్లు; **బిర్యానీ ఆకులు** – నాలుగు; **ఎండు మిర్చి** – ఏడు; **జీలకర్ర** – మూడు టేబుల్ స్పూన్లు; **ఆవాలు** – టీస్పూను; **పచ్చికొబ్బరి తురుము** – రెండు టేబుల్ స్పూన్లు; **కొత్తిమీర తరుగు** – రెండు టేబుల్ స్పూన్లు; **ఉప్పు** – రుచికి సరిపడా.

తయారీ: ముందుగా నాలుగు ఎండు మిర్చి, రెండు టేబుల్ స్పూన్ల జీలకర్రను దోరగా వేయించి పొడిచేసి పెట్టుకోవాలి. ● అరటికాయ, చేమ దుంపలు, బొప్పాయి తొక్కతీసి ముక్కలుగా తరగాలి. అల్లం, టొమాటోను కూడా సన్నగా తరిగి పెట్టుకోవాలి. ● పెసరపప్పు కడిగి కుక్కర్‌లో వేయాలి. అందులో మూడు కప్పుల నీళ్లు, అరటి, చేమ, బొప్పాయి, అల్లం ముక్కలు, బిర్యానీ ఆకులు వేయాలి. రుచికి సరిపడా ఉప్పు వేసి మూతపెట్టాలి. ● పెద్ద మంటమీద ఒక విజిల్ రానిచ్చి దించేయాలి. ● ఇప్పుడు స్టవ్ మీద బాణలి పెట్టి నెయ్యి వేయాలి. ● వేడెక్కిన నెయ్యిలో మిగిలిన ఎండు మిర్చి, జీలకర్ర, ఆవాలు వేసి వేయించాలి. ● ఇవి వేగాక కుక్కర్‌లో ఉడికిన పప్పు మిశ్రమాన్ని వేసి కలపాలి. ● ఇప్పుడు కొత్తిమీర తరుగు, పచ్చికొబ్బరి తురుము, మిర్చి, జీలకర్ర పొడి వేసి ఐదు నిమిషాలు మగ్గనిస్తే హబీసా దాల్మా రెడీ. ●వేడివేడి అన్నంతో సర్వ్ చేసుకోవాలి.

స్వీట్‌పొటాటో బిస్కెట్స్



కావలసినవి: **చిలగడ దుంపలు** – పావు కేజీ; **పాలు** – ముప్పావు కప్పు; **మైదా** – ఒకటిన్నర కప్పులు; **కార్న్ స్టార్చ్** – రెండు టేబుల్ స్పూన్లు; **పంచదార** – రెండున్నర టేబుల్ స్పూన్లు; **వంటసోడా** – టేబుల్ స్పూను; **ఉప్పు** – ఒకటింబావు టీస్పూన్లు; **బటర్** – అర కప్పు.

తయారీ: చిలగడ దుంపలను ఉడికించి తొక్క తీసి చిదిమి, అందులో పాలుపోసి కలిపి పక్కన పెట్టుకోవాలి. ● మిక్సీజార్‌లో కార్న్ స్టార్చ్, పంచదార, మైదా, వంట సోడా వేసి రెండు నిమిషాలు గ్రైండ్ చేయాలి. ● ఇప్పుడు బటర్, ఉప్పు కూడా వేసి గ్రైండ్ చేసి గిన్నెలోకి తీసుకోవాలి. ● దీనిలో చిలగడ దుంప చిదుము వేసి పిండి ముద్దలా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఒక ప్లేటులో పెట్టి ముప్పావు అంగుళం మందంలో ఉండేలాగా, సమంగా ఒకటే మందంలో ఉండేటట్లు సర్దాలి. ● ఇప్పుడు చాకుతో ఇష్టమైన ఆకారంలో ముక్కలుగా కట్ చేయాలి. పిండి చేతులకు అతుక్కుంటూ ఉంటే పొడి పిండి (మైదా) చల్లుకోవాలి. ● ఈ ముక్కలను బేకింగ్ ట్రేలో పెట్టి 360 డిగ్రీల ఉష్ణోగ్రతలో పదిహేను నిమిషాలు బేక్ చేయాలి. ముక్కలు గోల్డెన్ కలర్‌లోకి మారితే స్వీట్ పొటాటో బిస్కెట్స్ రెడీ ● గాలి చొరబడని డబ్బాలో నిల్వచేస్తే మూడు నెలలు పాడవకుండా ఉంటాయి.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 243

శుక్రవారం 24-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'



ఆఖరి బంతికి గట్టెక్కాం

ఆస్ట్రేలియాతో విశాఖపట్నంలో గురువారం జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో భారత జట్టు రెండు వికెట్ల తేడాతో గెలిచింది. 209 పరుగుల లక్ష్యాన్ని భారత జట్టు 19.5 ఓవర్లలో ఛేదించింది. టి20ల్లో భారత్‌కిదే అత్యధిక ఛేజింగ్ కావడం విశేషం. -13లో



కశ్మీర్‌లో ముగిసిన ఎన్‌కౌంటర్

జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో గురువారం రెండో రోజు కూడా ఉగ్రవాదులు, భద్రతా బలగాల మధ్య ఎదురుకాల్పులు కొనసాగాయి. బుధవారం ఎన్‌కౌంటర్ గాయపడిన ఇద్దరు జవాన్లలో ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారని అధికారులు తెలిపారు. దీంతో, ఈ ఎన్‌కౌంటర్ అసువులు బాసిన జవాన్ల సంఖ్య అయిదుకు చేరుకుంది.

- వివరాలు 6లో

కంప్యూటర్ కోర్సుల బోధనకు..

అధ్యాపకులంతా అర్హులే

- ఆయా సర్టిఫికెట్ కోర్సులు చేసి ఉండాలి
- యూనివర్సిటీలకు ఏఐసీటీఈ స్పష్టత

- వివరాలు 14లో

పటాన్‌చెరులో గురువారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్





మేం వండి పెడితే.. వడ్డిస్తరట

రాష్ట్ర సంపదను పెంచింది బీఆర్‌ఎస్ సర్కారు • దాన్ని తుంచి, దోచుకునేందుకు కాంగ్రెస్ కుయుక్తులు: సీఎం కేసీఆర్

- కాంగ్రెస్ అంటే కర్ఫ్యూ, ఘర్షణలు, గడబిడలే..
- వాళ్లకు ఓటేస్తే మళ్లీ పాత రోజులే వస్తాయి
- రైతుబంధు, బీమా, కరెంటు ఆగమవుతాయి
- మేం అన్నివర్గాల సంక్షేమం కోసం పనిచేశాం
- హిందువులు, ముస్లింలు నాకు రెండు కళ్లు
- మైనార్టీల కోసం పహాడీషరీఫ్‌లో ప్రత్యేక ఐటీ హబ్
- మహేశ్వరం, వికారాబాద్, జహీరాబాద్, పటాన్‌చెరు ప్రజా ఆశీర్వాద సభల్లో ప్రసంగం

సాక్షి, రంగారెడ్డి జిల్లా/వికారాబాద్/పటాన్‌చెరు/జహీరాబాద్: తాము ఆర్థిక క్రమశిక్షణ పాటించడంతో రాష్ట్రంలో సంపద పెరిగిందని.. దీనిని తుంచడానికి కాంగ్రెస్ కుయుక్తులు పన్నుతోందని బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆరోపించారు. మీరు వంటలు చేసిపెడితే.. మేం వచ్చి వడ్డిస్తామన్న చందంగా కాంగ్రెస్ తీరు ఉందని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ప్రతిరోజూ ఘర్షణలు, గడబిడలేనని.. కాంగ్రెస్ అంటే కర్ఫ్యూ అని మండిపడ్డారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం ప్రశాంతంగా ఉందని, అన్ని వర్గాల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం పనిచేసిందని చెప్పారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల చరిత్రను చూసి, ఆలోచించి ఓటేయాలని కోరారు. గురువారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, వికారాబాద్, సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, పటాన్‌చెరు నియోజకవర్గాల పరిధిలో జరిగిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమం కోసం పనిచేసింది. కాంగ్రెస్ మైనార్టీలకు చేసిందేమీ లేదు. వారిని ఎప్పుడూ ఓటు బ్యాంకుగానే చూసింది. మేం మైనార్టీ విద్యార్థులకు మంచి విద్య అందించేందుకు రెసిడెన్షియల్ స్కూళ్లు పెట్టాం. రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలుగా కూడా మార్చుకుంటున్నం. గత పదేళ్లలో

మిగతా 2వ పేజీలో ▶

సుస్థిరతకే ఓటు

• గ్రేటర్ వాయిస్



అభివృద్ధి ఆగొద్దు.. సుస్థిరత కావాలంటున్న సిటీ జనం

'గ్రేటర్' మరింత విస్తరించాలనే ఆకాంక్ష

జీహెచ్‌ఎంసీ పరిధిలోని 8 కారిడార్లలో సాక్షి ఆన్‌ఫీల్డ్ సర్వే

శాసనసభ ఎన్నికల ముంగిట గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 'సాక్షి' రోడ్ షో నిర్వహించింది. నగరాభివృద్ధిపై జనం ఏమంటున్నారు?, ఎవరొస్తే బాగుంటుందని భావిస్తున్నారు?.. ఇలా వివిధాంశాలపై అన్ని వర్గాల ప్రజల మనోగతం తెలుసుకునే యత్నం చేసింది. నగరాన్ని ఎనిమిది కారిడార్లుగా విభజించి ప్రజాభిప్రాయాన్ని సేకరించింది. మొత్తానికి ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే సుస్థిర ప్రభుత్వమే రావాలని అత్యధిక మంది తేల్చి చెప్పారు. కొత్త ప్రభుత్వం వస్తే మళ్లీ మొదటికొస్తుందనే అభిప్రాయం వ్యక్తమైంది.

6 కౌంట్ డౌన్ జంగ్ తెలంగాణ

- వివరాలు 7లో

సింగరేణి సెగ ఎవరికి? | రె'బెల్స్' కాదు ... ప్రత్యర్థి పక్షమే!

8లో

క్లుప్తంగా...

నేడు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల

తిరుమల: భక్తుల సౌకర్యార్థం 2024 ఫిబ్రవరి నెలకు సంబంధించిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను శుక్రవారం ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అదేవిధంగా తిరుమల, తిరుపతిలోని గదుల కోటాను అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. భక్తులు www.tirumala.org వెబ్‌సైట్‌లో ముందస్తుగా దర్శన టికెట్లు, గదులను బుక్ చేసుకోవాలని టీటీడీ కోరింది.

27న శ్రీవారి సేవ కోటా విడుదల: 2024 ఫిబ్రవరి 16న రథసప్తమి పర్వదినానికి సంబంధించిన శ్రీవారి సేవ స్లాట్లను ఈ నెల 27న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. 18 నుంచి 50 ఏళ్ల వరకు వయోపరిమితి ఉన్నవారు మాత్రమే ఈ స్లాట్లను బుక్ చేసుకునేందుకు అర్హులు. తిరుమల, తిరుపతిలో భక్తులకు స్వచ్ఛంద సేవ చేసేందుకు గాను 2024 జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించిన శ్రీవారి సేవ, నవనీత సేవ కోటాను అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేస్తారు. ఈ సేవలను www.tirumala.org వెబ్‌సైట్‌లో భక్తులు బుక్ చేసుకోవచ్చు. కాగా, తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 27న పరిపాలన కారణాల వల్ల బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.

ఇన్‌స్పెక్టర్ సభావేదిక ఎక్కలేదు

- అక్బరుద్దీన్ ఆరోపణలు అవాస్తవం
- సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ రోహిత్‌రాజు

సంతోష్‌నగర్: మజ్లిస్ బహిరంగ సభలో సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శివచంద్ర సభావేదిక ఎక్కినట్లు ఎలాంటి ఆధారాలు లేవని, ఆయనపై చాంద్రాయణగుట్ట మజ్లిస్ అభ్యర్థి, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ చేసిన ఆరోపణలు నిజం కాదని దర్యాప్తులో తేలిందని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ రోహిత్ రాజు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అక్బరుద్దీన్ ఈ నెల 21న సంతోష్‌నగర్‌లోని ఈదిబజార్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఇన్‌స్పెక్టర్ శివచంద్రను అడ్డుకోవడంతోపాటు తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించారన్నారు. అక్బరుద్దీన్ చేసిన ఆరోపణలపై పోలీసు, ఎఫ్ఎస్‌టీ, మీడియా చానళ్లు, ఎస్‌బీ రిసోర్స్ సెంటర్, స్మార్ట్ మీడియా ఇన్వెస్టిగేషన్ టీమ్, సీపీ కార్యాలయంలో అందుబాటులో ఉన్న అన్ని ఆధారాలను పరిశీలించగా ఇన్‌స్పెక్టర్ డయాస్ ఎక్కినట్లు ఎలాంటి ఆధారాలూ లభించలేదన్నారు. సభలో ద్వేషపూరిత ప్రసంగం చేసి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఆయన ఉల్లంఘించారని పేర్కొన్నారు.

విశాఖ నుంచి పాలనకు కీలక అడుగు

విశాఖ మిలీనియం టవర్లలో మంత్రులు, సీనియర్ అధికారుల క్యాంపు కార్యాలయాలు

- ఏ, బీ టవర్లలో 1.75 లక్షల చదరపు అడుగుల వసతి
- సీఎం, మంత్రులు, సమీక్షలకు ఈ టవర్లను వినియోగించుకోవాలి
- 16 శాఖలకు వివిధ ప్రాంతాల్లో భవనాలు కేటాయింపు



విశాఖ బీచ్ రోడ్డు

సాక్షి, అమరావతి: విశాఖపట్నం నుంచి పరిపాలనకు కీలక అడుగు పడింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో సమతుల అభివృద్ధిలో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో సమీక్షలు, పర్యవేక్షణ చేయాల్సి ఉన్నందున ముఖ్యమంత్రి, మంత్రులు, సీనియర్ అధికారులు ఆ జిల్లాల్లో పర్యటించడంతో పాటు విశాఖపట్నంలో రాత్రి పూట బస చేయాల్సి ఉందని, ఈ నేపథ్యంలో మంత్రులు, సచివాలయాల శాఖలు, సీనియర్ అధికారులకు కార్యాలయాల వసతిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖలో మంత్రులు, సచివాలయ, వివిధ శాఖాధిపతుల కార్యాలయాలు, క్యాంపు కార్యాలయాలకు భవనాలను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారులతో కమిటీని నియమించింది. ఈ కమిటీ సిఫార్సుల మేరకు మంత్రులు, సచివాలయ శాఖల కార్యాలయాల వసతికి ప్రభుత్వ భవనాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కేఎస్ జవహర్ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రులు, సీనియర్ అధికారుల సమీక్ష సమావేశాలకు రుషికొండలోని మిలీనియం టవర్స్ ఏ, బీని క్యాంపు కార్యాలయాలుగా గుర్తించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సొంత భవనాల్లేని ప్రధాన శాఖలకు కూడా ఈ టవర్లలో వసతి కేటాయించనున్నట్లు తెలిపారు. ఇక్కడ 1.75 లక్షల చదరపు అడుగుల స్థలంలో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మిగతా శాఖలకు నగరంలోని వివిధ ప్రభుత్వ భవనాల్లో మొత్తం 2.27 లక్షల చదరపు అడుగులు కేటాయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మొత్తం 35 శాఖల్లో 16 శాఖలకు మాత్రమే ప్రస్తుతానికి విశాఖలో వసతి కేటాయించారు. వీటికి ఎండాడ, హనుమంతవాక, దయాళ్ నగర్, మహారాణి పేట, కంచరపాలెం, దుర్గానగర్, రాంనగర్, ఎంవిపీ కాలనీ, పెందుర్తి, మద్దిలపాలెం, సిరిపురం సర్కిల్, భీమునిపట్నం, మర్రిపాలెం, ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంతాల్లో భవనాలు కేటాయించారు. మిగతా 19 శాఖలకు భవనాలను గుర్తించాల్సి ఉందని తెలిపారు. ఆర్‌టీజీఎస్, సాంఘిక సంక్షేమం, ఆర్థిక, సాధారణ పరిపాలన, గ్రామ, వార్డు సచివాలయాలు, ఉన్నత విద్య, గృహ నిర్మాణం, మౌలిక సదుపాయాలు ఐటీ, కార్మిక, న్యాయ, మైనారిటీ సంక్షేమం తదితర శాఖలకు వసతి గుర్తించాల్సి ఉందన్నారు. ఏ శాఖకైనా విశాఖలో సొంత భవనాలు ఉంటే వాటిలో కార్యాలయాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. సీనియర్ అధికారుల గృహ వసతి కోసం ముందుగా సొంత భవనాలను వినియోగించుకోవాలని సూచించారు. మిలీనియం టవర్లలో వసతి కేటాయింపులపై ఐటీ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్తర్వులకు అనుగుణంగా సచివాలయానికి సంబంధించిన అన్ని శాఖలు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వ్యక్తిగత కక్షతోనే వ్యాజ్యం

ప్రభుత్వ పెద్దలపై విషం చిమ్మడమే రఘురామ ధ్యేయం

- ముఖ్యమంత్రిని వదిలేది లేదంటూ ప్రకటనలు చేశారు
- ఆ దురుద్దేశాలు, ఆయనకెంత విశ్వసనీయత ఉందో పరిశీలించండి
- రుణ సంస్థలకు రూ.వందల కోట్లను ఎగ్గొట్టారు.. సీబీఐ కేసూ నమోదైంది
- పిల్ విచారణార్హతపై తేల్చాకే కేసు పూర్వాపరాల్లోకి వెళ్లాలి
- ఏపీ హైకోర్టుకు నివేదించిన అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్
- అంగీకరించిన ధర్మాసనం.. ప్రతివాదులందరికీ నోటీసులు

సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ప్రజా సంక్షేమ పథకాలకు దురుద్దేశాలను ఆపాదిస్తూ నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు హైకోర్టును ఆశ్రయించారు. సంక్షేమ పథకాల్లో అక్రమాలు జరిగాయని, పలువురికి లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలున్నాయని, వాటిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు గురువారం విచారణ జరిపింది. ఈ వ్యాజ్యంలో ముఖ్యమంత్రి జగన్, ఎంపీ వి.విజయసాయిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులను వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేయడంపై అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ అభ్యంతరం తెలిపారు. దురుద్దేశాలతోనే వీరందరినీ వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చారని నివేదించారు. ప్రభుత్వంపై, రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారిపై రఘురామ విషం చిమ్మడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. వ్యక్తిగత కక్షతోనే ఆయన ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారన్నారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలను తప్పుబడుతూ వ్యాజ్యం దాఖలు చేస్తున్నట్లు పేర్కొన్న రఘురామ అందులో సంబంధం లేని వారిని వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చారన్నారు. ఈ పిల్ దాఖలు చేసిన తరువాత ముఖ్యమంత్రిని వదిలేదంటూ మీడియా సమావేశాలు నిర్వహించి ప్రకటనలు చేశారని నివేదించారు.

అందుకు అనుమతించొద్దు

ప్రజా ప్రయోజనం పేరుతో వ్యాజ్యం దాఖలు చేసిన రఘురామ వాస్తవాలను కోర్టు ముందు ఉంచలేదని ఏజీ శ్రీరామ్ తెలిపారు. తనకు సంబంధించిన అన్ని విషయాలను పిల్‌లో పేర్కొన్నట్లు డిక్లరేషన్ ఇచ్చిన రఘురామ వాస్తవానికి పలు కీలక విషయాలను తొక్కిపెట్టారన్నారు. ఆయన చైర్మన్, ఎండీగా వ్యవహరించిన కంపెనీ పలు రుణ సంస్థలకు రూ.700 కోట్లకు పైగా రుణాలను ఎగవేసిందన్నారు. పిటిషనర్ సీబీఐ కేసు కూడా ఎదుర్కొంటున్నారని శ్రీరామ్ కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వివరాలను ఆయన వ్యాజ్యంలో పేర్కొనలేదన్నారు. వ్యక్తిగత, రాజకీయ ఎజెండాతో రఘురామ ముందుకెళుతున్నారని, అందుకు ఈ వ్యాజ్యమే ఉదాహరణ అని పేర్కొన్నారు. దీనికి ఎంత మాత్రం అనుమతించొద్దని కోర్టును ఏజీ అభ్యర్థించారు. ఈ వ్యాజ్యం విచారణార్హతపై తమకు అభ్యంతరం ఉందన్నారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపే ముందు రఘురామకృష్ణరాజు దురుద్దేశాలను, ఆయనకెంత విశ్వసనీయత ఉందో పరిశీలించాలని కోరారు. ముందు దీన్ని తేల్చిన తరువాతే ఈ వ్యాజ్యంలో తదుపరి విచారణను చేపట్టాలన్నారు. పిల్ నిబంధనల ప్రకారం ప్రతివాదుల జాబితా నుంచి ఎవరినైనా తొలగించే అధికారం ధర్మాసనానికి ఉందన్నారు.

ముందు విచారణార్హతపై తేలుస్తాం..

వాదనలు విన్న హైకోర్టు తొలుత రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన ఈ వ్యాజ్యం విచారణార్హతపై తేలుస్తామని స్పష్టం చేసింది. ఆ తరువాతే తదుపరి ప్రక్రియ చేపడతామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రతివాదులందరూ విచారణార్హతపై అభ్యంతరాలు తెలియచేయాలని, అందువల్ల వారందరికీ నోటీసులు జారీ చేస్తామని తెలిపింది. రేపు ఎవరూ తమకు వాదనలు వినిపించే అవకాశం రాలేదని అనకూడదని పేర్కొంది. న్యాయ ప్రయోజనాల నిమిత్తం అందరికీ నోటీసులు జారీ చేస్తున్నామంది. నోటీసులు జారీ చేయడం అందరికీ మంచిదని హైకోర్టు స్పష్టం చేసింది.

పలువురికి నోటీసులు జారీ...

ఈమేరకు వ్యక్తిగత ప్రతివాదులుగా ఉన్న ముఖ్యమంత్రి జగన్, ఎంపీ విజయసాయిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డిలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పలు కంపెనీలకు, డైరెక్టర్లకు కూడా నోటీసులు ఇచ్చింది. సీబీఐ డైరెక్టర్, కేంద్ర హోం శాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి, ఆర్థిక, రెవెన్యూ, గనులు, పరిశ్రమలు, సమాచార పౌర సంబంధాలు, వైద్య, ఆరోగ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులకు సైతం నోటీసులు జారీ చేసింది. మొత్తం 41 మందికి నోటీసులు ఇచ్చిన హైకోర్టు వారందరినీ రఘురామకృష్ణరాజు వ్యాజ్యం విచారణార్హతపై అభ్యంతరాలను తెలియచేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 14కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. మధ్యంతర ఉత్తర్వుల కోసం తాము అనుబంధ పిటిషన్ దాఖలు చేశామని, దాన్ని అనుమతించాలని రఘురామకృష్ణరాజు తరఫు సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు కోరారు. ఇసుక, మద్యం పాలసీలకు సంబంధించిన రికార్డులను జాగ్రత్త చేసేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించారు. ఆ పాలసీలకు సంబంధించిన రికార్డులను ధ్వంసం చేస్తున్నారని, వాటిని సీజ్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఏయూ రంగస్థలానికి పూర్వవైభవం

- నేడు ప్రారంభించనున్న నాగార్జున



విశాఖ (ఏయూ క్యాంపస్): ఆంధ్రా విశ్వకళా పరిషత్ తన పేరును సార్థకం చేసుకుంటూ చిత్రకళలు, నాటక రంగం, సంగీతం, నృత్యం నుంచి నేటి సినీ సంగీతం వరకు ఎందరో ఉద్దండులను సమాజానికి అందించే బృహత్తర బాధ్యతను నిర్విరామంగా నిర్వహిస్తోంది. దశాబ్దాల క్రితం కళలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నిర్మించిన ఆరుబయలు రంగస్థలం దాదాపు రెండున్నర దశాబ్దాలుగా నిరాదరణకు గురైంది. ప్రస్తుత వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి చొరవ తీసుకుని దీనిని పూర్తిస్థాయిలో ఆధునీకరించి వినియోగంలోకి తెచ్చారు.

1940లో పునాదిరాయి

ఎస్కిన్ స్క్వేర్ పేరిట 1940లో అప్పటి మద్రాసు గవర్నర్ రూథర్‌ఫర్డ్ ప్రారంభించబడిన ఏయూ కళాప్రాంగణం ఘనమైన చరిత్రకు సాక్ష్యంగా నిలిచింది. ఇక్కడ ప్రదర్శించిన నాటకాలను వీక్షించేందుకు అక్కినేని నాగేశ్వరరావు, ఎన్టీ రామారావు వంటి తెలుగు సినిమా అగ్ర కథానాయకులు వచ్చేవారు. రంగస్థల చారిత్రక, కళాప్రాశస్త్యాలు దెబ్బతినకుండా నేటి తరానికి ఉపయుక్తంగా సర్వహంగులతో సిద్ధం చేశారు. సినీ నటుడు అక్కినేని నాగార్జున, అమల, అఖిల్, అక్కినేని సుశీల శుక్రవారం జరిగే కార్యక్రమంలో దీనిని ప్రారంభిస్తారు.

మే 26న జేఈఈ అడ్వాన్స్‌డ్

సాక్షి, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను వచ్చే సంవత్సరం మే 26న నిర్వహిస్తున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) గురువారం ప్రకటించింది. 2024 ఏప్రిల్ 21 నుంచి ఏప్రిల్ 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారంది. మే 6 నాటికి పరీక్షఫీజు చెల్లించాలని, మే 17 నుంచి అడ్మిట్‌కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎన్‌టీఏ పేర్కొంది. జేఈఈ మెయిన్స్ పరీక్ష జనవరి, ఏప్రిల్‌లో జరుగుతుంది. ఇందులో అర్హత పొందినవారిలో 2 లక్షలమందికి అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత కల్పిస్తారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో వచ్చే ర్యాంకు ఆధారంగా దేశంలోని ఐఐటీల్లో ఇంజనీరింగ్ సీట్లు కేటాయిస్తారు. మెయిన్స్‌లో సాధించే ర్యాంకు ఆధారంగా ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే కాలేజీల్లో సీట్లు కేటాయిస్తారు.


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 243


శుక్రవారం 24-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆచితూచి రుణాలివ్వండి

ఎన్‌బీఎఫ్‌సీలకు సూచించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ -13లో



ఆరంభ లాభాలు ఆవిరి

తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు -13లో



రాహుల్‌కు ఈసీ నోటీస్

రాహుల్‌గాంధీపై ఈసీఐ సీరియస్ అయింది. ప్రధాని మోదీపై చేసిన వ్యాఖ్యలపై సంజాయిషీ ఇవ్వాలంటూ షోకాజ్ నోటీసు జారీ చేసింది.

- వివరాలు 6లో



జస్టిస్ ఫాతిమా బీవీ కన్నుమూత

దేశ సర్వోన్నత న్యాయస్థానం తొలి మహిళా న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఫాతిమా బీవీ (96) గురువారం కన్నుమూశారు.

- వివరాలు 6లో



నేటి నుంచే కాల్పుల విరమణ!

ఇజ్రాయెల్‌-హమాస్ మధ్య కుదిరిన ఒప్పందం శుక్రవారం నుంచి అమల్లోకి రానుంది. ఖతార్ ఈ విషయాన్ని తెలిపింది.

- వివరాలు 6లో



ఎంపీలకే డిజిటల్ యాక్సెస్

టీఎంసీ ఎంపీ వ్యవహారం నేపథ్యంలో పార్లమెంట్ యాప్‌ల పాస్‌వర్డ్‌లు, ఓటీపీలను ఎంపీలు షేర్ చేసుకోవడాన్ని నిషేధించారు.

- వివరాలు 6లో

మతపరమైన రిజర్వేషన్లను రద్దు చేస్తాం

ఆ కోటాను ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకు పంచుతాం: జేపీ నడ్డా

- పసుపు శుద్ధి కర్మాగారం ఏర్పాటు చేస్తాం
- అవినీతిరహిత పాలన అందిస్తాం
- కుటుంబ పాలన నుంచి తెలంగాణకూ విముక్తి కల్పిస్తాం
- కర్ణాటకలో 4 గంటలు కూడా కరెంటు సరఫరా కావడం లేదు
- కాంగ్రెస్‌లాగానే కేసీఆర్ హామీల పేరుతో మభ్యపెడుతున్నారు
- సంగారెడ్డి, నిజామాబాద్ సభల్లో బీజేపీ జాతీయాధ్యక్షుడు


నిజామాబాద్‌లో జరిగిన సకల జనుల విజయ సంకల్పసభలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: వందలాది మంది ప్రాణత్యాగాలతో ఏర్పడిన తెలంగాణ.. కేసీఆర్ కుటుంబం చేతిలో బందీ అయిందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ధ్వజమెత్తారు. దేశంలో పలు రాష్ట్రాలకు కుటుంబపాలన నుంచి విముక్తి కల్పించామని, తెలంగాణలోనూ కేసీఆర్ కుటుంబ పాలన నుంచి విముక్తి కల్పిస్తామన్నారు. మతపరమైన రిజర్వేషన్లను రద్దు చేసి, ఆ రిజర్వేషన్లను ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకు పంచుతామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సంగారెడ్డి, నిజామాబాద్‌లలో జరిగిన బహిరంగ సభల్లో నడ్డా ప్రసంగిస్తూ.. బీఆర్‌ఎస్‌ను భ్రష్టాచార్ రాక్షస సమితిగా అభివర్ణించారు. ధరణి పోర్టల్ ఏర్పాటు చేసి సర్కారు భూములను చెరబట్టారని, హైదరాబాద్ మియాపూర్‌లో 692 ఎకరాల భూకుంభకోణం చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్‌కు ఏటీఎంలా మారిందని, రూ.38 వేల కోట్ల ఈ ప్రాజెక్టును రూ.1.20 లక్షల కోట్లకు పెంచి అందిన కాడికి దోచుకున్నారని ధ్వజమెత్తారు. ఔటర్ రింగ్‌రోడ్డు టెండర్లలోనూ రూ.వెయ్యి కోట్లు చేతులు మారాయని, దళితబంధు పథకంలో బీఆర్‌ఎస్ నాయకులు 30 శాతం కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీఆర్‌ఎస్ సర్కారు అవినీతిపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపిస్తామని చెప్పారు. అవినీతికి పాల్పడిన కేసీఆర్‌ను జైలుకు పంపాలంటే ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు.

రామగుండం కర్మాగారాన్ని పునఃప్రారంభించాం: కర్ణాటకలో గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని నడ్డా విమర్శించారు. కర్ణాటకలో నాలుగు గంటలు కూడా మిగతా 3వ పేజీలో ▶

3 రోజులు.. 6 బహిరంగ సభలు

ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటన షెడ్యూల్ ఖరారు

నేటి నుంచి 3 రోజులు అమిత్ షా పర్యటన

- సభలు.. రోడ్ షోలు.. విస్తృతంగా ప్రచారం
- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కూడా..

- వివరాలు 3లో

వారి వాగ్దానాలు నమ్మొద్దు



- కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీపై మాయావతి ధ్వజం
- బీఎస్పీతోనే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు న్యాయం.. పెద్దపల్లి ఘీంకార సభలో బీఎస్పీ అధినేత్రి

సాక్షి, పెద్దపల్లి: బీఆర్ అంబేడ్కర్‌కు భారతరత్న ఇవ్వకుండా అడ్డుకున్న పార్టీ కాంగ్రెస్ అని, కాన్షీరాం చనిపోతే కనీసం సంతాపదినం ప్రకటించని ఆ పార్టీని ఓడించాలని బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి అన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంతోనే అణచివేతకు గురైన వర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అవకాశాలు వచ్చాయని చెప్పారు. మండల్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని దేశవ్యాప్తంగా కాన్షీరాం ఉద్యమం చేయడంతోనే ఓబీసీలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు దక్కాయని గుర్తుచేశారు. గురువారం పెద్దపల్లిలో నిర్వహించిన ఘీంకార బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. సీఎం కేసీఆర్ మిగతా 2వ పేజీలో ▶


'రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే సమయం ఆసన్నమైంది. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకోవాలి. ప్రజలంతా కాంగ్రెస్‌కు ఓటేయాలి'

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను అసెంబ్లీ గడప తొక్కనివ్వం

ఎమ్మెల్సీ కోసం 'పాడి' కాంగ్రెస్‌కు ద్రోహం చేశారు: రేవంత్‌రెడ్డి

- సుధీర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు అమ్ముడుపోయారు.. దొంగ ఏడ్పులతో గెలిచిన ఈటల ఏంచేశారు?
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే సమయం ఆసన్నమైంది

5లో

న్యూస్‌రీల్

డీఏపై నిర్ణయం రాలేదు!



రైతుబంధు, రుణమాఫీ పథకాలకు నిధుల విడుదల, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ మంజూరుకు అనుమతి కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిపై కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయంవెలువడాల్సి ఉందని సీఈఓ వికాస్‌రాజ్ చెప్పారు. తమను ఈసీ కోరిన వివరణలను పంపించామని తెలిపారు.

- వివరాలు 14లో▶

నేడు, రేపు పలుచోట్ల వానలు



రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గురువారం రాష్ట్రంలోని పలుచోట్ల తేలికపాటి వానలు కురిశాయి. రానున్న రెండ్రోజులు కూడా రాష్ట్రమంతటా ఇదే తరహా వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వానలతో చలితీవ్రత పెరిగింది.

- వివరాలు 14లో▶

కొండాపూర్‌లో రూ.5 కోట్ల నగదు సీజ్



ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న తనిఖీల్లో పోలీసులు కారులో తరలిస్తున్న రూ.5 కోట్ల నగదును పట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లా శివపల్లికి చెందిన దుగ్యాల సంతోష్‌రావు రియల్ ఎస్టేట్ వ్యాపారి. గురువారం ఈ నగదును తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. లెక్కలు చూపకపోవడంతో నగదును సీజ్ చేశారు.

- వివరాలు 14లో▶

డ్రిల్లింగ్ పనులకు మళ్లీ ఆటంకం




ఉత్తరాఖండ్‌లోని సిల్‌క్యారా సొరంగంలో ఇంకొన్ని మీటర్లు డ్రిల్లింగ్ చేస్తే కార్మికులు చిక్కుకున్న చోటుకు చేరుకోవచ్చన్న ఆశలకు బ్రేక్ పడింది. డ్రిల్లింగ్ మెషీన్ అమర్చిన 'వేదిక'కు పగుళ్లు రావడంతో డ్రిల్లింగ్‌ను ఆపేశారు.

- వివరాలు 6లో▶



విజయాలను వివరించి.. విమర్శలను తిప్పికొట్టి..

బహుముఖ వ్యూహంతో ప్రజల్లోకి బీఆర్‌ఎస్



- హ్యాట్రిక్ విజయానికి సర్వశక్తులూ ఒడ్డుతున్న గులాబీ దళం.. కేసీఆర్ బహిరంగ సభలు.. కేటీఆర్, హరీశ్ రోడ్‌షోలు
- రాష్ట్రాభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు.. పత్రికా ప్రకటనలు.. చానళ్లు, యూట్యూబర్లకు ఇంటర్వ్యూలు.. వివిధ వర్గాలతో ముఖాముఖీలు
- పదేళ్లలో సాధించిన విజయాలపై వివరణ
- విపక్షాల విమర్శలు తిప్పికొడుతూ ప్రణాళికాబద్ధంగా ముందుకు..

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చివరి అంకానికి చేరుతుండటంతో హ్యాట్రిక్ విజయం లక్ష్యంగా భారత్ రాష్ట్ర సమితి సర్వశక్తులూ ఒడ్డుతోంది. విపక్షాలకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా పైచేయి సాధించేందుకు ప్రయత్నిస్తోంది. పార్టీ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు, మరో మంత్రి హరీశ్‌రావు ముమ్మర ప్రచారంతో ప్రజల వద్దకు వెళుతున్నారు. పదేళ్ల పాలనలో సాధించిన విజయాలను వివరించడంతో పాటు, ఎప్పటికప్పుడు విపక్షాల ప్రచారాన్ని అన్నివిధాలా తిప్పికొట్టడం, విమర్శలకు వీలైన అన్ని మార్గాల్లో వివరణ ఇవ్వడం, ప్రజల్లో పార్టీ పట్ల సానుకూలత పెంచే వ్యూహాలను బీఆర్‌ఎస్ అమలు చేస్తోంది.

'ఎట్లుండె తెలంగాణ.. ఎట్లయింది'

కేసీఆర్ ఇప్పటికే సుమారు 75 బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఈ నెల 25న గ్రేటర్ హైదరాబాద్‌లోని పరేడ్ మైదానంలో భారీ బహిరంగ సభ కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక తాను మిగతా 2వ పేజీలో ▶

ప్రాజెక్టులపై రాజకీయాలొద్దు



ప్రాజెక్టుల ఖర్చు రూ.1.70 లక్షల కోట్లు: మంత్రి కేటీఆర్

- బదనాం చేసి అన్యాయం చేయొద్దు
- బ్యారేజీల్లో సమస్యలు సాధారణం
- మిషన్ భగీరథకు రూ.37 వేల కోట్లు ఖర్చు.. గణాంకాలతో మంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం, పాలమూరు సహా ఇతర ప్రాజెక్టుల కోసం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరంను నాలుగేళ్లలోనే పూర్తి చేశామని చెప్పారు. కాళేశ్వరం అంటే అనేక బ్యారేజీలు, రిజర్వాయర్లు, లిఫ్టులు, వందల కిలోమీటర్ల కాలువలు అని స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టులపై రాజకీయాలు చేయొద్దని, వాటిని బదనాం చేసి తెలంగాణకు అన్యాయం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. బ్యారేజీల్లో సమస్యలు అత్యంత సాధారణమన్నారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్ నిర్మాణం తర్వాత కూడా లీకేజీ సమస్యలు వచ్చాయని, రెండేళ్ల క్రితం శ్రీశైలం పవర్ హౌస్ పంపులు కూడా నీట మునిగాయని గుర్తు చేశారు. తొమ్మిదిన్నరేళ్ల తెలంగాణ ప్రగతి ప్రస్థానం, రంగాల వారీగా రాష్ట్రం పురోగమించిన తీరుపై గురువారం హైదరాబాద్‌లో ఆయన గణాంకాలతో కూడిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

నిండుకుండల్లా 46 వేల చెరువులు

'మిషన్ భగీరథ ద్వారా రూ.37 వేల కోట్లు ఖర్చు చేసి 58 లక్షల కుటుంబాలకు తాగునీరు అందిస్తున్నాం. దీని స్ఫూర్తితో కేంద్రం 'హర్ ఘర్ జల్' పథకాన్ని ప్రారంభించింది. దీనితో పాటు అనేక తెలంగాణ పథకాలు కేంద్రం, ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. మిషన్ కాకతీయ ద్వారా పునరుద్ధరించిన 46 వేల చెరువులు మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన చేసి ఉద్యోగాలిస్తాం

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నిజామాబాద్: బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి పక్కాగా ఉద్యోగాల ప్రక్రియను పూర్తి చేస్తామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. నిజామాబాద్ నగరంలోని జనార్దన్ గార్డెన్‌లో కళాశాల విద్యార్థులతో గురువారం ప్రత్యేకంగా ఓటర్లతో సంభాషణ కార్యక్రమాన్ని చేపట్టారు. టీఎస్‌పీఎస్సీలో సాంకేతిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏం చర్యలు చేపడుతుందన్న ఓ విద్యార్థి ప్రశ్నకు...కవిత సమాధానమిచ్చారు. రాష్ట్రంలో ఒకే ఒక్కసారి పేపర్ లీక్ ఉదంతం జరిగిందన్నారు. 10 రోజుల్లోనే నిందితులను పట్టుకున్నామని, ఈ లీకేజీ వ్యవహారంలో రాజకీయ పార్టీ ప్రమేయం ఉందని గుర్తించామని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరు ఓటు వేయకపోతే ప్రశ్నించే హక్కు ఉండదని వ్యవస్థలు నిర్వీర్యమవుతాయని, అందుకు ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని చెప్పారు.

పోలింగ్‌కు ఒక్క రోజు ముందు!

తాము పోటీ చేయని స్థానాల్లో ఎవరికి ఓట్లెయ్యాలో చెబుతామంటున్న సీపీఎం

సాక్షి, హైదరాబాద్: సీపీఎం పోటీ చేస్తున్న 19 స్థానాలను మినహాయిస్తే మిగిలిన చోట్ల బీజేపీకి వ్యతిరేకంగా ఏ పార్టీకి ఓటు వేయాలనేది సరిగ్గా పోలింగ్‌కు ఒక్క రోజు ముందు పార్టీ కేడర్‌కు వెల్లడించాలని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఒకవేళ నిర్ణయాన్ని ఇప్పుడే బహిరంగపరిస్తే ఆ ప్రభావం తాము పోటీ చేసే స్థానాలపై పడుతుందని ఆందోళన చెందుతున్నారు. పోటీ చేసే 19 స్థానాలను పక్కన పెడితే, మిగిలిన స్థానాల్లో దాదాపు 40 వరకు నియోజకవర్గాల్లో తమ పార్టీకి ఎంతో కొంత ఓటు బ్యాంకు ఉందని సీపీఎం నేతలు భావిస్తున్నారు. అటువంటి చోట్ల ఇప్పటికిప్పుడే బీఆర్ఎస్ లేదా కాంగ్రెస్ వంటి పార్టీలకు ఓట్లు వేయాలని పిలుపునిస్తే, ఆ నిర్ణయం మొత్తం రాష్ట్రవ్యాప్త చర్చకు దారితీస్తుందని భావిస్తున్నారు. ఇటీవల మంత్రి హరీశ్‌రావు సంగారెడ్డిలోని సీపీఎం ఆఫీసుకు వచ్చి మద్దతు కోరారు. ఇది గందరగోళానికి దారితీసింది. అందుకే తమ వ్యూహాన్ని సీక్రెట్‌గా అమలు చేయాలని నిర్ణయించారు.

టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్‌గా దివ్యవాణి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్‌గా సినీనటి దివ్యవాణిని నియమించారు. ఈ మేరకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్ గౌడ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారమే పార్టీలో చేరిన ఆమెకు ప్రచార కమిటీలో కీలక బాధ్యతలు అప్పగించడం విశేషం. బుధవారం పార్టీలో చేరిన మరో నేతకు కూడా టీపీసీసీలో పదవి లభించింది. టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధిగా మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయంను నియమిస్తూ మహేశ్‌కుమార్ గౌడ్ ఉత్తర్వులిచ్చారు.

పోలింగ్ సిబ్బందికి తపాలా బ్యాలెట్ ఇవ్వండి

ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ లేఖ

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి వెంటనే పోస్టల్ బ్యాలెట్లు అందజేయాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ మేరకు ఎన్నికల సంఘం సంయుక్త ప్రధానాధికారి సర్ఫరాజ్ అహ్మద్‌కు గురువారం లేఖ రాసినట్టు టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ వెల్లడించారు. ఆయన గురువారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చే చోటే.. బ్యాలెట్లు ఇస్తే వారు ఓటు హక్కు వినియోగించుకుంటారని స్పష్టం చేశారు. కానీ, చాలామంది సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్లు ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారని చెప్పారు. బ్యాలెట్లు ఇస్తే ఎన్నికల రోజు రిటర్నింగ్ అధికారి సమక్షంలో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంటుందని ఈసీకి లేఖ రాసినట్టు వెల్లడించారు.

కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేయాలి

తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్



జమ్మికుంట (హుజూరాబాద్): ఉద్యమాలతో సాధించుకున్న తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను నిర్లక్ష్యం చేసిందని తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ విమర్శించారు. ఆయన కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగం ఎవరికి వాళ్లు కల్పించుకునేది కాదని, ప్రభుత్వమే భర్తీ చేయాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగావకాశాలు వచ్చేలా నిరుద్యోగుల్లో నైపుణ్యాలు పెంపొందించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదేనన్నారు. ఈ పదేళ్లలో నిరుద్యోగం మూడింతలు పెరిగిందన్నారు. కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని, యువతకు న్యాయం జరుగుతుందని.. కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేయాలని కోరారు.





వికారాబాద్‌లో గురువారం జరిగిన ప్రజాఆశీర్వాద సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. జహీరాబాద్ సభకు హాజరైన ప్రజలు

మేం వండి పెడితే.. వడ్డిస్తరట

▶ మొదటి పేజీ తరువాయి

వారికోసం రూ.12 వేల కోట్లు ఖర్చు చేశాం. మేం అధికారంలోకి రాగానే.. మైనార్టీల కోసం పహాడీషరీఫ్‌లో ప్రత్యేక ఐటీ హబ్‌ను ఏర్పాటు చేస్తాం. హిందూ, ముస్లింలు నాకు రెండు కళ్లలాంటి వారు. ఇక్కడ ఎలాంటి మత ఘర్షణలకు తావు లేదు. కేసీఆర్ బతికి ఉన్నంత కాలం తెలంగాణ సెక్యులర్‌గానే ఉంటుంది.

కాంగ్రెస్ నక్కి కూర్చుంది.. జాగ్రత్త

రైతుల భూములు అన్యాక్రాంతం కావొద్దని, ఎవరుపడితే వారు పేర్లు మార్చొద్దనే ధరణి తెచ్చాం. కాంగ్రెస్ వాళ్లు 'ధరణి'ని బంగాళాఖాతంలో వేస్తరట. 'భూమాత'అని పెడుతరట. వాళ్లు పెట్టేది భూమాత కాదు.. భూమేత. రైతుల మధ్య గొడవలు పెట్టే కాంగ్రెస్ బుద్ధి మారలేదు. మళ్లీ వీఆర్వో, పట్వారీలను తెస్తామని, కౌలు, కబ్జాదారుల కాలమ్ పెడతామని కాంగ్రెస్ నాయకుడు భట్టి విక్రమార్క బాజాప్తాగా చెప్తున్నడు. మళ్లీ దళారులు, పైరవీకారులు, లంచావతారాల రాజ్యాన్ని తేవాలని కాంగ్రెస్ పార్టీ నక్కి కూర్చున్నది. జాగ్రత్తగా ఉండాలె. పీసీసీ అధ్యక్షుడు ఒకాయన మూడు గంటల కరెంటు చాలు, 10హెచ్‌పీ మోటార్లుపెడితే పొలం మొత్తం పారుతది అంటున్నడు. రైతులందరికీ 10 హెచ్‌పీ మోటార్లు ఎవరిస్తరు? ఉన్నా ఒకేసారి మోటార్లన్నీ ఆన్ చేస్తే తిరుగుతయా? ట్రాన్స్‌ఫార్మర్లన్నీ పేలిపోవా? మళ్లీ చీకటి రోజులు కావాలని కోరుకుంటున్నారా? పీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్ రైతుబంధు డబ్బులు దుబారా అంటున్నరు. అలాంటి కాంగ్రెస్ దిక్కుమాలిన పాలన మనకు అవసరమా? బీఆర్ఎస్ మళ్లీ వస్తేనే రైతుబంధు, రైతుబీమా, 24 గంటల కరెంటు ఉంటాయి.. లేకపోతే ఆగమైపోతాయి.

> తెలంగాణ తెచ్చినోడు ఎవరు? 24 కరెంటు ఇచ్చింది ఎవరు? ఇంటింటికి మంచినీళ్లు ఇచ్చిందెవరు? కేసీఆర్, బీఆర్ఎస్ సర్కారే కదా.. వెనకటికి ఏదో సామెత ఉంది. మీరు మొత్తం వంటలు తయారు చేసి పెట్టండి, వేళకు మేమొచ్చి వడ్డిస్తం అన్నరట. కాంగ్రెస్ తీరూ అలాగే ఉంది. మేం ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నందునే రాష్ట్రంలో సంపద పెరిగింది. ఆ సంపదను తుంచి, దోచుకోవడానికి కాంగ్రెస్ వాళ్లు వస్తున్నరు. ఎన్నికల్లో చేయి గుర్తుకు ఓటేస్తే మళ్లీ పాత రోజులే వస్తాయి. బేకార్ గాళ్లకు ఓటేస్తే అంతా ఆగమైపోతుంది.

కేసులతో పాలమూరును అడ్డుకున్నరు

కాంగ్రెస్ వాళ్లు అడ్డుకోవటం వల్లే పాలమూరు–రంగారెడ్డి నీళ్లు రావడం ఆలస్యమైంది. కేసులు పెట్టి అడ్డుకున్నరు. లేదంటే ఈ పాటికే వికారాబాద్‌కు నీళ్లొచ్చేవి. పంపుహౌస్‌లు, ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. కాల్వలు తవ్వడమే మిగిలింది. ఏడాదిలోగా కాల్వలు పూర్తిచేసి..వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాలకు నీళ్లిస్తాం. హైదరాబాద్ శివారు ప్రాంతాల దాహార్తిని తీర్చేందుకు రూ.670 కోట్లతో ఔటర్ చుట్టూ పైపులైన్ ఏర్పాటు చేస్తున్నాం. దీంతో మహేశ్వరంతో పాటు ఇతర సబర్బన్ ఏరియాల్లోనూ మంచినీటి సమస్య శాశ్వతంగా సమసిపోతుంది.

వికారాబాద్‌లో పూర్తిస్థాయిలో దళితబంధు

తెలంగాణ సాధించుకున్నాక హైదరాబాద్‌లో ఐటీ బాగా అభివృద్ధి చెందింది. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తే ఆ ఐటీని వికారాబాద్ వరకు విస్తరిస్తాం. వికారాబాద్‌లో దళితులు ఎక్కువగా ఉన్నారు. దగాపడ్డ దళిత సమాజానికి న్యాయం చేస్తా.. మా అభ్యర్థి మెతుకు ఆనంద్‌ను గెలిపిస్తే వికారాబాద్‌లో ఒకే విడతలో మొత్తం దళితులందరికీ దళితబంధు పథకం అమలుచేస్తాం.

దేశాన్ని నాశనం చేస్తున్న బీజేపీ

బీజేపీ మా ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే ప్రయత్నం చేసింది. ఆ ప్రయత్నం చేసినవారిని మేం జైలుకు పంపాం. బీజేపీ దేశాన్ని నాశనం చేస్తోంది. మంచి వాతావరణాన్ని పాడు చేస్తోంది. దీనివల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. ఇది ప్రజలకు అర్థమైతే బీజేపీని దేశం నుంచి తన్ని తరిమేస్తారు.

ఆలోచించి ఓటేయండి

అమెరికా వంటి దేశాల్లో రాజకీయ నేతలతో టీవీల్లో చర్చలు పెడతరు. ఆ చర్చలు చూసి ప్రజలు ఓటేస్తరు. మన దగ్గర కూడా అలాంటి పరిస్థితి రావాలె. ఓటు ఎవరో చెప్తే వేయొద్దు. చర్చ జరగాలె. ఎవరి చేతుల్లో ఈ రాష్ట్రం ఉంటే మంచిదని ఆలోచించి, సద్వినియోగం చేసుకోవాలి..'' అని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. ఆయా సభల్లో మంత్రులు హరీశ్‌రావు, సబిత ఇంద్రారెడ్డి, మహేందర్‌రెడ్డి, ఎంపీలు రంజిత్ రెడ్డి, బీబీ పాటిల్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, పటాన్‌చెరు అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డి, జహీరాబాద్ అభ్యర్థి మాణిక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటేనన్నది ఓపెన్ సీక్రెట్

- అక్కడక్కడ అభ్యర్థులపై వ్యతిరేకత, అసమ్మతి సహజమే
- 70 సీట్లతో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది
- మీడియా చిట్‌చాట్‌లో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కేసీఆర్ గొప్ప విజన్ ఉన్న నాయకుడని, ఆయన నాయకత్వమే తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామ రక్ష అని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన మీడియా చిట్ చాట్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నేతలు పగటి కలలు కంటున్నారని, ఆ పార్టీ గెలిచేది లేదని, ఆ పార్టీ నేతలకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం అస్సలు రానేరాదని అన్నారు. అధికార పార్టీలోని కొంత మంది అభ్యర్థుల పట్ల వ్యతిరేకత, పదేళ్లు అధికారంలో ఉన్నందున పార్టీపై అక్కడక్కడ కొంత అసంతృప్తి అనేది సహజంగా ఉండొచ్చని అన్నారు. అయినా రాష్ట్ర ప్రజలకు సీఎం కేసీఆర్‌పై సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. 70 సీట్లతో బీఆర్ఎస్ అధికారంలోకి రాబోతోందని, కేసీఆరే మూడోసారి సీఎం కాబోతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తారని, రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిగా మార్చుతారని ఆయన దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఆచరణ సాధ్యం కాని హామీలను ఇస్తూ ప్రజలను మోసం చేస్తోందన్నారు. బీఆర్ఎస్, ఎంఐఎం, బీజేపీ ఒక్కటేనని కాంగ్రెస్ పార్టీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అయితే బీఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటేనన్నది ఓపెన్ సీక్రెటేనన్నారు. ఒక్క అవకాశం ఇవ్వమని అడుగుతున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి నల్లగొండ ప్రజలు నాలుగు సార్లు అవకాశం ఇస్తే ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కేసీఆర్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. మెడికల్ కాలేజీలు, కేంద్రీయ, నవోదయ విద్యాలయాలు కావాలని లేఖలు ఆయా శాఖలకు వెళ్తాయి తప్ప కిషన్‌రెడ్డికి వెళ్లవన్నారు.

ప్రాజెక్టులపై రాజకీయాలొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

నిండు కుండలను తలపిస్తున్నాయి. సాగునీటితో సంపదను సృష్టించాం.

ధరణితో పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు

'భూ యజమానుల వేలి ముద్రకు అధికారమిచ్చి 'ధరణి'ద్వారా పారదర్శకంగా భూ లావాదేవీలు జరిగేలా చూస్తున్నాం. గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతులు, పల్లె ప్రగతితో గ్రామ స్వరాజ్యం, గ్రీన్ కవర్ 7.7శాతానికి పెంపు, హరిత నిధి ఏర్పాటు వంటి వాటికి ప్రాధాన్యతను ఇచ్చాం. మన ఊరు – మన బడితో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, వేయి గురుకుల పాఠశాలల ఏర్పాటు, 32 కొత్త మెడికల్ కాలేజీలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, బస్తీ దవాఖానాల ఏర్పాటు వంటివి మా ప్రభుత్వం సాధించిన విజయాలు.

గ్రేటర్‌లో మెట్రో రైలు వ్యవస్థ

గ్రేటర్ హైదరాబాద్‌లో వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం (ఎస్ఆర్‌డీపీ)కింద రహదారుల అభివృద్ధి, ఫ్లైఓవర్ల నిర్మాణంతో ట్రాఫిక్ జామ్‌లను తగ్గించే ప్రయత్నం చేస్తున్నాం. ఇప్పటికే 72 కిలోమీటర్ల మేరకు మెట్రో రైలు వ్యవస్థను అభివృద్ధి చేశాం. మరో 450 కిలోమీటర్ల మేరకు దీన్ని విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. నగరంలో ప్రస్తుతం రోజు విడిచి రోజు మంచినీటి సరఫరా జరుగుతోంది. భవిష్యత్తులో ప్రతిరోజు నీటి సరఫరాకు ప్రయత్నిస్తున్నాం. మురుగునీటి పారుదల శుద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి మునిసిపాలిటీలో సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లు నిర్మిస్తున్నాం..'అని కేటీఆర్ తెలిపారు. కేంద్రంలోని దుర్మార్గ ప్రభుత్వం తెలంగాణకు అప్పులు పుట్టకుండా కుట్ర చేస్తోందని మంత్రి విమర్శించారు. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే ప్రజలకు కరెంటు ఉండదని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు.

> **ధాన్యం ఉత్పత్తిలో అన్నపూర్ణగా రాష్ట్రం**
>
> ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రం అన్నపూర్ణగా మారింది. రైతును రాజును చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుంది. తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు తగ్గాయని కేంద్రమే చెప్పింది. తలసరి ఆదాయంలో రాష్ట్రాన్ని అగ్రభాగంలో నిలపగా, జీఎస్‌డీపీ అత్యంత వేగంగా పెరిగింది. రాష్ట్రం అద్భుతంగా అభివృద్ధి చెందింది. పేదరికాన్ని తగ్గించిన ప్రభుత్వంగా తెలంగాణ ప్రభుత్వం నిలిచింది. తండాలు గ్రామ పంచాయతీలుగా మార్పు, కొత్త జిల్లాల ఏర్పాటు వంటివి కేసీఆర్ పాలనలోనే జరిగాయి..'అని కేటీఆర్ తెలిపారు.

కాంగ్రెస్‌లో అందరూ సీఎంలే

గెలిస్తే కదా.. జగ్గారెడ్డి సీఎం అయ్యేది: హరీశ్‌రావు



సదాశివపేట రోడ్ షోలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డి: కాంగ్రెస్‌లో పదిమంది ముఖ్యమంత్రి అభ్యర్థులు ఉన్నారని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. గురువారం సంగారెడ్డిలో మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో, సదాశివపేటలో రోడ్‌షో, కందిలో గౌడ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి తాను సీఎం అవుతానని చెప్పారు కానీ ఆయన బరిలో లేరు. సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి కూడా సీఎం అవుతానని చెబుతున్నారని, అయన అసలు గెలిస్తే కదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలుగా గెలవలేని వారు సీఎం అవుతామని పగటి కలలు కంటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక గౌడ సొసైటీలను పునరుద్ధరించామని హరీశ్‌రావు తెలిపారు. వైన్ షాపుల కేటాయింపుల్లో గౌడ కులస్తులకు 15 శాతం రిజర్వేషన్ కల్పించినట్లు తెలిపారు. తమ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడిందని, గంగా జమున తెహజీబ్ లాగా అందరూ కలిసి ఉంటున్నామని అన్నారు. సంగారెడ్డి దాకా మెట్రో రైలును తెస్తామని హామీ ఇచ్చారు.

వారి వాగ్దానాలు నమ్మొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

దళిత వ్యతిరేకి అని, దళితులను కేసీఆర్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని మండిపడ్డారు. వారిని ఓటు బ్యాంకుగానే గుర్తిస్తూ రాజకీయంగా అణచివేస్తోందని దుయ్యబట్టారు. 1989లో తాను తొలిసారి ఎంపీగా గెలిచాక నాటి వీపీ సింగ్ ప్రభుత్వం తనకు కేంద్ర మంత్రి పదవి ఇస్తానంటే వద్దని చెప్పానని, మండల్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలంటూ పట్టుబట్టి ప్రభుత్వం మెడలు వంచానన్నారు. దేశంలో బీఎస్పీ అధికారంలోకి వస్తేనే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఏ వర్గానికీ న్యాయం జరగలేదన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ నియంతలా పాలిస్తూ ప్రజల హక్కులు కాలరాస్తున్నారని విమర్శించారు. చట్టసభల్లో మహిళలకు కల్పించిన 33 శాతం రిజర్వేషన్లలో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. దళితుల అణచివేతలో భాగంగానే ప్రవీణ్ కుమార్, ఆయన కుమారుడు పునీత్‌పై పోలీసులు హత్యాయత్నం కేసులు నమోదు చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో కూడా బీఎస్పీ అధికారంలోకి వస్తే అలాంటి పథకాలు అమలు చేసి బహుజనుల రాజ్యాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని దోచుకుంటున్న బీఆర్ఎస్‌ను ఓడించాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు.

విజయాలను వివరించి.. విమర్శలను తిప్పికొట్టి..

▶ మొదటి పేజీ తరువాయి

పోటీ చేస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో జరిగే సభతో కేసీఆర్ ఈ నెల 28న తన ఎన్నికల ప్రచారాన్ని ముగించనున్నారు. ఇక కేటీఆర్, హరీశ్‌రావులు కూడా రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ షోలు నిర్వహిస్తూ ప్రచారాన్ని తారస్థాయికి తీసుకెళ్లేందుకు శ్రమిస్తున్నారు. ప్రచార అంకంలో జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీతో పాటు బీఎస్పీ కూడా ఢిల్లీ నేతలను రంగంలోకి దించడాన్ని బీఆర్ఎస్ నిశితంగా గమనిస్తోంది. బీజేపీ తరపున ప్రధాని మోదీ, అమిత్ షా, నడ్డా తదితరులు.. కాంగ్రెస్ తరపున రాహుల్, ప్రియాంక, ఖర్గే తదితరులు.. బీఎస్పీ తరపున మాయావతి సైతం ప్రచారంలోకి దిగారు. దీంతో ఢిల్లీ నేతలు చేసే విమర్శలు, ఆరోపణలను తిప్పికొట్టేందుకు బీఆర్ఎస్ బహుముఖ వ్యూహాన్ని అమలు చేస్తోంది. పదేళ్ల పాలనలో రాష్ట్రం సాధించిన అభివృద్ధిని గణాంకాలతో సహా పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు, అడ్వర్టయిజ్‌మెంట్ల రూపంలో విస్తృతంగా ప్రచారం చేస్తోంది. 'ఎట్లుండె తెలంగాణ.. ఎట్లయింది'అనే నినాదంతో గతంతో, వర్తమాన పరిస్థితిని పోల్చి చూపిస్తూ ప్రజలను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తోంది.

విపక్షాల బలహీనతలపైనా దృష్టి

అధినేత కేసీఆర్ నుంచి అందే ఆదేశాలను వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రతిరోజూ ఉదయం, రాత్రి నిర్వహిస్తున్న టెలీ కాన్ఫరెన్స్ ద్వారా పార్టీ అభ్యర్థులు, కేడర్‌కు వివరిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్, బీజేపీకి చాలాచోట్ల పటిష్ట పార్టీ యంత్రాంగం లేకపోవడం, చివరి నిమిషంలో టికెట్లు దక్కించుకున్న ఇతర పార్టీల అభ్యర్థులు తడబడుతున్న తీరును తమకు అనువుగా మలుచుకునే వ్యూహాలకు సైతం పదును పెడుతోంది. మరోవైపు క్షేత్ర స్థాయిలో పోల్ మేనేజ్‌మెంట్ ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేసేందుకు పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తోంది. ఒక్కో ఓటును ఒడిసి పట్టేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగేలా కేడర్‌కు దిశా నిర్దేశం చేస్తోంది.

పరిస్థితుల సమీక్ష.. ఎప్పటికప్పుడు ఆదేశాలు

క్షేత్ర స్థాయిలో పార్టీ అభ్యర్థుల ప్రచారం, కేడర్ నడుమ సమన్వయాన్ని 'వార్ రూమ్'ల ద్వారా బీఆర్ఎస్ నిశితంగా గమనిస్తోంది. నిఘా సంస్థలు, సర్వే ఏజెన్సీలు, వివిధ సంస్థల నుంచి అందుతున్న నివేదికలను లోతుగా విశ్లేషించి నియోజకవర్గాల వారీగా పరిస్థితిని అంచనా వేస్తోంది. కాంగ్రెస్, బీజేపీతో పాటు బీఎస్పీ వంటి ఇతర పార్టీల ప్రచారం, క్షేత్ర స్థాయిలో ఆయా పార్టీలు, అభ్యర్థులు పన్నుతున్న వ్యూహాలు, అమలు చేస్తున్న ప్రణాళికలను ఛేదిస్తూ (డీకోడ్) వాటికి ప్రతివ్యూహాలను సిద్ధం చేస్తోంది. ఈ వ్యూహాల అమలు బాధ్యతను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, అభ్యర్థులకు అప్పగించి రాష్ట్ర స్థాయిలో ఏర్పాటైన వార్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తున్నారు. అదే సమయంలో పార్టీ అభ్యర్థుల ప్రచార లోపాలను కూడా విశ్లేషిస్తూ దిద్దుబాటుకు అవసరమైన సలహాలు, సూచనలతో తక్షణ ఆదేశాలు జారీ చేస్తున్నారు.

మేనిఫెస్టోకు కొత్త హామీల జోడింపు

మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను సభలు, రోడ్ షోలతో పాటు క్షేత్ర స్థాయి ప్రచారంలో విస్తృతంగా ప్రస్తావిస్తున్న బీఆర్ఎస్..ఎప్పటికప్పుడు కొత్త హామీలను కూడా జోడిస్తోంది. జనవరి నుంచి కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, బీడీ కార్మికుల పింఛన్లకు 2023 వరకు కటాఫ్ పెంపు, గల్ఫ్ కార్మికులకు బీమా, ఆటో కార్మికులకు వెహికల్ ఫిట్‌నెస్ నుంచి మినహాయింపు వంటి అంశాలను ప్రముఖంగా ప్రస్తావిస్తోంది. మరోవైపు సోషల్ మీడియాలో బీఆర్ఎస్‌పై జరుగుతున్న ప్రతికూల ప్రచారాన్ని తిప్పికొట్టే వ్యూహాలను ఎప్పటికప్పుడు సిద్ధం చేసే బాధ్యతను పలు ఏజెన్సీలకు అప్పగించారు. ఇక తెలంగాణ, హైదరాబాద్ విషయంలో తమ దార్శనికతను ఆవిష్కరించే క్రమంలో పేరొందిన యూట్యూబర్లు, చానెళ్లకు కేటీఆర్, హరీశ్ ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. విద్యాధికులు, పట్టణ ప్రాంత ఓటర్లను ఆకట్టుకునేందుకు వీలుగా సామాజిక మాధ్యమాల్లో పేరొందిన వారికి కూడా ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇచ్చేందుకు కేటీఆర్ ప్రాధాన్యత ఇస్తున్నారు. మరోవైపు మహిళలు, నిరుద్యోగ యువత, మైనారిటీ మహిళలు, అలాగే వివిధ రంగాలకు చెందిన వారితో బీఆర్ఎస్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ పలు హామీలు ఇస్తోంది. తద్వారా ఆయా వర్గాల్లో బీఆర్ఎస్ పట్ల సానుకూల ధోరణి నెలకొనేలా ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తోంది. ముఖ్యంగా పార్టీకి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రతికూల ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు 'విమర్శలు.. వివరణలు'అనే వ్యూహాన్ని బీఆర్ఎస్ అనుసరిస్తోంది.

రెండు చోట్లా రేవంత్‌కు ఓటమే

ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ కూడా చచ్చిపోతుంది

- సోషల్ మీడియాలో అన్నీ గాలికబుర్లు.. ఆ ప్రచారాన్ని నమ్మొద్దు
- మంచి పనులు చేసిన కేసీఆర్‌ను మళ్లీ దీవించండి
- మక్తల్, హుజూర్‌నగర్, దేవరకొండ, హైదరాబాద్ రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లలో కేటీఆర్



హుజూర్‌నగర్ రోడ్ షోలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/హుజూర్‌నగర్, దేవరకొండ/కుషాయిగూడ/అల్వాల్/గౌతంనగర్: అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్, కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రెండు చోట్లా ఓడిపోబోతున్నారని మంత్రి కె. తారక రామారావు జోస్యం చెప్పారు. రేవంత్‌రెడ్డి ఓటమి తర్వాత ఆ పార్టీ చచ్చిపోతుందని వ్యాఖ్యానించారు. తన మాటపై నమ్మకం లేకపోతే కొడంగల్‌లో చుట్టాలు ఉన్న వారిని కనుక్కోవాలని సూచించారు. ఎన్నికలపై చాలా మంది చాలా రకాలుగా ప్రచారం చేస్తున్నారని... వేటినీ నమ్మొద్దని కేటీఆర్ ప్రజలకు సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియాను అస్సలు నమ్మొద్దని.. అందులో వచ్చేవన్నీ గాలికబుర్లేనని చెప్పారు. బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నారాయణపేట జిల్లా మక్తల్, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, నల్లగొండ జిల్లా దేవరకొండతోపాటు హైదరాబాద్‌లోని మౌలాలి, మల్కాజిగిరి, ఆనంద్‌బాగ్, అల్వాల్, ఈసీఐఎల్ చౌరస్తాలో గురువారం నిర్వహించిన రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఆయా నియోజకవర్గాల బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. పొరపాటున ఎవరైనా కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలోలాగా తెలంగాణలోనూ కరెంట్ పోతుందన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్‌కు ఓటేసిన పాపానికి అక్కడి ప్రజలు చెంపలు వేసుకుంటున్నారని చెప్పారు.

రేవంత్ కరెంట్ తీగలు పట్టుకోవాలి..: 'రాష్ట్రంలో 24గంటల కరెంట్ ఎక్కడ వస్తోందని రేవంత్ అంటున్నారు. మక్తల్‌లో రేవంత్‌రెడ్డికి బంపర్ ఆఫర్ ఇస్తున్నా. రెండు ఏసీ బస్సులు పెడతా. రేవంత్ తోపాటు ఇతర కాంగ్రెస్ నాయకులను బస్సుల ఎక్కమనండి. ఏ ఊళ్లో, ఏ మండలానికి ఏ సమయానికైనా పోమ్మనండి. వైర్లను గట్టిగా పట్టుకోమనండి. కరెంట్ ఉందో లేదో తెలుస్తుంది. రాష్ట్రానికి ఓ దరిద్రం పోతుంది.' అని కేటీఆర్ పేర్కొన్నారు.

అంతా మీ చేతుల్లోనే..: 'ప్రజలు ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలి. అంతా మీ చేతుల్లోనే ఉంది. కాంగ్రెస్ కొత్తేమీ కాదు. ఆ పార్టీకి మనం ఒక్క చాన్స్ కాదు.. 11 చాన్స్‌లు ఇచ్చినం. 55 ఏళ్లు తాగునీరు, సాగునీరు, పింఛన్లు ఏమీ ఇవ్వనోడు... ఇవ్వాళ వచ్చి ఒక్క చాన్స్ అంటుండు. నమ్మితే మోసపోతం.. గోసపడతాం' అని కేటీఆర్ అన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టాలి: 'బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే రైతుబంధు సాయాన్ని రూ. 16 వేలు చేయబోతున్నాం. కోడలుకు సౌభాగ్యలక్ష్మి పథకం కింద నెలకు రూ. 3 వేలు అందిస్తాం. అర్హులకు కూడా ఆసరా పింఛన్ రూ.5 వేలు చేస్తాం. గ్యాస్ సిలిండర్‌ను రూ. 400కే అందిస్తాం. ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టాలి. అరాచక కాంగ్రెస్ పార్టీని పట్టించుకోవద్దు. ఎందుకంటే.. కాంగ్రెస్ గతం.. బీఆర్ఎస్ మీ భవిష్యత్తు.' అని కేటీఆర్ తెలిపారు.

ఈసీఐఎల్ వరకు మెట్రో తీసుకొస్తాం..: 'గతంలో ఉప్పల్ నుంచి ఈసీఐఎల్ వరకు మెట్రో రైలు తీసుకొస్తామన్నాం. కానీ కోవిడ్ కారణంగా కొంత ఆలస్యం జరిగింది. ఈసారి పక్కాగా మల్లాపూర్ నుంచి ఈసీఐఎల్ వరకు మెట్రో తీసుకొస్తాం. మల్కాజిగిరి సర్కిల్‌లో కొన్ని దీర్ఘకాలిక సమస్యలు ఉన్నాయి. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని జయగిరి లక్ష్మీనర్సింహనగర్‌లో ఎండోమెంట్ స్థలంలో నివాసముంటున్న వారికి ప్రత్యేక జీవో తీసుకొచ్చి సమస్య పరిష్కరిస్తాం. మల్లికార్జుననగర్‌లో ఉన్న యూఎల్‌సీ భూముల సమస్యనూ పరిష్కరిస్తాం. మౌలాలిలో వక్ఫ్ బోర్డు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. మల్కాజిగిరిలో గుండాగిరికి తావు లేదు. ఎవరైనా గూండాగిరికి పాల్పడితే ఉరుకొనేది లేదు' అని కేటీఆర్ హెచ్చరించారు.

క్లుప్తంగా...

బీజేపీ, బీఆర్ఎస్ దొందూదొందే

ఏఐసీసీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఇమ్రాన్ ప్రతాప్ ఘడి

పరిగి: బీఆర్ఎస్, బీజేపీ దొందూదొందేనని ఏఐసీసీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఇమ్రాన్ ప్రతాప్ ఘడి విమర్శించారు. పరిగిలోని కాంగ్రెస్ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి నివాసంలో గురువారం మైనార్టీ డిక్లరేషన్‌పై ముస్లిం నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్, మోదీ ఇద్దరూ ఒక్కటేనని స్పష్టం చేశారు. కేంద్రంలో మైనార్టీలకు వ్యతిరేకంగా బీజేపీ తీసుకువచ్చిన బిల్లులకు సీఎం కేసీఆర్ మద్దతు తెలిపారని గుర్తు చేశారు. మైనార్టీలకు రిజర్వేషన్ ప్రకటిస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని వేలాది ఎకరాల వక్ఫ్‌బోర్డు భూములను అక్రమంగా లాక్కున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే ఆర్థిక ప్రగతి, సాధికారత కింద కులగణన చేపట్టి ఉద్యోగాలు, పథకాల్లో మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మైనార్టీల బడ్జెట్‌ను రూ.4 వేల కోట్లకు పెంచి మైనార్టీ సబ్‌ప్లాన్‌ను తీసుకువస్తామని తెలిపారు.

కాంగ్రెస్ డీఎన్ఏలోనే సంక్షేమం: అజయ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: రైతులకు పంటల బీమా అమలు చేయని దేశంలోని ఏకైక రాష్ట్రం తెలంగాణేనని ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జ్ అజయ్‌కుమార్ వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతలు షామా అహ్మద్, వచన్, ఆవేలి దామోదర్‌లతో కలిసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీ చేయడంలో తీవ్ర జాప్యం చేసిన సీఎం కేసీఆర్ రైతు వ్యతిరేకి అని, బీఆర్ఎస్ రైతు వ్యతిరేక పార్టీ అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 8 వేల మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, విద్యుత్, ఎరువుల సమస్య తీవ్రంగా ఉందని, కానీ కేసీఆర్ మాత్రం తాము రైతులను ఉద్ధరించినట్టు గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ డీఎన్ఏలోనే సంక్షేమం ఉందని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రైతుల సంక్షేమం అద్భుతంగా అమలవుతోందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెస్తే కౌలు రైతుల సమస్యలను పరిష్కరించి, వారికి నగదు సాయం అందజేస్తామని అజయ్‌కుమార్ వెల్లడించారు.

తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు

కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు కలిసే ఉన్నాయని ఏఐసీసీ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు జైరాం రమేశ్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం తన వల్ల వచ్చిందని, తానే నిర్మాత అని ఓ వ్యక్తి చెప్పుకుంటున్నారని సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు. ఈ పదేళ్లలో కేసీఆర్ కుటుంబానికే లాభం చేకూరిందని, ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ లేకపోతే తెలంగాణ రాష్ట్రం ఏర్పడేదా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం దేశంలో తెలంగాణలోనే నిరుద్యోగ శాతం ఎక్కువగా ఉందన్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్రతో దేశంలో సమూల మార్పులు వచ్చాయని పేర్కొన్నారు.

అధికారంలోకి రాగానే నిరుపేదలకు ఇళ్లు

నల్లగొండ ఎన్నికల ప్రచారంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇళ్లులేని నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని, నాణ్యమైన బతుకమ్మ చీరలు పంపిణీ చేసే బాధ్యత కూడా తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్, నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. పది రోజుల తర్వాత ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శాశ్వతంగా ఫాంహౌస్‌కే పరిమితమవుతారన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో కోమటిరెడ్డి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేసీఆర్ పదేళ్ల పాలనలో ప్రగతి భవన్, ఫాంహౌస్ తప్ప ప్రజా సమస్యలు పట్టించుకోలేదన్నారు. కేసీఆర్, ప్రధాని మోదీ గల్లీలో కొట్లాట పెట్టుకున్నట్లు నటిస్తూ ఢిల్లీలో దోస్తీ చేస్తున్నారని ఆరోపించారు. దేశాన్ని పాలించే శక్తి ఒక్క కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు.

కాంగ్రెస్‌దే అధికారం

టీపీసీసీ ఉపాధ్యక్షురాలు పుష్పలీల

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు రాష్ట్రంలోని పేదలంతా సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కె.పుష్పలీల స్పష్టం చేశారు. ఆమె గురువారం ఏఐసీసీ అధికార ప్రతినిధి షామా అహ్మద్‌తో కలిసి గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలను కొట్టి పెద్దలకు దోచిపెట్టిందని విమర్శించారు.

ఉత్తర తెలంగాణపై కమలం ఫుల్ ఫోకస్!

- ఈ జిల్లాల నుంచే అధిక సీట్లు గెలుస్తామన్న ధీమాలో ముఖ్యనేతలు
- కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలపై ప్రత్యేక దృష్టి
- ఉమ్మడి వరంగల్‌లోనూ అనూహ్య ఫలితాలు వస్తాయని పార్టీ అంచనాలు



సాక్షి, హైదరాబాద్: ఉత్తర తెలంగాణపై కమలనాథులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. సంప్రదాయబద్ధంగా పట్టున్న ఈ ప్రాంతంనుంచి ఈసారి కూడా మంచి ఫలితాల సాధనకు పార్టీ ఉత్తర తెలంగాణను నమ్ముకుంది. సంస్థాగతంగానూ, రాజకీయంగానూ ఇతర ప్రాంతాల కంటే ఇక్కడే పార్టీ పటిష్టంగా ఉండటంతో అసెంబ్లీ ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయని అంచనా వేస్తోంది. ఉత్తర తెలంగాణలోని వివిధ జిల్లాల పరిధిలో అధిక సీట్లు గెలుస్తామన్న ధీమాను బీజేపీ ముఖ్యనేతలు వ్యక్తం చేస్తున్నారు. 2019 ఏప్రిల్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఈ ప్రాంతంలో కీలకమైన కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ సీట్లు బీజేపీ గెలుపొందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఉత్తర తెలంగాణలో అధిక స్థానాల్లో గెలుపొంది సత్తా చాటాలనే పట్టుదలతో బీజేపీ నాయకత్వముంది. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ అభ్యర్థుల పట్ల ప్రజల్లో క్రమంగా సానుకూలత పెరుగుతున్నదని అంచనా వేస్తున్నారు.

ముమ్మరంగా ప్రచారం చేసేలా...

ముఖ్యంగా పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తున్న ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో అధిక సీట్లు గెలుచుకునే దిశలో వివిధ రూపాల్లో ప్రచారాన్ని ముమ్మరం చేయాలని నిర్ణయించారు. అధికారంలోకి వస్తే బీసీ నేతను సీఎంను చేస్తామన్న హామీని వివిధ వర్గాల ప్రజల్లోకి మరింత లోతుగా తీసుకెళ్లేలా వ్యూహాలను సిద్ధం చేస్తున్నారు. దీంతో పాటు ఉపకులాల వారీగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు ప్రధాని మోదీ పూర్తి మద్దతు తెలపడంతో పాటు సమస్యల పరిష్కారంపై కచ్చితమైన హామీ ఇవ్వడంతో ఈ వర్గాల్లో బీజేపీపై సానుకూల స్పందన వ్యక్తమవుతోందని చెబుతున్నారు. ఈ పరిణామాల దృష్ట్యా బీసీ, ఎస్సీ, ఇతర వర్గాల నుంచి బీజేపీకి మద్దతు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన వైఖరి తీసుకోవడంతో బీజేపీకి ఎమ్మార్పీఎస్ నాయకత్వం మద్దతు తెలపడంతో పాటు బీసీ సీఎం నినాదాన్ని కూడా బలపరుస్తూ ప్రచారం చేయడం కూడా తమకు కలిసొచ్చే అంశంగా చెబుతున్నారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ కంటే అధికంగా 36 సీట్లను బీసీలకు బీజేపీ కేటాయించడం ద్వారా బీసీలకు పెరిగిన ప్రాధాన్యతను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళుతున్నారు.

3 రోజులు.. 6 బహిరంగ సభలు

ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటన షెడ్యూల్ ఖరారు



సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటన షెడ్యూల్ ఖరారైంది. తెలంగాణ ఎన్నికల ప్రచారంలో భాగంగా మూడు రోజుల పాటు మోదీ పర్యటించనున్నారు. ఈ షెడ్యూల్ ప్రకారం... శనివారం మధ్యాహ్నం బెంగళూరు నుంచి కామారెడ్డికి చేరుకొని మధ్యాహ్నం 2:15 గంటలకు అక్కడ జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. ఆ తర్వాత సాయంత్రం 4:15 గంటలకు రంగారెడ్డి జిల్లా పరిధిలో మరో బహిరంగ సభకు హాజరవుతారు. రాత్రికి రాజ్‌భవన్‌లో బస చేయనున్నారు. ఆదివారం ఉదయం 11:30 గంటలకు హైదరాబాద్ శివార్లలోని కన్హా శాంతివనాన్ని సందర్శిస్తారు. అక్కడ ఏర్పాటు చేసే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2:15 గంటలకు దుబ్బాకలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 3:45 గంటలకు నిర్మల్‌లో పార్టీ ఎన్నికల ప్రచార బహిరంగ సభలో ప్రసంగిస్తారు. రాత్రికి తిరుమలకు చేరుకొని అక్కడి శ్రీరచన రెస్ట్ హౌస్‌లో బస చేస్తారు. సోమవారం ఉదయం 8 గంటలకు శ్రీ వేంకటేశ్వర్వస్వామిని దర్శించుకుంటారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 12:45 గంటలకు మహబూబాబాద్ చేరుకొని బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2:45 గంటలకు కరీంనగర్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొన్నాక హైదరాబాద్ చేరుకుంటారు. సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌లోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో రోడ్‌షోచేపట్టి రాత్రి ఢిల్లీకి తిరిగివెళ్తారు.

నేటి నుంచి 3 రోజులపాటు రాష్ట్రంలో అమిత్ షా పర్యటన

శుక్రవారం వివిధ సభలు, రోడ్‌షోలలో పాల్గొననున్న రాజ్‌నాథ్‌సింగ్



సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాష్ట్రంలో మరోసారి సుడిగాలి పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేయడంలో భాగంగా శుక్ర, శని, ఆదివారాల్లో ఆయన రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆర్మూర్‌లో సకల జనుల విజయ సంకల్ప బహిరంగ సభలో షా ప్రసంగిస్తారు. తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు రాజేంద్రనగర్, 3 గంటలకు శేరి లింగంపల్లి, సాయంత్రం 4.30 గంటలకు అంబర్‌పేట నియోజకవర్గాల పరిధిలో ఆయన రోడ్ షో నిర్వహించనున్నారు. 25న ఉదయం 11 గంటలకు కొల్లాపూర్, మధ్యాహ్నం ఒంటి గంటకు మునుగోడు, 2 గంటలకు పటాన్‌చెరు నియోజకవర్గాల్లో నిర్వహించే బహిరంగ సభల్లో ప్రసంగిస్తారు. సాయంత్రం 4 గంటలకు ఖైరతాబాద్ నియోజకవర్గంలో రోడ్ షోలో పాల్గొంటారు. 26వ తేదీన ఉదయం 11 గంటలకు మక్తల్, మధ్యాహ్నం 1 గంటకు ములుగు, మధ్యాహ్నం 3 గంటలకు భువనగిరి, సాయంత్రం 6 గంటలకు కూకట్‌పల్లి నియోజకవర్గాల పరిధిలో నిర్వహిస్తున్న బహిరంగ సభల్లో అమిత్ షా ప్రసంగించనున్నారు. అదేరోజు రాత్రి 8 గంటలకు ఎన్టీఆర్ స్టేడియంలో కోటి దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారు. ఇదిలా ఉంటే.. శుక్రవారం ఉదయం 11 గంటలకు మేడ్చల్, సాయంత్రం 4 గంటలకు కార్వాన్, సాయంత్రం 5 గంటలకు కంటోన్మెంట్ నియోజకవర్గాల పరిధిలో జరగనున్న బహిరంగ సభలలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగించనున్నారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు హుజూర్‌నగర్ నియోజకవర్గంలో బహిరంగ సభలో పాల్గొని, సాయంత్రం 4 గంటలకు సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో రోడ్ షో నిర్వహించనున్నారు. అదేరోజు సాయంత్రం 6 గంటలకు ముషీరాబాద్ నియోజకవర్గంలో రోడ్ షో అనంతరం బహిరంగ సభలో మాట్లాడతారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కబ్జా భూములపై బుల్డోజర్లు దించుతా..

- ఆ స్థలాల్లో పేదలకు ఇళ్లు కట్టిస్తా: బండి సంజయ్
- కాంగ్రెస్‌కు ఓటేస్తే మురిగిపోయినట్లే



నగునూర్‌లో మాట్లాడుతున్న బండి సంజయ్

కరీంనగర్ టౌన్/ కరీంనగర్ రూరల్: 'ప్రభుత్వ స్థలాలేమైనా మీ అయ్య జాగీరనుకున్నరా? నేనెవ్వరికీ భయపడ. బరాబర్ చెబుతున్నా. బీఆర్ఎస్ నేతలు కబ్జా చేసిన స్థలాల్లో బుల్డోజర్లు దించుతా.. వాటిని స్వాధీనపర్చుకుని ఆ స్థలాల్లో పేదలకు ఇండ్లు కట్టించి పంచుతా'అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ ప్రకటించారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్ నేతల భూకబ్జాలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందని, తనను గెలిపిస్తే వాళ్ల సంగతి తేలుస్తానని ఆయన హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కరీంనగర్ మండలంలోని తాహెర్‌కొండాపూర్, బహుదూర్‌ఖాన్‌పేట, నగునూరు గ్రామాలతోపాటు కరీంనగర్ 17, 38, 39వ డివిజన్లలో సంజయ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులు ఆయనకు డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బండి నగునూరు, విద్యానగర్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. 'కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం దేశంలో 3 కోట్ల ఇళ్లు కట్టించింది. తెలంగాణకు 2.40 లక్షల ఇళ్లు మంజూరు చేసింది. వాటిని కట్టిస్తే మరో 5 లక్షల ఇళ్లు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉంది. కానీ, కేసీఆర్ ఇంతవరకూ ఒక్క ఇల్లు కూడా పేదలకు పంచలేదు. ఆ నిధులు దారి మళ్లించిండు. నగునూరులోని దుర్గామాత గుడి సమీపంలో 669 సర్వే నంబర్‌లో 26 ఎకరాలను బీఆర్ఎస్ నేతలు కబ్జా చేశారు. ఆ భూమిలో పేదలకు ఇళ్లు కట్టిస్తే బాగుండేది కదా.. నేను గెలిచాక కబ్జాకోరులపై బుల్డోజర్లు దించుతా.. ఆ భూములన్నీ పేదలకు పంచుతా'అని పేర్కొన్నారు. 'కరీంనగర్‌లో పోటీచేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల చరిత్రను పరిశీలించండి.. ఎవరు ప్రజల కోసం పోరాడుతున్నారో, ఎవరు భూకబ్జాలకు పాల్పడుతున్నారో బేరీజు వేయండి.. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలిద్దరూ భూకబ్జాదారులే. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి కుట్రలు చేస్తున్నాయి. పొరపాటున కాంగ్రెస్‌కు ఓట్లేస్తే అవన్నీ డ్రైనేజీలో వేసినట్లే.. దయచేసి కాంగ్రెస్ ట్రాప్‌లో పడొద్దని కోరుతున్నా.. నన్ను అవినీతిపరుడిగా చిత్రీకరించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు కలిసి కుట్ర చేస్తున్నారు. నేను సవాల్ చేస్తున్నా.. దమ్ముంటే నాపై చేసిన ఆరోపణలను నిరూపించాలి. నిరూపిస్తే ఉరేసుకుంటా.. లేకపోతే మీరు ఏ శిక్షకైనా సిద్ధమా?'అంటూ సవాల్ విసిరారు.

బియ్యం గోల్‌మాల్ నిరూపించేందుకు సిద్ధం!

మంత్రి గంగుల కమలాకర్ బియ్యం టెండర్లలో రూ.1,300 కోట్ల గోల్‌మాల్ చేశారని నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నానని బండి సవాల్ చేశారు. ఆయన తప్పు చేయకుంటే దేవుని గుడిలో ప్రమాణం చేయాలన్నారు. వడగండ్ల వానతో పంటలు నష్టపోతే ఎకరానికి రూ.10 వేలిస్తానన్న కేసీఆర్ ఇక్కడ ఇవ్వకుండా పంజాబ్ రైతులకు ఇచ్చారని బండి మండిపడ్డారు. తనకు సంబంధించిన ఆస్తిపాస్తుల డాక్యుమెంట్లను కమలాకర్ తీసుకొస్తే ప్రజలకు రాసిస్తానని, ఆయన అక్రమ ఆస్తులను ప్రజలకు పంచే దమ్ముందా అని ప్రశ్నించారు.

బీజేపీతోనే తెలంగాణ ఆత్మగౌరవం

కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ



పంజగుట్ట (హైదరాబాద్): తెలంగాణ ప్రజలు ఆత్మగౌరవంతో బతకాలంటే బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ అన్నారు. గురువారం ఖైరతాబాద్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో, ఆనంద్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన మహిళలతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో కుటుంబ పాలన అంతం కావాలంటే బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. దళిత బంధు పేరుతో కేసీఆర్ దళితులను మోసం చేస్తున్నాడని, గ్రామానికి ఎంతమందికి దళితబంధు ఇచ్చారో వేళ్లపై లెక్కపెట్టవచ్చునని, అందులో కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కమీషన్లు తింటున్నారని స్వయంగా కేసీఆరే ఒప్పుకున్నారని గుర్తుచేశారు. టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్లు ఇచ్చి.. పేపర్లు లీక్ చేసి నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని విమర్శించారు.

కాంగ్రెస్‌వి అబద్ధపు గ్యారంటీలు

హిమాచల్‌ప్రదేశ్ మాజీ సీఎం జైరాం ఠాకూర్



సాక్షి, హైదరాబాద్: తమ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అబద్ధపు గ్యారంటీల గురించి చెప్పేందుకే ఇక్కడకు వచ్చానని హిమాచల్‌ప్రదేశ్ మాజీ సీఎం, బీజేపీ నేత జైరాం ఠాకూర్ తెలిపారు. హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన పది గ్యారంటీలు అమలుకు నోచుకోలేదన్నారు. అక్కడ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా వాటిలో ఒక్కటీ కూడా అమలుకాకపోగా, ఇక్కడ మాత్రం హిమాచల్‌లో తమ హామీలు అమలు చేశామని కాంగ్రెస్‌నేతలు అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన మహిళకు ప్రతి నెలా రూ.1,500 ఇస్తామని చెప్పి, ఇప్పటి వరకు ఒక్క మహిళకు కూడా ఆ మొత్తాన్ని ఇవ్వలేదన్నారు. ఉచిత కరెంట్ ఇస్తామని చెప్పి విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత కూడా అక్కడి కాంగ్రెస్ సర్కార్‌దని ఎద్దేవా చేశారు. తెలంగాణలో కుటుంబపాలన నడుస్తోందని, ఎక్క డ చూసినా అవినీతే కనిపిస్తోందని విమర్శించారు.

కుటుంబ పాలనకు సమయం ముగిసింది

- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ కుటుంబ పాలనకు సమయం ముగిసిందని, ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను ఓడించబోతున్నారని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ జోస్యం చెప్పారు. ఫామ్‌హౌస్ నుంచి కేసీఆర్ 'వర్క్ ఫ్రం హోం'పాలన సాగిస్తున్నారని, దీంతో ప్రజలు ఆయనను ఇంటికే పరిమితం చేయాలని నిర్ణయించారని వ్యాఖ్యానించారు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పూర్తిగా వాటిని విస్మరించి ప్రజలను మోసం చేసిందన్నారు. పీయూష్ గోయల్ గురువారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజల పట్ల కేసీఆర్ విశ్వాస ఘాతుకానికి పాల్పడ్డారని మండిపడ్డారు. ప్రాజెక్టులలో అవినీతికి పాల్పడ్డారని, నాణ్యత లేకుండా నిర్మాణాలు చేపట్టారని...అందుకు ప్రత్యక్ష తార్కాణం కాళేశ్వరం ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగిపోయి కళ్లెదుట ప్రత్యక్షంగా కనిపిస్తోందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక వర్గం ఓటర్లను ఆకట్టుకునేందుకే తంటాలు పడుతున్నాయని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ అధికారానికి రాగానే ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని పీయూష్ గోయల్ వెల్లడించారు. ముస్లిం రిజర్వేషన్లపై అసదుద్దీన్ ఓవైసీ ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియదని ఎద్దేవా చేశారు. తెలంగాణకు రైల్వేబడ్జెట్‌లో కేటాయింపులు 16 రెట్లు పెరిగాయని, జాతీయ రహదారులకు రెండింతల నిధులు పెరిగాయని వివరించారు. తెలంగాణలో బీజేపీయేతర ప్రభుత్వం ఉన్నా ఇక్కడి అభివృద్ధికి అన్నిరకాలుగా మోదీ ప్రభుత్వం సహకరించిందన్నారు.

ఈటల భూముల కోసమే రూ. 27 కోట్లు ఇచ్చా

- రాజేందర్‌కు ఎందుకు నోటీసు ఇవ్వలేదు?... కేసీఆర్, అమిత్ షా ప్రోద్బలంతోనే నాపై ఈడీ దాడులు
- నా అరెస్టుకు బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర
- ఎన్నికల ప్రచారంలో చెన్నూరు కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ ఆరోపణ



కొత్తపల్లిలో ఎన్నికల ప్రచారంలో వివేక్

భీమారం: బీజేపీ నేత ఈటల రాజేందర్ భూముల కోసమే రూ. 27 కోట్లు చెక్కుల రూపంలో ఇచ్చానని, ఆ భూముల వ్యవహారంలో తనకు నోటీసులు ఇచ్చిన ఐటీ అధికారులు... ఆయనకు ఎందుకు ఇవ్వలేదని చెన్నూరు కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ గడ్డం వివేక్ ప్రశ్నించారు. బీజేపీలో ఉన్నాడనే ఉద్దేశంతోనే ఈటలకు నోటీసులు కూడా ఇవ్వడం లేదా అని నిలదీశారు. గురువారం మంచిర్యాల జిల్లా భీమారం మండలం కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వివేక్... బీఆర్ఎస్‌తోపాటు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బీజేపీలో ఉన్నప్పుడు తనను సీతలా చూసిన ఆ పార్టీ నేతలు... కాంగ్రెస్‌లో చేరాక రావణుడిలా చూస్తున్నారన్నారు. చెన్నూరు బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ ఓటమి భయంతోనే సీఎం కేసీఆర్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు చెప్పి తనపై కేంద్ర సంస్థలతో దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. గతంలో హుజూరాబాద్, మునుగోడులో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం తాను అహర్నిశలు కృషి చేశానని చెప్పారు. బాల్క సుమన్ ఫిర్యాదుతో ఐటీ అధికారులు 8 చోట్ల సోదాలు నిర్వహించి దాదాపు 12 గంటలపాటు తాను ప్రచారానికి వెళ్లకుండా అడ్డుకున్నారని వివేక్ ఆరోపించారు.

ఆ కంపెనీ నా మిత్రుడిదే...

తాను నిజాయతీతో వ్యాపారం చేస్తున్నానని, ఇప్పటివరకు రూ. 10 వేల కోట్ల మేర పన్నులు చెల్లించానని వివేక్ వివరించారు. 2014 ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కూడా ఆర్థిక సాయం చేశానని, అలాంటిది తనపై దాడులు చేయించారన్నారు. కేసీఆర్‌కు దమ్ముంటే ఈ ఎన్నికల్లో గెలవాలని సవాల్ విసిరారు. తప్పుడు ఆరోపణలతో బీజేపీ, బీఆర్ఎస్ కలసి తనను అరెస్టు చేయాలని కుట్ర చేస్తున్నాయని వివేక్ ఆరోపించారు. రూ. 20 లక్షల కంపెనీ రూ. 200 కోట్ల మేర లావాదేవీలు చేసిందని అంటున్నారని, కానీ ఆ కంపెనీ తన మిత్రుడికి చెందినదని వివేక్ తెలిపారు. చట్ట నిబంధనల ప్రకారమే తాను ఆ కంపెనీని చూసుకుంటున్నానని చెప్పారు. ఇటీవలే ఆ కంపెనీ షేర్లు అమ్మితే రూ. 50 కోట్ల లాభం వచ్చిందని, అందులో రూ. 9 కోట్లను పన్నుగా చెల్లించామని వివేక్ వివరించారు.

దైవసాక్షిగా చెప్తున్నా.. అమ్ముడుపోలేదు!



అమ్ముడుపోయినట్టుగా వచ్చిన ఆరోపణలకు అంతే దీటుగా స్పందించారు ఓ అభ్యర్థి. ప్రత్యర్థి ప్రలోభాలకు లొంగిపోలేదని దైవసాక్షిగా తిప్పికొట్టారు. బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన కొందరి ఆరోపణలకు సమాధానంగా బీజేపీ అభ్యర్థి శ్రీకాంత్‌రెడ్డి పసుపునీళ్లతో స్నానం చేశారు. అనంతరం స్థానిక మోహినిపుర వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రమాణం చేశారు. తనపై వస్తున్న ఆరోపణలు అవాస్తవమని శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. – ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

అడ్డుగా ఉన్నాననే నన్ను బయటికి పంపారు

గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్



గజ్వేల్ మండలంలో ఈటలకు తిలకం దిద్దుతున్న మహిళలు

గజ్వేల్: కేటీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేయడానికి అడ్డుగా ఉన్నాననే భయంతోనే బీఆర్ఎస్ నుంచి తనను బయటికి పంపారని గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఆరోపించారు. తెలంగాణలో కేసీఆర్ కుటుంబానికే ఉన్నత పదవులు దక్కాయన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ తీరుపై నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్‌లో సీఎం లేదా పార్టీ అధ్యక్ష పదవి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితకు తప్ప వేరే వ్యక్తులకు వచ్చే అవకాశమే లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీసీలకు సముచిత స్థానం ఇవ్వడంలేదని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ మాత్రమే బీసీ నాయకుడిని సీఎం చేస్తానంటూ ధైర్యంగా ప్రకటించారని చెప్పారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాల్సిన అవసరముందని ప్రజలకు పిలుపునిచ్చారు. అసెంబ్లీలో తన మొహం కనిపించకుండా కేసీఆర్ వందల కోట్లు ఖర్చుపెట్టి ఇబ్బందిపెడుతుంటే.. 'కేసీఆర్ నువ్వే హుజూరాబాద్‌కు రా.. నీ ముఖం చెల్లుతుందో.. నా ముఖం చెల్లుతుందో.. చూద్దాం?'అంటూ సవాల్ చేశానని గుర్తుచేశారు. కేసీఆర్ రాకపోయేసరికి తేల్చుకోవడానికి ఇప్పుడు తాను గజ్వేల్‌కే వచ్చానని స్పష్టం చేశారు. గజ్వేల్‌లో తనను గెలిపిస్తే భూములను అక్రమంగా గుంజుకోకుండా అడ్డుకట్ట వేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మత పరమైన రిజర్వేషన్లను రద్దు చేస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

విద్యుత్ సరఫరా కావడం లేదన్నారు. కాంగ్రెస్ మాదిరిగానే కేసీఆర్ కూడా హామీల పేరుతో ఎన్నికల్లో తెలంగాణ ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. ధరణి పోర్టల్ కాదు.. అది కేసీఆర్ భూములు హరించే పోర్టల్ అని చెప్పారు. మోదీ ప్రభుత్వం తెలంగాణలో ప్రత్యేకంగా రామగుండం ఎరువుల కర్మాగారాన్ని పునఃప్రారంభించిందని, వందే భారత్ రైళ్లను మంజూరు చేసిందని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే నిరుపేదలకు ఏటా నాలుగు సిలిండర్లను ఉచితంగా ఇస్తామని, పసుపుబోర్డు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆడపిల్ల పుడితే పెళ్లి వయస్సు వచ్చే సరికి రూ.రెండు లక్షలు వచ్చేలా బాండ్లు ఇస్తామని, విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు ఇస్తామని హామీ ఇచ్చారు.



సంగారెడ్డిలో జరిగిన సభలో అభివాదం చేస్తున్న జేపీ నడ్డా. చిత్రంలో సంగారెడ్డి అభ్యర్థి పులిమామిడిరాజు తదితరులు

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 5వ స్థానానికి భారత్

తెలంగాణ కోసం బలిదానాలు చేసిన, ప్రాణాలొడ్డి పోరాడిన ఉద్యమకారులను సైతం కేసీఆర్ ప్రభుత్వం వంచించిందని నడ్డా వ్యాఖ్యానించారు. కేసీఆర్ అవినీతితో తన కుటుంబ సభ్యులను బాగుచేసుకుని రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారన్నారు. ఇక్కడ కేసీఆర్, కేటీఆర్, కవిత పాలన నడుస్తోందన్నారు. విభజన సమయంలో ధనికంగా ఉన్న తెలంగాణను కేసీఆర్ ప్రభుత్వం అప్పులపాలు చేసిందన్నారు. కేంద్ర నిధులతో పథకాలు అమలు చేయకుండా కేసీఆర్ కుటుంబం అవినీతి, అక్రమాలకు పాల్పడిందన్నారు. దళితుడిని సీఎం చేస్తానన్న హామీతోపాటు అనేక హామీలను కేసీఆర్ తుంగలో తొక్కారన్నారు. మోదీ ప్రభుత్వం దేశంలో 5జీ నెట్‌వర్క్ తెస్తే రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం గప్‌లా (అక్రమాలు), గోటాలా (కుంభకోణాలు), గూస్‌కోరీ (అవినీతి), గరీబీ, గూండారాజ్ తెచ్చిందన్నారు. తెలంగాణలో దేశంలోనే అత్యధిక ద్రవ్యోల్బణం ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే తెలంగాణ రూపురేఖలను మారుస్తామని, అవినీతిరహిత పాలన అందిస్తామన్నారు. ప్రధాని మోదీ హయాంలో భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 5వ స్థానానికి చేరిందన్నారు. గరీబ్ కల్యాణ్ యోజన ద్వారా 80 కోట్ల మందికి ఉచిత రేషన్ పంపిణీ చేస్తున్నామని చెప్పారు. తెలంగాణలో పసుపు బోర్డు ఏర్పాటుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, పసుపు శుద్ధి యూనిట్‌ను కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో పసుపునకు మద్దతు ధర లభిస్తుందన్నారు.

> నిశ్చయంగా – ప్రజలలో మంచి పనులు చేసేవారు ఎవరో పరీక్షించటానికి – మేము భూమిపై ఉన్న వస్తువులను దానికి అలంకారంగా (ఆకర్షణీయమైనవిగా) చేశాము.
>
> – ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 24 నవంబర్ 2023

కార్పొరేట్ సునామీ!

బోర్డు రూం కుట్రలు, కార్పొరేట్ దిగ్గజ సంస్థలు చేతులు మారడం వగైరాలు ప్రపంచానికి కొత్త కాదు. కానీ చాట్‌జీపీటీ మాతృసంస్థ ఓపెన్ ఏఐలో పుట్టుకొచ్చిన సునామీ అందరినీ దిగ్భ్రాంతి పరిచింది. చిత్రమేమంటే... ఏం జరిగిందో అందరూ అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తుండగానే అనేక మలుపులు తిరిగి అది కాస్తా చప్పున చల్లారింది. ఈ మొత్తం వ్యవహారమంతా కేవలం అయిదంటే అయిదే రోజుల్లో పూర్తయింది. డైరెక్టర్ల బోర్డు బయటకు నెట్టేసిన వ్యక్తే దర్జాగా వెనక్కి రావటం, బోర్డు సభ్యులతో సహా కంపెనీలో ఎవరినైనా తొలగించే అధికారం చేజిక్కించుకోవటం, ఆయన్ను బయటికి పంపినవారే చివరకు పదవులు కోల్పోయి దిక్కుతోచని స్థితిలో పడటం ఈ వివాదానికి కొసమెరుపు. కేవలం నలుగురు డైరెక్టర్లకు వ్యతిరేకంగా 95 శాతంమంది సిబ్బంది తిరగబడటం, తామంతా రాజీనామా చేస్తామని హెచ్చరించటం, వారితో ఇన్వెస్టర్లు సైతం చేతులు కలపటం కనీవినీ ఎరుగనిది. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో అద్భుతాలు సృష్టించగల ఉపకరణాలను సృష్టించటమే ధ్యేయంగా శామ్యూల్ ఆల్ట్‌మాన్ 2015లో స్టార్టప్ కంపెనీ ఓపెన్ ఏఐ స్థాపించాడు. మరో నాలుగేళ్లకు మైక్రోసాఫ్ట్, ట్విటర్ సహా కొన్ని సంస్థలు, కొందరు వ్యక్తులూ అందులో పాలుపంచుకున్నారు. దాని పరిశోధనలు స్వల్ప కాలంలోనే అద్భుత ఆవిష్కరణలకు దారితీసి ఓపెన్ ఏఐ సిలికాన్ వ్యాలీలో 8,000 కోట్ల డాలర్ల దిగ్గజ సంస్థగా ఆవిర్భవించింది. అది ఏడాదిక్రితం తీసుకొచ్చిన చాట్‌జీపీటీ స్మార్ట్ ఫోన్ తర్వాత అంతటి గొప్ప ఆవిష్కరణగా గుర్తింపుపొందింది. అంతేకాదు, అది మున్ముందు మానవాళి మనుగడకు సైతం ముప్పుగా పరిణమించవచ్చన్న భయాందోళనలూ బయల్దేరాయి. దాన్ని అదుపు చేసేందుకు ఎలాంటి చట్టాలు అవసరమో ప్రపంచ దేశాధినేతలంతా చర్చించుకుంటున్నారు. అమెరికా, బ్రిటన్, యూరోపియన్ యూనియన్‌లు ఇప్పటికే చట్టాలు చేశాయి. మన దేశం కూడా ఆ పనిలోనే వుంది. కృత్రిమ మేధతో దేశదేశాల పౌరుల గోప్యతకూ, ముఖ్యంగా మహిళల, పిల్లల భద్రతకూ రాగల ముప్పు గురించిన భయసందేహాలు అంతటా ఆవరించాయి. రక్షణ రంగ వ్యవస్థల్లోకి, మరీ ముఖ్యంగా సైనిక స్థావరాల్లోకి ఇది ప్రవేశిస్తే రెప్పపాటులో భూగోళం బూడిదగా మారుతుందన్న హెచ్చరికలు వస్తూనే వున్నాయి. సురక్షితమైన కృత్రిమ మేధ మాత్రమే ప్రపంచానికి అవసరమంటూ అల్ట్రూయిజం వంటి టెక్ ఉద్యమాలూ బయల్దేరాయి.

ఈ నేపథ్యంలో అసలు ఓపెన్ ఏఐలో ఏం జరిగిందన్న ఆసక్తి, ఆత్రుత వుండటం సర్వసాధారణం. విషాదమేమంటే సంస్థ ఎగ్జిక్యూటివ్‌గా వున్న శామ్ ఆల్ట్‌మాన్‌కూ, డైరెక్టర్ల బోర్డుకూ మధ్య ఏర్పడ్డ లడాయి ఏమిటన్నది వెల్లడికాలేదు. ఆల్ట్‌మాన్ దేన్నీ సూటిగా, స్పష్టంగా చెప్పటం లేదని ఇప్పుడు నిష్క్రమించిన డైరెక్టర్లు ఆరోపించారు. ఆయన దేన్ని దాచటానికి ప్రయత్నించాడో, ఏ విషయంలో వారికి స్పష్టత రావటంలేదో వివరించలేదు. సరిగ్గా ఇదే కీలకమైనది. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమవుతున్న భయాందోళనలకూ, ఈ వివాదానికీ సంబంధం వుండే అవకాశం లేకపోలేదని కొందరి విశ్లేషణ. కృత్రిమ మేధతో పరిశోధనలు సాగిస్తున్నది ఓపెన్ ఏఐ మాత్రమే కాదు... దాంతోపాటు అమెరికాలోనే ఆంత్రోపిక్, స్కేల్ ఏఐ, విజ్.ఏఐ, డీప్ 6 వంటి 50 సంస్థలున్నాయి. ఇవిగాక మన దేశంతోపాటు అనేక దేశాల్లో పలు సంస్థలు కృత్రిమ మేధపై పని చేస్తున్నాయి. ఎలాంటి నిబంధనలూ, నియంత్రణలూ లేని వర్తమాన పరిస్థితుల్లో ఆర్నెల్లపాటు కృత్రిమ మేధ పరిశోధనలపై మారటోరియం విధించాలని టెక్ నిపుణులు కొందరు ఆమధ్య సూచించారు. కృత్రిమ మేధలో పరిశోధనలు చేస్తున్న ఎలిజార్ యుడ్కోవ్‌స్కీ ఈ టెక్నాలజీ తెలివితేటల్లో మనుషుల్ని మించిపోతుందని, చివరకు వారినే మింగేస్తుందని, చివరకు మనమంతా నియాండర్‌తల్ యుగానికి తిరోగమించటం ఖాయమని జోస్యం చెప్పాడు.

అయితే కృత్రిమ మేధతో రాగల ప్రమాదాల గురించి కొందరు అతిగా మాట్లాడుతున్నారన్న విమర్శలూ వున్నాయి. మానవాళికి ముప్పు తెచ్చే అగ్ని పర్వతాలు, గ్రహశకలాలు, అణ్వాయుధాలకన్నా అదేమీ పెద్ద ప్రమాదకారి కాదని వారి వాదన. భయాందోళనల మాటెలావున్నా దాని శక్తి సామర్థ్యాలు, ఉపయోగాలు కాదనలేనివి. రెండువేల ఏళ్లనాడు వర్ధిల్లిన పురాతన లిపుల్లో ఏం నిక్షిప్తమైవున్నదో వెలికితీసింది కృత్రిమ మేధ ఆధారంగా అందుబాటులోకి వచ్చిన ఉపకరణాలే. చరిత్రలో తొలికాలపు గ్రీకులు రాసినదేమిటో అర్థం చేసుకోవటానికి మూడువేల యేళ్లు పట్టింది. మయన్లు లిఖించిన పదాల కూర్పులోని రహస్యమేమిటో తెలుసుకోవటానికి రెండు శతాబ్దాలు పట్టింది. కానీ ఏఐ అలాంటి సంక్లిష్టమైన లిపులను క్షణాల్లో తేటతెల్లం చేస్తోంది. అందువల్ల ప్రాచీన మానవుల జీవన విధానంపై మన అవగాహన పెరిగింది. ఇక వైద్యపరంగా కృత్రిమ మేధ సాధిస్తున్నది అపారం.

శామ్ ఆల్ట్‌మాన్‌కు గురు సమానుడు స్టీవ్ జాబ్స్. మరొకరితో కలిసి ఆయన నెలకొల్పిన యాపిల్ సంస్థకు ఏరికోరి సీఈఓగా తెచ్చుకున్న వ్యక్తే 1985లో ఆ సంస్థనుంచి స్టీవ్ జాబ్స్‌ను వెళ్లగొట్టడం, తదనంతర పరిణామాల్లో జాబ్స్ తిరిగి అదే సంస్థకు రావటం చరిత్ర. ఇప్పుడు ఆల్ట్‌మాన్‌కు కూడా అదే జరిగింది. ఏదేమైనా ఓపెన్‌ఏఐలో జరిగిందేమిటో, పరిశోధనల దశ, దిశ ఎలా వున్నాయో తెలుసుకోవటం ప్రపంచ ప్రజానీకం హక్కు. అది తేటతెల్లం చేయాల్సిన బాధ్యత సంస్థలపై వుంది. కేవలం మానవాళి మంచికి మాత్రమే ఉపయోగపడేలా, ప్రభుత్వాలతో సహా ఎవరూ ఏఐని దుర్వినియోగం చేయకుండా కట్టుదిట్టమైన నియంత్రణలు విధించటం తక్షణావసరం.

పర్యావరణ హిత జీవనశైలి అవశ్యం

విశ్లేషణ



డా॥ పి. పృథ్వీకర్ రెడ్డి

క్రమపద్ధతి లేని ఉష్ణోగ్రత, వర్షపాతాల రూపంలో వాతావరణ మార్పు పరిణామాలు అనుభవిస్తున్నాం. ఒక శతాబ్దానికి పైగా, మండుతున్న శిలాజ ఇంధనాలు, అసమానమైన, నిలకడలేని శక్తి, భూవినియోగాల వలన, యావత్ ప్రపంచం మితిమీరి వేడెక్కడానికి దారితీసిందని, వాతావరణ మార్పును పరిశీలించడానికి నియమింపబడిన ఇంటర్‌గవర్నమెంటల్ ప్యానెల్ తన నివేదికలో నిర్ధారించింది. పర్యావరణాన్ని రక్షించడానికి సమగ్రమైన ప్రతిస్పందన, ప్రతి ఒక్కరికీ దానిని రక్షించాలనే భావన అనివార్యం. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ విపరీత పర్యావరణ సవాలును ఎలా ఎదుర్కోవాలనే విషయమై సతమతమవుతున్నాయి. పర్యావరణ రక్షణకు ఉపయోగపడే స్థిరమైన జీవనశైలి, ప్రతి వ్యక్తి తీసుకునే చర్యలు పెద్ద మార్పును తేగలవు.

గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడానికి తక్షణ, నిశ్చయాత్మకమైన ప్రయత్నాల అవసరం ఎంతైనా ఉంది. దీనికి గాను వాతావరణ నిపుణులు, సరఫరా, వినియోగ ప్రవర్తన వైపు పరిష్కారాలు ప్రతిపాదించారు. ఇందులో ఉద్గారాలు, వాటి నిర్వహణ, సాంకేతిక ఎంపికలు, జీవనశైలి మొదలైన వాటిని లక్ష్యంగా చేసుకుని, పరిష్కారాలు సూచించారు. వినియోగ నిర్వహణ అనునది, ఉత్పత్తి వ్యవస్థల నుండి వచ్చే ప్రతికూల పర్యావరణ ప్రభావాలను తగ్గించడం కొరకే గానీ, నాణ్యమైన జీవితం కోల్పోవడానికి కాదనీ వక్కాణించారు. ఈ ప్రయత్నంలో, వ్యక్తిగత ప్రవర్తన ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. మన దేశంలోని నీతి ఆయోగ్, ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం(యూఎన్‌డీపీ) వారిచే సంయుక్తంగా ఒక కార్యాచరణ నివేదిక 2023లో విడుదల అయింది. భారతదేశంతో సహా అనేక దేశాలలో నిర్వహించిన అధ్యయనాల ఫలితాలను క్రోడీకరించి, పర్యావరణాన్ని పరిరక్షించడానికి ఉపయోగపడే ఏడు ముఖ్యమైన అంశాలు ఈ నివేదికలో పొందుపరచారు. వీటిలో నీటి పొదుపు, వ్యర్థాల నిర్వహణ, సుస్థిరమైన ఆహార వ్యవస్థ, ఇంధన సంరక్షణ, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, స్థిరమైన జీవనశైలి, ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ ఉన్నాయి. అన్ని అధ్యయనాలు భారతదేశంలో జరగనప్పటికీ, ఫలితాలు మాత్రం పర్యావరణాన్ని పరిరక్షించడానికి మనకు కూడా వర్తిస్తాయి.



ఆహార రంగం

ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆహారాన్ని సక్రమంగా వినియోగించుకొని, పంట నుండి వినియోగం వరకు వృథాను తగ్గించాలి. మొక్కల ఆధారిత ఆహారాలను ఎక్కువగా తిని, జంతు ఆధారిత ఉత్పత్తులను తక్కువగా తినడం అలవాటు చేసుకోవాలి. 'ఆహారాన్ని ప్రేమించు – వ్యర్థాలను ద్వేషించు' అను నినాదం, ఆహార వృథాను తగ్గించడానికి ఉపయోగపడటంతోపాటు, ఆహారం తయారీ యజమానులలోను, చిల్లర వ్యాపారులలోను, వినియోగదారులలోను గణనీయమైన సానుకూల ఫలితాలను అందించింది. గృహ స్థాయిలో వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించడం వల్ల కంపోస్ట్ తయారీకి దారితీసి, నేల సారాన్ని పెంపొందించడంలో సహాయపడింది. స్థానికంగా పండించిన, కాలానుగుణమైన, ప్రకృతి మరియు సేంద్రీయ పద్ధతిలో పండించిన ఆహారాన్ని వినియోగిస్తున్నవారు, శాకాహారులు, యితర వ్యక్తులతో పోలిస్తే, తక్కువ తలసరి ప్రతికూల పర్యావరణ ప్రభావాన్ని కలిగిస్తున్నారని ఫలితాలు చూపించాయి.

వ్యవసాయం, భూమి నిర్వహణ పద్ధతులు

ఉత్పాదకతను పెంచడానికి పచ్చిక బయళ్లలో చెట్లను పెంచడం, వార్షిక పంటలతోపాటు చెట్లను పెంచడం, ప్రకృతి వ్యవసాయం పాటించడం, అనగా కంపోస్ట్ ఎరువు వాడకం, కలుపు అణచివేసే కవరు పంటలు వేయడం, రసాయన ఎరువుల వాడకం నిషేధించడం, యితర సహజ/సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు పాటించడం, సారం క్షీణించిన వ్యవసాయ భూమిని పునరుద్ధరించడం, పంట మార్పిడి చేయడం, పంట వేయడానికి నేలను తక్కువసార్లు దున్నడం, డ్రిప్ లేదా స్ప్రింక్లర్ పద్ధతుల ద్వారా పంటలకిచ్చే నీటి వినియోగాన్ని, వృథాను బాగా తగ్గించడం లాంటివన్నీ పర్యావరణ పరిరక్షణకు దారి తీస్తాయి. నీటికి సంబంధించిన లెక్కలు, తనిఖీ ప్రయోగం విజయవంతమైన వ్యూహంగా నిరూపితమైంది. నీటి వినియోగదారుల సంఘాలను ఏర్పాటు జేసుకోవడం, నీటి సంరక్షణ, వాతావరణ అంచనా కోసం అందుబాటులో ఉన్న సాంకేతికతను స్వీకరించడం వలన నీటి నిల్వను, వినియోగాన్ని మెరుగుపరచుకోవచ్చని ధ్రువీకరించడమైనది. ఆంధ్రప్రదేశ్‌లో, సహజ వ్యవసాయంతో బాటు, రుతుపవనాలకు ముందు అనగా వేసవి కాలంలో పంట వేయడం, స్థిరమైన వ్యవసాయం వైపు ప్రోత్సహించడం దీనికి ఒక ఉత్తమ ఉదాహరణ. ఈ పద్ధతులు నీటి సంరక్షణకు తోడ్పడుతూ, నేల నాణ్యతను సైతం మెరుగుపరుస్తున్నాయి. దీనికితోడు, రసాయన రహిత ఆహార ధాన్యాలను అందిస్తూ, భూమిలో 365 రోజుల పచ్చదనాన్ని, చల్లటి వాతావరణాన్ని యిస్తున్నాయి.

రవాణా

కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో రవాణా కీలక పాత్ర వహిస్తున్నది. పట్టణాలు, నగరాల్లో ప్రయాణించడానికి, ప్రజలు వ్యక్తిగత వాహనాలను ఉపయోగించకుండా ప్రజా రవాణాను ఉపయోగించడం అలవాటు చేసుకోవాలి. బ్యాటరీతో నడిచే వాహనాలను ఉపయోగించడం, గమ్యస్థానాలు చేరుకోడానికి సైకిలు ఉపయోగించడం, సాధ్యమైన చోటల్లా నడవడం, ఇద్దరు అంతకంటే ఎక్కువ మంది కలిసి వాహనాల్లో వెళ్ళడం, కార్‌పూలింగ్ పద్ధతులను పాటించడం, భౌతిక ఉనికికి బదులుగా వీడియో సాంకేతికతలను ఉపయోగించి టెలిప్రెసెన్స్‌ను పెంపొందించి రవాణా ఖర్చు తగ్గించడం వంటి చర్యలన్నీ కాలుష్యాన్ని తగ్గించడానికి ఉపయోగపడతాయి. రవాణాలో రద్దీని, ఖర్చును తగ్గించడానికి, సమర్థవంతమైన ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యం సహాయపడుతున్నది.

శక్తి సంబంధిత పదార్థాలు

శక్తి వినియోగంలో, పొదుపు ప్రవర్తన పెద్ద సవాలుగా మారింది. భవనం పైకప్పులో సోలార్‌ను అమర్చడం, వేడి నీటి కోసం సోలార్ హీటర్లను అమర్చుకోవడం, ఇంట్లో వెలుతురు, వంట కోసం బయోగ్యాస్ ఏర్పాటు చేసుకోవడం, ఎల్‌ఈడీ బల్బులు ఉపయోగించడం, ఇంధన సమర్థవంతమైన వాహనాలు, ఎలక్ట్రిక్ వాహనాలను వాడటం, పైకప్పులో తోటలను పెంచడం పర్యావరణ పరిరక్షణకు గణనీయంగా దోహదపడతాయి. వంటకు మెరుగైన స్టవ్‌లు (పొయ్యిలు) వాడితే, పొగ స్థాయిలను 55 శాతం వరకు తగ్గించాయని మన దేశంలో చేసిన ప్రయోగాలు నిరూపించాయి.

అవసరమైన వ్యూహాలు

మీడియా ప్రసారాలు, ప్రకటనలు, వార్తాపత్రికలలో కథనాలు అవగాహన స్థాయిని పెంచడంలో సహాయపడతాయి. పర్యావరణ అనుకూల పద్ధతులను పాటిస్తున్న వినియోగదారులను, ప్రభుత్వాలు తగు రీతిలో ప్రోత్సహించి, ప్రశంసిస్తే ఇతరులు కూడా అనుసరిస్తారని పరిశోధనలలో తేలింది. వినియోగదారుల నిర్ణయం ప్రభావితం చేయడానికి, వస్తువులపై 'పర్యావరణ అనుకూలమైనది' అని ముద్రించాలి. వ్యర్థాలు, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ఆరోగ్యకరమైన జీవనమునకు, స్థిరమైన ఆహార పద్ధతులను స్వీకరించడానికి దోహదపడుతుంది. పల్చటి ప్లాస్టిక్ కలిగించే ప్రతికూల ప్రభావాలను పాఠశాల పిల్లలకు తెలియబరిచాక, వారిలో గణనీయమైన మార్పు వచ్చింది. ధూమపానం చేసేవారు, తమ సిగరెట్ పీకలను నిర్దేశిత ప్రదేశంలో పడవేసేలా అవగాహన కల్పించాలి. సిగరెట్ పీకలు పర్యావరణంలోకి హానికరమైన రసాయనాలను వెదజల్లి, మైక్రోప్లాస్టిక్‌లుగా విడదీయడం వల్ల పర్యావరణం కలుషితమవుతున్నది. కుళాయిలలో నీటి ప్రవాహాన్ని తగ్గించడం, నీటి లీకేజీలను ఆపడం, పళ్ళు తోముకునేటప్పుడు కుళాయిని ఆపివేయడం వంటి చర్యల ద్వారా గృహాలలో నీటి ఆదా చేయవచ్చని అధ్యయనాలు వెల్లడించాయి. వ్యర్థాలను తగ్గించడానికి, చిన్న చిన్న మోతాదులలో వస్తువులను ప్యాకేజి చేయడం, ఒకసారి ఉపయోగించి పారవేయకుండా తిరిగి వాడటం అత్యంత ప్రభావవంతమైన మార్గాలు. సూట్‌కేసులు, ప్రింటర్లు, బూట్లు, వాషింగ్ మెషీన్‌లు సుదీర్ఘ కాలం ఉండేవి కొనుగోలు చేయడానికి వినియోగదారులు ఇష్టపడతారు, కాబట్టి వీటి జీవితకాలాన్ని ప్రముఖంగా కనబడేటట్లు ముద్రించాలి. తద్వారా వీటి వ్యర్థాలను తగ్గించవచ్చు. మొబైల్, టెలివిజన్, కంప్యూటర్ తయారీదారులు, వాటి వ్యర్థాలను రీసైకిల్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

పైన చెప్పినట్లుగా, వ్యక్తిగత స్థాయిలో ప్రవర్తన మార్పులు వచ్చినచో, కచ్చితంగా పర్యావరణాన్ని రక్షించవచ్చు.

వ్యాసకర్త హైదరాబాద్‌లోని 'సెస్'(సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్) సీనియర్ పరిశోధకుడు | prudhvikar@cess.ac.in

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నచ్చలేదు



డ్రెస్సింగ్ రూమ్ ఏ జట్టుకైనా పవిత్ర స్థలం. ఆటగాళ్లకు తప్ప ఎవరికీ అనుమతి ఉండని ఆ గది బయటే భారత ప్రధాని మన క్రీడాకారులను ఓదార్చి ఉండాల్సింది. మోదీ తన బెడ్‌రూమ్‌లోకి, డ్రెస్సింగ్ రూమ్‌లోకి తనను ఓదార్చడానికి వచ్చిన సందర్శకులను అనుమతిస్తారా?

– కీర్తి ఆజాద్, మాజీ క్రికెటర్

రానున్న ముప్పు



అభివృద్ధి చెందిన దేశాలలో సామాజిక ప్రయోజనాల కోసం 'డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్'ను ప్రోత్సహించడానికి సోషల్ ఇంపాక్ట్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని ప్రధాని మోదీ ప్రతిపాదించారు. దీని ద్వారా ఆయన డీప్‌ఫేక్ ప్రమాదాన్ని పునరుద్ఘాటించారు. మార్ఫింగ్ అనే మాట చిన్నదే కావచ్చు. ప్రపంచ దేశాలన్నీ కలిసి వస్తే తప్ప దీనిని ఎదుర్కోలేం.

– వసుధా వేణుగోపాల్, జర్నలిస్ట్

దేశానికి గుర్తింపు



శ్రీలంకలో గత రెండు రోజులుగా వైరల్ అవుతున్న ఉత్తమమైన వార్త ఏమిటో తెలుసా? ముల్లైతీవు నివాసి అయిన 71 ఏళ్ల అకిల తిరునాయకి ఫిలిప్పీన్స్‌లో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రెండు బంగారు పతకాలు, ఒక కాంస్య పతకం సాధించడం.

– మీరా శ్రీనివాసన్, జర్నలిస్ట్

అదే గౌరవం



ఉగ్రవాదులతో పోరాడుతూ సైనికులు 'చంపబడ్డారు', 'చనిపోయారు', 'ప్రాణాలు కోల్పోయారు' అనే పదాలకు మీడియా దూరంగా ఉండాలి. వారికి ఉన్న ఒకే ఒక పదం అమరవీరులు.

– అమోల్ అవతే, లెఫ్టినెంట్ కల్నల్

గుర్రం ఎగరావచ్చు



'స్త్రీని అర్థం చేసుకున్నానని అనుకుంటే పొరపడినట్లే. స్త్రీలు అర్థం అవడానికి కాదు, ప్రతి ఫలంగా ఏమీ ఆశించకుండా ప్రేమను పొందడానికి మాత్రమే సృష్టింపబడ్డారు' అని చాణక్య వాక్కు. దీన్ని విశ్వసించినా, లేకున్నా... అర్థం చేసుకునే ప్రయత్నాలనైతే మానకండి.

– ధ్రువ్ చౌహాన్, యూట్యూబర్

అగ్రస్థానంలో భారత్

భారతదేశంలో సుమారు 2 లక్షల గ్రామాలు పాడి పరిశ్రమకు ఆలవాలంగా ఉన్నాయి. తొమ్మిది కోట్ల కుటుంబాలకు చెందిన 45 కోట్లమంది సన్న, చిన్నకారు రైతులు, మహిళలు ప్రత్యక్ష ఉపాధి పొందుతున్నారు. గత ఆర్థిక సంవత్సరం ప్రపంచంలో పాల ఉత్పత్తిలో భారత్ అగ్రస్థానం పొందింది. అమెరికా, యూఏఈ, సౌదీ అరేబియా, బంగ్లాదేశ్, భూటాన్ తదితర దేశాలకు ఎగుమతులు చేసి కోట్లాది రూపాయల విదేశీ మారకద్రవ్యం ఆర్జించటం జరిగింది. పాడి పరిశ్రమకు గ్రామీణ భారతం ఎంతో అనుకూలంగా ఉండటం, చిన్నకారు రైతులకు, మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించటంలో ఈ పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తున్నందున దీనికి మరింత వెన్నుదన్ను నివ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకుగాను దేశంలో ప్రస్తుతం ఉన్న పాడి పశువుల సంఖ్యను పెంచే దిశలో చర్యలు తీసుకుంటోంది.

భారతదేశం పాలను అత్యధికంగా ఉత్పత్తి చేసే దేశంగా ఉన్నప్పటికీ ఉత్పత్తి, వినియోగం మధ్య భారీ తేడా ఉంది. ఈ అంతరాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు ఈ పోషక ఆహారాన్ని కల్తీ చేస్తున్నారు. ప్రమాద కరమైన డిటర్జెంట్లు, సింథటిక్స్, యూరియా, కాస్టిక్ సోడా, ఫార్మాలిన్ వంటి రసాయనాలు కలుపుతారు. ఫలితంగా జీర్ణకోశ సమస్యలు, బలహీనతలు, గుండె సమస్యలు, క్యాన్సర్ వంటి భయంకర వ్యాధులు సంక్రమించవచ్చు.

ప్రధానంగా, పాల నిల్వ వ్యవధిని పెంచడానికి ప్రిజర్వేటివ్‌లను కలుపుతారు. నీటి పరిమాణాన్ని పెంచి చిక్కని పాలులా కన్పించేందుకు అమ్మోనియం సల్ఫేట్, బోరిక్ యాసిడ్, బెంజోయిక్ యాసిడ్, సాలిసిలిక్ యాసిడ్, హైడ్రోజన్ పెరాక్సైడ్, చక్కెర, మెలమైన్ వంటి తీవ్రమైన ప్రతికూల ఆరోగ్య ప్రభావాలను కలిగించేవాటిని కలుపుతున్నారు. కల్తీదారులపై ఉక్కుపాదం మోపి కఠిన శిక్షలు విధించాలి. ఈ మార్పు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సత్వర చర్యలు మొదలెట్టడం అభినందనీయం.

– చలాది పూర్ణచంద్ర రావు, సీనియర్ జర్నలిస్ట్

(నవంబర్ 26న శ్వేత విప్లవ సృష్టికర్త వర్గీస్ కురియన్ జయంతి)

రాజ్యాంగ పఠనం మన తక్షణావసరం

తూర్పు తీరం



కె.ఎన్. మల్లీశ్వరి

1949 నవంబర్ 26వ తేదీన, రాజ్యాంగ సభలో భారత ప్రజలు తమకి తాము రాజ్యాంగాన్ని సమర్పించుకున్నారని చరిత్ర చెపుతుంది. 1950 జనవరి 24న రాజ్యాంగ సభ సభ్యులు 284 మంది రాజ్యాంగ ప్రతి మీద సంతకాలు చేశారు. ఆ సమయంలో వానజల్లులు పడుతూ ఉండడం శుభ శకునంగా భావించారట. శాస్త్రీయ దృష్టికోణం, స్వేచ్ఛ, సమానత్వాల ఆకాంక్షలతో రాసుకున్నది రాజ్యాంగం. ఆ ప్రయత్నపు ఆమోద సమయంలో ఇటువంటి వ్యక్తీకరణ కాస్త వింతగానే ఉంటుంది. కానీ భారత రాజ్యాంగ రచనా ప్రస్థానం మొత్తం చూస్తే పై విలువలు రాజ్యాంగంలో పాదుకొల్పడానికి ఒంటి చేత్తో పోరాటం చేస్తూ, నిప్పులవాగులో నిరంతరం ఎదురీదిన అంబేడ్కర్ గుర్తుకు వస్తే ఆ చిరుజల్లులు కురవాల్సినవే అనిపిస్తుంది.

ఇంతకుముందు ఎప్పుడూ లేనంతగా రాజ్యాంగం ఇపుడు తరుచూ మాట్లాడుకునే అవసరం అయింది. ముఖ్యంగా పీడిత వర్గాలు తమ హృదయాలలో వెలిగించుకున్న ఆశాదీపం అయింది. తమ తమ మతగ్రంథాల కన్నా మిన్నగా రాజ్యాంగాన్ని ప్రాచుర్యంలోకి తీసుకు వచ్చే ప్రయత్నాలు చురుకుగా సాగుతున్నాయి. భారత రాజ్యాంగం చుట్టూ దాని ఆచరణలో విరోధాభాస కొంత ఉంది. నిజంగా రాజ్యాంగపు రక్షణ తప్పనిసరిగా కావాల్సిన వర్గాల వారు ఆ స్ఫూర్తిని ప్రకటించడం మొదలు పెట్టగానే ఆధిపత్య వర్గాలు, ప్రభుత్వాలు ఆ స్ఫూర్తిని హైజాక్ చేసే ప్రయత్నాలు మొదలు పెడతాయి.

రాజ్యాంగం శ్రమజీవులను విముక్తి చేయగలదా అన్న ప్రశ్నకి జవాబు అంత సులువు కాదు. రాజ్యాంగం ద్వారా సాధించుకోవలసిన విలువలను గుర్తిస్తూనే ఆచరణలో ఆ విలువలను నిలబెట్టలేని పరిమితులు కూడా రాజ్యాంగంలో ఉన్నాయన్నది గ్రహించాలి. ప్రజలకి రాజ్యాంగం ఇచ్చిన శక్తిమంతమైన ఆయుధం 'ఓటు' అనుకుంటాము కదా! తమని తాము పరిపాలించుకోవడానికి తమని తామే ఎన్నుకునే వ్యవస్థ మనది. దాని ప్రకారం మెజారిటీ ప్రజలు తమ సంక్షేమానికి పాటుపడే పార్టీలని ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఎన్నుకుంటారు. మరి ఆచరణలో ఇంత సింపుల్‌గా జరుతున్నదా?

కొన్నేళ్ళ కిందట 'న్యూటన్' అని ఒక సినిమా వచ్చింది. ఎన్నికలు ఎంత ఫార్స్‌గా మారిపోయాయో మనసుకు హత్తుకునేట్లు చెప్పడం కోసం త్రిముఖ నేపథ్యాన్ని తీసుకున్నారు. ప్రజల కోసం ప్రత్యామ్నాయ రాజకీయ సాధనాలతో పోరాడే మావోయిస్టులు, ఎన్నికలని నిజాయితీగా జరిపించాలనుకునే పోలింగ్ బూత్ అధికారి, ఓటు అంటే తెలియని అమాయకపు ఆదివాసీలు – ఈ ముప్పేట కథనంతో భారత ప్రజాస్వామ్యపు లొసుగులను కళ్ళకి కట్టినట్లు చూపించారు. రాజ్యాంగంలో తాము ఏమి



హక్కులు పొందు పరుచుకున్నారో తెలియని ప్రజలు కోట్లాది మంది. ఓటుని హక్కుగా ప్రజలకి ఇవ్వగలిగిన రాజ్యాంగం, ఇన్నేళ్లలో ఆ ఓటు చుట్టూ ఉన్న దట్టమైన డబ్బు అల్లికని తెంపలేకపోయింది. అనేక మౌలిక హక్కులను ప్రకటించిన రాజ్యాంగం దొంతర్లుగా పేరుకుపోయిన అంతరాలను తగ్గించలేకపోయింది.

అలాగని ఇప్పటికిపుడు దేశవ్యాప్తంగా అందరినీ సమానత్వపు తాటిమీదకి తెచ్చే పూర్తి భరోసాని ఏ రాజకీయాలూ ఇవ్వలేకపోతున్నాయి. కులం, మతం, వర్గం, జెండర్ తదితర అంశాలలోని ఆధిపత్య శక్తులని అదుపు చేయగలిగే తక్షణ రక్షణ కవచంగా రాజ్యాంగం మాత్రమే కనిపిస్తోంది. సూక్ష్మస్థాయి సంగతి సరే, స్థూలంగానైనా మేళ్ళు జరగాలంటే రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడుకోవడానికి పోరాటం చేయక తప్పదు. రాజ్యాంగాన్ని అక్కున చేర్చుకోక తప్పదు.

గత పదేళ్లుగా రాజ్యాంగ ఉల్లంఘనలు అపరిమితంగా పెరిగిపోయాయి. తినడానికి ఒక ముద్ద తక్కువైనా ఓర్చుకోగలిగే మనుషులు, తమ విశ్వాసాల పట్ల నిక్కచ్చిగా స్వాభిమానంతో ఉంటారు. భిన్నమతాలకి నిలయమైన ఇండియాలో మైనార్టీలకి హక్కులకి రక్షణ ఉండాలని, మతాల మధ్య చిచ్చు రేగకూడదనే భారతదేశాన్ని లౌకిక రాజ్యంగా ప్రకటించింది రాజ్యాంగం. దాని ప్రకారం భారత ప్రజలు మతస్వేచ్ఛని కలిగి ఉంటారు. ప్రజలని పరిపాలించే ప్రభుత్వాలు మాత్రం మతాతీతంగా పరిపాలన చేయాలి. కానీ మనుషులు పౌరులుగా కాక ఓటుబాంకులుగా కనపడడం మొదలయ్యాక మత సామరస్యం కాలం చెల్లిన విలువ అయిపోయింది. ఇక మెజారిటీ మత రాజ్యస్థాపన లక్ష్యంగా కలిగిన పార్టీలు పరిపాలనలోకి రావడం వల్ల రాజ్యాంగస్ఫూర్తి మరింత క్షీణించింది.

మన వ్యక్తిగత విశ్వాసాలు, భావోద్వేగాలకి రాజ్యాంగం విలువ ఇచ్చినట్లే, మనమే రాసుకున్న రాజ్యాంగం పట్ల మనందరికీ అవగాహన ఏర్పడడం చాలా అవసరం. పౌరులుగా ఎలా మెలగాలన్న రాజకీయ స్పృహని మౌలికంగా రాజ్యాంగం ఇస్తుంది. రాజకీయాలంటే అయిదేళ్ళకోసారి వచ్చే ఎన్నికలు, కుల, మత, వర్గ గోదాల్లో నిలబడే అభ్యర్థుల గెలుపోటముల బెట్టింగ్ కాదనీ, అది తరతరాలుగా సమాజాన్ని ప్రభావితం చేయగల చైతన్యమనీ తెలుపుతుంది. ఈ రాజకీయ స్పృహ కలిగిననాడు రాజ్యాంగం ఇచ్చిన బాధ్యతల ఆలోచన కూడా మొదలవుతుంది. రాజ్యాంగం ఇపుడు మన తక్షణావసరం అన్నామంటే అది బేషరతు కానక్కర్లేదు. రాజ్యాంగ విలువలని కాపాడుకోవడానికి కృషి చేస్తూనే, ఆధిపత్య వర్గాలకి అనువుగా మారే పరిమితులను కూడా గుర్తించాలి. దృఢ అదృఢ లక్షణాలు కలిగిన భారత రాజ్యాంగానికి ఎపుడైనా సవరణ జరిగితే పీడిత ప్రజల ఆకాంక్షలు అందులో ప్రతిఫలించేట్లు జాగరూకులమై ఉండాలి.

వ్యాసకర్త జాతీయ కార్యదర్శి, ప్రరవే
malleswari.kn2008@gmail.com

(నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం)

ముందే మొదలయ్యే వేడుక

ప్రపంచ క్రైస్తవులు నవంబర్ 25న ప్రి–క్రిస్మస్ అంటే ముందస్తు క్రిస్మస్ జరుపుకోవడం ఒక వాడుక. క్రైస్తవుల ఆధ్యాత్మిక సిద్ధపాటుకు ఒక సూచిక. అంతేగాక వారికొక సంతస వేడుక. క్రిస్మస్‌ను క్రైస్తవులు డిసెంబర్ 25న జరుపుకొంటారు. కానీ ఆ పండుగను నవంబర్ 25 నుంచే జరుపుకోవడం మొదలవుతుంది. అందుకే దీనిని ప్రి–క్రిస్మస్, సపోజ్ట్ క్రిస్మస్, సెమీ క్రిస్మస్ అని పిలుస్తారు.

క్రీ.శ. 137లో రోమా బిషప్పులలో ఒకరైన టెలిఫోరస్ క్రిస్మస్‌ను డిసెంబర్ 25న జరుపుకోవాలని నిర్ణయించాడు. క్రీ.శ.336లో డిసెంబర్ 25న రోమా క్రైస్తవ చక్రవర్తి కాన్‌స్టంటైన్ ప్రప్రథమంగా, అధికారికంగా క్రిస్మస్ జరిపినట్లు ఆధారాలు లభించాయి. కొన్ని సంవత్సరాల తర్వాత క్రీ.శ.350లో పోప్ జూలియస్ కూడా క్రిస్మస్‌ను డిసెంబర్ 25న ఆచరించాలని ఆదేశించాడు. తూర్పు దేశాలలో 4వ శతాబ్దం నుండి మాత్రమే క్రిస్మస్‌ను జరుపుకోవడం మొదలైంది. 16వ శతాబ్దంలో పోప్ గ్రెగొరి ఒక క్యాలండర్‌ను ప్రవేశపెట్టాడు. దీని ప్రకారం కూడా క్రిస్మస్ డిసెంబర్ 25న జరుపుతారు. కొందరు సాంప్రదాయవాదులు జూలియన్ క్యాలండర్‌ను అనుసరించేవారు. దాని ప్రకారం వారు క్రిస్మస్‌ను జనవరి 6వ తేదీన జరుపుకొనేవారు. కానీ ప్రపంచంలో అత్యధిక శాతం డిసెంబర్ 25నే క్రిస్మస్‌ను ఆచరిస్తున్నారు.

క్రిస్మస్ సమయంలో బహుమతులను ఇచ్చిపుచ్చుకోవడం అనే భావనకు ఆద్యుడు బిషప్ నికోలస్. క్రిస్మస్ సీజన్‌లో పేదల గృహాల్లో బంగారు నాణాలున్న సంచులను వారికి తెలియకుండా పొగ గొట్టం ద్వారా వదిలేవాడు. అవి ఫైర్ ప్లేస్ దగ్గర స్టాకింగ్స్ దగ్గర పడేవి. వాటిని తీసికొని పేదలెంతో ముచ్చటపడేవారు. ఈ అదృశ్య దాత ఎవరో అని ఆశ్చర్యపడేవారు. కాలక్రమంలో ఆ అదృశ్య దాతనే క్రిస్మస్ తాత అని పిలుచుకొనేవారు.

యేసుక్రీస్తు ఈ లోకంలో జన్మించక ముందే ఏడు వందల సంవత్సరాల క్రితం యెషయా ప్రవక్త 'కన్యక గర్భవతియై కుమారుని కనును' అని ప్రవచించాడు. తర్వాత మీకా అను ప్రవక్త 'క్రీస్తు బెత్లెహేములో జన్మిస్తాడు' అని ప్రవచించాడు. క్రీస్తు జననాన్ని 'నేటివిటీ ఆఫ్ జీసస్' అని రోమనులు, గ్రీకులు అభివర్ణించారు. రాబోయే క్రిస్మస్ గురించి ముందస్తుగా గమనించవలసిన కొన్ని విషయాలు ఇవి.

– పులుకూరి లాజాను ప్రభుదాసు, కావలి

(నవంబర్ 25న ప్రి–క్రిస్మస్ సందర్భంగా)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయణం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.ద్వాదశి సా.6.17 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** రేవతి సా.4.01 వరకు, తదుపరి అశ్వని, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.8.25 నుండి 9.13 వరకు, తదుపరి ప.12.10 నుండి 12.58 వరకు, **అమృతఘడియలు:** ప.1.46 నుండి 3.14 వరకు, క్షీరాబ్ధి ద్వాదశి; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.13, **సూర్యాస్తమయం:** 5.20.

కార్మిక రాజ్య బీమా సంస్థ
కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం
कर्मचारी राज्य बीमा निगम
(श्रम एवं रोजगार मंत्रालय, भारत सरकार)
EMPLOYEES' STATE INSURANCE CORPORATION
(Ministry of Labour & Employment, Govt of India)
क.रा.बी.नि
E.S.I.C

सत्यमेव जयते

ప్రాంతీయ కార్యాలయం: తెలంగాణ,
5-9-23 హిల్ ఫోర్ట్ రోడ్, హైదరాబాద్
क्षेत्रीय कार्यालय, 5-9-23, हिल फोर्ट रोड, आदर्शनगर
हैदराबाद, तेलंगाना – 500 063
Regional Office, 5-9-23, Hill Fort Road,
Adarshnagar, Hyderabad, Telangana – 500 063
Phone: 040-23232357/58/59
Email id: rd-telangana@esic.gov.in

ప్రకటన

జారీ చేసిన సి18 నోటీసుల నిమిత్తం వ్యక్తిగత విచారణ కోసం పిలుస్తూ సంబంధిత అధికారి ఎదుట వ్యక్తిగత విచారణకు హాజరు కావలసిందిగా దిగువ తెలిపిన ఎంప్లాయర్‌కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

క్ర. సం.	ఇఎస్ఐ కోడ్ నం.	ఫ్యాక్టరీ / సంస్థ పేరు మరియు చిరునామా	ఎంప్లాయర్ పేరు మరియు చిరునామా	నోటీసు/ నోటీసు తేదీ	కాల వ్యవధి నుండి	కాల వ్యవధి వరకు	కంట్రిబ్యూషన్స్ క్లెయిమ్ మొత్తం (రూ.)	వ్యక్తిగత హాజరు కోసం అధీకృత అధికారి
1.	52000286400001000	మెసర్స్ కామాక్షి ఎంటర్‌ప్రైజెస్, ఇ.నం. 9-48, బొల్లారం, జిన్నారం, సంగారెడ్డి - 502 325	శ్రీ పి. విజయ్ కుమార్ రెడ్డి తండ్రి రమణారెడ్డి పెల్లూరు, ఇ.నం. 9-48, బొల్లారం, జిన్నారం, సంగారెడ్డి-502 325	C-18 Adhoc, తేది:04-03-2022	అక్టోబర్-2016	మార్చి-2021	రూ. 7,10,499/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
2.	52000286970001099	మెసర్స్ శ్రీ స్టీల్ బిల్డింగ్స్, ప్లాట్ నం. 56, రోడ్ నం.1, శ్రీలక్ష్మి నగర్, మన్సూరాబాద్, హైదరాబాద్ - 500 068	శ్రీ కె. వేణుగోపాల్ తండ్రి నరసింహారావు, ప్లాట్ నం. 56, రోడ్ నం.1, శ్రీలక్ష్మి నగర్, మన్సూరాబాద్, హైదరాబాద్ - 500 068	C-18 Adhoc, తేది:15-01-2021	జనవరి-2016	నవంబరు-2020	రూ. 17,86,554/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
3.	52000290400001099	మెసర్స్ విసెర్వ్ సర్వీసెస్, నం.6-1-121, గాంధీ హాస్పిటల్ వెనుక, సిఆర్‌పిఎఫ్ ఆఫీసర్స్ మెస్ ప్రక్కన, పద్మారావునగర్, సికింద్రాబాద్-500 025	శ్రీ ఎ. నితిన్ కుమార్, తండ్రి ఎ. గోవిందరాజులు ఇ.నం. 6-1-117, 118, ప్లాట్ నం.312, బిల్వెడెరె గార్డెన్, ఫేజ్-II, పద్మారావునగర్, సికింద్రాబాద్-500 025	C-18 Adhoc, తేది:03-03-2021	జూలై - 2016	అక్టోబరు - 2020	రూ. 8,61,432/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
4.	52000295690000009	మెసర్స్ కావ్య మెన్, కొత్త బస్టాండ్ దగ్గర, బోధన్, నిజామాబాద్-503185	శ్రీ ఎస్. తిరుపతి రెడ్డి, ఇ.నం. 4-2-322, కొత్త బస్టాండ్ ఎదుట, బోధన్, నిజామాబాద్-503 185	C-18 Adhoc, తేది:04-05-2022	మార్చి - 2017	ఫిబ్రవరి - 2022	రూ. 2,50,635/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
5.	52000296470001001	మెసర్స్ MSR ఎంటర్‌ప్రైజెస్ షాప్ నం. 12, గ్రౌండ్ ఫ్లోర్, ఉషోదయా టవర్స్, షాపూర్ నగర్, ఐడిఎ, జీడిమెట్ల, హైదరాబాద్ - 500 055	శ్రీ బి.మాధవరెడ్డి, ప్రొప్రయిటర్, ఇ.నం. 37-87/1, జగద్గిరిగుట్ట, హైదరాబాద్, తెలంగాణ - 500 037	C-18 Adhoc, తేది:25-10-2022	నవంబర్ - 2018	జూలై - 2022	రూ. 26,76,600/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
6.	52000299430000911	మెసర్స్ ఐసర్వ్‌సాఫ్ట్ జియోస్పాటియల్ ప్రై.లిమిటెడ్, ఫ్లాట్ నం.11-5-246/9, హెచ్‌పిరోడ్, మూసాపేట్, హైదరాబాద్ - 500 018	శ్రీ ఎం. సురేష్ బాబు, మేనేజింగ్ డైరెక్టర్, ఫ్లాట్ నం.102, బి-9, సాయి సురభి అవాస్, మధురానగర్, హైదరాబాద్-500 038.	C-18 Adhoc, తేది:5-04-2021	మార్చి - 2016	జనవరి - 2021	రూ. 2,19,978/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
7.	52000324620001303	మెసర్స్ మంజీరా ఎడ్యుకేషనల్ సొసైటీ (మంజీరా జూనియర్ కాలేజ్) శ్రీనగర్ కాలనీ, సిర్పూర్‌కాగజ్‌నగర్-504296	శ్రీ గోరంట రామారావు, కరస్పాండెంట్, శ్రీనగర్ కాలనీ, సిర్పూర్‌కాగజ్‌నగర్-504296	C-18 Adhoc, తేది:11-10-2021	సెప్టెంబరు - 2016	ఆగస్టు - 2021	రూ. 7,33,590/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
8.	52000326340000009	మెసర్స్ నైవేద్యం, నం. 6-3-866/ఏ, 1వ అంతస్తు, షాప్ నం.103, మెకిన్స్ మహేశ్వరి ప్లాజా, గ్రీన్‌ల్యాండ్ రోడ్, అమీర్‌పేట్, హైదరాబాద్-500 016	శ్రీమతి గీతా బాటీ, ప్రొప్రైట్రిక్స్, నం. 6-3-866/ఏ, 1వ అంతస్తు, షాప్ నం.103, మెకిన్స్ మహేశ్వరి ప్లాజా, గ్రీన్‌ల్యాండ్ రోడ్, అమీర్‌పేట్, హైదరాబాద్-500 016.	C-18 Adhoc, తేది:20-05-2021	ఏప్రిల్ - 2016	అక్టోబరు - 2020	రూ. 3,47,408/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
9.	52000326720001001	మెసర్స్ వాసవి ఎలక్ట్రికల్ మ్యాన్‌పవర్ సప్లయ్, ఇ.నం. 1-3-79/5, రాజేంద్రనగర్ మండలం, మహబూబ్‌నగర్-509 001	శ్రీ ఎ. శివకుమార్, ప్రొప్రైటర్, ఇ.నం. 1-3-79/5, రాజేంద్రనగర్ మండలం, మహబూబ్‌నగర్-509 001.	C-18 Adhoc, తేది:13-10-2021	సెప్టెంబరు - 2016	జూలై - 2021	రూ. 2,53,523/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
10.	52000327020001018	మెసర్స్ భోగాడి డాగ్ సెక్యూరిటీ సర్వీసెస్, ఫ్లాట్ నం.14, రాఘవ కాలనీ, వెంచర్-II, సిక్ విలేజ్, సికింద్రాబాద్-500 026	శ్రీమతి బి.లక్ష్మీదేవి, ప్రొప్రైట్రిక్స్, ఫ్లాట్ నం.14, రాఘవ కాలనీ, వెంచర్-II, సిక్ విలేజ్, సికింద్రాబాద్-500 026	C-18 Adhoc, తేది:05-07-2022	మే - 2017	మార్చి - 2022	రూ. 3,47,655/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
11.	52000330020001001	మెసర్స్ గ్రీన్‌ల్యాండ్స్, ఫ్లాట్ నం. 8-1-293/సి/2, 1వ అంతస్తు, ద్వారకానగర్ కాలనీ, మణికొండ రోడ్, హెచ్ఎస్ దర్గా, షేక్‌పేట్, హైదరాబాద్ - 500 008	శ్రీ బి. ప్రభాకర్ రెడ్డి, ప్రొప్రైటర్, ఫ్లాట్ నం. 8-1-293/సి/2, 1వ అంతస్తు, ద్వారకానగర్ కాలనీ, మణికొండ రోడ్, హెచ్ఎస్ దర్గా, షేక్‌పేట్, హైదరాబాద్ - 500 008	C-18 Adhoc, తేది:15-01-2021	సెప్టెంబరు - 2018	ఆగస్టు - 2020	రూ. 5,72,996/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
12.	52000331590000699	మెసర్స్ ఆదిత్య సోలార్ ఎనర్జీ సిస్టమ్స్, రిజిస్టర్ ఆఫీస్ :209, 1వ అంతస్తు, మేఘనా కాంప్లెక్స్, ఆంధ్రాబ్యాంక్ ఎదురుగా, బాలానగర్, హైదరాబాద్-500 037	శ్రీ జి. హరికృష్ణ, ప్రొప్రైటర్, ఫ్లాట్ నం. 308, శిరీషా అపార్ట్‌మెంట్స్, బాల్‌రెడ్డి నగర్, చింతల్, హైదరాబాద్-500 054	C-18 Adhoc, తేది:10-05-2021	జనవరి - 2016	జనవరి - 2021	రూ. 5,08,407/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
13.	52000335540000802	మెసర్స్ రోలాన్ కంటైనర్స్, ఇ.నం. 71/బి/ఇ, ఓల్డ్ కర్నూల్ రోడ్, కాటేదాన్, హైదరాబాద్-500 077, సర్వే నం.657, శాతంరాయి, శంషాబాద్, హైదరాబాద్-500 077	శ్రీ పీయూష్ గదోడియా, పార్టనర్, ఫ్లాట్ నం. 2బి, జైన్ అంజనీ అపార్ట్‌మెంట్, డికె రోడ్, అమీర్‌పేట్, హైదరాబాద్-500 077	C-18 Adhoc, తేది:08-10-2021	సెప్టెంబరు - 2016	మార్చి - 2021	రూ. 5,84,282/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
14.	52000339270000699	మెసర్స్ శిల్పా మెషిన్ టూల్స్, ఇ.నం.6-2-150, రోడ్ నం.2, శోభనా కాలనీ, బాలానగర్, హైదరాబాద్-500 042	శ్రీ టి. శ్రీనివాస్, ప్రొప్రైటర్, ఇ.నం.6-2-150, రోడ్ నం.2, శోభనా కాలనీ, బాలానగర్, హైదరాబాద్-500 042	C-18 Adhoc, తేది:17-12-2020	నవంబరు - 2018	అక్టోబరు - 2020	రూ. 2,00,970/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
15.	52000349520001001	మెసర్స్ గ్రాఫిక్స్ ఫైటో డైనమిక్స్, నం.14-245/బి ఎక్స్‌టెన్షన్, జోయస్ టౌన్‌షిప్, శేరిలింగంపల్లి, హైదరాబాద్-500019	శ్రీ ఎస్‌పిఎస్. భాస్కర్, తండ్రి ఎస్‌పివిఎం సత్తయ్య, ఫ్లాట్ నం.101, నవజీవన్ అపార్ట్‌మెంట్స్, ఇ.నం.7-2-177/1, చెక్ కాలనీ, సనత్‌నగర్, హైదరాబాద్-500 018	C-18 Adhoc, తేది:03-03-2021	అక్టోబరు - 2016	డిసెంబరు - 2020	రూ. 24,33,545/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
16.	52000358990001013	స్లీప్ కెరియర్ బిల్డర్స్ ప్రై. లి. నం.8-3-319/10/1, 2వ అంతస్తు, ఫ్లాట్ నం.202, శ్రీసాయి రామ్స్ స్వర్ణలత ఎస్టేట్, సారథీ స్టూడియో లేన్ వెనుక, ఎల్లారెడ్డి గూడ, హైదరాబాద్-500 073	శ్రీ జి. పాల్ డేవిడ్ రాజు డైరెక్టర్, తండ్రి ఆనందరావు, 8-3-616/4/2, హబీబ్‌బాగ్, ఎల్లారెడ్డిగూడ, హైదరాబాద్-500 073	C-18 Adhoc, తేది:31-03-2021	ఏప్రిల్ - 2016	ఫిబ్రవరి - 2021	రూ. 3,65,888/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
17.	52000360010001018	జిఎస్ గార్డింగ్ సర్వీసెస్, 2-3-761/3, 4, గోల్నాక, అంబర్‌పేట్, హైదరాబాద్.	శ్రీ ఎం. వీర్‌సింగ్, ఇ.నం. 3-1-620/6, నింబోలి అడ్డా, కాచీగూడ, హైదరాబాద్-500 027	C-18 Adhoc, తేది:09-11-2021	సెప్టెంబరు - 2016	ఆగస్టు - 2021	రూ. 4,03,475/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
18.	52000410190000900	1. మెసర్స్ రాయల్ కిడ్స్ వరల్డ్ 9 ఇండియా ప్రై.లి., ప్లాట్ నం.1, 2, సర్దార్‌పటేల్ నగర్, వసంత్‌నగర్ వెనుక, మెయిన్ గేట్, హైదర్‌నగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్-72 2. మెసర్స్ రాయల్ కిడ్స్ వరల్డ్ 9 ఇండియా ప్రై.లి., ప్లాట్ నం.90, టెలిగ్రాఫ్ ఆఫీస్ వెనుకవైపు, భాగ్యనగర్ కాలనీ, కెపిహెచ్‌బి ఎదురుగా, కూకట్‌పల్లి, హైదరాబాద్-72	శ్రీమతి జి. సింధు, ఫ్లాట్ నం.102, 107, రాఘవ్ టవర్స్, భాగ్యనగర్ కాలనీ, హైదరాబాద్-72	C-18 Adhoc, తేది:23-05-2022	ఏప్రిల్ - 2017	మార్చి - 2022	రూ. 3,55,163/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
19.	52000411170000999	మెసర్స్ రైట్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్, ఇ.నం.3-10-387, గుంటి జంగయ్య కాలనీ, నర్సింగ్ క్లాత్ షోరూం వెనుక, ఎల్బీనగర్, హైదరాబాద్-74	శ్రీ ఎం. వేణుగోపాల్ రెడ్డి మేనేజింగ్ ప్రొప్రయిటర్, నం.3-10-346, జిజెనగర్ కాలనీ, ఎల్బీనగర్, హైదరాబాద్-74	C-18 Adhoc, తేది:08-07-2019	సెప్టెంబరు - 2014	మే - 2019	రూ. 7,45,563/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
20.	52000412000000606	మెసర్స్ శ్రీ విఘ్నేశ్వర ఎంటర్‌ప్రైజెస్, ఇ.నం.1-112/67, ఆంధ్రాబ్యాంక్ ఎదురుగా, హఫీజ్‌పేట్ రోడ్, కొండాపూర్, హైదరాబాద్-32	శ్రీ కె. అశోక్‌కుమార్, నం.8-4-369/211/65/69, భరత్‌నగర్, బోరబండ, హైదరాబాద్-18	C-18 Adhoc, తేది:15-01-2021	జనవరి - 2016	నవంబరు - 2020	రూ. 2,57,681/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
21.	52000417130000999	1) M/s ధర్మికేపేపర్ ప్రొడక్ట్స్ ప్లాట్ నం.180, దూలపల్లి రోడ్, కొంపల్లి, హైదరాబాద్ -014 2) M/s. ధర్మికేపేపర్ ప్రొడక్ట్స్ సర్వే నం. 809, IDA, మేడ్చల్ మల్కాజిగిరి హైదరాబాద్ -014	శ్రీ హరీష్ రెడ్డి SR నగర్, హైదరాబాద్ -038	C-18 Adhoc, తేది:07-03-2022	జనవరి 2017	సెప్టెంబర్ 2021	రూ. 5,94,941/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
22.	52000418660000905	M/s శ్రీనివాస్ ఎలక్ట్రికల్ వర్క్స్, ఫ్లాట్ నం.101, స్ఫూర్తి అవెన్యూ వీరారెడ్డి నగర్, స్ట్రీట్ నం.1 నాచారం, రంగారెడ్డి 076.	శ్రీ జి.శ్రీశైలం ఫ్లాట్ నం.101 స్ఫూర్తి అవెన్యూ వీరారెడ్డి నగర్ స్ట్రీట్ నం.1 నాచారం, రంగారెడ్డి -076	C-18 Adhoc, తేది:08-10-2021	సెప్టెంబర్ 2016	ఆగస్ట్ 2021	రూ. 3,66,795/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
23.	52000418740001002	M/s. సన్‌కార్ప్ ప్లస్ ప్రైవేట్ లిమిటెడ్, # 6-2-953/109, మొదటి అంతస్తు, కృష్ణాప్లాజా, ఖైరతాబాద్, హైదరాబాద్ -04	శ్రీ కె.శ్రీనివాస్‌రావు #6-3-1085/01, 3వ బ్లాక్, రాజ్‌భవన్ రోడ్, సోమాజీగూడ, సికింద్రాబాద్-082	C-18 Adhoc, తేది:27-09-2019	అక్టోబర్ 2014	జూన్ 2019	రూ. 11,10,005/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
24.	52000419560000999	M/s. శ్రీవినాయక కంప్యూటర్స్, MIG 2-146, APHB కాలనీ, వినాయక నగర్, అంబర్ పేట నిజామాబాద్ -503001	శ్రీ బి.నంజయ్ కుమార్, MIG 2-146, APHB కాలనీ వినాయకనగర్, అంబర్‌పేట్ నిజామాబాద్ -503001	C-18 Adhoc, తేది:26-10-2022	ఏప్రిల్ 2020	జూలై 2022	రూ. 1,29,360/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
25.	52000283800001099	M/s. సుభి ఇంజనీరింగ్ వర్క్స్, ఫ్లాట్ నం.279, జవహర్ నగర్ కాలనీ, వెనాలీ, హైదరాబాద్ -500 040	శ్రీపి.అరుణ్ H.No.232, ప్రగతినగర్ మౌలాలీ హైదరాబాద్ - 500040	C-18 Adhoc, తేది:28-02-2023	ఏప్రిల్ 2018	నవంబర్ 2022	రూ. 2,11,423/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
26.	52000299440000304	M/s. డాక్సిన్ లేబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్, #5-246/3/1 పెడరైట్ ఇండస్ట్రీస్ దగ్గర, HPC రోడ్, మూసాపేట్, హైదరాబాద్ తెలంగాణ-500018	శ్రీ నరేంద్రకుమార్ మేనేజింగ్ డైరెక్టర్ H.No.703 గ్రౌండ్ ఫ్లోర్ శ్రీ కృష్ణదేవరాయ నగర్, ఎల్లారెడ్డి గూడ హైదరాబాద్ - 500073	C-18 Adhoc, తేది:27-02-2023	నవంబర్ 2017	అక్టోబర్ 2022	రూ. 6,69,900/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
27.	52000327020001018	M/s. భోగడి డాగ్ సెక్యూరిటీ సర్వీసెస్, ఫ్లాట్ నం.14, రాఘవ కాలనీ, వెంచర్-II, సిక్‌విలేజ్ సికింద్రాబాద్ -500026	శ్రీ శ్రీమతి బి.లక్ష్మీదేవి, యజమానురాలు C/o. M/s భోగడిడాగ్ సెక్యూరిటీ సర్వీసెస్, ఫ్లాట్ నం.14, రాఘవ కాలనీ, వెంచర్-II, సిక్‌విలేజ్ సికింద్రాబాద్ -500026	C-18 Adhoc, తేది:18-08-2022	మే 2017	మార్చి 2022	రూ. 3,47,655/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
28	52000333670001001	M/s. సంజయ్ వర్క్స్, H.No. 7-74/1, ప్లాట్ నం.306/A సుభాష్‌నగర్, IDA, జీడిమెట్ల హైదరాబాద్ - 500055	శ్రీహీర సింగ్ ప్రొప్రైటర్, H.No. 7-74/1 ప్లాట్ నం.306/A, సుభాష్‌నగర్, IDA, జీడిమెట్ల హైదరాబాద్ - 500055	C-18 Adhoc, తేది:04-03-2022	సెప్టెంబర్ 2018	సెప్టెంబర్ 2021	రూ. 2,39,778/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
29	52000352370001001	M/s. ఎమినెంట్ కార్పొరేట్ సర్వీసెస్.# 147/A, MES కాలనీ, ఓల్డ్ మడ్ ఫోర్ట్, నార్సి వ్యాల్ట్ దగ్గర, సికింద్రాబాద్ 500009	శ్రీ ఎ.సెల్వరాజ్ పార్టనర్ S/o. ఆశీర్వాదం & శ్రీ కె.జాన్ శీలా S/o. కృపానందం # 4-24/3 ఇందిరా గాంధీ విగ్రహం దగ్గర బాలాజీనగర్, యాప్రాల్, సికింద్రాబాద్ -500018	C-18 Adhoc, తేది:10-08-2022	అక్టోబర్ 2017	ఏప్రిల్ 2021	రూ. 5,98,002/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
30	52000355270000803	M/s. డైమండ్ పేపర్ ప్రొడక్ట్స్ # 19-5-15/5 కిషన్‌బాగ్ రోడ్, షాలిమార్ ఆయిల్ మిల్ దగ్గర బహదూర్‌పూర, హైదరాబాద్-500064	శ్రీ మహేష్‌కుమార్ మహేశ్వరి, # 3-6-449 ఫ్లాట్ నం.301, స్ట్రీట్ నం.5, లెజెండ్ శ్రీరామ్ అపార్ట్‌మెంట్స్ హిమాయత్‌నగర్, హైదరాబాద్ 500029	C-18 Adhoc, తేది:02-03-2023	నవంబర్ 2017	జూలై 2022	రూ. 3,53,199/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
31	52000355340000306	M/s. ఫార్చ్యూన్ పెయింట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్లాట్ నం.17B, IDA, ఫేజ్-2, పటాన్‌చేరు, మెదక్‌జిల్లా -502319	శ్రీ ఎ.శ్రీనివాస్ రెడ్డి MD, ఫ్లాట్ నం.10912 వాల్‌నట్ బ్లాక్, ఇందూ ఫార్చ్యూన్ ఫీల్డ్స్ KPHB, కూకట్‌పల్లి హైదరాబాద్-500072	C-18 Adhoc, తేది:02-03-2023	జనవరి 2019	జూలై 2022	రూ. 1,12,959/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
32	52000403930000606	M/s. శ్రీ విజయ గణపతి ఇంజనీరింగ్ వర్క్స్, ప్లాట్ నం.10, # 2-90/11/2, సుందర్‌నగర్, సూరారం, కుత్బుల్లాపూర్, హైదరాబాద్	M/s. శ్రీ విజయ గణపతి ఇంజనీరింగ్ వర్క్స్, ప్లాట్ నం.10, # 2-90/11/2, సుందర్‌నగర్, సూరారం, కుత్బుల్లాపూర్, హైదరాబాద్	C-18 Adhoc, తేది:20-10-2021	ఫిబ్రవరి 2017	మే 2021	రూ. 3,23,978/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
33	52000406650001010	M/s. యూనివర్సల్ టెలి సర్వీసెస్ డోర్ నం.13-1/12 సాయిపూరి కాలనీ, యాదవ్‌నగర్ మల్కాజిగిరి, సికింద్రాబాద్-17	శ్రీ ఎం.శివ కుమార్ ప్రొప్రైటర్ # డోర్ నం. 10-285/5/3, వసంతపురి కాలనీ, మల్కాజిగిరి, సికింద్రాబాద్ -017	C-18 Adhoc, తేది:28-02-2023	జనవరి 2018	సెప్టెంబర్ 2022	రూ. 3,15,315/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
34	52000410190000999	మెస్సర్స్ రాయల్‌కిడ్స్ వరల్డ్ 9 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్లాట్ నం.1&2 సర్దార్‌పటేల్ నగర్ వసంత్ నగర్ మెయిన్ గేట్, ప్రక్కన హైదర్ నగర్ కూకట్‌పల్లి - 500072	శ్రీ జి. సింధూ ఫ్లాట్ నం.102 & 107, రాఘవ టవర్స్ భాగ్యనగర్ కాలనీ, హైదరాబాద్ -500072	C-18 Adhoc, తేది:23-05-2022	ఏప్రిల్ 2017	మార్చి 2022	రూ. 3,55,163/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి
35	52000419560000999	మెస్సర్స్ శ్రీ వినాయక కంప్యూటర్స్, MIG 2-146 APHB కాలనీ, వినాయకనగర్, అంబర్‌పేట్ నిజామాబాద్ -503001	బి.నంజయ్ కుమార్ ప్రొప్రైటర్ MIG 2-146, APHB కాలనీ, వినాయక్ నగర్ అంబర్‌పేట్, నిజామాబాద్ -503001	C-18 Adhoc, తేది:26-10-2022	ఏప్రిల్ 2020	జూలై 2022	రూ. 1,29,360/-	సి. ప్రసూన రాణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఇఎస్ఐసి

* వ్యక్తిగత విచారణ తుది తేది వార్తా పత్రికలలో ప్రకటన తేది నుండి 30 రోజులలోగా ఉంటుంది.
* యజమానులు సంబంధిత రికార్డులు/ విజ్ఞప్తులతో వ్యక్తిగత విచారణకు హాజరు కావలసిందిగా సూచించబడుతున్నారు ఆ విధంగా చేయుటలో విఫలమైతే ఈ కార్యాలయంలో ఉన్న రికార్డులతో సెక్షన్ 45-A క్రింద ఉత్తర్వు జారీచేయబడును.

రీజినల్ డైరెక్టర్ (ఇన్‌చార్జి) తరపున,
రీజినల్ ఆఫీస్, తెలంగాణ

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను అసెంబ్లీ గడప తొక్కనివ్వం

- ఎమ్మెల్సీ కోసం 'పాడి' కాంగ్రెస్‌కు ద్రోహం చేశారు: రేవంత్‌రెడ్డి
- సుధీర్‌రెడ్డి బీఆర్ఎస్‌కు అమ్ముడుపోయారు
- దొంగ ఏడ్పులతో గెలిచిన ఈటల ఏంచేశారు?
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే సమయం ఆసన్నమైంది
- జమ్మికుంట, మానకొండూరు, దుబ్బాక, హైదరాబాద్ సభల్లో టీపీసీసీ చీఫ్




జమ్మికుంట విజయభేరి సభకు హాజరైన ప్రజలు. (ఇన్‌సెట్‌లో) ప్రజలకు అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/సాక్షి, సిద్దిపేట/వనస్థలిపురం/ముషీరాబాద్/దిల్‌సుఖ్‌నగర్: 'రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చెల్లని నోటు. దానిని జేబులో పెట్టుకుంటే జైలుకు వెళ్లడం ఖాయం' అని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి విమర్శించారు. ఈ ఎన్నికల్లో పార్టీ ఫిరాయింపు దారులను ఓడించాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే సమయం ఆసన్నమైందన్నారు. పార్టీ ఫిరాయించిన 12 మంది ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు తాకనివ్వవద్దని శపథం చేశానని, కాంగ్రెస్‌ను మోసం చేసిన మహేశ్వరం, ఎల్‌బీనగర్ నియోజకవర్గాల బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకోవాలని, దొరలపాలన పోవాలంటే ప్రజలంతా కాంగ్రెస్‌కు ఓటేయాలని పిలుపునిచ్చారు. ఎన్నో బలిదానాలతో తెలంగాణ వచ్చిందని.. కేసీఆర్ బంగారు తెలంగాణగా మారుస్తాడనుకుంటే రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు. విద్యార్థుల బలిదానాలు ఆపాలనే సంకల్పంతో సోనియాగాంధీ రాష్ట్రాన్ని ఇస్తే.. కేసీఆర్ మాత్రం నిరుద్యోగులు, ఉద్యోగులను వంచిస్తూ నీరో చక్రవర్తిలా వ్యవహరిస్తున్నారన్నారు. గురువారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట, రేణికుంటలో, సిద్దిపేట జిల్లా దుబ్బాకలో జరిగిన కాంగ్రెస్ ప్రజావిజయభేరి సభల్లో, హైదరాబాద్‌లోని వనస్థలిపురం, ముషీరాబాద్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌ల్లో రేవంత్ ప్రసంగించారు.

ఈటలది నయవంచన..

ఏడుసార్లు హుజూరాబాద్‌లో ఎమ్మెల్యేగా గెలిచిన ఈటల రాజేందర్ నియోజకవర్గ ప్రజలను నయవంచనకు గురి చేశారని రేవంత్ మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ నుంచి నియోజకవర్గ అభివృద్ధి కోసం నయాపైసా తీసుకురాలేని అసమర్థ నాయకుడని దుయ్యబట్టారు. దొంగ ఏడ్పులు ఏడ్చే ఈటల ఏమీ చేయలేదన్నారు. ఇప్పుడేమో హుజూరాబాద్ ప్రజలను విడిచి గజ్వేల్‌లో పోటీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉద్యమాల పురిటిగడ్డ హుజూరాబాద్‌లో కోవర్టులు (పరోక్షంగా పాడి కౌశిక్) పోటీ చేస్తున్నారని, అలాంటి వారికి ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న పాడి కౌశిక్ ఎమ్మెల్సీ పదవి, కమీషన్ల కోసం కాంగ్రెస్‌కు ద్రోహం చేశారన్నారు. పిల్లి తన పిల్లల రక్షణ కోసం ఇల్లిల్లూ మార్చినట్లు.. కేసీఆర్ తాను, తన కుటుంబ సభ్యులకు పదవుల కోసం నియోజకవర్గాలు మారుస్తున్నారని ఎద్దేవా చేశారు. ఉద్యమ సమయంలో సిద్దిపేటలో ఉన్న కేసీఆర్ తర్వాత కరీంనగర్, మహబూబ్‌నగర్, గజ్వేల్‌కు చేరారని, ఇప్పుడు కామారెడ్డికి పారిపోయారన్నారు. అధిష్టానం ఆదేశాల మేరకు తాను కామారెడ్డిలో కేసీఆర్‌పై పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. సిద్దిపేట జిల్లాలో ఉన్న బెజ్జంకి మండలాన్ని కరీంనగర్ జిల్లాలో కలుపుతామన్నారు.

చర్లపల్లి జైల్లో డబుల్ బెడ్‌రూం కట్టిస్తా

రాష్ట్రంలో డిసెంబర్ 9న ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటు కాబోతుందని, కేసీఆర్ రిటైర్ అవుతారని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయనకు కూడా పింఛన్ ఇస్తామని, చర్లపల్లి జైల్లో డబుల్ బెడ్‌రూం ఇల్లు కట్టిస్తానని చెప్పారు. కేసీఆర్‌తోపాటు ఆయన కొడుకు, బిడ్డ ఉండటానికి కచ్చితంగా ఇల్లు కట్టిస్తానన్నారు. కేసీఆర్ దోచుకున్న రూ.లక్ష కోట్లు కక్కిస్తానని హెచ్చరించారు. కేసీఆర్ కుటుంబ సభ్యులకే బంగారు తెలంగాణ అయిందని, ప్రజలకు బొందల తెలంగాణగా మారిందని రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లు ఎంపీగా ఉన్న ప్రభాకర్‌రెడ్డి కేసీఆర్ ఫాంహౌస్ దగ్గర పెద్ద జీతగానిలాగా ఉన్నాడని విమర్శించారు. ఉప ఎన్నికల్లో గెలిచిన రఘునందన్ రావు దుబ్బాక అభివృద్ధికి ఏమైనా కృషి చేశారా అని ప్రశ్నించారు. 2018లో ఎల్‌బీనగర్‌లో మీరు సుధీర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే, బీఆర్ఎస్‌కు అమ్ముడుపోయారని దుమ్మెత్తిపోశారు... Correction: దునుమాడారు. ఎల్‌బీనగర్‌లో మధుయాష్కీగౌడ్‌ను 30 వేల మెజార్టీతో గెలిపించాలని కోరారు. హైదరాబాద్‌లో పేదలకు ఏ కష్టం వచ్చినా అంజన్‌కుమార్ యాదవ్ అందుబాటులో ఉంటారని, వరుణ దేవుడు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరి అంజన్‌ను ఆశీర్వదిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ప్రణవ్ (హుజూరాబాద్), కవ్వంపల్లి సత్యనారాయణ (మానకొండూరు), చెరుకు శ్రీనివాస్ రెడ్డి (దుబ్బాక), మధుయాష్కీగౌడ్ (ఎల్‌బీనగర్) తదితరులు పాల్గొన్నారు.

రేపు రాష్ట్రానికి రాహుల్ గాంధీ

- ఒకే రోజు మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల ప్రచారం
- బోధన్, ఆదిలాబాద్, వేములవాడ సభలకు రానున్న ఏఐసీసీ అగ్రనేత
- నేటి నుంచి రెండు రోజులపాటు ప్రియాంక పర్యటన... షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు
- నేడు, రేపు రాష్ట్రంలో పర్యటించనున్న కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోమారు తెలంగాణకు రానున్నారు. ఈనెల 25న ఆయన మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం చేస్తారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. నాందేడ్ నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 12 గంటలకు బోధన్ చేరుకోనున్న రాహుల్ అక్కడ ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటారు. ఆ తర్వాత హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఆదిలాబాద్ వెళ్లి సభకు హాజరవుతారు. అక్కడి నుంచి సాయంత్రం 4 గంటలకు వేములవాడలో జరిగే సభకు హాజరవుతారని, అక్కడి నుంచి బేగంపేటకు చేరుకుని ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్తారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

ఖమ్మంలో బస చేయనున్న ప్రియాంక

ఇంతకుముందు ఖరారైన ప్రియాంకాగాంధీ ప్రచార షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు జరిగాయి. 24, 25 తేదీల్లో ఆమె వరంగల్, సిద్దిపేట, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో జరిగే ఎన్నికల ప్రచార సభలకు హాజరవుతారు. శుక్రవారం మధ్యాహ్నం పాలకుర్తి, ఆ తర్వాత హుస్నాబాద్, అనంతరం కొత్తగూడెం నియోజకవర్గాల్లో జరిగే సభల్లో పాల్గొననున్నారు. నేడు ఖమ్మంలోనే బస చేయనున్న ప్రియాంక 25న ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో సభలకు హాజరవుతారు. అక్కడి నుంచి విజయవాడకు వెళ్లి గన్నవరం విమానాశ్రయం నుంచి ఢిల్లీ వెళ్తారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

నేడు, రేపు శివకుమార్

బెంగళూరు నుంచి శుక్రవారం ఉదయం హైదరాబాద్‌కు రానున్న కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ మధ్యాహ్నం 12 గంటలకు స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కార్నర్ మీటింగ్‌లో పాల్గొననున్నారు. ఆ తర్వాత వర్ధన్నపేట, వరంగల్ వెస్ట్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎన్నికల ప్రచార సభలకు హాజరవుతారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోనే బస చేయనున్న శివకుమార్ 25న హైదరాబాద్‌లోని పలు నియోజకవర్గాల్లో జరిగే రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లకు హాజరవుతారని పార్టీ వర్గాలు తెలిపాయి.

రాజస్థాన్ ఎవరిదో!


199 స్థానాల్లో రేపే పోలింగ్

- హామీలే గెలిపిస్తాయంటున్న కాంగ్రెస్ పార్టీ
- హిందూత్వ కార్డుపైనే బీజేపీ భరోసా
- ఎవరికీ చిక్కని ఓటరు నాడి

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల పర్వం ముగింపునకు వస్తోంది. మిజోరం, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో పోలింగ్ ఇప్పటికే ముగియగా కీలకమైన రాజస్థాన్‌లో ప్రచార పర్వానికి గురువారం సాయంత్రంతో తెర పడింది. శనివారం పోలింగ్ జరగనుంది. అధికార కాంగ్రెస్, బీజేపీ రెండూ గెలుపుపై ధీమాగా ఉన్నాయి. ఏడు హామీలకు తోడు ప్రజాకర్షక పథకాలు కచ్చితంగా గట్టెక్కిస్తాయని ముఖ్య మంత్రి అశోక్ గెహ్లోత్ నమ్ముతున్నారు. దారుణంగా క్షీణించిన శాంతిభద్రతలు కచ్చితంగా సర్కారు పుట్టి ముంచుతాయని, మోదీ మేనియాకు హిందూత్వ కార్డు తోడై ఘనవిజయం సాధించి పెడుతుందని బీజేపీ అంటోంది. నవంబర్ 30న తెలంగాణలో పోలింగ్ ముగిశాక డిసెంబర్ 3న ఐదు రాష్ట్రాల ఓట్ల లెక్కింపు జరిగి ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో రాజస్తాన్‌లో గత మూడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఓసారి చూస్తే...

- సాక్షి, నేషనల్ డెస్క్

2008



పరిశీలకులతో పాటు అందరి అంచనాలనూ తలకిందులు చేస్తూ అధికార బీజేపీ అనూహ్యంగా ఓటమి చవిచూసింది! కాంగ్రెస్ మరోసారి విజయబావుటా ఎగరేసింది. గెహ్లోత్ మళ్లీ సీఎం అయ్యారు. ప్రజల ఆదరణ బీజేపీకే ఉన్నట్టు దాదాపుగా అన్ని సర్వేల్లోనూ తేలినా ఆ పార్టీ ఓడిపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ముఖ్యమంత్రిగా వసుంధరా రాజె సింధియా అనుసరించిన లోప భూయిష్టమైన ఎన్నికల వ్యూహమే ఇందుకు ప్రధాన కారణమని పరిశీలకులు అభిప్రాయపడ్డారు. ఆమె అహంకారపూరిత ప్రవర్తన, సీనియర్లకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం, అభ్యర్థుల ఎంపికలో ఒంటెత్తు పోకడలు పార్టీని ముంచాయంటూ విమర్శలు వెల్లు వెత్తాయి. మొత్తం 200 స్థానా లకుగాను కాంగ్రెస్ 96 చోట్ల నెగ్గగా బీజేపీ 78 స్థానాలకు పరిమితమైంది. కాంగ్రెస్‌కు 36.8 శాతం ఓట్లు పోలవగా బీజేపీకి 34.3 శాతం పడ్డాయి. ఇతరులకు 21 శాతం ఓట్లు పోలవడం బీజేపీ విజయావ కాశాలను గట్టిగా దెబ్బకొట్టింది. ఎందుకంటే 2003 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్‌కు ఓట్లు కేవలం ఒక్క శాతం మాత్రమే పెరిగాయి. బీజేపీ ఏకంగా 5 శాతానికిపైగా ఓట్లను నష్టపోయింది! ఇక బీఎస్పీ 7.6 శాతం ఓట్లతో 6 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంది.

పార్టీ	సీట్లు	ఓట్లు	ఓట్లశాతం
కాంగ్రెస్	96	88,72,184	36.8
బీజేపీ	78	82,58,966	34.3
ఇతరులు	20	51,35,337	21.3
బీఎస్పీ	6	18,32,195	7.6

2013




పార్టీ	సీట్లు	ఓట్లు	ఓట్లశాతం
బీజేపీ	163	1,39,39,203	45.2
కాంగ్రెస్	21	1,02,04,694	33.1
ఇతరులు	13	56,75,488	18.4
బీఎస్పీ	3	10,41,241	3.4

ఆనవాయితీని కొనసాగిస్తూ బీజేపీ ఘనవిజయం సాధించింది. వసుంధరా రాజె మళ్లీ ముఖ్యమంత్రి పీఠమెక్కారు. రాష్ట్ర చరిత్రలోనే రికార్డు స్థాయిలో బీజేపీ 163 సీట్లలో నెగ్గింది. కాంగ్రెస్ కేవలం 21 స్థానాలకు పరిమితమై ఘోర పరాభవం మూటగట్టుకుంది. రాష్ట్ర చరిత్రలో ఒక ప్రధాన పార్టీకి లభించిన అత్యల్ప స్థానాలు ఇవే! 1998 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 33 సీట్లొచ్చాయి. బీజేపీ 45.2 శాతం ఓట్లు సాధించగా కాంగ్రెస్‌కు 33.1 శాతం దక్కాయి. గుజ్జర్ నేత కిరోరీసింగ్ బైన్స్‌లా దన్ను కాంగ్రెస్‌కు పెద్దగా కలిసిరాలేదు. ఎప్పుడూ ఆదరించే మేవార్ ప్రాంతం ఈసారి బీజేపీకే జై కొట్టడంతో ఆ పార్టీ తేరుకోలేకపోయింది. 34 ఎస్సీ స్థానాల్లో కాంగ్రెస్ ఒక్కటి కూడా నెగ్గలేకపోవడం విశేషం. 25 ఎస్టీ సీట్లలో నాలుగే గెలిచింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థిగా ప్రధానంగా తెరపైకి వచ్చిన నరేంద్ర మోదీ మేనియానే బీజేపీ ఘన విజయానికి కారణమని సీఎం అశోక్ గెహ్లోత్ అంగీకరించడం విశేషం! బీఎస్పీ సగం అసెంబ్లీ సీట్లు కోల్పోయి మూడింటికే పరిమితమైంది.

2018

ప్రభుత్వాలను పడగొట్టే ధోరణి మరోసారి కాంగ్రెస్‌కు గెలుపు కట్టబెట్టింది. పీసీసీ చీఫ్‌గా యువ నేత సచిన్ పైలట్ అంతా తానై ఎన్నికల బాధ్యతలను చూసుకున్నారు. పార్టీ విజయంలో ఒకరకంగా కీలక పాత్ర పోషించారు. కాంగ్రెస్ నెగ్గితే ఆయనే ముఖ్యమంత్రి అవుతారన్న ప్రచారం పార్టీకి బాగా లాభించింది. 100 సీట్లతో పార్టీ ఘనవిజయం సాధించింది. 2013లో 59 ఎస్సీ, ఎస్టీ స్థానాలు నెగ్గిన బీజేపీ ఈసారి కేవలం 21 స్థానాలకు పరిమితమైంది. ఆళ్వార్, దౌసా, సవాయ్ మధోపూర్, టోంక్, ధోల్‌పూర్, కరౌలీ జిల్లాల్లోనైతే ఒక్క ఎస్సీ, ఎస్టీ స్థానం కూడా నెగ్గలేకపోయింది. ఫలితాల అనంతరం పైలట్ సీఎం అవుతారని అంతా భావించారు. కాంగ్రెస్ అధిష్టానం అనూహ్యంగా పాత కాపు మరోసారి గెహ్లోత్‌కే చాన్స్ ఇచ్చింది. రెండేళ్ల అనంతరం అవకాశమిస్తామంటూ పైలట్‌ను అనునయించి డిప్యూటీ సీఎం పదవి కట్టబెట్టింది. మాట నిలుపుకోకపోవడంతో 2020లో ఆయన తిరుగుబాటు చేసినా రాహుల్‌గాంధీ జోక్యంతో రాజీ పడ్డారు.



పార్టీ	సీట్లు	ఓట్లు	ఓట్లశాతం
కాంగ్రెస్	100	1,40,18,945	39.3
బీజేపీ	73	1,38,29,046	38.8
ఇతరులు	21	63,89,063	17.9
బీఎస్పీ	6	14,35,858	4.0

చైనాలో మిస్టరీ నిమోనియా కలకలం

బీజింగ్: కోవిడ్–19 మహమ్మారి సృష్టించిన విలయాన్ని ప్రపంచం ఇంకా మర్చిపోలేదు. కోట్లాది మందిని బలితీసుకున్న ఈ ప్రాణాంతక వైరస్ డ్రాగన్ దేశం చైనాలోనే పుట్టిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇక్కడే మరో వ్యాధి పురుడు పోసుకుంటున్నట్లు తెలుస్తోంది. చైనా విద్యాసంస్థల్లో అంతుచిక్కని నిమోనియా వ్యాధి విజృంభిస్తోంది. ప్రధానంగా బీజింగ్, లియోనింగ్ ప్రావిన్స్‌ల్లో ఇది పరిణామం కనిపిస్తోంది. హాస్పిటళ్లు బాధితులతో నిండిపోతున్నాయి. భారీ సంఖ్యలో బాధితులు చేరుతుండడంతో ఉత్తర చైనాలో ఆసుపత్రులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఎక్కువగా చిన్నారులు ఈ వ్యాధి బారినపడుతున్నారు. వారిలో విపరీతమైన జ్వరం, ఊపిరితిత్తుల్లో ఇబ్బందులు, శ్వాసక్రియలో సమస్యలు కనిపిస్తున్నాయి. అయితే, నిమోనియాలో సాధారణంగా కనిపించే దగ్గు, ఇతర లక్షణాలు లేవు. మిస్టరీ నిమోనియా వేగంగా వ్యాప్తి చెందుతుండడంతో విద్యాసంస్థల మూసివేత తప్పకపోవచ్చని స్థానిక మీడియా పేర్కొంది. కొన్ని పాఠశాలల్లో పిల్లలతోపాటు ఉపాధ్యాయులు సైతం వ్యాధి బారినపడినట్లు సమాచారం. కొత్త వ్యాధి వల్ల ఇప్పటిదాకా ఎవరూ మృతిచెందలేదు. ఇది ఇన్‌ఫ్లూయెంజా తరహా ఇన్ఫెక్షన్ అని, ప్రాణాంతకం కాదని వైద్యులు చెబుతున్నారు. మహమ్మారిగా మారకపోవచ్చని అంచనా వేస్తున్నారు.

కాల్పుల్లో గాయపడిన భారతీయ విద్యార్థి మృతి

సిన్సినాటి: అమెరికాలోని ఓహియోలో గుర్తు తెలియని దుండగుల కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన ఆదిత్య అద్లఖా(26) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 18న తుదిశ్వాస విడిచారు. ఓహియో రాష్ట్రం యూనివర్సిటీ ఆఫ్ సిన్సినాటిలో డాక్టరేట్ చేస్తున్న ఆదిత్య ఈనెల 9న కారులో వెళ్తుండగా దుండగులు పలుమార్లు అతడిపైకి కాల్పులు జరిపారు. దీంతో అతడు తీవ్రంగా గాయపడగా, కారు అదుపుతప్పి గోడను ఢీకొని ఆగిపోయింది. ఆదిత్యను పోలీసులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ 18న అతడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఢిల్లీలోని రాంజస్ కాలేజీలో బీఎస్సీ, 2020లో ఎయిమ్స్‌లో ఫిజియాలజీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిన అతడు సిన్సినాటి యూనివర్సిటీలో జాయినయ్యారు. కాగా, కాల్పులకు కారణాలు తెలియాల్సి ఉంది.

రూ.350 కోసం దారుణ హత్య

ఢిల్లీలో 18 ఏళ్ల యువకుడిని చంపేసిన బాలుడు

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఓ బాలుడు కేవలం రూ.350 కోసం 18 ఏళ్ల యువకుడిని అత్యంత పాశవికంగా హత్యచేశాడు. హత్య చేసి దోచుకున్న సొమ్ముతో బిర్యానీ తిందామని నిందితుడు భావించాడు. గొంతు నులిమి ఊపిరిపోయేలా చేసి కుప్పకూల్చాడు. వెంటనే కత్తితో విచక్షణారహితంగా 60 సార్లకుపైగా పొడిచాడు. తల, మెడ, కళ్లు, వీపు.. ప్రతి చోటా పొడిచాడు. ఒళ్లంతా రక్తసిక్తమైన మృతదేహంపై నిల్చుని డ్యాన్స్‌చేశాడు. ఈ దారుణ హత్య అక్కడి సీసీటీవీలో రికార్డయింది. మంగళవారం 11 గంటల ప్రాంతంలో ఢిల్లీలోని వెల్‌కమ్ ఏరియాలోని జనతా మజ్దూర్ కాలనీలో చోటుచేసుకుంది. హత్య తర్వాత నిందితుడు అక్కడ గుమికూడిన జనాన్ని దగ్గరకు రాకుండా బెదిరించాడు. విషయం తెల్సుకున్న పోలీసులు రంగంలోకి దిగి నిందితుడిని బుధవారం ఉదయం అరెస్ట్‌చేశారు. చనిపోయిన 18 ఏళ్ల మృతుడికి, 16 ఏళ్ల నిందితుడికి అస్సలు ముఖ పరిచయం కూడా లేదని పోలీసుల దర్యాప్తులో తేలింది. నిందితుడు గత సంవత్సరంలోనూ ఇలా ఒకరిని డబ్బు దొంగలించేందుకు బెదిరించాడని తెలుస్తోంది. నిందితుడుసహా నలుగురు మైనర్లు ఒక గ్యాంగ్‌లా ఏర్పడి చిన్నపాటి చోరీలు చేస్తుంటారని పోలీసులు వెల్లడించారు. మృతుని వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. మద్యం మత్తులో ఇలా విచక్షణారహితంగా ప్రవర్తించానని పోలీసుల ముందు నిందితుడు నేరం అంగీకరించాడు.

ఎంపీలకే డిజిటల్ యాక్సెస్

- పాస్‌వర్డ్‌లు, ఓటీపీలను షేర్ చేయడంపై నిషేధం
- లోక్‌సభ సెక్రెటేరియట్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టీఎంసీ) ఎంపీ మహువా మొయిత్రా వ్యవహారం నేపథ్యంలో లోక్‌సభ సెక్రెటేరియట్ కఠిన చర్యలకు ఉపక్రమించింది. పార్లమెంట్ హౌజ్ పోర్టల్ లేదా పార్లమెంట్ యాప్‌ల పాస్‌వర్డ్‌లు, ఓటీపీలను ఎంపీలు ఇతరులతో షేర్ చేసుకోవడాన్ని నిషేధించింది. పార్లమెంట్ సభ్యులు మాత్రమే డిజిటల్ సంసద్ పోర్టల్ లేదా యాప్‌లను యాక్సెస్ చేసుకోవాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. ఎంపీలు ఇకపై తమ అధికారిక ఈ–మెయిల్ పాస్‌వర్డ్‌ను వ్యక్తిగత సహాయకులు, వ్యక్తిగత కార్యదర్శులకు కూడా షేర్ చేయడం నిషిద్ధమని స్పష్టం చేసింది. సభలో ప్రశ్నలు అడగడం కోసం ముందుగానే నోటీసులు ఇవ్వడానికి, ట్రావెల్ బిల్లులు సమర్పించడానికి పార్లమెంట్ పోర్టల్, యాప్‌లను ఎంపీలు ఉపయోగిస్తుంటారు. అంతేకాదు ఈ పోర్టల్ ద్వారా ప్రభుత్వానికి ప్రశ్నలు సంధించవచ్చు. ఈమెయిల్, ఫోన్ నంబర్‌తో పోర్టల్‌లోకి లాగిన్ కావాల్సి ఉంటుంది. టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా తన అధికారిక ఈమెయిల్ పాస్‌వర్డ్‌ను దుబాయి వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీకి ఇచ్చినట్లు లోక్‌సభ ఎథిక్స్ కమిటీ గుర్తించింది. ఆమె నిబంధనలు ఉల్లంఘించారని నిర్ధారించింది. డిజిటల్ సంసద్ పోర్టల్ కొన్ని నెలల క్రితం అందుబాటులోకి వచ్చింది. ఈ పోర్టల్‌కు ఎలా ఉపయోగించాలో చాలామంది ఎంపీలకు తెలియదు. అందుకే వారు తమ వ్యక్తిగత సహాయకులు, కార్యదర్శులపై ఆధారపడుతున్నారు. ఈమెయిల్ వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు వారికి అందజేస్తున్నారు. దీనివల్ల పోర్టల్ అనధికార వ్యక్తుల చేతుల్లో పడి దుర్వినియోగం అవుతున్నట్లు మహువా మొయిత్రా కేసు నిరూపించింది. ఈ నేపథ్యంలో పోర్టల్ పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు ఇతరులకు ఇవ్వడాన్ని నిషేధిస్తూ తాజాగా నిర్ణయం తీసుకుంది.

ప్రకాశ్‌రాజ్‌కు ఈడీ సమన్లు

చెన్నై: తిరుచిరాపల్లి కేంద్రంగా పనిచేసిన ఆభరణాల సంస్థపై నమోదైన కేసులో విచారణకు హాజరుకావాలంటూ ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆదేశించింది. ఈ మేరకు డిసెంబర్ మొదటివారంలో తమ ఆఫీస్‌కు వచ్చి వాంగ్మూలం ఇవ్వాలంటూ ఆయనకు సమన్లు జారీచేసింది. ప్రణవ్ జువెల్లర్స్ సంస్థ పలు పట్టణాల్లో స్థానిక వ్యాపారుల భాగస్వామ్యంలో ఆభరణాల విక్రయ షోరూమ్‌లను నెలకొల్పి వ్యాపారం చేసేది. ఈ ప్రణవ్ జువెల్లర్స్‌కు ప్రకాశ్ రాజ్ చాలా కాలం బ్రాండ్ అంబాసిడర్‌గా సేవలందించారు. జువెల్లర్స్ నుంచి ఆయనకు చెల్లింపులు, ఆర్థిక లావాదేవీల వివరాలు అడిగి తెల్సుకునేందుకు డిసెంబర్ మొదటివారంలో తమ ఆఫీస్‌కు వచ్చి వాంగ్మూలం ఇవ్వాలంటూ ఈడీ సమన్లు జారీచేసింది. ఈ సంస్థ చిన్న పెట్టుబడుల రూపంలో తమ వినియోగదారుల నుంచి దాదాపు రూ.100 కోట్ల మేర మొత్తాలను సమీకరించిందని ఈడీ ఆరోపిస్తోంది. ఇటీవల ఆ సంస్థ బోర్డు తిప్పేయడంతో ఎఫ్‌ఐఆర్ నమోదైంది. ఈ ఎఫ్‌ఐఆర్ ఆధారంగానే ఈడీ కేసు దర్యాప్తుచేస్తోంది. పోంజీ స్కామ్, మోసం చేశారని పేర్కొంటూ ఈనెల 20వ తేదీన సోదాలు చేసి రూ.23.70 లక్షల నగదు, 11.6 కేజీల బంగారు ఆభరణాలను ఈడీ స్వాధీనం చేసుకుంది. దాదాపు రూ.100 కోట్లమేర పోంజీ స్కామ్ జరిగిందని ఈడీ చెబుతోంది.

నేటి నుంచే కాల్పుల విరమణ!

- గాజాలో బందీల విడుదలకు రంగం సిద్ధం
- 150 మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేయనున్న ఇజ్రాయెల్
- ఒక్కరోజు ఆలస్యంగా అమల్లోకి రానున్న ఒప్పందం

ఖాన్ యూనిస్: గాజాలో నాలుగు రోజులపాటు కాల్పుల విరమణ, దాదాపు 50 మంది బందీలకు విముక్తి, ఇజ్రాయెల్ జైళ్లలోని పాలస్తీనా ఫైటర్ల విడుదలపై ఇజ్రాయెల్–హమాస్ మధ్య కుదిరిన ఒప్పందం ఒక్కరోజు ఆలస్యంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి అమల్లోకి రానుంది. ఖతార్ ఈ విషయాన్ని గురువారం ప్రకటించింది. తొలుత 13 మంది బందీలు విడుదలవుతారని తెలియజేసింది. వాస్తవానికి గురువారం ఉదయం నుంచే ఈ ఒప్పందం అమలు కావాలి. చివరి క్షణంలో కొన్ని అడ్డంకులు ఎదురయ్యాయని ఇజ్రాయెల్ అధికారులు చెప్పారు. కాల్పుల విరమణకు, బందీల విడుదలకు తగిన సానుకూల పరిస్థితులను సృష్టించే పనిలో మధ్యవర్తులు నిమగ్నమయ్యారని ఖతార్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మాజిద్ అల్–అన్సారీ వివరించారు. ఈ కార్యాచరణ దాదాపు పూర్తయినట్లు తెలిపారు. ఇజ్రాయెల్–హమాస్ మధ్య ఒప్పందం కుదిర్చే విషయంలో ఖతార్ అత్యంత కీలకంగా వ్యవహరించింది. గాజాలో హమాస్ చెరలో ఉన్న తమ ఆప్తుల విడుదల కోసం బందీల కుటుంబ సభ్యులు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. తమ దేశంలోని జైళ్ల నుంచి విడుదల కావడానికి అర్హతలు కలిగిన 300 మంది పాలస్తీనా ఖైదీల జాబితాను ఇజ్రాయెల్ న్యాయ శాఖ బహిర్గతం చేసింది. వీరిలో చాలామంది యువకులే ఉన్నారు. గత ఏడాది కాలంలో వీరంతా అరెస్టయ్యారు. రాళ్లు విసరడం, చిన్నచిన్న నేరాలకు పాల్పడడం వంటి కారణాలతో ఇజ్రాయెల్ పోలీసులు వీరిని అరెస్టు చేశారు. 50 మంది బందీలను హమాస్ విడుదల చేస్తే, ఒప్పందం ప్రకారం 150 మంది పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ విడుదల చేయాల్సి ఉంటుంది.

అల్–షిఫా డైరెక్టర్, డాక్టర్ల అరెస్టు

గాజాలోని అల్–షిఫా హాస్పిటల్ డైరెక్టర్ మొహమ్మద్ అబూ సాల్మియాతోపాటు ఇద్దరు సీనియర్ డాక్టర్లను ఇజ్రాయెల్ సైన్యం అరెస్టు చేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ)కు చెందిన వాహనాల్లో రోగులతోపాటు ప్రయాణిస్తుండగా సైన్యం వారిని అడ్డుకొని, అదుపులోకి తీసుకున్నట్లు గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది. అల్–షిఫా హాస్పిటల్ డైరెక్టర్, వైద్యులను ఇజ్రాయెల్ సైన్యం అరెస్టు చేయడాన్ని హమాస్ తీవ్రంగా ఖండించింది. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది.



షిఫా ఆస్పత్రిలో సొరంగాన్ని మీడియాకు చూపిస్తున్న ఇజ్రాయెల్ సైనికుడు

అల్–షిఫా కింద హమాస్ సొరంగం, బంకర్లు

గాజా స్ట్రిప్‌లో అతిపెద్దదైన అల్–షిఫా హాస్పిటల్ కింది భాగంలో భారీ సొరంగంలో హమాస్ ప్రధాన కమాండ్ సెంటర్ ఉందని ఇజ్రాయెల్ సైన్యం పదేపదే చెబుతోంది. ఇందుకు సంబంధించిన బలమైన ఆధారాన్ని సైన్యం తాజాగా బయటపెట్టింది. విదేశీ జర్నలిస్టుల బృందాన్ని హమాస్ సొరంగంలోకి తీసుకెళ్లి, అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా చూపించింది. రాళ్లతో నిర్మించిన ఈ సొరంగం 150 మీటర్ల పొడవు ఉంది. అల్–షిఫా కింద అండర్‌గ్రౌండ్ బంకర్లను కలుపుతూ దీన్ని నిర్మించారు. సొరంగం చివర వసతి గృహం లాంటిది కనిపిస్తోంది. ఏసీ, వంటగది, బాత్‌రూమ్, రెండు ఇనుప మంచాలు ఉన్నాయి. గచ్చుపై తెల్లటి టైల్స్ పరిచారు. ఈ టన్నెల్ చాలా రోజులు ఉపయోగంలో లేనట్లు దుమ్ముధూళితో నిండిపోయి ఉంది. అల్–షిఫా కిందనున్న హమాస్ సొరంగం దృశ్యాలను ఇజ్రాయెల్ సైన్యం సోషల్ మీడియాలో షేర్ చేసింది. గాజాలోని ఆసుపత్రులను హమాస్ మిలిటెంట్లు ప్రధాన స్థావరాలుగా మార్చుకున్నారని, వాటి కింది భాగంలో సొరంగాలు, బంకర్లు నిర్మించుకున్నారని, ఆయుధాలు నిల్వ చేశారని, అక్కడి నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నారని ఇజ్రాయెల్ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. అందుకే ఆసుపత్రులపై గురిపెట్టి వైమానిక దాడులు కొనసాగిస్తోంది. అయితే, ఇజ్రాయెల్ ఆరోపణలను హమాస్ ఖండిస్తోంది.



డ్రిల్లింగ్ పనులు జరుగుతున్న టన్నెల్ ప్రాంతం

డ్రిల్లింగ్ పనులకు మళ్లీ ఆటంకం

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్‌లోని సిల్‌క్యారా సొరంగంలో ఇంకొన్ని మీటర్లు డ్రిల్లింగ్ చేస్తే కార్మికులు చిక్కుకున్న చోటుకు చేరుకోవచ్చన్న ఆశల నడుమ అనుకోని అవాంతరం ఎదురైంది. 25 టన్నుల బరువైన భారీ డ్రిల్లింగ్ మెషీన్ అమర్చిన 'వేదిక'కు పగుళ్లు రావడంతో డ్రిల్లింగ్‌ను ఆపేశారు. బిగించిన వేదిక సరిగా లేకుంటే డ్రిల్లింగ్ మెషీన్ అటుఇటూ కదులుతూ కచ్చితమైన దిశలో డ్రిల్లింగ్ సాధ్యపడదు. అప్పుడు అసలుకే మోసమొస్తుంది. అందుకే ముందుజాగ్రత్తగా డ్రిల్లింగ్‌ను ఆపేశారు. 'మరికొన్ని గంటల్లో లేదా రేపటి కల్లా ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తవుతుంది' అని జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ(ఎన్‌డీఎంఏ) సభ్యుడు లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అతా హస్నయిన్ గురువారం సాయంత్రం చెప్పారు. 'మనం చేస్తున్నది యుద్ధం లాంటిదే. ఖచ్చితంగా ఫలానా సమయంలోగా ఈ ఆపరేషన్ పూర్తిచేసి అందర్నీ బయటకు తెస్తామని ముందుగానే జోస్యం చెప్పడం సరైన విధానం కాదు' అని ఆయన వ్యాఖ్యానించారు. జాతీయ విపత్తు స్పందన దళం(ఎన్‌డీఆర్‌ఎఫ్) సభ్యులు సొరంగం వద్దే ఉండి, లోపలున్న కార్మికులను బయటకు తీసుకువచ్చే విషయంలో రిహార్సల్ చేస్తున్నారని హస్నయిన్ తెలిపారు. కార్మికులను బయటకు తీసుకొచ్చే క్రమంలో అనుకోని విధంగా కాలహరణం జరుగుతున్నందున సమాంతర డ్రిల్లింగ్‌లో అనుకోని అవాంతరాలు ఎదురైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేపట్టామన్నారు. ఇందుకోసం అదనంగా యంత్రాలను తెప్పిస్తున్నామని వివరించారు. బార్కోట్ వైపు నుంచి డ్రిల్లింగ్ పనులను 9.10 మీటర్ల మేర పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ పనులు నిరాటంకంగా కొనసాగుతున్నాయని వారు వెల్లడించారు.

సుప్రీం తొలి మహిళా జడ్జి ఫాతిమా కన్నుమూత

- దేశ న్యాయవ్యవస్థలో అత్యున్నత స్థానానికి ఎదిగిన ముస్లిం మహిళగా ఘనత



సాక్షి, న్యూఢిల్లీ: దేశ సర్వోన్నత న్యాయం స్థానం తొలి మహిళా న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఫాతిమా బీవీ (96) గురువారం కన్నుమూశారు. వయో సంబంధ రుగ్మతలతో బాధపడుతున్న ఆమె కొద్ది రోజులుగా ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారని అధికార వర్గాలు తెలిపాయి. 1989లో సుప్రీంకోర్టు తొలి మహిళా జడ్జిగా నియమితులైన జస్టిస్ ఫాతిమా, న్యాయవ్యవస్థలో అత్యున్నత స్థానానికి ఎదిగిన వ్యక్తిగా మహిళలకు స్ఫూర్తిగా, ఆదర్శంగా నిలిచారు. ఆసియాలోనే తొలిసారి ఒక దేశ అత్యున్నత న్యాయస్థానంలో మహిళా న్యాయమూర్తిగా ఎంపికైన వ్యక్తిగా ఘనత సాధించారు. సుప్రీం జడ్జిగా 1992లో పదవీ విరమణ పొందాక జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలిగా పనిచేశారు. తమిళనాడు గవర్నర్‌గా చేశారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో శిక్ష అనుభవిస్తున్న నలుగురు ఖైదీలు దాఖలు చేసిన క్షమాభిక్ష పిటిషన్లను తరస్కరించిన తర్వాత.. గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. తమిళనాడు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా పనిచేశారు. 1927లో కేరళలో జన్మించిన జస్టిస్ ఫాతిమా పత్తనంతిట్టలోని క్యాథలిక్ హైస్కూల్‌లో చదువుకున్నారు. తండ్రి ప్రోత్సాహం మేరకు ఆమె తిరువనంతపురం లా కాలేజీలో న్యాయవాద విద్యను అభ్యసించారు. 1950లో బార్ కౌన్సిల్ పరీక్షలో అగ్రస్థానంలో నిలిచి బంగారు పతకం సాధించిన తొలి మహిళగా రికార్డు సాధించారు. అదే ఏడాది న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 1983లో కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా, అదే ఏడాది శాశ్వత జడ్జిగా పదోన్నతి పొందారు. ఈమెకు నలుగురు చెల్లెళ్లు, ఇద్దరు సోదరులు ఉన్నారు. అవివాహిత అయిన జస్టిస్ ఫాతిమా బీవీ ఒక సోదరి వద్ద ఉంటున్నారు.

కశ్మీర్‌లో ముగిసిన ఎన్‌కౌంటర్..

- లష్కరే టాప్ కమాండర్ సహా ఇద్దరు ముష్కరులు హతం
- ఆస్పత్రిలో కన్నుమూసిన మరో జవాను

రాజౌరీ/జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో గురువారం రెండో రోజు కూడా ఉగ్రవాదులు, భద్రతా బలగాల మధ్య ఎదురుకాల్పులు కొనసాగాయి. బుధవారం ఎన్‌కౌంటర్ గాయపడిన ఇద్దరు జవాన్లలో ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారని అధికారులు తెలిపారు. దీంతో, ఈ ఎన్‌కౌంటర్ అసువులు బాసిన జవాన్ల సంఖ్య అయిదుగురుకు చేరుకుంది. బుధవారం చనిపోయిన వారిని కెప్టెన్ ఎంవీ ప్రాంజల్(కర్ణాటక), కెప్టెన్ శుభమ్ గుప్తా(యూపీ), పారా ట్రూపర్ సచిన్ లౌర్(యూపీ), హవల్దార్ అబ్దుల్ మాజిద్(జమ్మూకశ్మీర్)గా గుర్తించారు. గురువారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబా టాప్ కమాండర్ సహా ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ధర్మసాల్‌లోని బాజిమాల్ ప్రాంతంలో బుధవారం ఎన్‌కౌంటర్ సందర్భంగా ఇద్దరు కెప్టెన్లు సహా నలుగురు జవాన్లు నేలకొరిగారు. మరో ఇద్దరు గాయాలపాలైన విషయం తెలిసిందే. రాత్రి వేళ కాల్పులను నిలిపివేసిన బలగాలు ఉగ్రవాదులు తప్పించుకునే అవకాశం లేకుండా, అక్కడి దట్టమైన అటవీ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో దిగ్బంధించాయి. గురువారం ఉదయం తిరిగి రెండు వర్గాల మధ్య కాల్పులు ప్రారంభమయ్యాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో, ఈ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ ముగిసినట్లయిందని తెలిపారు. మృతుల్లో ఒకరిని పాకిస్తాన్‌కు చెందిన పేరుమోసిన ఉగ్రవాది క్వారీగా గుర్తించారు. మందుపాతరలను అమర్చడం, స్నైపర్ కాల్పుల్లోనూ ఇతడు నిపుణుడు. గుహల్లో ఉంటూ ఉగ్ర చర్యలకు పాల్పడుతుంటాడు. పాక్, అఫ్గానిస్తాన్‌లలో ఉగ్ర శిక్షణ పొందిన క్వారీ లష్కరే తోయిబాలో టాప్ కమాండర్‌గా వ్యవహరిస్తున్నాడు. హతమైన మరో ముష్కరుడి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రధానిపై వ్యాఖ్యలు.. రాహుల్‌కు ఈసీ నోటీస్

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్ అయింది. ప్రధాని మోదీపై చేసిన విమర్శలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లేనని ఈసీ తెలిపింది. 25వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు సంజాయిషీ ఇవ్వాలంటూ రాహుల్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసింది. రాజస్తాన్‌లోని బార్మెర్ జిల్లాలో నిర్వహించిన ఎన్నికల సభలో రాహుల్.. ప్రధాని మోదీని 'పనౌతి'(అపశకునం) అని విమర్శించారు. ఇండియా–ఆస్ట్రేలియా మధ్య జరిగిన వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌కు ప్రధాని వెళ్లడం వల్లనే భారత్ ఓడిపోయిందని వ్యాఖ్యానించారు. దీనిపై బుధవారం బీజేపీ నేతలు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు అందుకున్న 24గంటల్లోపే రాహుల్ గాంధీకి ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసు జారీ చేయడం గమనార్హం. 'అప శకున వ్యక్తి' అంటూ ప్రధానిపై చేసిన వ్యాఖ్యలు ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 123 ఉల్లంఘన కిందికి వస్తుందని ఈసీ అందులో తెలిపింది.

6 కౌంట్ డౌన్
జంగ్ తెలంగాణ

సుస్థిరతకే ఓటు!

సాక్షి, హైదరాబాద్ సిటీ నెట్‌వర్క్

వచ్చే గురువారం అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. సరిగ్గా వారం రోజులుండగా నగర ప్రజల పల్స్ పట్టుకునేందుకు 'సాక్షి' రోడ్ షో నిర్వహించింది. గ్రేటర్ హైదరాబాద్ నగరాన్ని ఎనిమిది కారిడార్లుగా వర్గీకరించి ప్రజాభిప్రాయాన్ని సేకరించింది. ఎనిమిది దిక్కుల్లోని ప్రజలనూ కలిసిన విలేకరులకు విభిన్న స్వరాలు వినిపించాయి. నగర అభివృద్ధికి కృషి చేస్తోందంటూ బీఆర్ఎస్ సర్కారుకే పెద్దపీట వేస్తామనేవారితోపాటు వాన లొస్తే ముంపు ఇబ్బందులు అంతగా తప్పించలేని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారూ లేకపోలేదు. రోజు రోజుకూ విస్తరిస్తున్న నగరం మరింతగా అభివృద్ధి చెందాలని, తిరిగి ఇదే ప్రభుత్వం వస్తే అభివృద్ధి మరింత వేగంగా కొనసాగే అవకాశముందని కొందరు ప్రత్యేకించి చెప్పడం గమనార్హం. ఫ్లై ఓవర్లతో నగర రూపురేఖలే మారాయని, ఐటీని మేటిగా నిలుపుతున్న ప్రభుత్వాన్నే తిరిగి ఎన్నుకుంటామన్న వారితో పాటు ప్రజారవాణా వ్యవస్థలో భాగంగా మెట్రో, ఎంఎంటీఎస్, ఆర్టీసీ తదితర రంగాల్లో నగరం ఎంతో పురోగతి సాధించిందని, కాకపోతే ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదని, ఇందుకు ప్రత్యేక ప్రణాళిక అవసరమని ధిక్కార స్వరాన్ని వినిపించిన వారూ ఉన్నారు.. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి కొనసాగాలంటే ఇదే ప్రభుత్వం బెటరనే అభిప్రాయాల్ని ఎక్కువమంది వ్యక్తం చేశారు. కొత్త వారొస్తే.. మళ్లీ మొదటికొస్తుందని వారు అభిప్రాయపడ్డారు. దినసరి కూలీల నుంచి ఐటీ ఉద్యోగుల దాకా, ఆర్టీసీ బస్సుల్లో వెళ్తున్న వారి నుంచి చిరు వ్యాపారుల దాకా, ఇరవయ్యేళ్ల నవయువ ఓటర్ల నుంచి అరవయ్యేళ్లు పైబడిన వారిదాకా, మహిళల్లో గృహిణుల నుంచి వ్యాపారాలు నిర్వహిస్తున్నవారి దాకా విభిన్న వర్గాల ప్రజల మనోగతాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయగా అత్యధికులు సుస్థిర ప్రభుత్వం మేలని అభిప్రాయపడగా.. మిగతా వారు మార్పు కోరుకుంటూ అంతరంగం వెలిబుచ్చారు.

అభివృద్ధి ఆగొద్దు.. సుపరిపాలన కావాలంటున్న సిటీజనం

గ్రేటర్ హైదరాబాద్ మరింత విస్తరించాలనే ఆకాంక్ష

బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తే సంక్షేమం పరుగులు
కాంగ్రెస్, బీజేపీలూ తక్కువేం కాదు
ఆరు గ్యారంటీలపై సర్వత్రా చర్చ
సాధ్యాసాధ్యాలపై సందేహాలు..
మోదీ చరిష్మా పైనా ఆశలు
ఎనిమిది కారిడార్లలో ఆన్‌ఫీల్డ్ సర్వే
సాక్షి రోడ్‌షోలో గ్రేటర్ ఓటర్ల మనోగతం

కారిడార్ 1
పోచారం, నారపల్లి, బోడుప్పల్, ఉప్పల్

శివార్లకు ప్రాణం పోయండి

పదేళ్లుగా తెలంగాణలో బాగా అభివృద్ధి జరిగిందని ఎక్కువ మంది అభిప్రాయపడగా, పెరిగిన నిత్యావసరాలతో సామాన్యులు బతకలేని పరిస్థితులేర్పడ్డాయని, డబ్బున్న వారు మరింత సంపన్నులు కాగా, పేదలు మరింత నిరుపేదలయ్యారని వాపోయిన వారూ ఉన్నారు. భారతీయ సంస్కృతిని పరిరక్షించడంతోపాటు ప్రపంచ దేశాల్లో భారత్ గౌరవాన్ని పెంపొందించే నాయకత్వం కావాలన్న వారు సైతం ఉన్నారు. శివారు ప్రాంతాల్లో సౌకర్యాల కల్పనలో మరింత దృష్టి పెట్టాలని, కనీస వసతులు, రవాణాను రాబోయే ప్రభుత్వాలు ప్రధాన అంశాలుగా తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు కోర్‌సిటీపైనే దృష్టి పెట్టారు, ఈ దశలో శివార్ల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని ఆశిస్తున్నారు.

అభివృద్ధి బాగుంది



పదేళ్లుగా తెలంగాణలో అభివృద్ధి జరిగింది. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగ అవకాశాలు పెరిగాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు లబ్ధి పొందుతున్నారు. ఈ అభివృద్ధిని ఇలాగే కొనసాగించాలంటే మరోసారి అధికారపార్టీని గెలిపించవలసిన అవసరం ఉంది.
– జశ్‌రామ్, వ్యాపారి, నారపల్లి

ఈ విడతలోనే అభివృద్ధి



కేసీఆర్ నాయకత్వంతోనే రాష్ట్రం మరింత అభివృద్ధిని సాధించగలదు. అందరికీ తాగునీరు, సాగునీరు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుంది. ఈసారి కాంగ్రెస్‌కు అవకాశమిద్దాం అనే ఆలోచన కంటే అభివృద్ధిని చూసి ఓటేద్దామని ఆలోచించడం మంచిది.
– అరుణ, వాటర్ ప్లాంట్ నిర్వాహకురాలు, జోడిమెట్ల.

మార్పు కావాలి



బీఆర్ఎస్ వల్ల పేదలకు చాలా అన్యాయం జరిగింది. డబ్బున్నవాళ్లే మరింత ధనవంతులయ్యారు. పేదవాళ్లు ఇంకా నిరుపేదలయ్యారు. కాంగ్రెస్ మొదటి నుంచీ పేదల పార్టీ. ఆ పార్టీయే అధికారంలోకి రావాలి.
–విజయ్, టిఫిన్ బండి నిర్వాహకుడు, ఉప్పల్

కారిడార్ 2
రామంతాపూర్, అంబర్‌పేట, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, లిబర్టీ, ఖైరతాబాద్

సంక్షేమానికి మొగ్గు

అభివృద్ధికి ఎక్కువ మంది ఓటర్లు మొగ్గు చూపారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న ప్రస్తుత సర్కారుకు మరో అవకాశం ఇస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమైంది. సంక్షేమ పథకాలు అందుకుంటున్న వర్గాలు అధికంగా ఉండడం,ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు జై కొట్టడం గమనార్హం. మరో వైపు స్థానిక అభ్యర్థులపై అభిమానంతో కాంగ్రెస్‌వైపు మొగ్గుచూపుతున్న వారూ ఉన్నారు. ఆరు గ్యారంటీలపై చర్చ జరుగుతున్నా అంతిమంగా ఓటర్లు ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చినట్లు స్పష్టంగా అర్థమైంది. ఇక్కడ బీజేపీకి కొంత అనుకూలత కనిపించింది.

సమస్యలపై అవగాహన ఉంది



కాంగ్రెస్ పార్టీపై అభిమానం ఉంది. స్థానిక అభ్యర్థికి సమస్యలపై అవగాహన ఉంది. రాష్ట్రంలో మార్పు రావాలని కోరుకుంటున్నా.
–రంగనాథ్, వ్యాపారి, వెంకటేశ్వరనగర్

సంక్షేమ పథకాలతో లబ్ధి పొందాం



తొమ్మిదేళ్లుగా ప్రభుత్వం అందజేసిన వివిధ సంక్షేమ పథకాలతో లబ్ధి పొందాం. ఇంకా మేలు జరుగుతుందేమోనని ఎదురుచూస్తున్నాం. కొత్తవారైతే ఎక్కువేమైనా చేస్తారేమోననే ఆశ ఉంది. ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.
– నోముల రాములు, మార్బుల్ మేస్త్రీ అంబర్‌పేట

బీఆర్ఎస్‌తోనే నగరాభివృద్ధి



బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే హైదరాబాద్ నగరం అన్ని విధాలుగా అభివృద్ధి చెందింది. ఐటీ మంత్రి కేటీఆర్ అంటే నాకెంతో అభిమానం ,ప్రేమ. ఆయన వల్లనే నగరం అన్నిరంగాల్లో ముందుకెళ్లింది. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే హైదరాబాద్‌కు మంచి భవిష్యత్ ఉంటుంది.
–రాజేందర్, విద్యార్థి, ఖైరతాబాద్



కారిడార్ 3
అమీర్‌పేట, ఎస్సార్‌నగర్, ఎర్రగడ్డ, జూబ్లీహిల్స్

మెట్రో విస్తరణ ప్రథమ ఎజెండా కావాలి

ప్రస్తుత ప్రభుత్వంలో చాలా పనులు జరిగాయని, మార్చాల్సిన అవసరమైతే కనిపించడం లేదని ఎక్కువమంది అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పరంగా లోపాల్లేకున్నా, స్థానికంగా ఉండే నేతలు సైతం ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని కోరుకున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతాల్లో ఓటర్లు బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రధానంగా మెట్రోపై తమ అభిప్రాయాలను వివరించారు. మెట్రో రాకతో రవాణా ఇబ్బందులు తొలగిపోయాయని , విస్తరణను నగర ప్రథమ ఎజెండాగా బీఆర్ఎస్ తీసుకోవాలని మెజార్టీ ఓటర్లు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇక్కడ ఆంధ్రా ప్రాంత ఓటర్లు ఉండడం, వారు అధికార పార్టీకి మద్దతు ప్రకటించడం విశేషం. కాంగ్రెస్ పార్టీకి అవకాశం వస్తే బావుంటుంది కానీ, వారి వర్గ పోరుతోనే సమస్య అన్న వాళ్లు ఉన్నారు.

ప్రభుత్వంలో లోపాల్లేవు



కేసీఆర్ పాలనలో నాకు ఏ లోపాలు కనిపించడం లేదు. ఈ ప్రభుత్వాన్ని మార్చాల్సిన అవసరం లేదు. సుస్థిర ప్రభుత్వం కొనసాగాలంటే. తిరిగి కేసీఆర్‌కు జై కొట్టాలి.
– ఉత్తేజ్, సినీనటుడు, జూబ్లీహిల్స్

వేరే ఆప్షన్ లేదు



ఎక్కడైనా ఏ ప్రభుత్వంలోనైనా కొన్ని లోటుపాట్లు ఉంటాయి. అంతమాత్రాన ప్రభుత్వాన్నే మార్చాలనుకోవడం తగదు. స్థానికంగా కొన్ని సమస్యలున్నా, బీఆర్ఎస్ కంటే మంచి ఆప్షన్ కనిపించడం లేదు.
– ఆకుల ప్రవీణ్‌కుమార్, ఐస్‌క్రీమ్ మెషిన్ల వ్యాపారి

ఎప్పుడూ ప్రజల్లో ఉండాలి



బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు ఇంటింటికీ తిరుగుతూ ఓట్లేయమంటున్నారు. గెలిచాక కూడా అలాగే ప్రజల్లో తిరగాలి. వారి సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరిస్తే ప్రజలు ఎప్పుడూ వారివెంటే ఉంటారు.
–మహేష్‌చౌదరి, అమీర్‌పేట

కారిడార్ 4
కొంపల్లి, బాలానగర్, కేపీహెచ్‌బీ, హైటెక్‌సిటీ

ఐటీలో మేటి..

పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక శ్రద్ధతోనే ఐటీలో మెరుగ్గా నిలిచామన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. గతంలో విదేశాల్లో మాత్రమే కనిపించే భారీ అంతస్తుల భవనాలు, కేబుల్‌బ్రిడ్జి వంటివి నగరంలోనూ కనిపిస్తున్నాయని ఎక్కువమంది అభిప్రాయపడ్డారు. ప్రధానంగా ఐటీ రంగం అంచలంచెలుగా ఎదుగుతోందని, పేరొందిన కంపెనీలు రావడం కేవలం కేటీఆర్ కృషి వల్లేనని చెప్పారు. ఐటీ కంపెనీల రాకతో ఈ ప్రాంతం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌గా మారిపోయిందని, మున్ముందు మరింత ఖ్యాతి పొందే అవకాశం ఉందన్నారు. కొందరు మాత్రం తాము దరఖాస్తు చేసుకున్నా డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పథకం కొందరికే చుట్టమైందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఐటీ అభివృద్ధి చెందింది



నగరంలో ఐటీ బాగా అభివృద్ధి చెందింది. లింక్‌రోడ్లతో ప్రయాణం సాఫీగా మారింది. సీఎం కేసీఆర్ కుల వృత్తిదారులకు ఆర్థికంగా చేయూతనిస్తున్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందింది.
– మహేష్‌చారి, చందానగర్

గుణగణాలను చూసే ఓటేస్తా



తెలంగాణ ప్రభుత్వం అందించే పింఛన్ వస్తోంది. డబుల్ బెడ్‌రూమ్ ఇంటికి దరఖాస్తు చేసుకున్నాం. కానీ రాలేదు. వచ్చే ఎన్నికలలో అభ్యర్థి గుణగణాలను చూసి ఓటేస్తాం.
–రమ, పాన్‌షాపు, లింగంపల్లి

పేదలకు న్యాయం జరగాలి



నాకు అరవయ్యేళ్లు దాటాయి. వృద్ధాప్య పెన్షన్ రావడం లేదు. మూడుసార్లు దరఖాస్తు చేసుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. డబుల్ బెడ్‌రూమ్ ఇంటి కోసం దరఖాస్తు చేసుకుంటే అదీ రాలేదు. – వెంకటేశ్వర్లు, చిరువ్యాపారి, హఫీజ్‌పేట

కారిడార్ 5
సాగర్‌రింగ్‌రోడ్, బాలాపూర్, ఆర్‌సీఐ, శంషాబాద్

ఒకవైపే కాదు.... రెండో వైపు చూడండి

గతంతో పోలిస్తే గడచిన తొమ్మిదిన్నరేళ్లలో అభివృద్ధి జరగడాన్ని అంగీకరిస్తూనే, వివిధ రంగాల్లో ప్రభుత్వ వైఫల్యాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అభివృద్ధితోపాటు పేదల సంక్షేమం కూడా పట్టించుకోవాలని ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు. ఆయా ఎమ్మెల్యేలు కేవలం తమ సన్నిహితులు, తమ అనుచరులు, కార్యకర్తలకే ఎక్కువ ప్రాధాన్యమిస్తూ పేదలను విస్మరిస్తున్నారన్న వాదనలను వ్యక్తం చేశారు. అన్ని పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను సమన్యాయంతో అమలు చేయాలని కోరేవారు ఇక్కడ ఎక్కువ సంఖ్యలో కనిపించారు. పదేళ్లలో తమను పట్టించుకోలేదని, పేదలందరికీ న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు చేపడితే బావుండేదని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ గురించి మౌత్ పబ్లిసిటీ పెద్ద ఎత్తున ఉన్నా ఇక్కడ స్థానిక నాయకత్వం యాక్టివ్‌గా ఉన్నట్టుగా కనిపించడంలేదు. బీజేపీ కాస్త మెరుగ్గా ఉన్నా ప్రచారంలో దూసుకెళ్లడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధానంగా ఎల్బీనగర్ చౌరస్తా రూపురేఖలే మారిపోయాయని, ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపిన బీఆర్ఎస్‌కు అక్కడ కొంత మెరుగ్గా ఉన్నట్టు కనిపిస్తోంది.



అర్హులకు నిరాశే మిగిలింది

నేను పక్కా తెలంగాణవాదిని. ఒకే పార్టీకి రెండుసార్లకంటే ఎక్కువ పాలనాధికారాలు అందిస్తే నిరంకుశత్వంగా వ్యవహరిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో అదే జరుగుతోంది. సంక్షేమ పథకాలన్నీ అధికారపార్టీ ప్రతినిధులు, వారికి అనుకూలమైన వారి జేబుల్లోకే వెళుతున్నాయి. అర్హులకు ఎదురు చూపులే మిగులుతున్నాయి.
– కాకి నవీన్‌గౌడ్, ప్రైవేట్ ఉద్యోగి, కర్మన్‌ఘాట్ చౌరస్తా

ఉచితాలు కాదు ఉపాధి కావాలి



నేను నిరుపేద కుటుంబంలో జన్మించాను. చదివితే కొలువు సాధించవచ్చని ఇంట్లో కొట్లాడి హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ వరకు చదివాను. పోలీసు ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకున్నాను. ఉద్యోగం రాలేదు. గత్యంతరం లేక ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నా. నిరుద్యోగ యువతకు ఉచితాలు వద్దు. ఉపాధి కావాలి.
– బెయిన సుధాకర్, నిరుద్యోగి, సాయిరాంనగర్‌కాలనీ చౌరస్తా

పెద్దకొడుకు మా కేసీఆర్



రాష్ట్ర సొంతింటి పెద్ద కొడుకు మా సీఎం కేసీఆర్. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పెన్షన్లు, షాదీముబారక్, కల్యాణలక్ష్మి, దళిత, బీసీ, రైతు బంధు వంటి సంక్షేమ పథకాలు అమలు చేసి నేనున్నానని భరోసా ఇస్తున్నాడు. మాకు ఇంకేం కావాలి. కాంగ్రెస్‌కు పాలన అందిస్తే సాగు, తాగునీటి కష్టాలు తప్పవు. రోజుకు మూడు గంటలే కరెంట్ ఇచ్చి చీకటి చేస్తరు. బీజేపీకి అధికారం ఇస్తే స్థానిక సమస్యలను గాలికి వదిలేస్తారు.
–పోతురాజు జంగయ్య, దుర్గానగర్, అడ్డాకూలీ

కారిడార్ 6
నాగోల్, కొత్తపేట, నల్లగొండ చౌరస్తా, నాంపల్లి పబ్లిక్‌గార్డెన్

స్వచ్ఛ మూసీ ఎక్కడ? ట్రాఫికర్ తీరేదెలా?

ఈ ప్రాంతాల్లో మిశ్రమ స్పందన కనిపించింది. వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులు బీఆర్ఎస్ వైపు ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో బీజేపీకి మొగ్గు చూపినవారూ ఉన్నారు. కొత్త రేషన్‌కార్డులు, డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల ప్రయోజనాలు అందలేదని కొందరు ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తం చేశారు. కేంద్రంలో మోదీ విధానాలకు ఆకర్షితులైన వారు బీజేపీకి పట్టం కడతామంటున్నారు. స్వచ్ఛ మూసీ విషయంలో బీఆర్ఎస్ అశ్రద్ధ చేసిందనే వాదనలు కొంతమంది వ్యక్తం చేయగా, ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ అత్యంత ఇబ్బందులకు గురిచేస్తోందని ఈ సమస్యకు తక్షణమే పరిష్కారం కావాలన్నవారు చాలామందే ఉన్నారు. నిత్యం ట్రాఫిక్ జాం, భారీ సంఖ్యలో వాహనాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు.

పేదలకు న్యాయం జరగలేదు



బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు చేసింది ఏమీ లేదు. కాంగ్రెస్ పార్టీ వస్తే అన్ని వర్గాల ప్రజలు బతకవచ్చు. పెరిగిన నిత్యావసరాల ధరలతో పేద ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడింది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే మద్దతు ఇస్తాం.
– నర్సింహ, ఆటోడ్రైవర్, మోహన్‌నగర్

సుస్థిర ప్రభుత్వం ఉండాలి



రాష్ట్రంలో బలమైన ప్రతిపక్షం లేదు. ఎలాంటి ఆటంకాల్లేకుండా ఐటీ సెక్టార్ హైదరాబాద్‌లో బాగా అభివృద్ధి చెందింది. రాష్ట్రంలోని జిల్లాలకు ఈ సెక్టార్‌ను విస్తరించడం మంచి పరిణామం. ఇంకా అభివృద్ధి జరగాలి. అందుకు సుస్థిర ప్రభుత్వం ఉండాలి.
– సాయిసుమంత్, ఐఐఎం గ్రాడ్యుయేట్, దిల్‌సుఖ్‌నగర్

కారిడార్ 7
సికింద్రాబాద్, జేబీఎస్, బోయిన్‌పల్లి, అల్వాల్

ఆచరణ సాధ్యమేనా...

మాస్ ఓటర్లు, మధ్యతరగతి ఓటర్లకు నెలవైన ఈ ప్రాంతంలో అధికార బీఆర్ఎస్‌కు పెద్ద ఎత్తున తమ మద్దతు వ్యక్తం చేశారు. పదిమందిలో సగం మంది కారుకే వేస్తామని చెప్పారు. సంక్షేమ పథకాలైన ఆసరా పింఛన్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు పొందామన్నారు. ఇవే హామీలు కాంగ్రెస్ కూడా ఇస్తుందని 'సాక్షి' ప్రశ్నించగా కాంగ్రెస్ గ్యారంటీల మీద తమకు నమ్మకం లేదని, ఆచరణ సాధ్యం కాదని పలువురు చెప్పారు. ఒకవేళ ఇవ్వగలిగితే కేసీఆర్ ఇచ్చేవాడు కదా? అవి సాధ్యం కాలేనివి కాబట్టే బీఆర్ఎస్ చెప్పలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు అభ్యర్థులు పెద్దగా ప్రభావం చూపేవారు కాదని, వారి ప్రచారం కూడా అంతంతే ఉందని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

మళ్లీ కేసీఆరే రావాలి



రాష్ట్రంలో పేదలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందిస్తూ అంతే స్థాయిలో అభివృద్ధి చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వమే మళ్లీ గెలవాలి. కంటోన్మెంట్‌లో సాయన్న చొరవతో నిరుపేదలకు ఎన్నో సంక్షేమ ఫలాలు అందాయి. పెన్షన్లు, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి ఇలా అన్ని రకాల ప్రయోజనాలు దక్కాయి. కంటోన్మెంట్‌లో మరోసారి ఆ పార్టీకే అవకాశాలున్నాయి.
– నారాయణముదిరాజ్, అంబేడ్కర్‌నగర్

బీసీబంధు బీజేపీకే ఓటు



బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించిన బీజేపీకే మా మద్దతు. నియోజకవర్గంలోని బీసీలంతా బీజేపీకే ఓటు వేస్తారని ఆశిస్తున్నా. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉండే కంటోన్మెంట్‌లో బీజేపీ గెలిస్తేనే ఎంతో అభివృద్ధి జరుగుతుంది.
– సురేశ్, మారేడుపల్లి

కారిడార్ 8
చార్మినార్, అఫ్జల్‌గంజ్, ఎంజే మార్కెట్, గాంధీభవన్

ప్రశాంతతకే పట్టం కడతాం

పాతబస్తీ ప్రజలతోపాటు ఈ కారిడార్‌లోని పలువురు వ్యాపారులు ఎంఐఎంనే కోరుకుంటున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారు. గోషామహల్ ప్రాంతంలో మిశ్రమ స్పందన కనిపించింది. కొందరు బీజేపీ, మరి కొందరు బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల పట్ల మొగ్గు చూపారు. రాష్ట్రంలో మాత్రం కేసీఆర్ నాయకత్వం పట్లనే అసక్తి కనబర్చారు. ప్రధానంగా మైనార్టీల సంక్షేమం పట్ల బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందని, షాదీముబారక్, రంజాన్ తోఫా, విద్య, వైద్యం విషయంలో బీఆర్ఎస్ కృషిని మరిచిపోలేమన్నారు. మైనార్టీలంతా ఎంఐఎం వైపు ఉంటామని తెలంగాణవ్యాప్తంగా బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతామని స్పష్టం చేశారు.



ఇదే పాలన కొనసాగాలి

తొమ్మిదేళ్లుగా పర్యాటక కేంద్రం చార్మినార్ ప్రశాంతంగా ఉంది. చిరువ్యాపారాలపై ఒత్తిడి లేదు. శాంతి భద్రతల విఘాతం సమస్యలేదు. పరస్పర సహకారం బాగుంది. పాతబస్తీలో అసెంబ్లీ స్థానాలతోపాటు రాష్ట్రంలో కూడా ఇదే పాలనా కొనసాగాలి.
– షేక్ చాంద్, చిరువ్యాపారి, చార్మినార్

బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తేనే బాగుంటుంది



రాష్ట్రంలో మళ్లీ ఇదే ప్రభుత్వం రావాలి. ముస్లిం సంక్షేమం, చేయూత బాగుంది. విద్యారంగానికి పెద్దపీట వేశారు. ఉచితంగా పేదపిల్లలకు చదువు లభిస్తోంది. చిరు వ్యాపారులకు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తే బాగుటుంది.
–ముజాహిద్, అత్తర్ వ్యాపారి. యాకుత్‌పురా

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు



గత పదేళ్ల పాటు బీఆర్ఎస్ పార్టీ పాలించింది. ప్రస్తుతం మార్పు అవసరం. కాంగ్రెస్ అధికారంలోకి రావాలి – మహ్మద్ ఖలీల్, వ్యాపారి, ఓల్డ్‌సిటీ



రె'బెల్స్' కాదు... ప్రత్యర్థి పక్షమే!



పోలంపల్లి ఆంజనేయులు

ఎన్నికల్లో ప్రధాన పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడం ఒకెత్తయితే... సొంత పార్టీ నుంచి రెబెల్‌గా ఎవరూ లేకుండా చూసుకోవడం మరోఎత్తు. తాము ఎప్పటి నుంచో ఉంటున్న పార్టీ ఎన్నికల సమయంలో టికెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గానో, మరో పార్టీ నుంచో పోటీ చేసి గెలిచిన నాయకులు తెలంగాణలో చాలా మందే ఉన్నారు. ఒకవేళ గెలవకపోయినా, సొంత పార్టీ అభ్యర్థిని ఓడించి ప్రత్యర్థి పార్టీ గెలుపునకు పరోక్షంగా కారకులైన వారూ ఉన్నారు. కొన్నిసార్లు పేరున్న రెబెల్ కారణంగా పోటీలో ఉన్న ప్రధాన పార్టీల్లోని ఏ అభ్యర్థి ఓడిపోతాడో చెప్పలేని పరిస్థితి. కానీ ఈసారి సీన్ మారింది. రెబెల్స్ పోటీలో నిలిచిన నియోజకవర్గాలు చాలా తక్కువగా ఉన్నాయి. రెబెల్స్‌గా పోటీ చేసే బదులు ప్రత్యర్థి పార్టీలో చేరి ఆ పార్టీ అభ్యర్థికి మద్దతుగా పనిచేయడం అనే పద్ధతిని ఈసారి చాలామంది ఫాలో అయిపోయారు. పీసీసీ అధ్యక్షుడిగా, రాష్ట్ర మంత్రిగా పనిచేసిన పొన్నాల లక్ష్మయ్య మొదలు మాజీ మంత్రులు నాగం జనార్దన్ రెడ్డి(నాగర్‌కర్నూలు), సంభాని చంద్రశేఖర్ (సత్తుపల్లి), మాజీ ఎమ్మెల్యేలు పి. విష్ణువర్ధన్‌రెడ్డి (జూబ్లీహిల్స్), ప్రేంసింగ్ రాథోడ్(గోషామహల్), చందర్‌రావు(కోదాడ), బిరుదు రాజమల్లు (పెద్దపల్లి) వంటి వారు ఇందులో ఉండడం గమనార్హం.

ఎన్నికల్లో భారీగా తగ్గిన అసంతృప్తుల బెడద

- టికెట్లు రానివారు వేరే పార్టీల్లో చేరిక
- అప్పటి వరకు ప్రత్యర్థులుగా ఉన్న వారికే మద్దతు
- పొన్నాల లక్ష్మయ్య, నాగం జనార్దన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రేంసింగ్‌రాథోడ్, చందర్‌రావుకు టికెట్లు రాక పార్టీ నుంచి జంప్
- రెబెల్‌గా పోటీ చేసే కంటే ప్రత్యర్థి పార్టీలో చేరి అప్పటి వరకు కొనసాగిన పార్టీ అభ్యర్థిని ఓడించడమే ఎత్తుగడ

కాంగ్రెస్ టికెట్ రాక బీఆర్‌ఎస్‌లోకి

కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డ నాయకులు రెబెల్స్‌గా బరిలో దిగాలని తొలుత భావించినప్పటికీ, 'సింబల్' లేకుండా గెలవడం కష్టమనే భావనతో మధ్యే మార్గంగా ప్రత్యామ్నాయ పార్టీలను చూసుకున్నారు. బీఆర్‌ఎస్ కూడా టికెట్ రాని కాంగ్రెస్, బీజేపీ నాయకులకు కండువాలు కప్పి మరీ సాదరంగా ఆహ్వానించింది. కొట్లాడుతామనుకున్న వాళ్లకే మద్దతుగా ప్రచారం చేయాల్సిన అనివార్య పరిస్థితి కల్పించింది. ఇలాంటి వారిలో చెరుకు సుధాకర్ (నల్లగొండ), తాటి వెంకటేశ్వర్లు (అశ్వారావుపేట), పాల్వాయి స్రవంతి (మునుగోడు), గండ్రత్ సుజాత (ఆదిలాబాద్) వంటి వారున్నారు. బీజేపీ నుంచి కూడా రాకేష్‌రెడ్డి (వరంగల్), తుల ఉమ (వేములవాడ), రమాదేవి (ముధోల్) టికెట్ రాక భంగపడి బీఆర్‌ఎస్‌లో చేరారే తప్ప రెబెల్స్‌గా పోటీ చేసే సాహసం చేయలేదు.

ఒక పార్టీ టికెట్ ఇవ్వకపోతే మరో పార్టీ నుంచి బరిలో...

ఈసారి ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మూడు నెలల ముందే అభ్యర్థులను ప్రకటించింది. కొందరు మినహా సిట్టింగ్‌లకే ఆ పార్టీ టికెట్లు కేటాయించడంతో ఆయా నియోజకవర్గాల్లో సీట్లు ఆశించిన వారు రెండు నెలలు ఆలోచించిన అనంతరం ఎక్కువ శాతం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఖమ్మంకు చెందిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు కాంగ్రెస్ నుంచి పోటీ పడుతున్నారు. జలగం వెంకట్రావు ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పోటీలో ఉన్నారు. తన కొడుకుకు మెదక్ సీటివ్వలేదని అలిగిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. అలాగే టికెట్ దక్కని రేఖా నాయక్(ఖానాపూర్) కాంగ్రెస్‌లో చేరగా, ఆమె భర్త శ్యాంనాయక్‌కు ఆసిఫాబాద్ టికెట్ లభించింది. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావుకు మద్దతుగా ఆపార్టీలో చేరారు. నిర్మల్ నుంచి శ్రీహరిరావు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ పడుతున్నారు. సంగారెడ్డి టికెట్ ఆశించిన పులిమామిడి రాజు బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. కరీంనగర్‌లో బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన పురమళ్ల శ్రీనివాస్ కాంగ్రెస్ టికెట్ దక్కించుకున్నారు. అంబర్‌పేటలో బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, మునుగోడు నుంచి చెలిమల కృష్ణారెడ్డి బీజేపీలో చేరి ఆ పార్టీ నుంచి బరిలో నిలిచారు. చేవెళ్లలో రత్నం, మానకొండూరు నుంచి ఆరెపల్లి మోహన్, రామగుండం నుంచి కందుల సంధ్యారాణి బీజేపీ నుంచి పోటీలో ఉన్నారు. కల్వకుర్తిలో బీఆర్‌ఎస్ టికెట్ ఆశించి భంగపడ్డ కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్ టికెట్టుపై పోటీ చేస్తున్నారు.

ఇండిపెండెంట్లుగా గెలిచిన వారెందరో...!

తెలుగుదేశం ఆవిర్భావం అనంతరం 1983లో వచ్చిన ఎన్టీ రామారావు ప్రభంజనంలో ఉమ్మడి రాష్ట్రంలో 19 మంది ఇండిపెండెంట్లు విజయం సాధించగా, అందులో తెలంగాణ నుంచే తొమ్మిది మంది విజయం సాధించారు. 1985 మధ్యంతర ఎన్నికల్లో గెలిచిన 9 మందిలో 8 మంది తెలంగాణ నుంచి కావడం గమనార్హం. వీరిలో అధిక సంఖ్యలో తెలుగుదేశం టికెట్లు ఆశించి భంగపడ్డ నాయకులే ఉన్నారు. 1989 ఎన్నికల్లో ఏకంగా 15 మంది స్వతంత్రులు విజయం సాధించగా, అందులో 8 మంది తెలంగాణ నుంచే. ఆలేరులో మోత్కుపల్లి నర్సింహులు, కరీంనగర్‌లో బి.జగపతి రావు వంటి నేతలు అప్పుడు కాంగ్రెస్ టికెట్ దక్కక రెబల్‌గా పోటీ చేసి గెలిచిన వారే. 1994లో మరోసారి ఎన్టీఆర్ ప్రభంజనంలో 12 మంది ఇండిపెండెంట్లు గెలవగా, అందులో తెలంగాణ నుంచి గెలిచిన ఐదుగురు ఇండిపెండెంట్లలో తుంగతుర్తి నుంచి ఆర్.దామోదర్ రెడ్డి , గద్వాల నుంచి డీకే.భరత్ సింహారెడ్డి, కల్వకుర్తి నుంచి ఎడ్మ కిష్టారెడ్డి కాంగ్రెస్ రెబల్స్‌గా విజయం సాధించారు. 2004లో 11 మంది ఇండిపెండెంట్లు గెలవగా తెలంగాణ నుంచి విజయం సాధించిన నలుగురిలో కొల్లాపూర్ నుంచి జూపల్లి కృష్ణారావు వంటి వారు ఉన్నారు.

2004 నుంచి ఇతర పార్టీల గుర్తుల మీద...

2004 ఎన్నికల నాటి నుంచి టికెట్లు రాని వారు రెబెల్స్‌గా ఇతర రాష్ట్రాలకు చెందిన పార్టీ గుర్తుల మీద పోటీ చేసే ఆచారం మొదలైంది. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో జనతా పార్టీ తరఫున మెట్‌పల్లి నుంచి పోటీ చేసిన కొమిరెడ్డి రాములు, సమాజ్‌వాది పార్టీ టికెట్ మీద గద్వాల నుంచి పోటీ చేసిన డీకే.అరుణ కాంగ్రెస్ రెబల్స్‌గా విజయం సాధించారు. 2009 ఎన్నికల్లో చిరంజీవి నేతృత్వంలో ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భవించగా, అప్పుడు టీడీపీ, కాంగ్రెస్ నుంచి సీట్లు రాని వారు ఆ పార్టీ తరఫున పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో పలువురు పోటీ చేసినప్పటికీ... నిర్మల్ నుంచి మహేశ్వర్ రెడ్డి, బాల్కొండ నుంచి అనిల్‌కుమార్ విజయం సాధించి, అనంతర పరిణామాల్లో కాంగ్రెస్‌లో విలీనమయ్యారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014 ఎన్నికల్లో అప్పటి టీఆర్‌ఎస్, కాంగ్రెస్, టీడీపీలకు ప్రత్యామ్నాయంగా ఆదిలాబాద్ జిల్లాలో బీఎస్పీని తెరపైకి తెచ్చిన అల్లోల్ల ఇంద్రకరణ్ రెడ్డి, కోనేరు కోనప్ప ఆ పార్టీ తరఫున ఎమ్మెల్యేలుగా గెలిచి తర్వాత అధికార పార్టీలో చేరారు. నర్సంపేటలో కాంగ్రెస్ రెబల్‌గా దొంతు మాధవరెడ్డి పోటీ చేసి విజయం సాధించారు. 2018లో వైరా నుంచి రాములు నాయక్ కాంగ్రెస్ రెబల్‌గా విజయం సాధించగా, రామగుండం నుంచి కోరుకంటి చందర్ ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తరఫున పోటీ చేసి గెలుపొంది, తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఓటు అమ్ముకోను

ఫ్లెక్సీ కట్టిన కొత్త ఓటరు రోహిత

మా కుటుంబంలో ఓటును అమ్ముకోము.. తాయిలాలకు తాకట్టు పెట్టం, ప్రజాస్వామ్యానికే మా ఓటు అంటూ ఇంటి బయట ఫ్లెక్సీ ఏర్పాటు చేసి యువతరానికి స్ఫూర్తిగా నిలిచింది సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన కొల్లు రోహిత. కోదాడలోని శ్రీమన్నారాయణకాలనీ వాసి పర్యావరణ ఉద్యమకారుడు కొల్లు లక్ష్మీనారాయణ కుమార్తె రోహిత ఇటీవలే డిగ్రీ పూర్తి చేసింది. ఆమెకు కొత్తగా ఓటు హక్కు వచ్చిన నేపథ్యంలో తొలిసారి ఈ ఎన్నికల్లో ఓటు వేసేందుకు సన్నద్ధమవుతోంది.

–కోదాడ అర్బన్



ఐదేళ్లకోసారి రిపీటయ్యే... 'పులి..బంగారు కంకణం' కథ!

ఓ పులికి వయసు బాగా మీద పడింది. తాను మాంఛి యౌవనంలో ఉన్నప్పుడెప్పుడో ఓసారి ఓ బాటసారిని వేటాడినప్పుడు, అతడి బంగారు కంకణం దాని గుహలో ఉండిపోతుంది. తన వృద్ధాప్యంలో ఇప్పుడా కంకణాన్ని చేత పట్టుకుని, దారికాచి, ఓటరు మహాశయుల్లాంటి బాటసారుల కోసం వేచిచూడటం మొదలుపెట్టింది పులి.

తానిప్పుడు నాన్-వెజ్ పూర్తిగా మానేశాననీ, గతంలో ఆ దారెంట పోయేవాళ్లను ఎందరినో తిన్నందుకు ఇప్పుడు పాప భారంతో కుమిలిపోతున్నానంది. పైగా చిరుధాన్యాలతో చేసిన వంటలే మంచివనీ, మిగతావన్నీ వేస్ట్ అని చెప్పింది. ఇలా కొందరు మహానుభావులు టీవీల్లో చేస్తున్న ప్రచారాలతో తీవ్రంగా ప్రభావితమయ్యానంటూ ఉద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకుంది. చూసేవాళ్ల గుండె కరిగేలా కుములుతూ పులి పాపం..తన పైపంజాతో కన్నీళ్లు తుడుచుకుంది.

తీవ్రమైన పశ్చాత్తాపంతో దహించుకుపోతున్న తాను ఆ గిల్టీ ఫీలింగ్‌నుంచి బయటపడేందుకే బంగారు కంకణాన్ని ఎవరికైనా బహూకరించాలని అనుకున్నానంది. ప్రాయశ్చిత్తం తర్వాత తన శేషజీవితాన్నంతా ఓ వీగన్‌గా వెళ్లదీస్తానంది. అంతే కాదు..తన పులిగోళ్లను వేలం వేసి, అలా వచ్చిన సొమ్మంతటినీ తాను నమ్మిన వీగన్ ఉద్యమ ప్రచారానికే విరాళంగా ఇస్తానంటూ..ఓటరు బాటసారుల కరతాళ ధ్వనుల మధ్య దిక్కులు పిక్కటిల్లేలా గాండ్రించి ప్రకటించింది.

తన వైల్డ్‌లైఫ్ జీవితానికి స్వస్తి పలికి, జనజీవన స్రవంతిలోకొచ్చి ప్రజలకు సేవ చేద్దామనుకున్న కంటెస్టింగ్ క్యాండిడేటులా పులి తన వీగన్ అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించగానే..టీవీ జర్నలిస్టులంతా దాన్ని చుట్టుముట్టారు. అన్ని పార్టీలకు చెందిన ముఖ్యనేతలను ఇంటర్వ్యూ చేసినట్టుగా..రిపోర్టర్లంతా పులి చుట్టూ చేరి, దాని ఇంటర్వ్యూ తీసుకోసాగారు.

''మరి పులిగారూ... పులిగారూ... ఇకపై మీరేం తింటారు?''

''ఇంకేం తింటాం సార్. పులి అని పేరు పెట్టుకున్నాక టైటిలు జస్టిఫికేషన్ కోసం ఇకపై కేవలం పులిహోర మాత్రమే తిని బతుకుదామనుకుంటున్నా''

''ఈ దారెంట పోయేవాళ్లు మిమ్మల్ని చూసి బెంబేలెత్తిపోతుంటారు. పైగా ఈమధ్య మీరు మరీ ఆవేశపడుతున్నారు. అప్పుడప్పుడూ 'నన్ను నమ్మనివాళ్లను (పులిగోళ్లతో) చీరేస్తా, పదడుగులు గొయ్యి తీసి పాతేస్తా, అయితే మరిప్పుడేం చేద్దాం చెప్పు? మీకు బుద్ధిలేదా' అంటూ ఆగ్రహంతో గాండ్రిస్తున్నారు కదా. మరి మిమ్మల్ని ఎలా నమ్మగలం పులిగారూ?''

ఇప్పుడు తానున్న పరిస్థితుల్లో కోపం తెచ్చుకోవడం సరి కాదని గ్రహించింది. అతికష్టమ్మీద గాండ్రింపును అదుపులో పెట్టుకుంది. ''క్షమించాలి..ఎంతచెడ్డా పుట్టింది పులిపుట్టుక కదా. అందుకే నేను మామూలుగా మాట్లాడినా మీకు గాండ్రింపులా వినిపిస్తోంది...సారీ'' అంటూ నెపాన్ని మళ్లీ రిపోర్టర్ల మీదికే నెట్టింది.

''మీ భవిష్యత్ కార్యాచరణ ఏమిటి?'' అంటూ అడిగినప్పుడు తన ఫ్యూచర్ ప్లాన్‌ను పులి ఇలా వివరించింది...

''టైటిలు జస్టిఫికేషన్ కోసం ఏ పులిచింతల ప్రాజెక్టు దగ్గరికో, పులికాట్ సరస్సు ఒడ్డుకో వెళ్దామనుకున్నా. కానీ అదంతా ఆంధ్రా ఏరియా కదా. నా మనసంతా నిండి ఉన్నది తెలంగాణయే. కాబట్టి ఏ కవ్వాల్ ఫారెస్టుకో, ఏ అమ్రాబాద్ అడవుల్లోకో వెళ్లి, తపస్సు చేసుకుంటా'' అంది.

అప్పుడు జర్నలిస్టులంతా పులికంకణాన్ని పరిశీలనగా చూశారు. 'నెలనెలా పింఛన్లూ..క్రమంగా వాటి పెంపు అనీ, గ్యాస్ సిలిండరు రూ. 500 లేదా రూ. 400లకేననీ, డబుల్‌బెడ్‌రూమ్ గృహాలూ/ఇందిరమ్మ ఇళ్లనీ; ఒకచోట ధరణి అనీ, ఇంకోచోట భూమాత అనీ, కొన్ని డిజైన్లలో కళ్యాణలక్ష్మి /కళ్యాణమస్తు' అనీ...ఇలా సమస్త పార్టీల వాగ్దానాలన్నీ ఆ కంకణమ్మీద నగిషీలు నగిషీలుగా చెక్కి ఉన్నాయి.



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

ఇదంతా ఐదేళ్లకోసారి వినిపించే 'పులి-బంగారు కంకణం రిపీటు టెలికాస్టు స్టోరీయే'నని పెదవి విరుస్తూ జర్నలిస్టులు తమ ఇంటర్వ్యూనిక ముగించారు.

సింగరేణి సెగ ఎవరికి?

సాక్షి, హైదరాబాద్



- 11 డివిజన్లలో ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు 70వేలు
- కుటుంబ సభ్యుల ఓట్లు మూడున్నర లక్షలకు పైగా
- వారసత్వ ఉద్యోగాలు, లాభాల బోనస్‌పై బీఆర్‌ఎస్ నమ్మకం
- గతంలో కంటే మంచి ఫలితాలు సాధిస్తామంటున్న కాంగ్రెస్
- ప్రధాన పోటీ బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల మధ్యే
- నాలుగు చోట్ల మినహా బీజేపీ పోటీ నామమాత్రమే...

ప్రతి ఎన్నికల్లో విలక్షణ తీర్పు ఇచ్చే సింగరేణి ఓటర్లు ఈసారి ఎటువైపు మొగ్గు చూపుతారోనని రాజకీయపక్షాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. రాష్ట్రంలో గోదావరి లోయ పరిధిలో 6 జిల్లాలు, 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తరించిన సింగరేణిలో మొత్తంగా 11 డివిజన్లలో 70వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో 42 వేల మంది రెగ్యులర్ ఉద్యోగులు కాగా, మరో 28వేల మంది కాంట్రాక్టు కార్మికులు. వీరి కుటుంబసభ్యులతో సహా మూడున్నర లక్షల మంది వరకు ఓటర్లు ఉంటారు. ఈ 11 నియోజకవర్గాల్లో సింగరేణి ఓటర్లు ఎటు వైపు మొగ్గు చూపుతే ఫలితం అటు వైపే అన్న విషయం గత అనుభవాల నేపథ్యంలో అన్ని పక్షాలకు తెలుసు. దీంతో సింగరేణి కార్మికులను మచ్చిక చేసుకునేందుకు అన్ని పార్టీలు ఇప్పటికే ప్రయత్నాలు సాగిస్తున్నాయి. సింగరేణి బొగ్గు గనుల వద్ద కార్నర్ మీటింగ్‌లు, దావత్‌లు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ఇప్పటికే బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ సింగరేణి పరి ధిలోని పలు నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాదసభలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క వంటి నాయకులు సింగరేణి బెల్ట్‌లో ప్రచారం నిర్వహిస్తున్నారు. రాజకీయ పార్టీల అనుబంధ సంఘాలుగా ఉన్న టీబీజీకేఎస్ (బీఆర్‌ఎస్), ఐఎన్‌టీయూసీ (కాంగ్రెస్), ఏఐటీయూసీ (సీపీఐ)ల బలం కూడా ఈసారి ఎన్నికల్లో కీలకం కానుంది.

ఈ ఎన్నికల్లో సింగరేణిలో పోటీ పడుతున్న ప్రధాన అభ్యర్థులు		
నియోజకవర్గం	బీఆర్‌ఎస్	కాంగ్రెస్
ఆసిఫాబాద్	కోవా లక్ష్మి	శ్యాం నాయక్
బెల్లంపల్లి	దుర్గం చిన్నయ్య	గడ్డం వినోద్
చెన్నూరు	బాల్క సుమన్	గడ్డం వివేక్
మంచిర్యాల	ఎన్. దివాకర్ రావు	కె. ప్రేంసాగర్ రావు
రామగుండం	కోరుకంటి చందర్	మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్
మంథని	పుట్ట మధుకర్	దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
భూపాలపలి	గండ్ర వెంకటరమణా రెడ్డి	గండ్ర సత్యనారాయణరావు
కొత్తగూడెం	వనమా వెంకటేశ్వర్ రావు	కూనంనేని (సీపీఐ)
ఇల్లందు	బానోత్ హరిప్రియ	కోరం కనకయ్య
పినపాక	రేగా కాంతారావు	పాయం వెంకటేశ్వర్లు
సత్తుపల్లి	సండ్ర వెంకటవీరయ్య	మట్టా రాగమయి

2018లో విలక్షణ తీర్పు

గత శాసనసభా ఎన్నికల్లో సింగరేణి ఓటర్లు విలక్షణ తీర్పును ఇచ్చారు. 11 శాసనసభా నియోజకవర్గాలకుగాను టీఆర్‌ఎస్‌కు కేవలం మూడు సీట్లు మాత్రమే కట్టబెట్టారు. బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాలల్లో మాత్రమే బీఆర్‌ఎస్ గెలుపొందగా, రామగుండంలో బీఆర్‌ఎస్ రెబెల్ కోరుకంటి చందర్ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ టికెట్ మీద పోటీ చేసి విజయం సాధించారు. సత్తుపల్లిలో టీడీపీ గెలుపొందగా, మంథని, భూపాలపల్లి, కొత్తగూడెం, ఇల్లందు, పినపాకల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఖమ్మం ఉమ్మడి జిల్లా నుంచి కాంగ్రెస్, టీడీపీ నుంచి గెలిచిన వారితో పాటు భూపాలపల్లి , ఆసిఫాబాద్ నుంచి గెలిచిన గండ్ర వెంకట రమణారెడ్డి , ఆత్రం సక్కు కూడా తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇప్పుడు వారిలో ఆసిఫాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరిన ఆత్రం సక్కు మినహా మిగతా వారంతా బీఆర్‌ఎస్ తరఫున బరిలో నిలిచారు. ఆసిఫాబాద్‌లో టీఆర్‌ఎస్ నుంచి గతంలో ఓడిపోయిన కోవా లక్ష్మికే మరోసారి బీఆర్‌ఎస్ టికెట్ దక్కింది. ఈసారి సింగరేణి కార్మికులు సిట్టింగ్ ఎమ్మెల్యేలకే మద్దతు పలుకుతారా? కొత్త వారికి అవకాశం కల్పిస్తారా? అనేది చూడాలి. కాగా, మంథని, రామగుండం, మంచిర్యాల, భూపాలపల్లి నియోజకవర్గాల్లోనే బీజేపీ ప్రభావం కనిపిస్తోంది మిగిలిన చోట్ల ఆ పార్టీ పోటీ నామమాత్రంగానే ఉంది.

మిగతా హామీల సంగతేంటంటున్న కాంగ్రెస్, సీపీఐ

గత సింగరేణి ఎన్నికల్లో వారసత్వ ఉద్యోగాలతో పాటు కార్మికులు రాష్ట్రంలో ఎక్కడైనా సొంతిల్లు నిర్మించుకునేందుకు రూ.10లక్షల వడ్డీ లేని రుణం మంజూరు చేయిస్తామని బీఆర్‌ఎస్ నేతలు హామీ ఇచ్చా రు. కార్మికులకు ఆదాయపన్ను మినహాయింపు హామీని కూడా అమలు చేయిస్తామని చెప్పారు. గనుల్లో చనిపోయిన కార్మికులకు నష్ట పరిహారం రూ. 20 లక్షలకు పెంపు హామీ ఇంకా నెరవేరలేదు. భూగర్భ బొగ్గు గనులను ఓపెన్ కాస్ట్ గనులుగా మార్చడం, కొత్త గనులు తెరవకపోవడం, సింగరేణికి ప్రభుత్వ సంస్థలు రూ. వేల కోట్లు బాకీపడడం, సింగ రేణిలో పెరిగిన రాజకీయ జో క్యం, ప్రైవేటీకరణ వంటి అంశాలను కాంగ్రెస్, సీపీఐ తప్పు పడుతున్నాయి.

వారసత్వ ఉద్యోగాలపై బీఆర్‌ఎస్ ఆశలు

2017లో జరిగిన సింగరేణి ఎన్నికల్లో తమ కార్మిక సంఘం టీబీజీకేఎస్‌ను గెలిపిస్తే వారసత్వ ఉద్యోగాల కల్పనతో పాటు పలు హామీలు నెరవేరుస్తామని బీఆర్‌ఎస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో గెలిచిన వెంటనే తదనుగుణంగా పావులు కదిపి సింగరేణి కారుణ్య నియామకాల ఉత్తర్వులు తీసుకొచ్చింది. ఈ మేరకు ఇప్పటి వరకు 18వేల మందికి వారసత్వ ఉద్యోగాలు ఇప్పించినట్లు బీఆర్‌ఎస్ చెబుతోంది. ఎప్పుడో చంద్రబాబు హయాంలో 1998లో రద్దయిన వారసత్వ ఉద్యోగాల ప్రక్రియను పునః ప్రారంభించి, సింగరేణి కార్మికుల కలలను నెరవేర్చిన పార్టీ బీఆర్‌ఎస్ అని ఆపార్టీ ఎమ్మెల్యేలు చెపుతున్నారు. సింగరేణి కార్మికులకు ఇచ్చే క్వార్టర్స్ విషయంలో నిబంధనల సడలింపు, కాంట్రాక్టు కార్మికులకు మెరుగైన జీతాలు, మరమ్మతుల కల్పన, క్వార్టర్లకు ఏసీ సౌకర్యం కల్పన వంటివి అందించడంతో బీఆర్‌ఎస్ పట్ల సానుకూలత ఉందని తెలుస్తోంది. లాభాల వాటాను 16 శాతం నుంచి 23 శాతానికి పెంచుతామన్న హామీ నెరవేర్చడం, దసరా, దీపావళి పేరిట కార్మికులకు ఇచ్చే బోనస్, అడ్వాన్స్ పెంపు కూడా తమ విజయంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలు పూర్తిస్థాయిలో బీఆర్‌ఎస్ వెంట నడుస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి హైదరాబాద్
శుక్రవారం । 24 । నవంబర్ । 2023





సుల్తాన్‌పూర్ సభకు హాజరైన జనం



మీ కోసం నేను

మహేశ్వరం బీఆర్‌ఎస్ అభ్యర్థి సబితారెడ్డికి మద్దతుగా సుల్తాన్‌పూర్‌లో, మహిపాల్ రెడ్డికి మద్దతుగా పటాన్‌చెరులో గురువారం నిర్వహించిన బహిరంగ సభల్లో సీఎం కేసీఆర్ ప్రసంగించారు.




మీతో నేను

ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి మద్దతుగా గురువారం ఈసీఐఎల్ చౌరస్తాలో, మర్రి రాజశేఖర్‌రెడ్డికి మద్దతుగా మల్కాజిగిరిలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లలో మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని బీఆర్‌ఎస్ కార్యకర్తలకు, ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

షేర్ కౌన్?

శేరిలింగంపల్లిలో ముక్కోణపు పోటీ

- దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గం
- వ్యూహ ప్రతివ్యూహాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ
- హ్యాట్రిక్ విజయం సాధిస్తానంటున్న ఆరెకపూడి గాంధీ
- కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని జగదీశ్వర్ గౌడ్ ధీమా
- కమల వికాసం ఖాయమంటున్న రవికుమార్ యాదవ్



గచ్చిబౌలి: ఐటీ కంపెనీలకు నిలయంగా ఉన్న శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 29 రాష్ట్రాలకు చెందిన ఓటర్లు ఉన్నారు. టెకీలతో పాటు ఐటీ నిపుణులు, అక్షరాస్యుల సంఖ్య కూడా ఎక్కువే. 600కుపైగా ఐటీ కంపెనీలు వందలాది హోటళ్లు ఉన్నాయి. ఐటీ, ఐటీ ఆధారిత ఉద్యోగులు, ఆతిథ్య రంగంలోనూ ఉద్యోగులుగా ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఎక్కువగా ఉంటారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి, తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాలకు చెందిన వారు నియోజకవర్గంలో ఉన్నారు. దేశంలోని అన్ని భాషలు మాట్లాడే వారు, వివిధ రాష్ట్రాలకు చెందిన ఫుడ్ కోర్టులు ఉన్నాయి. భిన్న సంస్కృతులకు నిలయమైన శేరిలింగంపల్లి మినీ భారత్‌గా చెప్పవచ్చు. ఈ నియోజకవర్గంలో అభ్యర్థులే కాదు కుబేరులైన ఓటర్లకూ కొదవలేదు. పారిస్ నగరాన్ని తలపించే ఆకాశ హర్మ్యాలు, కేబుల్ బ్రిడ్జి, లింకు రోడ్లు, సెంట్రల్ యూనివర్సిటీ, నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, సైబరాబాద్ కమిషనరేట్, స్టార్ హోటళ్లకు కేంద్రం. నియోజకవర్గంలో 852 కాలనీలు ఉన్నాయి. 100కు పైగా స్లమ్స్ ఉన్నాయి. ఇప్పటికే కొన్ని స్లమ్స్ కాలనీలుగా రూపాంతరం చెందాయి. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి నుంచి ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య ముక్కోణపు పోటీ నెలకొంది. గెలుపు తమదంటే తమదంటూ మూడు పార్టీల అభ్యర్థులూ ధీమా వ్యక్తంచేస్తున్నారు. ఒక్కసారి ఈ నియోజవర్గంపై దృష్టి సారిస్తే..

అందరి చూపూ.. శేరిలింగంపల్లి వైపే

దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గాల్లో శేరిలింగంపల్లి ఒకటి. ఇక్కడ మొత్తం 7,32,506 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 3,88,482, మహిళలు 3,43,875, ఇతరులు 149 మంది ఉన్నారు. ఉత్తర భారతీయుల ఓట్లు దాదాపు లక్షన్నర ఉన్నట్లు అంచనా. సీమాంధ్రకు చెందిన దాదాపు 2 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. స్థానిక ఓటర్లు, మైనార్టీ ఓటర్లు భారీ సంఖ్యలో ఉన్నారు. భిన్న సంస్కృతులకు నిలయమైన శేరిలింగంపల్లిలో గెలిచేదెవరనే విషయంపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతోంది.

ఎవరి ధీమా వారిదే..

- బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ తన సామాజిక ఓటర్లతో పాటు, మైనార్టీ ఓటర్లపై నమ్మకం పెట్టుకున్నారు. ఆయన 2014లో టీడీపీ నుంచి 80 వేల మెజారిటీతో, 2018లో టీఆర్‌ఎస్ నుంచి 42 వేల ఓట్లతో గెలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్ మూడు సార్లు కార్పొరేటర్‌గా పని చేయడంతో మాదాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్లలో మంచి పట్టు ఉంది. ఆ రెండు డివిజన్లలోని మైనార్టీలు, తన సొంత సామాజికవర్గంతో పాటు మారిన పరిస్థితుల్లో సెటిలర్స్ ఓట్లపై నమ్మకం పెట్టుకున్నారు. బీజేపీ అభ్యర్థి ఎం.రవి కుమార్ యాదవ్ నార్త్ ఇండిన్స్ ఓట్లపై నమ్మకం పెట్టుకున్నారు. 50 వేలకు పైగా నార్త్ ఇండియన్స్ ఓట్లను ఎన్‌రోల్ చేయించారు. నార్త్ ఇండియన్స్‌తో పాటు తన సామాజిక వర్గం ఓట్లు, తన తండ్రి మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ అదనపు బలంగా చెప్పుకుంటున్నారు. అంతే కాకుండా తమిళ, కన్నడ ఓటర్లపై ఫోకస్ చేస్తున్నారు. ఎవరికి వారే గెలుపు తమనే వరిస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఢీ అంటున్న ముగ్గురు కుబేరులు

శేరిలింగంపల్లిలో పోటీ పడుతున్న ప్రధాన పార్టీలకు చెందిన ముగ్గురు అభ్యర్థులు కుబేరులే. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ రూ.44 కోట్ల స్థిరాస్తులు, కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్ తన పేరిట రూ.113 కోట్ల ఆస్తులు, బీజేపీ అభ్యర్థి ఎం.రవి కుమార్ యాదవ్ రూ.151 కోట్ల ఆస్తులున్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో చూపించారు. అభ్యర్థులు ప్రచారంలో పోటీ పడుతూ ఢీ అంటే ఢీ అన్నట్లు వ్యవహరిస్తున్నారు. రోడ్ షోలకు పోటీపడి జన సమీకరణ చేయడం గమనార్హం. పెద్ద నియోజకవర్గం కావడంతో అభ్యర్థుల ఖర్చు కూడా భారీ మొత్తంలో ఉంటుందనే చర్చ జరుగుతోంది. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై రోడ్ షోను బీజేపీ అభ్యర్థి ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ కేటీఆర్ రోడ్ షోలో భారీ జన సమీకరణ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్ రాహుల్ గాంధీ రోడ్ షో ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

హ్యాట్రిక్ ఖాయం..

తొమ్మిదిన్నర ఏళ్లలో వేల కోట్ల నిధులతో అభివృద్ధి చేశాను. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటాను. ప్రజలు నన్నే గెలిపిస్తారు. బీఆర్‌ఎస్ పార్టీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలకు మరింత చేరువయ్యాను.
– ఆరెకపూడి గాంధీ, బీఆర్‌ఎస్ అభ్యర్థి

కాంగ్రెస్ గాలి వీస్తోంది..

ప్రతిఫలం ఆశించకుండా 15 ఏళ్లుగా కార్పొరేటర్‌గా సేవలవందిస్తున్నాను. నా పని తీరు ఓటర్లకు తెలుసు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తోంది. శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం. వ్యవసాయ నుంచి ఐటీ రంగం వరకు జాతీయ విధానాలు తీసుకొచ్చిందే కాంగ్రెస్.
– జగదీశ్వర్ గౌడ్, కాంగ్రెస్ అభ్యర్థి

మోదీ సంస్కరణలే శ్రీరామ రక్ష

దేశంలో మోదీ సర్కార్ తీసుకొస్తున్న సంస్కరణలే దేశానికి శ్రీరామ రక్ష. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై మూడేళ్లుగా పోరాటం చేస్తున్నాం. మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి అదనపు బలం.
– ఎం.రవి కుమార్ యాదవ్, బీజేపీ అభ్యర్థి

గ్రేటర్‌లో 1.70 లక్షల మంది యువ ఓటర్లు



యంగ్ తరంగ్!

- తొలిసారి ఓటు వేసేందుకు ఉత్సాహం
- ఉద్యోగ అవకాశాలు, అభివృద్ధే వీరి ఎజెండా
- వీరిని ఆకట్టుకునేందుకు సోషల్ మీడియా వేదిక అభ్యర్థుల ప్రచారం
- హైదరాబాద్‌లో 77,522 : రంగారెడ్డిలో 92,540 తొలిసారి ఓటర్లు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో యంగ్ తరంగ్ ఓటు అనే వజ్రాయుధంతో దూసుకొస్తోంది. ఈ నెల 30న జరగనున్న శాసనసభ ఎన్నికలలో తొలిసారి ఓటు వేసేందుకు యువతరం ఉరకలేస్తోంది. వీరు ఎటు మొగ్గు చూపితే ఆ అభ్యర్థులే విజయం సాధిస్తారనడంలో సందేహం అక్కర్లేదు. అభ్యర్థులు నచ్చకపోతే నోటాను నొక్కే అవకాశం ఉండటంతో అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. ఉద్యోగ అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధే వీరి ప్రధాన ఎజెండా. దీంతో వీరిని ఆకట్టుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు సామాజిక మాధ్యమాల వేదికగా తెగ ప్రచారం చేస్తున్నాయి.

గ్రేటర్‌లో 1.70 లక్షల మంది ఓటర్లు..

రాష్ట్రంలో 18–19 ఏళ్ల మధ్య వయసు ఉన్న యువ ఓటర్లు 8,11,640 మంది ఉన్నారు. ఇందులో గ్రేటర్ వాటా 1.70 లక్షలు. అత్యధికంగా రంగారెడ్డిలో 92,540, హైదరాబాద్‌లో 77,522 మంది యువత రానున్న అసెంబ్లీ ఎన్నికలలో తొలిసారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గ్రేటర్‌లోని చాలా నియోజకవర్గాలలో ఈ తొలి ఓట్లే అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో కీలకంగా మారాయి.

ఉచిత విద్య, వైద్యానికే మొగ్గు..

మౌలిక సదుపాయల అభివృద్ధి, ఉద్యోగ అవకాశాల, జాబ్ కేలండర్‌లకు మేనిఫెస్టోలో ప్రాధాన్యం ఇచ్చిన పార్టీలకే యువతరం మొగ్గు చూపించే అవకాశాలున్నాయి. దీంతో పాటు ఉచిత విద్య, వైద్యం కల్పించే పార్టీలకు జైకొడతామని పేర్కొంటున్నారు. ప్రజాధనం దుర్వినియోగం, స్కామ్‌లు, అవినీతి వంటి వాటిపై సామాజిక మాధ్యమాల వేదికగా ప్రశ్నిస్తున్నారు. ఈ యువ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్టాగామ్ వంటి సామాజిక మాధ్యమాల వేదికగా షార్ట్ వీడియోలు, రీల్స్ చేస్తూ జోరుగా ప్రచారం చేస్తున్నాయి. బస్తీలు, కాలనీల్లోని యువ ఓటర్లను ఆకర్షించేందుకు క్రికెట్ కిట్లు, పండుగలకు సాంస్కృతిక కార్యక్రమాలు, యువతుల కోసం ఎలక్ట్రిక్ వాహనాలు, స్మార్ట్ వాచ్‌లు వంటివి పంపిణీ చేస్తున్నారు.



ఎల్‌బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీగౌడ్‌కు మద్దతుగా గురువారం రాత్రి వనస్థలిపురం రైతుబజారు వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

20,587 మంది సిద్ధం

- 4,947 మంది పీఓలు.. 802 ఎంఓలతో సహా
- హైదరాబాద్ జిల్లాలో ఎన్నిక నిర్వహణకు..

సాక్షి, సిటీబ్యూరో: వచ్చే గురువారం జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన సిబ్బందిని అధికారులు సిద్ధం చేశారు. హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 4,119 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. వీటిలో పోలింగ్ నిర్వహణకు పోలింగ్ ఆఫీసర్లు (పీఓ), అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు (ఏపీఓ), అదర్ పోలింగ్ ఆఫీసర్లు (ఓపీఓ), మైక్రో అబ్జర్వర్లు (ఎంఓ)గా విధులు నిర్వహించే అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ సిద్ధం చేశారు. అనుకోని పరిస్థితులు ఎదురైతే ప్రత్యామ్నాయంగా రిజర్వులో ఉంచిన అధికారులతో సహా మొత్తం 20,587 మందిని ఇందుకు సిద్ధంగా ఉంచారు.

నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు.. అధికారుల సంఖ్య ఇలా ఉంది.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	అధికారులు
ముషీరాబాద్	289	1405
మలక్‌పేట	300	1534
అంబర్‌పేట	239	1211
ఖైరతాబాద్	258	1286
జూబ్లీహిల్స్	352	1738
సనత్‌నగర్	229	1111
నాంపల్లి	285	1540
కార్వాన్	324	1576
గోషామహల్	235	1139
చార్మినార్	202	1031
చాంద్రాయణగుట్ట	321	1606
యాకుత్‌పురా	339	1719
బహదూర్‌పురా	288	1453
సికింద్రాబాద్	223	1091
కంటోన్మెంట్	235	1147



వీరిలో పీఓలు: 4,119
పీఓలు (రిజర్వు): 828
ఏపీఓలు: 4119
ఏపీఓలు (రిజర్వు): 828
ఓపీఓలు: 8238
ఓపీఓలు రిజర్వు: 1653
ఎంఓలు: 723
ఎంఓలు (రిజర్వు): 79



పటిష్ట భద్రత

ప్రతీ పోలింగ్ స్టేషన్ వద్ద మహిళా సిబ్బంది

- ఇప్పటికే పని చేస్తున్న 45 ఫ్లయింగ్ స్క్వాడ్స్
- అవసరమైన స్థాయిలో క్యూఆర్‌టీ బృందాలు
- అబ్జర్వర్లకు వివరించిన సిటీ పోలీసు కమిషనర్
- ఐసీసీసీలో సమీక్ష సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: ఓటింగ్ జరిగే రోజు ప్రతి పోలింగ్ స్టేషన్ వద్దా కచ్చితంగా మహిళా పోలీసులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి వచ్చిన ఎలక్షన్ అబ్జర్వర్లతో (జనరల్, పోలీసు, ఎక్స్‌పెండిచర్) గురువారం కొత్వాల్‌తో పాటు జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ భేటీ అయ్యారు. బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో ఈ సమావేశం జరిగింది. ఈ నేపథ్యంలో పోలీసు, జీహెచ్‌ఎంసీ, ఎన్నికల అధికారులు తాము తీసుకుంటున్న చర్యలను అబ్జర్వర్లకు వివరించారు. ఈసారి నిఘా కోసం ప్రత్యేక, అత్యాధునిక టెక్నాలజీ వాడుతున్నట్లు రోనాల్డ్ రాస్ వివరించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ స్టేషన్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నామని, ఈవీఎంలను తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. సుమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద కేంద్ర సాయుధ బలగాలను మోహరిస్తున్నామని కొత్వాల్ సందీప్ శాండిల్య పేర్కొన్నారు. వీటికి అదనంగా 391 రూట్ మొబైల్స్ ఏర్పాటు చేశామని, ఒక్కో దాంట్లో ఒక కానిస్టేబుల్‌తో పాటు ముగ్గురు సాయుధ బలగాల సిబ్బంది ఉంటారని వివరించారు.

129 పెట్రోలింగ్ వాహనాలు, 220 బ్లూకోల్ట్స్

- నగర కమిషనరేట్ పరిధిలో ఉన్న 129 పెట్రోలింగ్ వాహనాలు, 220 బ్లూకోల్ట్స్‌తో పాటు అదనంగా ఏర్పాటు చేసిన మరో 122 వాహనాలు క్షేత్ర స్థాయిలోనే ఉంటూ, డయల్–100కు వచ్చిన కాల్స్‌పై తక్షణం స్పందిస్తున్నారని అబ్జర్వర్లకు తెలిపారు. ప్రస్తుతం నగర వ్యాప్తంగా 45 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 45 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్‌తో పాటు అవసరమైన ప్రాంతాల్లో స్టాటిక్ పికెట్లు ఏర్పాటు చేశామని, ఇప్పటి కొన్నాళ్లుగా పని చేస్తున్నాయని వివరించారు. ఏడుగురు డీసీపీలు, 28 మంది ఏసీపీ స్థాయి అధికారులతో ఏర్పాటు చేస్తున్న స్ట్రైకింగ్ ఫోర్స్‌లు పోలింగ్‌కు నిర్ణీత కాలం ముందు నుంచే విధుల్లో ఉంటాయని సందీప్ శాండిల్య పేర్కొన్నారు.

- టాస్క్‌ఫోర్స్, స్పెషల్ ఫోర్సెస్‌కు చెందిన తొమ్మిదేసి బృందాలు, 71 మంది ఇన్‌స్పెక్టర్లు, 125 మంది సబ్–ఇన్‌స్పెక్టర్లతో కూడిన క్విక్ రెస్పాన్స్ టీమ్స్ (క్యూఆర్టీ) రంగంలోకి దిగనున్నాయని తెలిపారు. నగర వ్యాప్తంగా 144వ సెక్షన్ విధించడంతో పాటు ప్రతి ఒక్కరూ ఓటు వేసిన వెంటనే తిరిగి ఇళ్లకు వెళ్లేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఏ చిన్న ఉదంతం జరిగినా సత్వరం లేదా అవసరమైన స్థాయిలో స్పందించని అధికారులకు చర్యలు తీసుకుంటున్నామని కొత్వాల్ సందీప్ శాండిల్య స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు సీపీ (శాంతి భద్రతలు) విక్రమ్ సింగ్ మాన్, సంయుక్త సీపీ (స్పెషల్ బ్రాంచ్) పి.విశ్వప్రసాద్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సంయుక్త సీపీ (పరిపాలన) పరిమళ హన నూతన్, జీహెచ్‌ఎంసీలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్న ఐపీఎస్ అధికారి ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల పరిశీలకులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీపీ



మోదీ..షా

- గ్రేటర్‌లో బీజేపీ నేతల మకాం
- నేడు అమిత్‌షా.. రేపు మోదీ రాక
- ఇప్పటికే నగరంలో పలువురు కేంద్ర మంత్రులు
- శివారు నియోజక వర్గాలపై ఫుల్ ఫోకస్

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌పై బీజేపీ ఫుల్ ఫోకస్ పెట్టింది. సంస్థాగతంగా పార్టీకి గట్టిపట్టున్న కోర్ సిటీ సహా శివారు నియోజకవర్గాలపై దృష్టి సారించింది. ఎలాగైనా ఆయా స్థానాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలనే తపనతో.. వారి తరఫున ప్రచారం చేసేందుకు ఆ పార్టీ అగ్రనేతలు ఇక్కడికి క్యూ కడుతున్నారు. ఇప్పటికే పలువురు కేంద్ర మంత్రులు నగరంలో పర్యటిస్తున్నారు. బీజేపీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్నారు. తాజాగా శుక్రవారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, శనివారం ప్రధాని మోదీ నగరానికి చేరుకోనున్నారు. హోం మంత్రి అమిత్‌షా 25న ఉదయం 11.30 గంటలకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారు. అదే విధంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కూడా హైదరాబాద్ రానున్నారు. ఆయన ఉదయం 11 గంటలకు మేడ్చల్, కంటోన్మెంట్, కార్వాన్ నియోజకవర్గాల్లో నిర్వహించే బహిరంగ సభల్లో ఆయన పాల్గొననున్నారు. అదే విధంగా మధ్యాహ్నం 2.10 గంటలకు హోంమంత్రి అమిత్‌షా రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, అంబర్‌పేట నియోజకవర్గాల్లో రోడ్‌షో నిర్వహించనున్నారు. రాత్రి ఐటీసీ కాకతీయలో బస చేసి, 25న ఉదయం కొల్లాపూర్ వెళ్లనున్నారు. అటు నుంచి మునుగోడు, పటాన్‌చెరుకు వెళ్లనున్నారు. రాత్రి ఏడు గంటలకు ఖైరతాబాద్‌లో రోడ్‌షో నిర్వహించనున్నారు. అదే విధంగా 26న సాయంత్రం కూకట్‌పల్లిలో రోడ్‌షో నిర్వహించనున్నారు. 25న మహేశ్వరం నియోజకవర్గంలో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. సాయంత్రం ఐదు గంటలకు తుక్కుగూడ వేదికగా నిర్వహించే బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు. రాత్రి రాజ్‌భవన్‌లో బస చేయనున్నారు. ఆ తర్వాత వరుసగా రెండు రోజుల పాటు నగరంలో రోడ్డు షోలు నిర్వహించనున్నారు. 26న ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ కల్వకుర్తి నియోజకవర్గంలో పర్యటించనున్నారు.

రేపటి నుంచి తెలంగాణ అండర్‌-15 చెస్‌ టోర్నీ

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ రాష్ట్ర అండర్‌–15 చెస్‌ టోర్నమెంట్‌ ఈనెల 25, 26వ తేదీల్లో జరగనుంది. నిజాంపేట ప్రగతి నగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో ఈ టోర్నీని నిర్వహిస్తారు. టాప్‌–6లో నిలిచిన ప్లేయర్లు త్వరలో జరిగే జాతీయ అండర్‌–15 చెస్‌ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలంగాణ రాష్ట్ర చెస్‌ సంఘం అధ్యక్షుడు కేఎస్‌ ప్రసాద్‌ తెలిపారు. ఇతర వివరాలకు నిర్వాహకులను 7337578899, 7337399299 ఫోన్‌ నంబర్లలో సంప్రదించాలి.

మంత్రి సబితపై సీఎం ప్రశంసల వర్షం

- గర్వపడే మనిషి కాదు.. హుందాతనంతో ఉంటుంది
- ఆమెకు ప్రజా సేవ తప్ప మరో వ్యాపకం లేదు
- మంత్రి సబిత చుట్టే సీఎం కేసీఆర్‌ ప్రసంగం




సభకు హాజరైన వారికి అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్‌, చిత్రంలో మంత్రి సబిత ఇంద్రారెడ్డి, ఎంపీ రంజిత్‌ రెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా/ మహేశ్వరం: ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్‌ ప్రసంగం మహేశ్వరం బీఆర్‌ఎస్‌ అభ్యర్థి, మంత్రి సబితా ఇంద్రారెడ్డి చుట్టే కొనసాగింది. మంత్రి సబితపై సీఎం కేసీఆర్‌ ప్రశంసల వర్షం కురిపించారు. రాజకీయాల్లో ఆమెకు ఉన్న అనుభవం, మంత్రిననే గర్వం కనీసం లేకపోవడం, ఓ సామాన్య కార్యకర్తలా నిత్యం ప్రజలతోనే మమేకమై పోవడం, ఓపిక, హుందాతనం, అభివృద్ధి, ప్రజా సంక్షేమం పట్ల ఆమెకున్న నిబద్ధతే ప్రధాన అంశంగా సీఎం మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మహేశ్వరం నియోజకవర్గం సుల్తాన్‌పూర్‌లో మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధ్యక్షతన ‘ప్రజా ఆశీర్వాద సభ’ నిర్వహించారు. సుమారు 25 నిమిషాల పాటు తన ప్రసంగాన్ని కొనసాగించారు. తన ప్రసంగం మొత్తం మంత్రి సబిత చుట్టే కొనసాగించారు. సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరైన జనాన్ని చూసి సబిత గెలుపు ఖాయమైందని చెప్పారు. ఆమెకు భూదేవికున్నంత ఓపిక ఉందని, మంత్రిననే గర్వం కూడా తనలో కన్పించదని, ఓ సామాన్య కార్యకర్తల కష్టపడి పని చేస్తుందని, నియోజకవర్గం అభివృద్ధి తప్పా మరే ఇతర వ్యాపకాలు ఆమెకు లేవని సీఎం కొనియాడటంతో కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌ సహా మాజీ స్పీకర్‌ మధుసూదనాచారి, ఎంపీ రంజిత్‌రెడ్డి, జిల్లా పరిషత్‌ చైర్‌పర్సన్‌ తీగల అనితా హరినాథ్‌ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, మాజీ మేయర్‌ బొంతు రామ్మోహన్‌, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ ఆయాచితం శ్రీధర్‌, మీర్‌పేట్‌ మేయర్‌ దుర్గా దీప్‌లాల్‌ తదితరులు హాజరయ్యారు.

సంక్షేమం, అభివృద్ధి చూసి ఆదరించండి... మంత్రి సబితా ఇంద్రారెడ్డి

గడిచిన తొమ్మిదిన్నరేళ్ల కాలంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సంక్షేమ పథకాలను ప్రతి గడపకు అందించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఏ ఇంటి గడప తొక్కినా పార్టీలకతీతంగా ఆశీర్వదిస్తున్నారని తెలిపారు. నాలుగున్నరేళ్ల కాలంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌ నాయకత్వంలో నియోజకవర్గంలో రూ.2 వేల కోట్లకు పైబడి నిధులతో అభివృద్ధి చేశా నని గుర్తు చేశారు.

గెలుపు బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలి

కేంద్ర మంత్రి పీయూష్‌ గోయల్‌

రాజేంద్రనగర్‌ : రాజేంద్రనగర్‌ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌ రెడ్డిని గెలిపించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కేంద్ర మంత్రి పీయూష్‌ గోయల్‌ సూచించారు. గురువారం రాజేంద్రనగర్‌ ప్లాటినం హోటల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీజేపి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముఖ్య నేతలకు సూచించారు. గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలను తెలిపారు. మధ్యప్రదేశ్‌ ఇంచార్జ్‌ మురళిధరరావు, స్థానిక కార్పొరేటర్‌ సంగీతా గౌరి శంకర్‌, డాక్టర్‌ ప్రేమ్‌రాజ్‌, శ్రీధర్‌, కోమురయ్య, మల్లేష్‌ పాల్గొన్నారు.



కేంద్ర మంత్రిని సన్మానిస్తున్న అత్తాపూర్‌ కార్పొరేటర్‌ సంగీతా గౌరిశంకర్‌ తదితరులు

కాప్రా వరకు మెట్రో ఏర్పాటు

మల్లాపూర్‌ రోడ్‌ షోలో మంత్రి కేటీఆర్‌




మల్లాపూర్‌ రోడ్‌ షోలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్‌

మల్లాపూర్‌: నగరంలో 35 ఫ్లై ఓవర్లు మనం పూర్తి చేసుకుంటే.. ఒక్క జాతీయ రహదారిని పూర్తి చేయలేని బీజేపీ నాయకులు సిగ్గు..శరం లేకుండా ఓట్లు అడగటానికి వస్తున్నారని మంత్రి కేటీఆర్‌ విమర్శించారు. ఉప్పల్‌ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి మద్దతుగా మల్లాపూర్‌లో గురువారం రోడ్‌ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్‌ మాట్లాడుతూ..రానున్న రోజుల్లో రూ. 20 వేల కోట్లతో ఉప్పల్‌లో మూసీనది పక్షాళన, అండర్‌ డ్రైనేజీ, వరద నీటి కాలువలు, ఉప్పల్‌, హబ్సిగూడ, మల్లాపూర్‌, కాప్రా, ఈసిఐఎల్‌ వరకు మెట్రో ఏర్పాటు చేసుకుందామన్నారు. రూ.400కే గ్యాస్‌ సిలిండర్‌, సౌభాగ్యలక్ష్మి పేరుతో 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు రూ.3 వేలు, ప్రతి కుటుంబానికి సన్న బియ్యం, కేసీఆర్‌ బీమా ఏర్పాటు చేసుకుందామన్నారు. 55 ఏళ్లు కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చినా కరెంట్‌ కష్టాలు ఉండేవన్నారు. హైదరాబాద్‌ నగరం బాగుండాలంటే బలమైన నాయకత్వం, స్థిరమైన ప్రభుత్వం ఉండాలని పేర్కొన్నారు. బండారి లక్ష్మారెడ్డి గెలుపు 100 శాతం పక్కా అన్నారు. ఉప్పల్‌ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌ రెడ్డి, మాజీ ఎంబీసీ కార్పొరేషన్‌ చైర్మన్‌ తాడూరి శ్రీనివాస్‌, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్‌, శాంతి సాయిజెన్‌శేఖర్‌, బన్నాల గీతా ప్రవీణ్‌, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనకరంగా చిన్నారుల్లో ఎదుగుదల లోపాలు

పోషకాహార సదస్సులో వైద్య నిపుణులు



సదస్సులో పాల్గొన్న వైద్య నిపుణులు

సాక్షి, సిటీబ్యూరో: చిన్నారుల్లో ఎదుగుదల లోపాలు ఆందోళనకర స్థాయికి చేరాయని వైద్య నిపుణులు అభిప్రాయపడ్డారు. వైద్య పరిశోధనలు, ఆవిష్కరణలకు పేరొందిన అబ్బోట్ ఆధ్వర్యంలో బేగంపేట్‌లోని తాజ్‌ వివంతా హోటల్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. పోషకాహారలోపం చిన్నారుల్లో ఎదుగుదలపై ప్రభావం చూపుతున్న అంశంపై నిర్వహించిన ఈ సమావేశంలో అమెరికాకు చెందిన పీడియాట్రిక్‌ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్‌ పెడ్రో అలార్కన్‌ మాట్లాడుతూ.. ఎదుగుదల లోపాలపై తల్లిదండ్రుల్లో అవగాహన పెరగాలన్నారు. పోషకాహార సప్లిమెంట్స్‌లో కొన్ని వెలితిని పూడ్చేవి కాగా కొన్ని ఆహారం ద్వారా వచ్చే పోషకాలను శరీరానికి వంటబట్టించేవి కూడా ఉన్నాయన్నారు. అబ్బోట్‌ వైద్య పరిశోధన విభాగానికి చెందిన డా. గణేష్‌ కాథె మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఐదేళ్ల లోపు చిన్నారుల్లో 149 మిలియన్ల మంది ఎదుగుదల లోపాలు కనిపిస్తున్నాయని తేలిందన్నారు. దీన్ని నివారించడానికి మాక్రో న్యూట్రియంట్స్‌, మైక్రో న్యూట్రియంట్స్‌ సరైన మేళవింపుతో ఆహారాన్న చిన్నారులకు అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. యశోద ఆసుపత్రికి చెందిన పీడియాట్రిక్స్‌ విభాగ వైద్యులు డా.డి.రమేష్‌ మాట్లాడుతూ నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ న్యూట్రిషన్‌ (ఎన్‌ఐఎన్‌) తాజా అధ్యయనం ప్రకారం రాష్ట్రంలోని నగరాల్లో 33.8 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో 33శాతం మంది చిన్నారుల్లో ఎదుగుదల లోపాలు ఉన్నట్టు తేలిందన్నారు. పండ్లు, 5రకాల కూరగాయలు, ప్రొటీన్‌, పాలు సంబంధిత ఉత్పత్తులు, తృణ ధాన్యాలు మేళవింపుతో ఆహారాన్ని చిన్నారులకు అలవాటు చేయడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చునన్నారు. సమావేశంలో పలువురు వైద్య, పోషకాహార నిపుణులు పాల్గొన్నారు.

మోదీ జీ ఆగయా...



ఎల్‌బీనగర్‌లో బీజేపీ నేతలు, కార్యకర్తలు వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మోదీ కటౌట్‌ను చేతబూని..డప్పులు వాయిస్తూ గల్లీల్లో తిరుగుతూ ‘మోదీ జీ ఆగయా..జర దేఖో... బీజేపీకి ఓటేయండి’ అంటూ ఓటర్లను ఆకర్షిస్తున్నారు.

నగరంలో వర్షం



సాక్షి, సిటీబ్యూరో : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో హైదరాబాద్‌ నగరంలో వర్షం కురిసింది. గురువారం ఉదయం ఒకేసారి వాతావరణంలో మార్పు తో కొద్దిసేపు పడిన వర్షం ఆ తర్వాత రోజంతా ఆగుతూ.. కురుస్తూ రాత్రి ఏడు గంటల తర్వాత జోరందుకుంది. ఏకధాటిగా పడిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఫలితంగా పలు చోట్ల ట్రాఫిక్‌ స్తంభించిపోయింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకునేందుకు గంటల తరబడి సమయం పట్టింది. ముఖ్యంగా దిల్‌సుఖ్‌నగర్‌, మలక్‌పేట, కోఠి, అబిడ్స్‌,ఫిల్మ్‌నగర్‌, బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌, అమీర్‌పేట్‌, లక్డీకాపూల్‌, రామంతాపూర్‌, తార్నాక, సికింద్రాబాద్‌, ఖైరతాబాద్‌, పంజాగుట్ట, ఎర్రగడ్డ, మోహిదీపట్నం, కూకట్‌పల్లి, పటాన్‌ చెరుతోపాటు ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. నగరంలో మరో మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది.

డిసెంబర్‌ 1 నుంచి ఎస్‌బీఐ మెగా ప్రాపర్టీ షో



సుల్తాన్‌బజార్‌: దేశవ్యాప్తంగా 23 బ్రాంచీలతో తన ఉనికితో పాటు హోమ్‌ లోన్‌ వ్యాపారంలో 6.80 ట్రిలియన్‌ మార్కును స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా అధిగమించిందని తెలంగాణ శాఖ చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌ రాజేష్‌కుమార్‌ అన్నారు. ఈ మేరకు గురువారం కోఠిలోని స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా హైదరాబాద్‌ సర్కిల్‌ ఆవరణలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో డిసెంబర్‌ 1, 2, 3 తేదీలలో హైటెక్స్‌లో జరిగే మెగా ప్రాపర్టీ షో ప్రచార రథాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 26 సెంట్రల్‌ ప్రాసెసింగ్‌ సెంటర్ల ద్వారా హైదరాబాద్‌ సర్కిల్‌లో రూ.75 వేల కోట్ల కంటే హోమ్‌లోన్‌ పోర్ట్‌ పోలియో ఉందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రంలో రూ.9300 కోట్ల రూపాయాల మొత్తంలో రూ.20,636 గృహ రుణాలు, టాప్‌ అప్‌ లోన్లను బ్యాంకు మంజూరు చేసిందన్నారు.

ప్రపంచ విధాన సదస్సులో తెలంగాణ వాసి

లక్డీకాపూల్‌ : విభిన్న అంశాలపై దుబాయిలో నిర్వహించిన ప్రపంచ విధాన సదస్సులో తెలంగాణ వాసి, సోషల్‌ ఎంట్రప్రెన్యూర్‌ మను మల్లిఖార్జున్‌ పాల్గొన్నారు. దుబాయిలో బుధవారం జరిగిన ఈ సదస్సులో తెలంగాణ ఉద్యమ నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్‌ మల్లిఖార్జున్‌ తనయుడితో పాటు పశ్చిమ బెంగాల్‌ మాజీ గవర్నర్‌ ఎంకే నారాయణన్‌ తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఏఐ, గ్లోబల్‌ హెల్త్‌, ఆహార భద్రత, ఉక్రెయిన్‌ యుద్ధం తదితర సమస్యలపై చర్చించారు.

ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్లు!

- ముగిసిన 'అనుసంధాన' ప్రక్రియ
- ఖైరతాబాద్‌లో 'నోటా'తో కలిపి మొత్తం 26 బ్యాలెట్ పేపర్లు
- మొత్తం విధానాన్ని పరిశీలించిన అధికారులు
- విజయవంతంగా మాక్ పోలింగ్ నిర్వహణ
- అభ్యర్థుల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రం


ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్లు లోడ్ చేస్తున్న ఖైరతాబాద్ ఎన్నికల అధికారులు

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గంలో పోటీలో ఉన్న 25 మంది అభ్యర్థులు, నోటాతో కలిపిన బ్యాలెట్ పేపర్లను ఈవీఎంల లోకి లోడ్ చేసే ప్రక్రియను గురువారం ఎన్నికల అధికారులు పూర్తి చేశారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో ఇప్పటికే భద్రపరిచిన ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్ల అనుసంధాన ప్రక్రియను ముగించారు. అభ్యర్థుల క్రమ సంఖ్యలతో కూడిన బ్యాలెట్ పేపర్లను ఈవీఎంలలో లోడ్ చేసిన అనంతరం భారీ పోలీసు బందోబస్తు మధ్య ఖైరతాబాద్ రిటర్నింగ్ అధికారి వెంకటేష్ ధోత్రే, సహాయ రిటర్నింగ్ అధికారులు ప్రశాంతి, అనితారెడ్డి, సంపత్ తదితరులు ఒక్కో అభ్యర్థి పేరు మీద క్లిక్ చేసిన అనంతరం వాటిని చెక్ చేసుకొని అనంతరం జీరో వచ్చేదాకా చూసి వాటిని సీల్ చేశారు.


ఈవీఎంలకు వీవీ ప్యాట్లు అనుసంధానిస్తున్న సిబ్బంది

మాక్ పోలింగ్ నిర్వహించిన అధికారులు వివిధ రాజకీయ పార్టీల తరఫున పోటీ చేసిన అభ్యర్థులు వారి ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను క్లియర్ చేసి సీల్ చేసిన అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. నియోజకవర్గంలో 25 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. నోటాతో కలిపి 26 క్రమసంఖ్యలను బ్యాలెట్ పేపర్‌లో ఏర్పాటు చేశారు. వీటిని కూడా అభ్యర్థులు, ప్రతినిధులు సరిగా ఉన్నాయో లేవో చెక్ చేసుకున్నారు.


చెక్ చేసిన అనంతరం ఈవీఎంను సీల్ చేస్తున్న దృశ్యం

258 పోలింగ్ స్టేషన్లు.. 2,96,106 మంది ఓటర్లు

ఖైరతాబాద్ నియోజకవర్గంలో పెరిగిన ఓటర్లకు అనుగుణంగా అదనంగా 13 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయగా ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో మొత్తం 258 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఇందుకుగాను 516 బ్యాలెట్ యూనిట్లు అవసరంకాగా రిజర్వ్‌లో మరికొన్నింటిని కలిపి మొత్తం 645 బ్యాలెట్ యూనిట్లు వచ్చాయి. అలాగే 258 కంట్రోల్ యూనిట్లు అవసరం కాగా రిజర్వ్‌తో కలిసి మొత్తం 323 సరఫరా అయ్యాయి. వీవీ ప్యాట్లు 258 అవసరం కాగా రిజర్వ్‌లో ఉంచే క్రమంలో మొత్తం 362 ఇక్కడ భద్రపరిచారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,96,106 ఉంది.

నీటి నాణ్యతపై తనిఖీలు


వినాయకనగర్‌బస్తీలో నీటి నాణ్యతను పరిశీలిస్తున్న జలమండలి జీఎం హరిశంకర్

ఫిలింనగర్: నీటి సరఫరా వేళల్లో నీటి నాణ్యతా పరిశీలన కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నామని జలమండలి డివిజన్-6 జీఎం హరిశంకర్ అన్నారు. గురువారం ఫిలింనగర్‌లోని బాల్‌రెడ్డినగర్, వినాయకనగర్ ప్రాంతాల్లో పర్యటించి నీటి శాంపిల్స్‌ను సేకరించి నాణ్యతను పరిశీలించారు. నీటి సరఫరా వేళల్లో ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించాలన్న జలమండలి ఎండి దాన కిషోర్ ఆదేశాల మేరకు తాము ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు హరి శంకర్ తెలిపారు. నీటి సరఫరా వేళల్లో పర్యటిస్తే సమస్యలను గుర్తించడంతో పాటు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని ఆయన అన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం: అజహరుద్దీన్


ప్రచారం నిర్వహిస్తున్న అజహరుద్దీన్, నవీన్‌యాదవ్


రహమత్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న కర్ణాటక మంత్రి ఇతర ప్రముఖులు

శ్రీనగర్‌కాలనీ: కాంగ్రెస్ పాలనలోని తెలంగాణ వచ్చిందని, తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం పోరాడే పార్టీ కాంగ్రెస్ పార్టీలని, కాంగ్రెస్‌కు ఓటు వేసి నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభ్యర్థి మహమ్మద్ అజహరుద్దీన్ అన్నారు. గురువారం యూసుఫ్‌గూడ, శ్రీనగర్‌కాలనీ, రహమత్‌నగర్‌లలో నియోజకవర్గ ఇంచార్జ్ నవీన్‌యాదవ్‌తో కలిసి ప్రచారం చేశారు. జూబ్లీహిల్స్ అంటే సంపన్నులుంటారని అనుకుంటారని, కానీ ఇక్కడ పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలే అధికంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటువేస్తే బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి, నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. నేతలు భవానీశంకర్, కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

కర్ణాటక మంత్రుల ప్రచారం...

రహమత్‌నగర్‌లో కర్ణాటక మంత్రి కేజే జార్జ్, ఏఐసీసీ మైనార్టీ వైస్ చైర్మన్ అనిల్ ఎన్ థామస్, రాజ్యసభ ఎంపీ జేసుదాస్ సేలం, మాజీ ఎంఎల్‌సీ డిసౌజాలో పాటు స్థానిక నేతలు కాంగ్రెస్ పార్టీకి ఓటువేయాలని ప్రచారాన్ని నిర్వహించారు.

కాంగ్రెస్ విజయం తథ్యం: సర్వే

హిమాయత్‌నగర్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సర్వే సత్యనారాయణ అన్నారు. అధిష్ఠానం దళితుడిని ముఖ్యమంత్రి చేయాలని కోరారు. ఈ విషయంపై త్వరలో సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంకలను కలిసి ఒప్పిస్తానన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నలుగురు ఉప ముఖ్యమంత్రులతో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అద్భుతంగా పరిపాలిస్తున్న విధంగానే తెలంగాణలో దళితుడిని సీఎం చేసి, ఇతర సామాజిక వర్గాల వారిని ఉప ముఖ్యమంత్రులుగా చేయాలన్నారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సోనియాగాంధీ వల్లే తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. తెలంగాణ ఇచ్చినందుకు కతజ్ఞతగా ఈ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. భట్టి విక్రమార్కకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉందని, దామోదర రాజనర్సింహ కూడా సీఎం రేసులో ఉన్నారన్నారు.

ఇరానీ ఛాయ్.. మస్తుంది భాయ్

ప్రచారంలో పాల్గొన్న గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్


వెంకటేశ్వరనగర్‌లో చాయ్ తాగుతున్న గోవా సీఎం ప్రమోద్ సావంత్

వెంకటేశ్వరకాలనీ: ఖైరతాబాద్ బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డిని గెలిపించాలంటూ గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కోరారు. గురువారం వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లో అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డితో కలిసి ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను స్థానికులకు తెలియజేశారు. అనంతరం ఆయన ఓ ఇరానీ టీ కొట్టు వద్ద ఛాయ్ తాగి సందడి చేశారు.

బీఆర్‌ఎస్‌ను నమ్ముకుంటే నట్టేట ముంచింది: నవీన్‌యాదవ్


నవీన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఎరుకల ప్రజా సేవాసంఘం నేతలు

వెంగళరావునగర్: పదేళ్ల పాటు బీఆర్‌ఎస్ పార్టీని నమ్ముకున్న ప్రజానీకాన్ని నట్టేట ముంచిందని కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి వి.నవీన్‌యాదవ్ అన్నారు. గురువారం నవీన్‌యాదవ్ కార్యాలయంలో ఆయన సమక్షంలో ఎరుకల ప్రజా సేవా సంఘం నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నవీన్‌యాదవ్ మాట్లాడుతూ... ఎరుకల సంఘాన్ని బీఆర్‌ఎస్ చాలా నిర్లక్ష్యం చేయడమే కాకుండా చిన్నపాటి స్కీములను కూడా ఇవ్వకుండా మోసం చేసిందని విమర్శించారు.

ముస్లింల సంక్షేమానికి కృషి

జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి


ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: బీజేపీని గెలిపిస్తే కులమతాలకు అతీతంగా పనిచేస్తామని, ముఖ్యంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ముస్లింలకు అండగా ఉంటూ వారి సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తామని బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి అన్నారు. గురువారం శ్రీనగర్‌కాలనీ, వెంగళరావునగర్, ఎర్రగడ్డలలో ప్రచారాన్ని నిర్వహించారు. బీఆర్‌ఎస్ అన్ని వర్గాలను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో విఫలమైందని, కేవలం పథకాలతో కాకుండా వారికి ఉపాధి అవకాశాలను కల్పించలేదన్నారు. ముఖ్యంగా యువత నిరుద్యోగ సమస్యలతో సతమతమవుతున్నారని ఆరోపించారు. బీజేపీ తెలంగాణలో అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. నియోజకవర్గంలో చాలా సమస్యలున్నాయని, రాచరికం పోవాలంటే బీజేపీ రావాలన్నారు. కార్యక్రమంలో నేతలు కిలారి మనోహర్, కుంబాల గంగరాజు, ప్రేమ్‌కుమార్, అట్లూరి రామకృష్ణ, బంగారు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కుటుంబ పాలన త్వరలో అంతం: తుమ్మల



వెంగళరావునగర్: తెలంగాణలో నిశబ్ద విప్లవం వచ్చిందని, త్వరలోనే సీఎం కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతాన్ని ప్రజలు పాడబోతున్నారని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మధురానగర్ కాలనీ సమీపంలోని వెస్ట్ శ్రీనివాస్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ... ఆకు రౌడీలకు ప్రజలు భయపడే ప్రసక్తేలేదని, ఈ నెల 30న అలాంటి వారికి తగిన గుణపాఠం చెప్పబోతున్నారని స్పష్టం చేశారు. తెలంగాణలో నివసించే ప్రతి ఒక్కరిదీ అని... ఈ తెలంగాణ కేసీఆర్ ఆయన కుటుంబీకుల జాగీరు కాదని అన్నారు. దేశవ్యాప్తంగా ఎంతో మంచి పేరు సంపాదించిన టీం ఇండియా మాజీ సారథి, మాజీ ఎంపీ మహమ్మద్ అజహరుద్దీన్‌ను రాహుల్‌గాంధీ జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబెట్టారని, ఆయనకు మనమంతా వెన్నుదన్నుగా నిలబడి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అభ్యర్థి అజహరుద్దీన్‌తోపాటు నియోజకవర్గ ఇన్‌చార్జి నవీన్‌యాదవ్, కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, పార్టీ సీనియర్ నేత భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మాలల మద్దతు కాంగ్రెస్‌కే: చెన్నయ్య



బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి భారీ మెజార్టీతో గెలిపిద్దామని ఆమెకు అండగా నిలబడదామని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య పిలుపునిచ్చారు. గురువారం బంజారాహిల్స్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. దళితుల అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేసింది కాంగ్రెస్ మాత్రమే అని స్పష్టం చేశారు. ఆ పార్టీకి మాలలంతా అండగా నిలబడాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్ మన్నె శ్రీధర్‌రావు, బూర్గుల వెంకటేశ్వర్లు, కరణం కిషన్, బల్వంతరావు, బత్తుల రాంప్రసాద్, గడ్డం శ్రీనివాస్, భానుప్రకాశ్ పాల్గొన్నారు.

చంద్రమోహన్‌కు నివాళి



సాక్షి, సిటీబ్యూరో: దివంగత నటుడు చంద్రమోహన్ సంస్మరణ సభ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ క్లబ్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. చంద్రమోహన్ మేనల్లుడు, ప్రముఖ నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్, చంద్రమోహన్ సతీమణి జలంధర, పెద్ద కుమార్తె మధుర, రెండో కుమార్తె మాధవి, మనువరాళ్లు చిన్మయి, శ్రీకర, నిర్మాత ఆదిశేషగిరిరావు, దర్శక-నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, గాయకుడు ఎస్పీ చరణ్, దర్శకులు రేలంగి నరసింహారావులు చంద్రమోహన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

దళిత బహుజన పార్టీ అభ్యర్థులను గెలిపించండి

లిబర్టీ: పేద దళిత జనుల సమస్యలు పరిష్కారం కావాలంటే దళిత బహుజనులను చట్టసభల్లోకి పంపించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వి.కృష్ణస్వరూప్, జాతీయ ఉపాధ్యక్షుడు సి.యాదగిరి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఓటర్లు రాజకీయ పార్టీల తాయిలాలకు లొంగకుండా నిజమైన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపిస్తే చట్టసభల్లో ప్రజల వాదాన్ని వినిపిస్తారన్నారు. గురువారం పార్టీ అభ్యర్థుల కరపత్రాన్ని వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రధాన రాజకీయ పార్టీలైన బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌ల అభ్యర్థులను ఓడించాలని కోరారు. డబ్బు, మద్యానికి తలొగ్గకూడదని విజ్ఞప్తి చేశారు. ముషీరాబాద్ అభ్యర్థి శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

రియల్టర్ ఇంట్లో చోరీ

వెంగళరావునగర్: పెళ్లికి వెళ్లి వచ్చేలోపు రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇంట్లో చోరీ జరిగిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసుల సమాచారం మేరకు... మధురానగర్‌కాలనీలో నివసించే వై.శ్రీరాఘవ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. నెల కిందట బంగారం, డైమండ్స్ తదితర వస్తువులు తన అల్మారాలో ఉంచి తాళాలు వేశాడు. ఈ నెల 23న వివాహానికి హాజరు కావానికి వెళ్లాడు. తిరిగి వచ్చి అల్మారాను చెక్ చేసుకోగా అతని వస్తువులు కనిపించలేదు. తన వద్ద పని చేసే రాములు అనే వ్యక్తిపై అనుమానం ఉందని, దాదాపు దాదాపు రూ. 5 లక్షలు ఖరీదు చేసే 20 తులాలు బంగారు, డైమండ్స్ వస్తువులు దొంగిలించాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఐక్యతతోనే బీసీలకు రాజ్యాధికారం


మాట్లాడుతున్న బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు కుమారస్వామి

లిబర్టీ: అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలు ఐక్యంగా ఉండి తమ అభ్యర్థులను గెలిపించాలని.. అప్పుడే బీసీలకు రాజ్యాధికారం దక్కుతుందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుంద్రు కుమారస్వామి పిలుపునిచ్చారు. విడిపోతే పడిపోతాం ఐక్యంగా ఉంటే బీసీలదే విజయమని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లు, పార్టీ శ్రేణులకు విన్నవించారు. వివిధ రాజకీయ పార్టీలు చేస్తున్న హామీలు వాగ్దానాలకు మోసపోకుండా బీసీలు ఐక్యంగా ఉండి సంఘటిత శక్తిని ప్రదర్శించాలని విజ్ఞప్తి చేశారు. వివిధ రాజకీయ పార్టీలు ఇస్తున్న హామీలకు మోసపోతే మళ్లీ ఐదు సంవత్సరాలు అభివృద్ధి వెనక్కి పోతుందని స్పష్టం చేశారు. ఆర్థిక సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుకబాటుకు గురవుతున్న బీసీల సమస్యలు పరిష్కారం కావాలంటే బీసీ అభ్యర్థులను చట్టసభల్లోకి పంపిస్తే తమ వాణిని వినిపిస్తారని తెలిపారు.

మహిళా సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం


మాట్లాడుతున్న ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్

ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్


భార్య అనితతో కలిసి నినాదాలు చేస్తున్న దానం

వెంకటేశ్వరకాలనీ: ఇంకో రెండు మూడు రోజుల్లో ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ఓట్లు కొనుగోలు చేసేందుకు వస్తారని మహిళలు అప్రమత్తంగా ఉండి వారిని తరిమికొట్టాలని కేసీఆర్ సర్కార్‌లో ఇతర పార్టీలకు చోటు లేదని ముఖం మీదే కడిగేయాలని ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ సూచించారు. జూబ్లీహిల్స్ డివిజన్ మహిళా ఆత్మీయ సమ్మేళనం గురువారం బంజారాహిల్స్‌లోని లేక్‌వ్యూ బంజారాలో జరిగింది. ఈ సమావేశంలో దానం మాట్లాడుతూ... ఈ సభను చూస్తుంటే లేచింది మహిళా లోకం అనే పాట గుర్తుకొస్తున్నదని ఆ స్థాయిలో తన గెలుపు కోసం ఇంత మంది రావడం ఆనందంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే రూ. 400లకే సిలిండర్, కేసీఆర్ భరోసా, సౌభాగ్యలక్ష్మి పథకం, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, పెన్షన్ల పెంపు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, గృహలక్ష్మి పథకం అమలవుతాయని రెట్టింపు లబ్ధి పొందేది మహిళలేనని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ మహిళలపైనే ఎన్నో ఆశలు పెట్టుకొని వారి సంక్షేమం కోసమే ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టారని వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత మహిళలదేనని అన్నారు. కొన్ని పార్టీల అభ్యర్థులు అహంకారంతో పొగరుబోతుతనంతో నేనే గొప్ప అనే రీతిలో ప్రవర్తిస్తున్నారని చరిత్రలో ఇలాంటి వారు పైకొచ్చిన దాఖలాలు ఎక్కడా లేవన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.5లోని దేవరకొండ బస్తీలో ఇంటింటి ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బొట్టు పెట్టి.. ఓటుఅడిగి...

భర్త గెలుపు కోసం దానం అనిత ప్రచారం


బొట్టు పెట్టి ఓటు అభ్యర్థిస్తున్న అనిత

బంజారాహిల్స్: ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మరోసారి ఈ ఎన్నికల్లో కూడా ఓటు వేసి గెలిపించాలని ఆయన సతీమణి దానం అనిత మహిళలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె గురువారం పలువురు మహిళలను ప్రత్యేకంగా కలిసి బొట్టు పెట్టి ఓటును అభ్యర్థించారు. ఆయన ప్రచారానికి మహిళల నుంచి మంచి స్పందన లభించింది.

బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలు



బంజారాహిల్స్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పోతలు మల్లేష్ ఆధ్వర్యంలో ఆ పార్టీకి చెందిన సుమారు 50 మంది గురువారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. స్థానిక నేతలు అనిల్, సురేష్ నాగన్న, చిన్నా, బాలస్వామి, నరేష్, శివ, సాయి తదితరులు పార్టీలో చేరారు.

నాన్న పీజేఆర్ ఆదర్శంగా ప్రజాసేవ చేస్తా

- అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి ఎలా ఉండాలో చేసి చూపిస్తా
- ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా
- ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి


చేయి గుర్తుకు ఓటు వేయాలని వృద్ధురాలి చేయి కలిపిన విజయారెడ్డి


మంగళ హారతులతో విజయారెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళ

హిమాయత్‌నగర్: దివంగత కాంగ్రెస్ నేత, తన నాన్న పి.జనార్దన్‌రెడ్డి (పీజేఆర్) ఆదర్శంగా ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.విజయారెడ్డి అన్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉండి, సంక్షేమ పథకాలు అమలయ్యేలా చేస్తానన్నారు. ఈ మేరకు గురువారం హిమాయత్ నగర్ డివిజన్‌లోని దత్త నగర్, జనార్దన్ బాడ, చంద్రానగర్, చాంది నగర్, ఓల్డ్ కమేలా ప్రాంతాలలో ఇంటింటికీ తిరిగి స్థానికులను కలిసి హస్తం గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ... ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులు కావాలా, ఎన్నికలప్పుడు మాత్రమే ఓట్ల కోసం వచ్చే నాయకులు కావాలా ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. ఎన్నికలు వచ్చాయని ఓట్ల కోసం, మరొకసారి ప్రజలను మోసం చేయడానికి వచ్చే నాయకులకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రూ. 500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని, 200 యూనిట్ల వరకు కరెంటు ఉచితంగా ఇస్తామని విజయారెడ్డి స్పష్టం చేశారు. పేదలందరికీ కాంగ్రెస్ హయాంలోనే న్యాయం జరిగిందని గుర్తు చేశారు. సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం విడుదల చేసిన ఆరు గ్యారంటీల కరపత్రం ద్వారా ప్రజలకు వివరించామన్నారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు, పలు డివిజన్ల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు, బస్తీ వాసులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యువర్స్

● సక్సెస్ స్టోరీ

ఆర్ట్ ఆఫ్ జోష్



సౌరవ్ జోషి

'ఈ పనికి నేను తగను' అనుకునే వాళ్లు కొందరు. 'తగ్గేదే ల్యా' అని ముందుకు వెళ్లే వాళ్లు కొందరు. రెండో వర్గం వారికి తమ దారిలో అవరోధాలు ఎదురు కావచ్చు. అయితే వారిలోని ఉత్సాహ శక్తి ఆ అవరోధాలను అధిగమించేలా చేసి విజేతను చేస్తుంది. సౌరవ్ జోషి ఈ కోవకు చెందిన కుర్రాడు. 24 సంవత్సరాల జోషి ఫోర్బ్స్ 'టాప్ డిజిటల్ స్టార్స్-2023'లో చోటు సంపాదించాడు...

జోషి స్వస్థలం ఉత్తరాఖండ్‌లోని ఆల్మోర. హరియాణాలోని హన్సిలో ఫైన్ ఆర్ట్స్‌లో డిగ్రీ చేశాడు. తండ్రి కార్పెంటర్. తల్లి గృహిణి. ఇంటర్మీడియెట్‌లో 'సౌరవ్ జోషి ఆర్ట్స్' పేరుతో యూట్యూబ్ చానల్ ప్రారంభించాడు. ఈ చానల్‌లో తన స్కెచ్-మేకింగ్ వీడియోలను పోస్ట్ చేసేవాడు.

తొలి రోజుల్లో 'హౌ ఐ డ్రా యంఎస్ ధోనీ' టైటిల్‌తో ఒక వీడియోను అప్‌లోడ్ చేశాడు. మొదట్లో పెద్దగా స్పందన కనిపించలేదు. అయితే లాక్‌డౌన్ టైమ్‌లో ఈ వీడియో పాపులారిటీ ఎక్కడికో వెళ్లిపోయింది. ఈ ఉత్సాహంతో '365 వీడియోస్ ఇన్ 365 డేస్' ఛాలెంజ్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు జోషి. ఈ చాలెంజ్ అతడి జీవితానికి టర్నింగ్ పాయింట్‌గా మారింది. సౌరవ్ జోషిని డిజిటల్ స్టార్‌ను చేసింది. ఏ వీడియో చేసినా లక్షల సంఖ్యలో వ్యూస్ రావడం మొదలైంది. పన్నెండు మిలియన్‌ల సబ్‌స్క్రైబర్‌లతో జోషి చానల్ 'ఫాస్టెస్ట్-గ్రోయింగ్ యూట్యూబ్ చానల్' జాబితాలో చేరింది. ఇక వెనక్కి తిరిగి చూసుకోలేదు జోషి.

జోషి కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండేది. 'సౌరవ్ జోషి ఆర్ట్స్'తో దేశ వ్యాప్తంగా పేరు తెచ్చుకోవడమే కాదు కుటుంబ ఆర్థిక పరిస్థితినీ మెరుగుపరిచాడు జోషి.

'ఇప్పటికీ ఇది నిజమా? కలా? అని అనుకుంటాను. మొదట్లో వీడియోలు అప్‌లోడ్ చేసినప్పుడు ఎవరూ పట్టించుకునేవారు కాదు. చాలా నిరాశగా అనిపించేది. 365 డేస్ ఐడియా నా జీవితాన్నే మార్చేసింది' అంటాడు జోషి. షేడింగ్ టిప్స్ ఫర్ బిగినర్స్, హౌ టూ డ్రా ఏ పర్‌ఫెక్ట్ ఐ, హౌ టూ యూజ్ చార్‌కోల్ పెన్సిల్, డ్రాయింగ్ టూల్స్ ఫర్ బిగినర్స్... ఒకటా రెండా జోషి చానల్‌కు సంబంధించి ఎన్నో వీడియోలు పాపులర్ అయ్యాయి. ఎంతోమందిని ఆర్టిస్ట్‌లను చేశాయి.

'మీరు వయసులో నా కంటే చాలా చిన్నవాళ్లు. నేను అప్పుడెప్పుడో బొమ్మలు వేసేవాడిని. ఆ తరువాత ఉద్యోగ జీవితంలో పడి డ్రాయింగ్ పెన్సిల్‌కు దూరమయ్యాను. మీ వీడియోలు చూసిన తరువాత మళ్లీ పెన్సిల్, పేపర్ పట్టాను. నేను మళ్లీ ఆర్టిస్ట్‌గా మారడానికి మీరే కారణం' .....ఇలాంటి కామెంట్స్‌తో పాటు 'ఇది ఎందుకూ పనికి రాని వీడియో'లాంటి ఘాటైన కామెంట్స్ కూడా ప్రేక్షకుల నుంచి వస్తుంటాయి.

అయితే ప్రశంసలకు అతిగా పొంగిపోవడం, విమర్శలకు కృంగిపోవడం అంటూ జోషి విషయంలో జరగదు.

రెండిటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళుతున్నాడు. ఆర్ట్‌లోనే కాదు ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్లోనూ దూసుకుపోతున్నాడు సౌరవ్ జోషి.




ఒక్క ఐడియా చాలు

మనం వెళ్లగానే 'సక్సెస్' వచ్చి షేక్‌హ్యాండ్ ఇవ్వాలనుకుంటాం. అది జరగకపోయేసరికి నిరాశ పడతాం. 'ఇది మనకు వర్కవుట్ అయ్యేట్లు లేదు' అని వెనక్కి వెళ్తాం. సక్సెస్ కావడానికి, కాకపోవడానికి అదృష్టం ప్రమేయం ఎంత మాత్రం ఉండదు. మన టాలెంట్ మీద మనకు ఎంత నమ్మకం ఉంది, విజయం కోసం ఎదురుచూడడంలో ఎంత ఓపిక ఉంది అనే దానిపైనే మన విజయం ఆధారపడి ఉంటుంది. అందరిలాగే నేను కూడా మొదట్లో బాగా నిరాశపడిపోయాను. అయితే వెనక్కి మాత్రం పోలేదు. మరో సారి ట్రై చేసి చూద్దాం...అని ఒకటికి రెండు ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో ఒక ఐడియాతో నా జీవితమే మారిపోయింది.

- సౌరవ్ జోషి

● అవును... ఇది నిజమే!

ఈ ఊరోళ్లు భూగర్భంలో ఉంటారు!



ఆస్ట్రేలియాలోని కూబర్ పెడీ టౌన్ భూగర్భ నివాసాలకు ప్రసిద్ధి చెందింది. వాతావరణ ప్రతికూల పరిస్థితుల వల్ల ఈ వోపల్ మైనింగ్ టౌన్‌లో 2,500 మంది భూగర్భ గృహాల్లో నివసిస్తున్నారు. ఈ నివాసాలను 'డగౌట్స్' అంటారు. ఈ చిన్న పట్టణం పర్యాటక ప్రాంతంగా మారింది. ఈ టౌన్ అందాలు ఫైర్ ఇన్ ఇది స్టోన్, గ్రౌండ్ జీరో, ది బ్లడ్ ఆఫ్ హీరోస్, స్టార్స్ ఆన్ మార్స్...మొదలైన హాలీవుడ్ సినిమాల్లో కనిపిస్తాయి.

● టెక్.. టాక్

మోటోరోలా మోటో జీ54



డిస్‌ప్లే: 6.50 అంగుళాలు వోఎస్: ఆండ్రాయిడ్ 13
రిజల్యూషన్: 1080×2400 పిక్సెల్స్ బ్యాటరీ: 6000 ఎంఏహెచ్
మెమోరీ: 128జీబి 8జీబి ర్యామ్/256జీబి 8జీబి ర్యామ్/ 256 జీబి 12జీబి ర్యామ్

ల్యాప్‌టాప్ మానిటర్ స్క్రీన్‌లైట్ బార్



బ్రాండ్: టిక్‌జేర్
కలర్: బ్లాక్
డైమెన్షన్స్: 8.5డీ×33 డబ్ల్యూ×3. 3 హెచ్ సెంటీమీటర్స్
స్పెషల్ ఫీచర్: స్మార్ట్ టచ్ సెన్సర్
● అడ్జస్టబుల్ ● యాంటీగ్లేర్

వన్‌ప్లస్ ఏఐ మ్యూజిక్ స్టూడియో



టెక్ దిగ్గజం వన్‌ప్లస్ 'వన్‌ప్లస్ ఏఐ మ్యూజిక్ స్టూడియో'ను లాంచ్ చేసింది. ఈ ఏఐ టూల్‌తో యూజర్‌లు తమ సొంత మ్యూజిక్‌ను క్రియేట్ చేసుకోవచ్చు. ఇమెయిల్ అడ్రస్‌ను ఉపయోగించి యూజర్‌లు సైనప్ కావచ్చు. ఇందులో హిప్-హప్, ర్యాప్... మొదలైన జానర్స్ ఉంటాయి. ఈ ఏఐ టూల్‌తో తమదైన స్టైల్‌తో కంపోజర్‌లుగా మారవచ్చునని చెబుతుంది వన్‌ప్లస్. యూజర్‌లు తమ కంపోజిషన్‌లను సోషల్ మీడియాలో షేర్ చేసుకోవచ్చు.

మ్యూజిక్ వీడియో క్రియేట్ చేయడానికి...
● క్రియేట్ మ్యూజిక్-క్లిక్ చేసి మీకు కావాల్సిన జానర్‌ను ఎంచుకోవాలి ● లిరిక్స్ క్రియేట్ చేయడానికి ....ప్రొసీడ్ ప్రొవైడ్-క్లిక్ చేయాలి ● 2-3 నిమిషాల్లో లిరిక్స్ అందుబాటులోకి వస్తాయి.
● ఇప్పుడు మ్యూజిక్‌తో కూడిన వీడియోను క్రియేట్ చేయవచ్చు
● క్రియేట్ చేసిన వీడియోను డౌన్‌లోడ్ చేసుకొని సోషల్ మీడియాలో షేర్ చేయవచ్చు.

యూట్యూబ్ న్యూ జెన్ ఏఐ టూల్



టెక్స్ట్, ప్రాంప్ట్స్ హమ్మింగ్‌తో మ్యూజిక్ ట్రాక్స్ క్రియేట్ చేసే సరికొత్త జెన్ ఏఐ టూల్‌ను యూట్యూబ్ పరీక్షిస్తోంది. ఈ టూల్ ద్వారా మన ఆలోచనలు, ఐడియాలను మ్యూజిక్‌లోకి తీసుకెళ్లవచ్చు. చార్లీ పుత్, డెమీ లోవటో, జాన్ లెజెండ్‌లాంటి తొమ్మిది మంది ఆర్టిస్ట్‌లు ఈ ప్రాజెక్ట్‌లో భాగం అవుతున్నారు. 'ఆర్టిస్ట్‌లు, సాంగ్ రైటర్‌లు, ప్రొడ్యూసర్‌ల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌తో యూజర్‌లకు నచ్చే ఏఐ టూల్‌కు రూపకల్పన చేసే ప్రయత్నంలో ఉన్నాం' అంటుంది కంపెనీ.

English Idioms

ఎల్బో గ్రీజ్

ఒక పనికి సంబంధించి ఎక్కువ కష్టపడాలి, మరింత శ్రద్ధ పెట్టాలి...అని చెప్పే సందర్భంలో వాడే మాట...ఎల్బో గ్రీజ్.

ఉదా: నథింగ్ వుడ్ షిఫ్ట్ ఇట్ హౌవెవర్ మచ్ ఎల్బో గ్రీజ్ వుయ్ యూజ్‌డ్

ఏ బ్యాడ్ హెయిర్ డే

'ఇవ్వాళ నా గ్రహచారం బాగలేదు. ఏది చేసినా కలిసి రావడం లేదు, అన్నీ నష్టాలే, ఇబ్బందులే'...అనుకునే సందర్భాలు ఉంటాయి. ఇలాంటి సమయంలో ఉపయోగించే మాట ఏ బ్యాడ్ హెయిర్ డే.

ఉదా: యెస్టర్‌డే, మై మామ్ వాజ్ హ్యావింగ్ ఏ బ్యాడ్ హెయిర్ డే. సో ఐ డిసైడెడ్ టు షో హర్ మై రిపోర్ట్ కార్డ్ దిస్ ఈవెనింగ్.

● మ్యూజిక్ వరల్డ్

చిన్న వయసులోనే తల్లి నుంచి సంగీతం నేర్చుకుంది షల్మాలీ ఖోల్గాడే. ఆమె తల్లి ఉమా ఖోల్గాడే శాస్త్రీయ గాయని. ప్రసిద్ధ రంగస్థల కళాకారిణి. యూఎస్‌లో వోకల్ మ్యూజిక్ కోర్సు చేసిన షల్మాలీ బాలీవుడ్ సినిమా 'ఇష్క్‌జాదే'లో పరేషాన్ పాటతో బాగా పాపులర్ అయింది.

స్వర సందడి



షల్మాలీ ఖోల్గాడే

బెస్ట్ ఫిమేల్ ప్లేబ్యాక్ సింగర్‌గా ఫిల్మ్‌ఫేర్ అవార్డ్ అందుకుంది.

'గతంలో పోల్చితే చాలామంది గాయకులు తమ స్వరాలకు తామే పాట రాసుకుంటున్నారు. గొంతు ఇస్తున్నారు. ఆ పాటల్లో ఒక్క పాట హిట్ అయినా అవకాశాలు మన అడ్రస్ వెదుక్కుంటూ వస్తాయి. కోవిడ్‌కు ముందు కోవిడ్ తరువాత సంగీతాన్ని గురించి చెప్పుకోవాలంటే కోవిడ్ విరామంలో చాలామంది తమ నైపుణ్యాన్ని మెరుగు పరుచుకున్నారు. ఆడియో వోటీటీకి ఆదరణ పెరగడం శుభపరిణామం. మ్యూజిక్ అంటే ఫిల్మ్ మ్యూజికే కాదు అనే విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. ఇండిపెండెంట్ మ్యూజిక్‌కు కూడా మంచి ఆదరణ ఉంది' అంటుంది షల్మాలీ ఖోల్గాడే.

సినిమా


మెగా 156 షురూ



● చిరంజీవి

చిరంజీవి హీరోగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న 'మెగా 156'(వర్కింగ్ టైటిల్) సినిమా రెగ్యులర్ షూటింగ్ షురూ అయింది. యువీ క్రియేషన్స్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మారేడుమిల్లిలో మొదలైంది. ముందుగా చిరంజీవి పాల్గొనని సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట మేకర్స్. అతి త్వరలోనే ఈ సెట్స్‌లో చిరంజీవి పాల్గొంటారని సమాచారం. ఫాంటసీ అడ్వెంచరస్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'విశ్వంభర' టైటిల్ అనుకుంటున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాకు సంగీతం: ఎమ్ఎమ్ కీరవాణి, కెమెరా: ఛోటా కె.నాయుడు.

తప్పు చేస్తే ఎవరు ప్రశ్నిస్తారు?



● నాగచైతన్య

''నూట ముప్పై ఎనిమిది కోట్ల జనాన్ని కాపాడుతున్న ఈ జ్యుడీషియల్ సిస్టమ్, పొలిటీషియన్స్ అండ్ పోలీస్... తప్పు చేస్తే వీళ్లను ఎవరు ప్రశ్నిస్తారు? అది మేము.. జర్నలిస్ట్స్'' అనే డైలాగ్‌తో మొదలవుతుంది 'ధూత' వెబ్‌సిరీస్ ట్రైలర్. నాగచైతన్య నటించిన ఈ తొలి వెబ్‌సిరీస్‌కు విక్రమ్ కె.కుమార్ దర్శకత్వం వహించారు. ఇందులో జర్నలిస్ట్ సాగర్ పాత్రలో నటించారు నాగచైతన్య. పోలీసాఫీసర్ క్రాంతిగా నటి పార్వతి, జర్నలిస్ట్ అమృతగా ప్రాచీ దేశాయ్, మరో కీలక పాత్రలో ప్రియాభవానీ శంకర్ నటించారు. శరత్ మరార్ నిర్మించిన ఈ వెబ్‌సిరీస్ డిసెంబరు 1 నుంచి అమెజాన్‌లో స్ట్రీమింగ్ కానుంది. గురువారం (నవంబరు 23) నాగచైతన్య బర్త్ డే సందర్భంగా 'ధూత' ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''భిన్న కోణాలున్న సాగర్‌లాంటి పాత్రలో నటించడం సవాల్‌గా అనిపించింది'' అన్నారు నాగచైతన్య. ''ధూత' అంటే 'ది మెసెంజర్'. సాగర్‌కి తెలిసిన, ప్రేమించిన అందర్నీ అతని గతం వెంటాడుతుంటుంది. ఎలా అనేది 'ధూత'లో చూడండి'' అన్నారు విక్రమ్ కె.కుమార్.

ఎన్నాళ్లకెన్నాళ్లకు!



● కమల్ హాసన్, రజనీకాంత్

భారతీయ చిత్ర పరిశ్రమలో తమదైన క్రేజ్, ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు హీరోలు రజనీకాంత్, కమల్ హాసన్. కెరీర్ ప్రారంభంలో వీరిద్దరూ కలిసి నటించి అభిమానులను అలరించిన సంగతి తెలిసిందే. దాదాపు 21 సంవత్సరాల తర్వాత వీరిద్దరూ ఒకే స్టూడియోలో కలిసిన ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. అయితే రజనీ-కమల్ కలిసి ఒకే సినిమాలో నటించడం లేదు. కానీ, వారి వారి చిత్రాల షూటింగ్స్ ఒకే స్టూడియోలో జరుగుతుండటంతో ఇలా కలిశారు. శంకర్ దర్శకత్వంలో కమల్‌హాసన్ హీరోగా నటిస్తున్న 'ఇండియన్ 2' మూవీ చిత్రీకరణ చెన్నైలోని ప్రసాద్ స్టూడియో ఎరీనాలో జరుగుతోంది. ఈ స్టూడియో ఆవరణలోనే రజనీకాంత్ హీరోగా జ్ఞానవేల్ దర్శకత్వం వహిస్తున్న 'తలైవర్ 170' షూటింగ్ జరుగుతోంది. 'తలైవర్ 170' షూటింగ్ స్పాట్‌కి వెళ్లి రజనీకాంత్‌కి సర్‌ప్రైజ్ ఇచ్చారు కమల్‌హాసన్. 21 సంవత్సరాల తర్వాత ఒకే స్టూడియోలో వీరిద్దరి మూవీస్ షూటింగ్స్ జరుపుకోవటం, అక్కడ వీరు కలుసుకోవడంతో గత స్మృతులను నెమరువేసుకున్నారు. 2002లో రజనీకాంత్ 'బాబా', కమల్‌హాసన్ 'పంచ తంత్రం' చిత్రాల షూటింగ్స్ ఒకే చోట జరిగినప్పుడు వారిద్దరూ కలుసుకున్నారు.

యుద్ధవీరుడు.. పరమ భక్తుడు



● 'కన్నప్ప'లో మంచు విష్ణు

మంచు విష్ణు టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మోహన్‌బాబు, మోహన్‌లాల్, శరత్ కుమార్, శివ రాజ్‌కుమార్, ప్రభాస్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీ 80 శాతం చిత్రీకరణ న్యూజిలాండ్‌లోనే జరగనుంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ అక్కడే జరుగుతోంది. గురువారం (నవంబరు 23) మంచు విష్ణు బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమాలోని విష్ణు ప్రీ లుక్ తరహా పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. 'ది బ్రేవెస్ట్ వారియర్.. ది అల్టిమేట్ డివోటీ' (గొప్ప యుద్ధవీరుడు.. పరమ భక్తుడు) అనే క్యాప్షన్ పోస్టర్‌పై ఉంది. ''మహాశివుడి ప్రియ భక్తుడైన కన్నప్పను తెరపైకి తీసుకొచ్చేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం'' అని మంచు విష్ణు పేర్కొన్నారు. అవా ఎంటర్‌టైన్‌మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకంపై మోహన్‌బాబు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు కెమెరా: షెల్డన్ చౌ.

నాకు డ్యాన్స్ చేయాలనిపించింది

- చిరంజీవి



● చిరంజీవి, రోషన్

''బబుల్‌గమ్' సినిమాలోని 'ఇజ్జత్..'పాట చాలా హుషారుగా అనిపించింది. శ్రీచరణ్ పాకాల చక్కని సంగీతం అందించారు. 'ఇజ్జత్..' అనే ర్యాప్ సాంగ్‌లో రోషన్‌తో కలసి డ్యాన్స్ చేయాలనిపించింది. ప్రతి క్లబ్, పబ్, యూత్ వేడుకల్లో ఈ పాట మార్మోగుతుంది'' అని హీరో చిరంజీవి అన్నారు. రోషన్ కనకాల, మానస చౌదరి జంటగా రవికాంత్ పేరేపు దర్శకత్వం వహించిన చిత్రం 'బబుల్‌గమ్'. మహేశ్వరి మూవీస్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 29న రిలీజ్ కానుంది. శ్రీచరణ్ పాకాల సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ఇజ్జత్..' పాటను చిరంజీవి రిలీజ్ చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ పాటకి ఎం.ఎస్. హరి సాహిత్యం అందించగా, రోషన్ కనకాల, ఎం.ఎస్. హరి పాడారు.

క్లైమాక్స్ కొత్తగా ఉంటుంది

- శ్రీకాంత్ ఎన్.రెడ్డి

వైష్ణవ్ తేజ్, శ్రీలీల జంటగా శ్రీకాంత్ ఎన్.రెడ్డి దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఆదికేశవ'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. శ్రీకాంత్ ఎన్. రెడ్డి మాట్లాడుతూ-''హైదరాబాద్‌కి చెందిన ఓ కుర్రాడు అనంతపురం సమీపంలోని కళ్యాణదుర్గం బ్రహ్మసముద్రం అనే గ్రామంలో జరుగుతున్న దారుణాలను ఎలా అడ్డుకున్నాడు? అన్నదే ఈ సినిమా కథాంశం. మూవీ ప్రారంభమైన 10 నిమిషాలకే వైష్ణవ్‌తేజ్ పాత్రతో ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. సినిమాలోని చివరి 45నిమిషాల సన్నివేశాలు మరింత ఆసక్తికరంగా, క్లైమాక్స్ కొత్తగా ఉంటుంది. బడ్జెట్, పారితోషికం.. ఇలాంటి అంశాలను పట్టించుకోకుండా నా దృష్టంతా సినిమాపై కేంద్రీకృతమయ్యేలా చేసిన నాగవంశీగారికి థ్యాంక్స్. జీవీ ప్రకాష్ కుమార్ మంచి సంగీతం ఇచ్చారు'' అన్నారు.





● తరుణ్ భాస్కర్, చైతన్యారావు

వినోదాల పారిజాతం

సునీల్, చైతన్యా రావు, శ్రద్ధా దాస్, మాళవిక సతీశన్ ప్రధాన పాత్రల్లో సంతోష్ కంభంపాటి దర్శకత్వం వహించిన చిత్రం 'పారిజాత పర్వం'. మహీధర్ రెడ్డి, దేవేష్ నిర్మించిన ఈ సినిమా కాన్సెప్ట్ టీజర్‌ను దర్శకుడు-నటుడు తరుణ్ భాస్కర్ విడుదల చేసి, ''టీజర్ ఆసక్తిగా ఉంది.. సినిమా విజయం సాధించాలి. చైతన్యా రావు, హర్ష ప్రయాణం స్ఫూర్తిగా ఉంటుంది'' అన్నారు. ''క్రైమ్ కామెడీ చిత్రమిది. సూపర్‌హిట్ అవుతుందన్న నమ్మకం ఉంది'' అన్నారు చైతన్యా రావు. ''కిడ్నాప్ అనేది నేరం. కానీ, మా మూవీలో అది ఓ కళ. ఎలా అనేది మూవీలో చూడాలి'' అన్నారు సంతోష్ కంభంపాటి. ఈ కార్యక్రమంలో మాళవిక సతీశన్, పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి మాట్లాడారు. ఈ సినిమాకు సహ నిర్మాత: అనంత సాయి.

రాజకీయాలతో సంబంధం లేదు

- తేజా మార్ని



''ప్రస్తుత రాజకీయాలకు, 'కోట బొమ్మాళి పీఎస్' సినిమా కథకు ఎటువంటి సంబంధం లేదు. కాకపోతే ఈ మూవీలో ఎన్నికల గురించి, ఓటు విలువ గురించి చర్చించాం. వ్యవస్థ, మనం ఎలా అవినీతిమయమై ఉన్నాం అనేది ఈ చిత్రంలో చెబుతున్నాం. ఈ మూవీకి ఏ పొలిటికల్ ఎజెండా లేదు'' అని డైరెక్టర్ తేజా మార్ని అన్నారు. రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ జంటగా శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్ కుమార్ కీలకపాత్రల్లో నటించిన చిత్రం 'కోటబొమ్మాళి పీఎస్'. 'బన్నీ' వాస్, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా తేజా మార్ని మాట్లాడుతూ-''వ్యవస్థలో ఉన్న వాళ్లు అదే వ్యవస్థకు బలైతే ఎలా ఉంటుంది? అనే కథని జనాలకు చెప్పాలనిపించింది. కోటబొమ్మాళి అనే ఊరిలో ఉప ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో ఏం జరిగింది? అది ముగ్గురు పోలీస్ అధికారుల జీవితాలను ఎలా మార్చింది? అనేది ఈ చిత్ర కథ. మలయాళ హిట్ 'నాయట్టు' కి ఇది తెలుగు రీమేక్ అయినా తెలుగుకి తగ్గట్టు మార్పులు చేశాం. శ్రీకాంత్, వరలక్ష్మిగార్ల పాత్రలు పోటాపోటీగా ఉంటాయి. రాహుల్, శివాని చక్కగా నటించారు. నిర్మాతలు వాసు, విద్యగార్లు ఎక్కడా రాజీపడలేదు. 'లింగిడి లింగిడి..' పాట వల్లే మా సినిమా గురించి అందరికీ తెలిసింది'' అన్నారు.

రెండుగంటలు నవ్వుతూనే ఉంటారు

- సంజయ్ శేరి



''అమాయకులైన తండ్రీ కొడుకుల బంధం నేపథ్యంలో జరిగే కథే 'సౌండ్ పార్టీ'. ఈ పాత్రలకి శివన్నారాయణ, సన్నీ కరెక్ట్‌గా సరిపోయారు. నా నిజ జీవితంలోని అనుభవాల నుంచి వినోదాత్మకంగా ఈ చిత్ర కథను రాశాను. ఈ సినిమాతో రెండు గంటలపాటు ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు'' అని డైరెక్టర్ సంజయ్ శేరి అన్నారు. వీజే సన్నీ, హ్రితికా శ్రీనివాస్ జంటగా శివన్నారాయణ కీలక పాత్రలో నటించిన చిత్రం 'సౌండ్ పార్టీ'. జయ శంకర్ సమర్పణలో ఫుల్ మూన్ మీడియాపై రవి పొలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు సంజయ్ శేరి మాట్లాడుతూ-''మాది కామారెడ్డి. పూరి జగన్నాథ్‌గారిని స్ఫూర్తిగా తీసుకొని డైరెక్టర్ కావాలనుకున్నా. దర్శకులు మారుతి, సంపత్ నందిగార్ల వద్ద రచనా విభాగంలో పనిచేశా. జయశంకర్ ద్వారా నిర్మాతలకు 'సౌండ్ పార్టీ' కథ వినిపించాను.. వారికి నచ్చడంతో వెంటనే ఈ ప్రాజెక్ట్ ఆరంభించాం. శివ కార్తికేయన్‌గారితో ఓ సినిమా చేయాలని ఉంది'' అన్నారు.

సాక్షి బిజినెస్

శుక్రవారం
24-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 5	66,018
నిఫ్టీ ▽ 10	19,802

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	14,266	△ 66
డోజోన్స్	35,273	▽ 185
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,484	△ 14
డాక్స్	15,995	△ 37
షాంఘై	3,062	△ 18
నికాయ్	33,452	△ 98

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	61,394 ▽ 222
బంగారం (99.5 స్వచ్ఛత)	61,148 ▽ 221
వెండి (కిలో)	73,065 ▽ 400

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒక్కటి	82.53	84.20
£	బ్రిటన్ పౌండ్	ఒక్కటి	102.55	105.90
€	యూరో	ఒక్కటి	89.35	92.43
¥	జపాన్ ఎన్ (100)	ఒక్కటి	62.71	64.78
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒక్కటి	53.43	55.78
S$	సింగపూర్ డాలర్	ఒక్కటి	61.81	63.86
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.27	22.89
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.79	23.59
¥	చైనా యువాన్	పదింటికి	10.55	12.62

ఏటా 10 శాతం చొప్పున జీవితాంతం

- డిసెంబర్‌లో ఎల్‌ఐసీ కొత్త ప్లాన్
- మూడు–నాలుగు కొత్త పాలసీలకు ప్రణాళికలు



న్యూఢిల్లీ: జీవిత బీమా రంగ దిగ్గజం ఎల్‌ఐసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడు నుంచి నాలుగు వరకు నూతన పాలసీలను ఆవిష్కరించనుంది. నూతన వ్యాపార ప్రీమియంలో రెండంకెల వృద్ధిని సాధించాలనే లక్ష్యంతో ఉంది. ''గతేడాదితో పోలిస్తే రెండంకెల వృద్ధిని సాధిస్తాం. ఎందుకంటే ఇండివిడ్యువల్ రిటైల్ వ్యాపారం పుంజుకుంటున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఆకర్షణీయమైన కొత్త పాలసీలను ఆవిష్కరించనున్నాం''అని ఎల్‌ఐసీ చైర్మన్ సిద్ధార్థ మహంతి తెలిపారు. డిసెంబర్ మొదటి వారంలో ఎల్‌ఐసీ ఒక ఉత్పత్తిని తీసుకువస్తుందని వెల్లడించారు. దీనితో మార్కెట్లో మంచి స్పందన వస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. డిసెంబర్‌లో తెచ్చే నూతన పాలసీ గురించి వివరిస్తూ.. పాలసీ మెచ్యూరిటీ తర్వాత (గడువు ముగిసిన అనంతరం) జీవితాంతం ఏటా సమ్ అష్యూర్డ్‌లో (బీమా కవరేజీలో) 10 శాతం చొప్పున లభిస్తుందని తెలిపారు. ఇది మార్కెట్లో సంచలనాన్ని సృష్టిస్తుందన్నారు. 20–25 ఏళ్ల తర్వాత ఎంత చొప్పున వస్తుంది, ఎంత ప్రీమియం చెల్లించాలన్నది తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపిస్తారని పేర్కొన్నారు. ఈ ప్లాన్‌పై రుణ సదుపాయం, ముందస్తు ఉపసంహరణకూ అవకాశం ఉంటుందన్నారు. హామీతో కూడిన రాబడులు ఇచ్చే పాలసీలకు పాలసీదారులు, వాటాదారులు ఆసక్తి చూపిస్తున్నారని చెబుతూ.. తమ కంపెనీ వాటాదారుల్లో చాలా మంది పాలసీదారులుగా ఉన్నట్టు మహంతి తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో (ఏప్రిల్–సెప్టెంబర్) నూతన వ్యాపార ప్రీమియం (ఇండివిడ్యువల్) 2.65 శాతమే వృద్ధి చెంది రూ.25,184 కోట్లకు చేరుకోవడం గమనార్హం.

అమెజాన్‌తో వాణిజ్య శాఖ ఒప్పందం

చిన్న సంస్థలకు ఎగుమతులపై శిక్షణ



న్యూఢిల్లీ: దేశీయంగా 20 జిల్లాల్లోని చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్‌ఎంఈ) శిక్షణ కల్పించే దిశగా ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్‌తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ వెల్లడించింది. దీని ప్రకారం ఈ–కామర్స్ మాధ్యమం ద్వారా ఎగుమతులను ప్రోత్సహించే దిశగా ఇమేజింగ్, డిజిటల్ క్యాటలాగ్‌లను రూపొందించడం, పన్నుల సంబంధమైన అంశాలను తెలుసుకోవడం మొదలైన వాటికి ఈ శిక్షణ ఉపయోగపడగలదని పేర్కొంది. ఎగుమతుల హబ్‌లుగా గుర్తించిన జిల్లాల్లో అమెజాన్, డీజీఎఫ్‌టీ కలిసి శిక్షణ, వర్క్‌షాప్‌లను నిర్వహిస్తాయి. ఇతర జిల్లాల్లోనూ ఇదే తరహా కార్యక్రమాల కోసం ఫ్లిప్‌కార్ట్, ఈబే, రివెక్సా, షిప్‌రాకెట్, షాప్‌క్లూస్ వంటి వివిధ ఈ–కామర్స్ సంస్థలతో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) చర్చలు జరుపుతున్నట్లు వాణిజ్య శాఖ ఒక ప్రకటనలో వివరించింది. ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా దేశీ సంస్థలు అంతర్జాతీయంగా మరిన్ని ఎగుమతి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ ఒప్పందాలు ఉపయోగపడతాయి. 2030 నాటికి ఈ–కామర్స్ ద్వారా 350 బిలియన్ డాలర్ల విలువ చేసే ఉత్పత్తులను ఎగుమతి చేయాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకోవాలని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్‌ఐ) ఇటీవల ఒక నివేదికలో పేర్కొంది. ప్రస్తుతం ఇవి 2 బిలియన్ డాలర్లుగా మాత్రమే ఉన్నాయి. ఎగుమతులను సరళతరం చేయడం, 2025 నాటికి ఈ–కామర్స్ ఎగుమతులను 20 బిలియన్ డాలర్లకు చేర్చడంపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు అమెజాన్ ఇండియా డైరెక్టర్ భూపేన్ వాకంకర్ తెలిపారు.

ఇరెడా ఐపీవో సక్సెస్



చివరి రోజుకల్లా 39 రెట్లు అధిక బిడ్స్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ మినీరత్న సంస్థ ఇండియన్ రెనెవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఐఆర్‌ఈడీఏ–ఇరెడా) పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. చివరి రోజు గురువారానికల్లా 39 రెట్లు అధిక స్పందన నమోదైంది. కంపెనీ 47 కోట్లకుపైగా షేర్లను ఆఫర్ చేయగా.. 1,827 కోట్లకుపైగా షేర్ల కోసం దరఖాస్తులు దాఖలయ్యాయి. సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 24 రెట్లు, రిటైలర్ల నుంచి దాదాపు 8 రెట్లు అధికంగా బిడ్స్ లభించాయి. అర్హతగల కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో అయితే దాదాపు 105 రెట్లు అధికంగా దరఖాస్తులు వెల్లువెత్తాయి. రూ. 30–32 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూలో భాగంగా సోమవారం(20న) యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 643 కోట్లు సమీకరించిన సంగతి తెలిసిందే.

ఈక్విటీ వివరాలిలా

ఐపీవోలో భాగంగా 40.31 కోట్ల ఈక్విటీ షేర్లను ఇరెడా తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా కంపెనీ ప్రమోటర్ కేంద్ర ప్రభుత్వం 26.88 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచింది. ఈక్విటీ జారీతో రూ. 1,290 కోట్లు, ప్రభుత్వ వాటాకు రూ. 860 కోట్ల చొప్పున లభించనున్నాయి. వెరసి ఇష్యూ ద్వారా కంపెనీ మొత్తం రూ. 2,150 కోట్లు సమకూర్చుకోనుంది. గతేడాది మే నెలలో బీమా రంగ దిగ్గజం ఎల్‌ఐసీ లిస్టింగ్ తదుపరి మళ్లీ ప్రభుత్వ రంగ సంస్థ పబ్లిక్ ఇష్యూకి రావడం విశేషం! కాగా.. ఈక్విటీ జారీ నిధులను కంపెనీ భవిష్యత్ పెట్టుబడి అవసరాలరీత్యా మూలధన పటిష్టతకు వినియోగించనుంది.

ప్యూర్ ఈవీ నుంచి ఎకోడ్రిఫ్ట్ బైక్

ధర రూ. 1,29,999



హైదరాబాద్: ఎలక్ట్రిక్ వాహనాల సంస్థ ప్యూర్ ఈవీ తమ కొత్త మోటార్ సైకిల్ వేరియంట్ ఎకోడ్రిఫ్ట్ 350ని ఆవిష్కరించింది. దీన్ని ఒక్కసారి చార్జి చేస్తే 171 కి.మీ. వరకు ప్రయాణించగలదు. ప్రతి రోజూ ఎక్కువ దూరాలు ప్రయాణించే వినియోగదారులకు ఇది ఎంతో అనువుగా ఉంటుందని సంస్థ తెలిపింది. దీనితో నెలవారీగా రూ. 7,000 పైచిలుకు ఆదా కాగలదని వివరించింది. దీని ధర రూ. 1,29,999గా ఉంటుందని ప్యూర్ సహ వ్యవస్థాపకుడు రోహిత్ వదేరా తెలిపారు. సులభతరమైన ఈఎంఐ సదుపాయం రూ. 4,000 నుంచి ఉంటుందని పేర్కొన్నారు. 110 సీసీ సెగ్మెంట్‌లో హీరో స్ప్లెండర్, హోండా షైన్, బజాజ్ ప్లాటినా వంటి మోటార్‌సైకిల్స్‌తో దీటుగా పోటీపడగలిగేలా దీన్ని తీర్చిదిద్దినట్లు వివరించారు. ఇందులో రివర్స్ మోడ్, హిల్ స్టార్ట్ అసిస్ట్, డౌన్ హిల్ అసిస్ట్ వంటి ఫీచర్లు కూడా ఉన్నాయి. 75 కి.మీ. గరిష్ట వేగంతో ప్రయాణించగలదు.

ఫేమ్ ఉల్లంఘనలపై విచారణ

నెల రోజుల్లో నివేదిక; తర్వాత చర్యలు



న్యూఢిల్లీ: ఫేమ్–2 స్కీము నిబంధనల ఉల్లంఘనలో అధికారులపరంగా తప్పిదాలు జరిగాయన్న ఆరోపణలపైనా కేంద్రం దృష్టి పెట్టింది. వాటితో పాటు వేలిడేషన్, టెస్టింగ్ ఏజెన్సీలైన ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్‌ఏఐ), ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆటోమోటివ్ టెక్నాలజీ (ఐసీఏటీ) అధికారుల పాత్రపైనా కేంద్ర భారీ పరిశ్రమల శాఖ విచారణ ప్రారంభించింది. దీనికి సంబంధించి నెల రోజుల వ్యవధిలో నివేదిక రావచ్చని శాఖ కార్యదర్శి కమ్రాన్ రిజ్వి తెలిపారు. ఆ తర్వాత ఉల్లంఘనలకు బాధ్యులైన వారితో పాటు సిస్టమ్స్‌ను కూడా సరిదిద్దే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. స్థానికంగా తయారీని, విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు.. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థలకు సబ్సిడీలు ఇచ్చేలా కేంద్రం రూ. 10,000 కోట్లతో ఫేమ్–2 స్కీమును ప్రవేశపెట్టింది. అయితే, నిబంధనలకు విరుద్ధంగా పలు కంపెనీలు పెద్ద స్థాయిలో దిగుమతి చేసుకుంటున్నాయని, ఏడు సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ప్రోత్సాహకాలు పొందాయని ఆరోపణలొచ్చాయి.

ఆచితూచి రుణాలివ్వండి..!

- ఎన్‌బీఎఫ్‌సీలకు కేంద్ర ఆర్థిక మంత్రి సూచన
- అత్యుత్సాహం ప్రదర్శించొద్దని హితవు

న్యూఢిల్లీ: ఆర్‌బీఐ సూచించిన విధంగా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లు రుణ వితరణలో అప్రమత్తంగా వ్యవహరించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. ఎర్రటి గీతను (హద్దులను/పరిమితులను) గౌరవించాలని, అత్యుత్సాహంతో దూకుడుగా వ్యవహరించరాదని కోరారు. వ్యక్తిగత రుణాలు, క్రెడిట్‌కార్డ్ రుణ విభాగంలో (అన్‌సెక్యూర్డ్) బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు గడిచిన కొన్నేళ్లలో భారీ వృద్ధిని చూపిస్తుండడం తెలిసిందే. ఫలితంగా ఈ విభాగంలో ఎన్‌పీఏలు క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో రిస్క్ నియంత్రణకు గాను ఆర్‌బీఐ ఇటీవలే నిబంధనలు కఠినతరం చేయడం తెలిసే ఉంటుంది. వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డ్‌ల రుణాలకు గాను రిస్క్ వెయిటేజీని 0.25 శాతం మేర పెంచింది. దీనివల్ల బ్యాంకుల వరకే రూ.84,000 కోట్లను అదనంగా పక్కన పెట్టాల్సి రావచ్చని అంచనా. 'డేట్ విత్ టెక్' కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి సీతారామన్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. ''ఉత్సాహం మంచిదే. కానీ, కొన్ని సందర్భాల్లో ఇదీ మరీ ఎక్కువైతే జీర్ణించుకోవడం కష్టం. దీంతో జాగ్రత్తగా ఉండాలని, దూకుడుగా వ్యవహరించడం ద్వారా తర్వాత రిస్కులు చవిచూడొద్దన్న ఉద్దేశంతోనే ఆర్‌బీఐ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలను అప్రమత్తం చేసింది'' అని మంత్రి సీతారామన్ వివరించారు.



డేటా సురక్షితం

అకౌంట్ అగ్రిగేటర్లతో (ఏఏ) పంచుకునే కస్టమర్ల డేటా దేశంలో పూర్తి సురక్షితంగా ఉంటుందని మంత్రి సీతారామన్ హామీనిచ్చారు. డేటా భద్రత విషయంలో వ్యక్తమవుతున్న ఆందోళనను తొలగించే ప్రయత్నం చేశారు. ''అకౌంట్ అగ్రిగేటర్లు డేటా బ్యాంక్ కలిగి ఉంటారనే అభిప్రాయాలు ఉండేవి. నిజానికి వారు డేటా కలిగి ఉండరు. వారి ద్వారా డేటా బదిలీ అవుతుంది. ఏఏ ద్వారా బ్యాంక్ కానీ, కస్టమర్ కానీ డేటా కలిగి ఉండరు. కేవలం రుణాల మంజూరీకే దీన్ని వినియోగించుకుంటారు''అని మంత్రి చెప్పారు.

ఆరంభ లాభాలు ఆవిరి..



ముంబై: ట్రేడింగ్‌లో తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు గురువారం చివరికి స్వల్ప నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 5 పాయింట్లు నష్టపోయి 66,018 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 10 పాయింట్లు పతనమై 19,802 వద్ద నిలిచింది. ఫార్మా, ఐటీ, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఉదయం సానుకూలంగా మొదలైన సూచీలు ఆరంభ లాభాలను నిలుపుకోవడంలో విఫలమయ్యాయి. ట్రేడింగ్ ఆద్యంతం పరిమిత శ్రేణిలో తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఇంధన, రియల్టీ, టెలికం, మెటల్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం చొప్పున రాణించాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి. ''నిఫ్టీ 19,800 స్థాయిని దాటి ముందుకెళ్లేందుకు ప్రోత్సాహానిచ్చే కీలక పరిణామాలేవీ లేకపోవడంతో పరిమిత శ్రేణి ట్రేడింగ్ రెండోరోజూ కొనసాగింది. క్రూడాయిల్ ధరలు, బాండ్లపై రాబడులు దిగిరావడం వంటి అంశాలు దేశీయ మార్కె ట్ పతనాన్ని అడ్డుకుంటున్నాయి'' అని జియోజిత్ ఫైనాన్సియల్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్



క్వార్టర్ ఫైనల్లో రష్మిక


మహిళల ప్రపంచ టెన్నిస్ టూర్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి... డబుల్స్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. బెంగళూరులో జరుగుతున్న ఈ టోర్నీలో గురువారం జరిగిన సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 21 ఏళ్ల రష్మిక 4–6, 7–5, 7–5తో నాలుగో సీడ్ వైదేహి (గుజరాత్)ను ఓడించింది. 2 గంటల 53 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక నాలుగు ఏస్‌లు సంధించింది. ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసిన రష్మిక తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయింది. డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రష్మిక-వైదేహి (భారత్) జోడీ 6–0, 6–3తో కశిష్ భాటియా-వన్షిత (భారత్) జంటపై నెగ్గింది. హైదరాబాద్‌కే చెందిన యడ్లపల్లి ప్రాంజల పోరాటం ఈ టోర్నీలో ముగిసింది. సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రాంజల 4–6, 3–6తో రుతుజా భోస్లే (భారత్) చేతిలో ఓడిపోయింది.

ప్రణయ్ ముందంజ



షెన్‌జెన్: చైనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ హెచ్‌ఎస్ ప్రణయ్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రణయ్ 21–12, 21–18తో మాగ్నస్ జొనాసెన్ (డెన్మార్క్)పై గెలుపొందాడు. మరోవైపు పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం కూడా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జోడీ 21–15, 21–16తో అకీరా కొగా–తైచి సైటో (జపాన్) జంటపై గెలిచింది.

రన్నరప్ హారిక



సాక్షి, హైదరాబాద్: జూలియస్ బేర్ అంతర్జాతీయ మహిళల ఆన్‌లైన్ స్పీడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక రన్నరప్‌గా నిలిచింది. చైనా గ్రాండ్‌మాస్టర్ హు ఇఫాన్‌తో జరిగిన ఫైనల్లో హారిక 11–15 పాయింట్ల తేడాతో ఓడిపోయింది. విజేతగా నిలిచిన హు ఇఫాన్‌కు 15,769 డాలర్లు (రూ. 13 లక్షల 13 వేలు), రన్నరప్ హారికకు 4,230 డాలర్లు (రూ. 3 లక్షల 52 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

ఐపీఎల్‌కు స్టోక్స్ దూరం



చెన్నై: ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్, చెన్నై సూపర్ కింగ్స్ జట్టు సభ్యుడు బెన్ స్టోక్స్ వచ్చే ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) నుంచి వైదొలిగాడు. పనిభారాన్ని తగ్గించుకోవడానికి స్టోక్స్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. వచ్చే ఏడాది ఐపీఎల్ కంటే ముందు భారత జట్టుతో ఇంగ్లండ్ ఐదు టెస్టుల సిరీస్ ఆడనుంది. ఆ తర్వాత జూన్‌లో టి20 వరల్డ్‌కప్ ఉంది. ఈ నేపథ్యంలో పూర్తి ఫిట్‌గా ఉండాలనే ఉద్దేశంతో స్టోక్స్ ఐపీఎల్ నుంచి తప్పుకున్నాడు. స్టోక్స్‌ను చెన్నై ఫ్రాంచైజీ రూ. 16 కోట్ల 25 లక్షలకు తీసుకోగా అతను ఈ ఐపీఎల్ సీజన్‌లో కేవలం రెండు మ్యాచ్‌లు ఆడి మోకాలి గాయంతో మిగతా టోర్నీకి దూరమయ్యాడు.

ఆఖరి బంతికి గట్టెక్కాం

- ఉత్కంఠపోరులో భారత్ విజయం
- కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన సూర్యకుమార్
- రాణించిన ఇషాన్, రింకూ సింగ్
- తొలి టి20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఓటమి
- ఇన్‌గ్లిస్ సెంచరీ వృథా
- 26న రెండో టి20 మ్యాచ్

సాక్షి, విశాఖపట్నం: పరుగుల వరద పారిన మ్యాచ్‌లో చివరికి భారత జట్టుదే పైచేయిగా నిలిచింది. ఆస్ట్రేలియాతో ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. గురువారం ఇక్కడి డాక్టర్ వైఎస్‌ఆర్–ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని భారత జట్టు రెండు వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా జట్టును ఓడించింది. తొలిసారి జాతీయ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన మ్యాచ్‌లో సూర్యకుమార్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 208 పరుగులు సాధించింది. జోష్ ఇంగ్లిస్ (50 బంతుల్లో 110; 11 ఫోర్లు, 8 సిక్స్‌లు) అంతర్జాతీయ కెరీర్‌లో తొలి సెంచరీ సాధించగా... ఓపెనర్‌గా వచ్చిన స్టీవ్ స్మిత్ (41 బంతుల్లో 52; 8 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 130 పరుగులు జోడించారు. ఇన్‌గ్లిస్ 47 బంతుల్లో సెంచరీ చేశాడు. ఈ క్రమంలో ఆస్ట్రేలియా తరఫున టి20ల్లో వేగవంతమైన సెంచరీ చేసిన ప్లేయర్‌గా ఆరోన్ ఫించ్ (47 బంతుల్లో) పేరిట ఉన్న రికార్డును సమం చేశాడు. అనంతరం భారత జట్టు 19.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 209 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (42 బంతుల్లో 80; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (39 బంతుల్లో 58; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు)– అర్ధ సెంచరీలతో అదరగొట్టగా... రింకూ సింగ్ (14 బంతుల్లో 22 నాటౌట్; 4 ఫోర్లు) ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. భారత్ విజయానికి ఆఖరి బంతికి ఒక పరుగు అవసరంకాగా... సీన్ అబాట్ వేసిన బంతిని రింకూ సింగ్ సిక్సర్‌గా మలిచి భారత విజయాన్ని ఖరారు చేశాడు. అయితే టీవీ రీప్లేలో అబాట్ వేసిన బంతి నోబాల్ అని తేలడంతో అక్కడే భారత విజయం ఖాయమైంది. దాంతో రింకూ సింగ్ సిక్స్‌ను లెక్కలోకి తీసుకోలేదు. టి20ల్లో భారత జట్టుకిదే అత్యధిక ఛేజింగ్ కావడం విశేషం. సిరీస్‌లోని రెండో టి20 మ్యాచ్ ఈనెల 26న తిరువనంతపురంలో జరుగుతుంది.





సూర్య, ఇషాన్ ధనాధన్

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు శుభారంభం లభించలేదు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (8 బంతుల్లో 21; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో సమన్వయలోపం కారణంగా మరో ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ (0) ఒక్క బంతి ఆడకుండానే తొలి ఓవర్లోనే రనౌటయ్యాడు. అనంతరం మూడో ఓవర్లో యశస్వి భారీ షాట్‌కు యత్నించి నిష్క్రమించాడు. ఈ దశలో ఇషాన్, సూర్యకుమార్ జత కలిశారు. వీరిద్దరు ఎక్కడా తగ్గకుండా ఆసీస్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. దాంతో భారత్ స్కోరు 4.5 ఓవర్లలో 50 దాటింది. పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ 2 వికెట్లకు 63 పరుగులు సాధించింది. ఆ తర్వాత కూడా ఇషాన్, సూర్య జోరు కొనసాగించడంతో భారత్ 9.1 ఓవర్లలో 100 పరుగులు చేసింది. ఇషాన్ 37 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇన్నింగ్స్ 13వ ఓవర్లో భారీ షాట్‌కు యత్నించి డీప్ ఎక్స్‌ట్రా కవర్‌లో షార్ట్ చేతికి చిక్కడంతో ఇషాన్ ఇన్నింగ్స్ ముగిసింది. తిలక్ వర్మ (10 బంతుల్లో 12; 2 ఫోర్లు) ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. ఈ దశలో సూర్య, రింకూ జతకలిసి ఐదో వికెట్‌కు 40 పరుగులు జోడించడంతో భారత్ 194/4తో విజయానికి చేరువైంది. అయితే ఇదే స్కోరు వద్ద సూర్య అవుటయ్యాడు. అప్పటికి భారత్ విజయానికి చేరువైంది.

చివరి ఓవర్ డ్రామా...

12 బంతుల్లో 14 పరుగులు చేయాల్సిన దశలో 19వ ఓవర్లో భారత్ 7 పరుగులు చేసింది. దాంతో చివరి ఓవర్లో భారత్ గెలుపునకు 6 బంతుల్లో 7 పరుగులు అవసరమయ్యాయి. తొలి బంతికే రింకూ ఫోర్ కొట్టాడు. రెండో బంతికి 'బై' రూపంలో పరుగు వచ్చింది. 4 బంతుల్లో 2 పరుగులు చేయాల్సిన దశలో భారత్ వరుసగా మూడు బంతుల్లో అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ వికెట్లను కోల్పోయింది. రెండో పరుగు పూర్తి చేసే క్రమంలో అర్ష్‌దీప్ అవుటయ్యాడు. దాంతో చివరి బంతికి భారత్ విజయానికి ఒక పరుగు అవసరమైంది. 'సూపర్ ఓవర్' అవసరం పడుతుందా అనే అనుమానం కలిగిన దశలో అబాట్ వేసిన ఆఖరి బంతిని రింకూ సిక్స్‌గా మలచడంతో భారత్ విజయం ఖరారైంది. అయితే అబాట్ బంతి నోబాల్ అని తేలడంతో రింకూ సిక్స్ షాట్‌ను పరిగణనలోకి తీసుకోలేదు.



స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: స్టీవ్ స్మిత్ (రనౌట్) 52; మాథ్యూ షార్ట్ (బి) రవి బిష్ణోయ్ 13; జోష్ ఇన్‌గ్లిస్ (సి) యశస్వి జైస్వాల్ (బి) ప్రసిధ్ కృష్ణ 110; స్టొయినిస్ (నాటౌట్) 7; టిమ్ డేవిడ్ (నాటౌట్) 19; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 208. వికెట్ల పతనం : 1–31, 2–161, 3–180. బౌలింగ్:** అర్ష్‌దీప్ సింగ్ 4–0–41–0, ప్రసిధ్ కృష్ణ 4–0–50–1, అక్షర్ పటేల్ 4–0–32–0, రవి బిష్ణోయ్ 4–0–54–1, ముకేశ్ కుమార్ 4–0–29–0.

భారత్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) స్మిత్ (బి) షార్ట్ 21; రుతురాజ్ గైక్వాడ్ (రనౌట్) 0; ఇషాన్ కిషన్ (సి) షార్ట్ (బి) తన్వీర్ 58; సూర్యకుమార్ యాదవ్ (సి) ఆరన్ హార్డి (బి) బెహ్రెన్‌డార్ఫ్ 80; తిలక్ వర్మ (సి) స్టొయినిస్ (బి) తన్వీర్ సంఘా 12; రింకూ సింగ్ (నాటౌట్) 22; అక్షర్ పటేల్ (సి అండ్ బి) సీన్ అబాట్ 2; రవి బిష్ణోయ్ (రనౌట్) 0; అర్ష్‌దీప్ సింగ్ (రనౌట్) 0; ముకేశ్ కుమార్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (19.5 ఓవర్లలో 8 వికెట్లకు) 209. వికెట్ల పతనం:** 1–11, 2–22, 3–134, 4–154, 5–194, 6–207, 7–207, 8–208. **బౌలింగ్:** స్టొయినిస్ 3–0–36–0, బెహ్రెన్‌డార్ఫ్ 4–1–25–1, షార్ట్ 1–0–13–1, సీన్ అబాట్ 3.5–0–43–1, నాథన్ ఎలిస్ 4–0–44–0, తన్వీర్ సంఘా 4–0–47–2.

సామ్యూల్స్‌పై ఆరేళ్ల నిషేధం



దుబాయ్: అవినీతి నిరోధక నియమావళిని ఉల్లంఘించినందుకు వెస్టిండీస్ మాజీ క్రికెటర్ మార్లోన్ సామ్యూల్స్‌పై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఆరేళ్ల నిషేధం విధించింది. 2019లో అబుదాబిలో జరిగిన టి10 లీగ్ సందర్భంగా సామ్యూల్స్ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి లబ్ధి పొందాడని... ఎన్నిసార్లు అతడిని విచారించినా వాటికి సంబంధించిన వివరాలు ఇవ్వకపోవడంతో నిషేధం విధిస్తున్నట్లు ఐసీసీ తెలిపింది. 42 ఏళ్ల సామ్యూల్స్ 2012, 2016లలో టి20 ప్రపంచకప్ సాధించిన వెస్టిండీస్ జట్టులో కీలక సభ్యుడిగా వ్యవహరించాడు. 2008లో మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడటంతో రెండేళ్ల నిషేధానికి గురైన సామ్యూల్స్ వెస్టిండీస్ తరఫున 71 టెస్టులు (3917 పరుగులు; 41 వికెట్లు), 207 వన్డేలు (5606 పరుగులు; 89 వికెట్లు), 67 టి20 మ్యాచ్‌లు (1611 పరుగులు; 22 వికెట్లు) ఆడాడు.

హైదరాబాద్ బోణీ



జైపూర్: విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు శుభారంభం చేసింది. మణిపూర్ జట్టుతో జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన మణిపూర్ సరిగ్గా 50 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ బౌలర్లలో రవితేజ (3/71), రక్షణ్ రెడ్డి (2/28), తనయ్ త్యాగరాజన్ (2/24) రాణించారు. అనంతరం హైదరాబాద్ కేవలం 29.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసి నెగ్గింది. హైదరాబాద్ కెప్టెన్ గాహ్లత్ రాహుల్ సింగ్ (47 బంతుల్లో 70; 13 ఫోర్లు), చందన్ సహని (32 బంతుల్లో 41; 4 ఫోర్లు, 1 సిక్స్), రవితేజ (11 బంతుల్లో 23 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు.

ఆంధ్ర పరాజయం

మరోవైపు చండీగఢ్‌లో ఆంధ్ర జట్టు పరాజయంతో ఈ టోర్నీని ప్రారంభించింది. గ్రూప్ 'డి'లో భాగంగా హిమాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఏడు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ముందుగా ఆంధ్ర జట్టు 47.3 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌటైంది. నితీశ్ రెడ్డి (59 బంతుల్లో 47; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), మనీశ్ గోలమారు (60 బంతుల్లో 46; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అనంతరం హిమాచల్ ప్రదేశ్ 43.3 ఓవర్లలో 3 వికెట్లకు 212 పరుగులు చేసి విజయం సాధించింది. అమిత్ (78 నాటౌట్; 11 ఫోర్లు), ఆకాశ్ వశిష్ఠ్ (53; 2 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు.

క్లుప్తంగా...

యాదాద్రిలో శత చండీయాగం



అగ్ని ప్రతిష్ఠ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి (శివాలయం) ఆలయంలో గురువారం శత చండీయాగానికి శ్రీకారం చుట్టారు. కార్తీక శుద్ధ ఏకాదశి మొదలుకొని కార్తీక శుద్ధ పౌర్ణమి వరకు పాంచాహ్నిక దీక్షతో చండీయాగం జరగనుంది.

అవినీతి ఆరోపణలపై స్పందించాలి

- 30లోగా పరిష్కరించాలి
- ఈసీ, డీజీపీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, ఎమ్మెల్సీ కవిత, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, బీజేపీ నేత బండి సంజయ్, ఎంపీ అర్వింద్ సహా ఇతర పార్టీల నేతల ఒకరిపై ఒకరు చేసుకున్న అవినీతి ఆరోపణలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై విచారణ జరపాలని సమర్పించిన వినతిపత్రాలను ఈ నెల 30లోగా పరిష్కరించాలని ఎన్నికల కమిషన్, రాష్ట్ర డీజీపీని హైకోర్టు ఆదేశించింది. ఓటర్లను తమ వైపు తిప్పుకోవడం కోసం ఒక పార్టీ వారిపై మరొకరు తీవ్ర అవినీతి ఆరోపణలు చేసుకుంటున్నారని, నగదు, మద్యం పంపిణీ చేస్తున్నారని.. వీటిపై విచారణ జరిపేలా ఈసీ, అధికారులను ఆదేశించాలని కోరుతూ నిజామాబాద్‌కు చెందిన సామాజిక కార్యకర్త ఎంఏ ఖాదర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నెల 2న డీజీపీ, 4న సీఈవోకు ఈ అంశంపై వినతిపత్రం సమర్పించానని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ సమర్పించిన వినతిపత్రాలను 30లోగా పరిష్కరించాలని ఈసీ, డీజీపీని ఆదేశిస్తూ, పిటిషన్‌పై వాదనలను ముగించింది.

7,588 లైసెన్స్‌డ్ ఆయుధాలు స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో గురువారం ఉదయం వరకు మొత్తం 7,588 లైసెన్స్‌డ్ ఆయుధాలను లైసెన్స్‌దారులు జమ చేశారు. అక్రమ ఆయుధాలు కలిగి ఉన్న ఎనిమిది మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా 31,680 బైండోవర్ కేసులలో 83,715 మందిని బైండోవర్ చేశారు. ఇప్పటివరకు మొత్తం 3,005 నాన్‌బెయిలబుల్ వారెంట్లను పోలీసులు అమలు చేయగా, మరో 2,483 వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయి.

ఆస్ట్రియాలో దీపావళి సంబరాలు



సాక్షి, హైదరాబాద్: ఆస్ట్రియా రాజధాని వియన్నా సమీపంలోని గ్రాజ్ నగరంలో 'స్టిరి యా ఇండియన్ అసోసియేషన్'కు చెందిన తెలుగు కుటుంబాల ఆధ్వర్యంలో దీపావళి సమ్మేళనం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన జి.రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేయగా, తెలుగు బాలిక సరయు ఆలపించిన కీర్తనతో ప్రారంభించారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: శబరికి వెళ్లే అయ్యప్ప భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మరో 18 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్టు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్-కొల్లాం, హైదరాబాద్-కొట్టాయం, మచిలీపట్నం-కొట్టాయంల మధ్య డిసెంబర్ 15వ తేదీ నుంచి జనవరి 16 వరకు ఈ ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి.

కోనప్పను అరెస్టు చేయొద్దు: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: కాగజ్‌నగర్‌లో దాఖలైన కేసులో సిర్పూర్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్పను తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు అరెస్టు చేయొద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించి విచారణను డిసెంబర్ 7కు వాయిదా వేసింది. ఈ నెల 12న బీఆర్ఎస్, బీఎస్పీ సమావేశాల సందర్భంగా ఇరుపార్టీల కార్యకర్తల మధ్య వివాదం చోటుచేసుకుంది. తనపై దాడి చేశారన్న సయ్యద్ ఫయీమ్ ఫిర్యాదు మేరకు కోనప్పతో పాటు అలీమ్‌ఖాన్, కోనేరు ఫణికుమార్, లలిత్ బల్హోత్రా, అన్షుమన్ సింగ్, కోనేరు శ్రీనివాస్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే ఈ కేసును కొట్టివేసేలా, తనను అరెస్టు చేయకుండా తదుపరి విచారణ నిలిపివేసేలా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ కోనప్ప హైకోర్టును ఆశ్రయించారు.

డీఏపై నిర్ణయం రాలేదు!

సీఈఓ వికాస్‌రాజ్ వెల్లడి
- రైతుబంధు, రుణమాఫీ, డీఏ అమలుకు ప్రభుత్వం అనుమతి కోరింది
- కేంద్ర ఎన్నికల సంఘం నుంచి నిర్ణయం రావాల్సి ఉంది
- ఇప్పటివరకు 45 వేలకు పైగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పూర్తి
- తొలిసారిగా పరిశీలకుల సమక్షంలో ఓట్ల లెక్కింపు



మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వికాస్‌రాజ్, అదనపు సీఈఓ లోకేష్‌కుమార్, జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహమద్, డిప్యూటీ సీఈఓ సత్యవాణి

సాక్షి, హైదరాబాద్: రైతుబంధు, రుణ మాఫీ పథకాలకు నిధుల విడుదల, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం (డీఏ) మంజూరుకు అనుమతి కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) నిర్ణయంవెలువడాల్సి ఉందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వికాస్‌రాజ్ చెప్పారు. తమను ఈసీ కోరిన వివరణలను పంపించామని తెలిపారు. గురువారం బీఆర్‌కేఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఓటరు గుర్తింపు కార్డులు, స్లిప్పుల పంపిణీ

'ఈ ఏడాది 51 లక్షల ఓటరు గుర్తింపు కార్డులను ముద్రించామని, పోస్టు ద్వారా వీటి పంపిణీ చివరి దశకు చేరుకుంది. గురువారం నాటికి 86 శాతం అనగా 2.81 కోట్ల ఓటర్లకు ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్పులను పంపిణీ చేశాం. శనివారంలోగా మిగిలిన స్లిప్పుల పంపిణీ పూర్తి చేస్తాం. ఓటర్లకు అవగాహన కోసం ఓటర్ గైడ్ బుక్, సీ-విజిల్‌పై కరపత్రాలను సైతం పంపిణీ చేశాం. 4,70,287 పోస్టల్ బ్యాలెట్ పత్రాలు, 8,84,584 ఈవీఎం బ్యాలెట్ పత్రాలను ముద్రించాం. టెండర్ ఓట్లు, చాలెంజ్ ఓట్లను సేకరించడం కోసం అధిక సంఖ్యలో ఈవీఎం బ్యాలెట్ పత్రాలు ముద్రించాం. ఇప్పటివరకు 32,730 మంది ఎన్నికల సిబ్బంది, 253 మంది అత్యవసర సేవల ఓటర్లు ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఓటేశారు. బుధవారం నాటికి 9,386 మంది వయోజన ఓటర్లు, 522 మంది దివ్యాంగులు ఇంటి నుంచే ఓటేశారు. 9,813 మంది సర్వీసు ఓటర్లు ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోగా, గురువారం నాటికి 275 మంది ఓటేసి వాటిని తిరిగి పంపించేందుకు తపాలా శాఖలో బుకింగ్ చేశారు..'అని సీఈఓ వెల్లడించారు. గడువులోగా ఫామ్ 12డీ సమర్పించినా తమకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించలేదని పలువురు జర్నలిస్టులు చెప్పగా..పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ప్రతి రౌండ్‌కు పరిశీలకుడి నిర్ధారణ

'ఈసారి ప్రతి శాసనసభ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియ పరిశీలకుడి సమక్షంలో జరగనుంది. ప్రతి రౌండ్ లెక్కింపును పశీలకుడు నిర్ధారించిన తర్వాతే తదుపరి రౌండ్‌కి వెళ్తారు. ప్రతి కౌంటింగ్ కేంద్రంలో 14+1 టేబుళ్లను ఏర్పాటు చేసి ఓట్లను లెక్కిస్తారు. 500కి మించి పోలింగ్ కేంద్రాలున్న 6 కేంద్రాల్లో మాత్రం టేబుళ్ల సంఖ్య రెట్టింపుగా ఉంటుంది. ఈ నెల 30న పోలింగ్ జరగనుండగా, 29న పోలింగ్ సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి ఈవీఎంలను తీసుకుని పోలింగ్ కేంద్రాలకు వెళతారు.

జీపీఎస్ ద్వారా వాహనాల ట్రాకింగ్

రాష్ట్ర వ్యాప్తంగా 35,655 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. అందులో 299 అనుబంధ పోలింగ్ కేంద్రాలు కూడా ఉన్నాయి. ఎన్నికల్లో మొత్తం 59,779 బ్యాలెట్ యూనిట్లను వాడుతున్నాం. అభ్యర్థుల సంఖ్య అధికంగా ఉన్న ఓ పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా నాలుగు బ్యాలెట్ యూనిట్లను వాడుతుండగా, మరికొన్ని చోట్ల రెండు, మూడు బ్యాలెట్ యూనిట్లను వినియోగించనున్నాం. ఈవీఎంలను తరలించే వాహనాలను జీపీఎస్ ద్వారా ట్రాక్ చేస్తాం..'అని సీఈఓ వివరించారు.

ఆ నగదు ఎవరిదో దర్యాప్తులో తేలుతుంది

'హైదరాబాద్‌లో రూ.కోట్లలో పట్టుబడిన నగదు ఏ పార్టీకి చెందిందో అన్న అంశం పోలీసుల దర్యాప్తులో తేలుతుంది. ఇప్పటివరకు రూ.669 కోట్ల విలువైన నగదు, ఇతర వస్తువులను జప్తు చేయగా, ఇందుకు సంబంధించి 10,106 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశాం. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి మరో 777 కేసులు పెట్టాం. పెద్ద ఎత్తున ఎన్నికల ప్రలోభాలను పట్టుకున్నాం. వాటిని క్లెయిమ్ చేసుకోవడానికి ఏ రాజకీయ పార్టీ, అభ్యర్థి ముందుకు రావడం లేదు..'అని చెప్పారు.

ప్రతి ఒక్కరూ ఓటేయాలి

'అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటేసేందుకు రావాలి. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, నిర్భయంగా, నైతికంగా, ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలి. 40 వేల మంది రాష్ట్ర పోలీసు బలగాలు, 25 వేల మంది పొరుగు రాష్ట్రాల పోలీసు బలగాలు, 375 కంపెనీల కేంద్ర బలగాలను మోహరిస్తున్నాం. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరిస్తాం..'అని సీఈఓ తెలిపారు. అదనపు సీఈఓ లోకేశ్‌కుమార్, జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్, డిప్యూటీ సీఈఓ సత్యవాణి పాల్గొన్నారు.

ప్రాణం పోయినా వెనకడుగేయను

- కొల్లాపూర్ స్వతంత్ర అభ్యర్థి బర్రెలక్క
- మద్దతు ప్రకటించిన అంతర్జాతీయ న్యాయవాదుల సంఘం నాయకులు



బర్రెలక్కకు మద్దతు ప్రకటిస్తున్న అంతర్జాతీయ న్యాయవాదుల సంఘం నేతలు

కొల్లాపూర్: 'నేను ఓట్లు చీల్చుతాననే భయంతో కొందరు నాపై దాడులకు ప్రయత్నిస్తున్నారు. నా తమ్ముడిపై దాడికి పాల్పడింది ఎవరో.. వారు ఏ పార్టీ వారో కూడా తెలుసు. కానీ, నేను వారి పార్టీ పేరు వెల్లడించను. ప్రాణం పోయినా.. ఈ పోరాటంలో వెనకడుగు వేయను'అని నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో అసెంబ్లీ ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థిగా నిలిచిన కర్నె శిరీష అలియాస్ బర్రెలక్క అన్నారు. గురువారం ఆమె కొల్లాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'నాలుగైదు సార్లు గెలిచిన వాళ్లు, అధికార పార్టీ వాళ్లు నన్ను చూసి భయపడుతున్నారు. అందుకే రౌడీమూకలతో నాపై దాడులకు ప్రయతిస్తున్నారు. నాకు మద్దతుగా ప్రచారం చేస్తున్న మధు అనే అన్నను సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నుంచి తొలగించారు. అండగా నిలుస్తున్న వారిని బెదిరిస్తున్నారు. అయినా నేను దేనికీ భయపడను. నేను ఇప్పుడు ఒక్క అడుగు వెనక్కి వేసినా.. భవిష్యత్‌లో వెయ్యి అడుగులు వెనక్కి వేసినదాన్ని అవుతా. యువతకు ఇది తప్పుడు సంకేతం ఇస్తుంది.'అని పేర్కొన్నారు. కాగా, ఆమెకు అంతర్జాతీయ న్యాయవాదుల సంఘం నాయకులు కావేటి శ్రీనివాసరావు, కరణం రాజేశ్, ఆదిత్య దొడ్డల అండగా ఉంటామని ప్రకటించారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, బర్రెలక్కకు రక్షణ కల్పించాలని ఎస్పీని కలసి కోరుతామన్నారు.


గన్‌మెన్లతో భద్రత కల్పించండి

హైకోర్టులో బర్రెలక్క పిటిషన్.. నేడు విచారణ

సాక్షి, హైదరాబాద్: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న తనపై రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడినందున 2ప్లస్2 గన్‌మెన్లతో భద్రత కల్పించాలని కోరుతూ కర్నె శిరీష (బర్రెలక్క) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు హోంశాఖ ప్రధాన కార్యదర్శి, చీఫ్ ఎలక్షన్ కమిషనర్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. రెండు రోజుల క్రితం కొల్లాపూర్ పరిధిలోని పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్ల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో కొందరు బర్రెలక్కతో పాటు ఆమె తమ్ముడిపై దాడి చేశారు. ఆమె తమ్ముడు తీవ్రంగా గాయపరిచారు.

విద్యుదుత్పత్తి కేంద్రాల షట్‌డౌన్ నిజమే

- కానీ వెంటనే పునరుద్ధరించాం...
- కర్ణాటక విద్యుత్ మంత్రి జార్జ్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: తమ కంటే ముందు అధికారంలో ఉన్న బీజేపీ చేసిన నిర్వాకం వల్లనే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కర్ణాటకలోని విద్యుదుత్పత్తి కేంద్రాలను షట్‌డౌన్ చేశామని ఆ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి కేసీ జార్జ్ అంగీకరించారు. అయితే, రాయచూర్‌తోపాటు పలు ప్రాంతాల రైతుల నుంచి డిమాండ్ రావడంతో వెంటనే ఆ కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని పునరుద్ధరించామన్నారు. రైతులకు అవసరమైన మేరకు తమ రాష్ట్రంలో విద్యుత్ సరఫరా చేస్తున్నామని వెల్లడించారు. తమ రాష్ట్రంలో అసలు కరెంటు కొరత లేనేలేదని వెల్లడించారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ జేడీ శీలం, ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జి అజయ్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు.

ఛత్తీస్‌గఢ్ నుంచి ఎందుకు కొంటున్నారు?

తెలంగాణలో విద్యుదుత్పత్తి సరిపోయేంత ఉంటే ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ ఎందుకు కొనుగోలు చేస్తున్నారని ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జి అజయ్‌కుమార్ ప్రశ్నించారు. ఈ కొనుగోళ్లకు సంబంధించిన రూ.3వేల కోట్ల బిల్లులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిపై చర్చించేందుకు కేటీఆర్ వస్తే కర్ణాటక విద్యుత్ మంత్రి జార్జి వస్తారని, ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

కంప్యూటర్ కోర్సుల బోధనకు..

అధ్యాపకులంతా అర్హులే

అయితే ఆయా సర్టిఫికెట్ కోర్సులు చేసి ఉండాలి
- యూనివర్సిటీలకు ఏఐసీటీఈ స్పష్టత
- ఫ్యాకల్టీ విషయంగా వర్సిటీలు వేధిస్తున్నాయంటూ వచ్చిన ఫిర్యాదులపై స్పందన
- కొత్త కోర్సులు చేసినవారే కావాలంటే ఫ్యాకల్టీ కొరత తలెత్తుతుందని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కంప్యూటర్ కోర్సులను ఏ బ్రాంచీ అధ్యాపకులైనా బోధించే వెసులుబాటు ఇవ్వాలని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) దేశంలోని అన్ని యూనివర్సిటీలనూ ఆదేశించింది. కొత్తగా వచ్చిన కోర్సుల బోధన కోసం ఇప్పటికే వాటిని పూర్తిచేసిన వారే ఉండాలన్న నిబంధన సరికాదని పేర్కొంది. దీనివల్ల ఎక్కడా ఫ్యాకల్టీ లభించని పరిస్థితి తలెత్తుతుందని, కంప్యూటర్ కోర్సుల బోధనకు సమస్య తలెత్తుతుందని స్పష్టం చేసింది. సంప్రదాయ కోర్సుల స్థానంలో కంప్యూటర్ ఆధారిత బ్రాంచీలకు డిమాండ్ పెరుగుతోందని.. వాటిలో ఫ్యాకల్టీకి సంబంధించి కొన్నేళ్లు ఇలాంటి పరిస్థితే ఉండే అవకాశం ఉందని పేర్కొంది. ఈ క్రమంలో సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్‌ను కూడా బోధనకు వినియోగించుకోవాలని సూచించింది.


వర్సిటీలు వేధిస్తున్నాయన్న ఫిర్యాదులతో..

కొన్నేళ్లుగా సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ వంటి ఇంజనీరింగ్ కోర్సులకు డిమాండ్ తగ్గుతూ.. కంప్యూటర్ ఆధారిత టెక్ కోర్సుల్లో చేరేవారు పెరుగుతున్నారు. మన రాష్ట్రంలో ఈసారి 58శాతం విద్యార్థులు కంప్యూటర్ కోర్సుల్లోనే చేరారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, రోబోటిక్స్, క్వాంటం కంప్యూటింగ్, డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సులకు డిమాండ్ బాగా పెరిగింది. అయితే కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇచ్చే యూనివర్సిటీలు ఈ కోర్సుల బోధనపై పలు షరతులు పెట్టాయి. సదరు సబ్జెక్టుల్లో పీజీ చేసిన వారినే ఫ్యాకల్టీగా నియమించాలని స్పష్టం చేశాయి. కానీ చాలా కాలేజీలు ఇతర ఇంజనీరింగ్ కోర్సులు (సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, సీఎస్ఈ) బోధిస్తున్న అధ్యాపకులను కొత్త కోర్సులకు ఫ్యాకల్టీగా నియమించాయి. ఈ అధ్యాపకులు కొత్త కోర్సులకు సంబంధించిన సర్టిఫికెట్ కోర్సులు చేసినవారేనని పేర్కొంటున్నాయి. కానీ దీనిని తాము అనుమతించబోమని, పీజీ చేసినవారిని నియమించాల్సిందేనని యూనివర్సిటీలు పట్టుపడుతున్నాయి. ఈ క్రమంలో ప్రైవేటు కాలేజీలపై వర్సిటీ అధికారుల వేధింపులు పెరిగాయంటూ కొందరు ఏఐసీటీఈకి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఏఐసీటీఈ.. ఇతర కోర్ గ్రూపులు బోధించే వారినీ కొత్త కంప్యూటర్ కోర్సుల బోధనకు అనుమతించాలంటూ వర్సిటీలకు స్పష్టత ఇచ్చింది.

ఆ కోర్సులు తప్పనిసరి

ఇంజనీరింగ్‌లో ఏ బ్రాంచీలో బోధిస్తున్న అధ్యాపకుడైనా కొన్ని కోర్సులు చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోధించాలనుకుంటే మైనర్ డిగ్రీ కోర్సుగా దానిని చేయాల్సి ఉంటుంది. ఈ కోర్సులను మూక్స్, స్వయం వంటి సంస్థలు ఆన్‌లైన్ ద్వారా అందిస్తున్నాయి. ఇతర ఇంజనీరింగ్ బ్రాంచీల అధ్యాపకులకు సాంకేతికతలు, బోధనపై అవగాహన ఉంటుందని.. అదనంగా సర్టిఫికెట్ కోర్సులు చేయడాన్ని అర్హతగా పరిగణించాలని ఏఐసీటీఈ పేర్కొంది. ఈ సర్టిఫికెట్ కోర్సులకు 18 నుంచి 20 క్రెడిట్స్ ఉంటాయని, అవి బోధనకు సరిపోతాయని స్పష్టం చేసింది.

20% అనుమతిస్తున్నాం



ఇతర బ్రాంచీల వారిని ఇప్పటికే 20శాతం వరకూ కొత్త కోర్సుల ఫ్యాకల్టీగా అనుమతిస్తున్నాం. వంద శాతం అనుమతిస్తే బోధనలో నాణ్యత ఉండదని భావిస్తున్నాం. అయితే సంబంధిత సర్టిఫికెట్ కోర్సులు చేసిన వారిని అనుమతించాలని ఏఐసీటీఈ తెలిపింది. ఇందులో సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తాం.

– ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి, జేఎన్‌టీయూహెచ్ వీసీ

అందరినీ అనుమతించాలి

కొత్త కంప్యూటర్ కోర్సులు బోధించే నైపుణ్యం అలవరచుకున్న అందరినీ బోధనకు అనుమతించాలి. దీనికి వర్సిటీలు అభ్యంతరం చెప్పడం సరికాదు. వర్సిటీల తీరుతో ఫ్యాకల్టీ లభించక బోధన కుంటుపడుతుంది. సర్టిఫికెట్ కోర్సులు చేసిన కోర్ గ్రూప్ వారికీ కంప్యూటర్ అనుబంధ కోర్సులపై పట్టు ఉంటుంది.

– వి.బాలకృష్ణారెడ్డి, సాంకేతిక, వృత్తి విద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

నేడు, రేపు పలుచోట్ల తేలికపాటి వానలు

పెరగనున్న చలి...
- రాష్ట్రానికి తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి బలమైన గాలులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వానలు కురిశాయి. రాష్ట్రానికి తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి వస్తున్న బలమైన గాలుల ప్రభావం ఫలితంగా నెలకొన్న మార్పులతో ఈ వానలు కురుస్తున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రానున్న రెండ్రోజులు కూడా రాష్ట్రమంతటా ఇదే తరహాలో వాతావరణం ఉంటుందని అంచనా వేస్తున్నారు. వానల కారణంగా వాతావరణం మరింత చల్లబడింది. దీంతో చలితీవ్రత వేగంగా పెరిగింది.

సాధారణం కంటే తక్కువగా..

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పతనమయ్యాయి. సాధారణం కంటే తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం రాష్ట్రంలో సాధారణం కంటే 2 డిగ్రీల వరకు తక్కువ ఉష్ణోగ్రత నమోదైంది. రామగుండంలో గరిష్ట ఉష్ణోగ్రత 29.6 డిగ్రీల సెల్సియస్‌గా, మెదక్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 17 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయింది. అలాగే నల్లగొండలో కనిష్ట ఉష్ణోగ్రత 18.4 డిగ్రీలు నమోదు కాగా, ఇక్కడ సాధారణం కంటే 2 డిగ్రీలు తగ్గింది. దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ కనిష్ట ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదయ్యాయి. శుక్ర, శని వారాల్లోనూ ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదు కావొచ్చని వాతావరణ శాఖ తెలిపింది.

గురువారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్)

కేంద్రం	కనిష్ట ఉష్ణోగ్రత
ఆదిలాబాద్	17.5
భద్రాచలం	24.5
హకీంపేట్	19.6
దుండిగల్	20.3
హనుమకొండ	22.5
హైదరాబాద్	21.5
ఖమ్మం	24.6
మహబూబ్‌నగర్	22.6
మెదక్	17.0
నల్లగొండ	18.4
నిజామాబాద్	20.2
రామగుండం	20.4

కొండాపూర్‌లో రూ. 5 కోట్ల నగదు సీజ్



గచ్చిబౌలి పోలీసులు స్వాధీనం చేసుకున్న రూ. 5 కోట్ల నగదు

గచ్చిబౌలి: ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న తనిఖీల్లో పోలీసులు కారులో తరలిస్తున్న రూ.5 కోట్ల నగదును పట్టుకున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. సీఐ జేమ్స్ బాబు దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం శివపల్లి గ్రామానికి చెందిన దుగ్యాల సంతోష్ రావు(36) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ కేపీహెచ్‌బీలో నివాసం ఉంటున్నారు. గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో కారులో ఆయన కొండాపూర్‌లోని అపర్ణ సెరెన్ నుంచి కేపీహెచ్‌బీకి వెళుతుండగా చిరెక్ పబ్లిక్ స్కూల్ వద్ద మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు వాహనాల తనిఖీలో భాగంగా కారును సోదా చేశారు. అందులో రెండు సూట్‌కేస్‌లలో 500 నోట్ల కట్టలు గుర్తించారు. నగదును లెక్కించగా రూ.5 కోట్లు ఉన్నాయని, లెక్కలు చూపకపోవడంతో నగదును సీజ్ చేశామని సీఐ తెలిపారు. ఈ నగదును శేరిలింగంపల్లి రిటర్నింగ్ ఆఫీసర్ ద్వారా ఐటీ శాఖ అధికారులకు అప్పగిస్తామన్నారు. కారులో సంతోష్‌రావుతో పాటు పెద్దపల్లి జిల్లాకు చెందిన ముత్యాల నరేశ్(36), చీటి సంపత్ రావు(47)లు ఉన్నట్లు సీఐ తెలిపారు.

స్కూళ్లు, కాలేజీల్లో మౌలిక వసతులు కల్పించండి

- నాలుగు వారాల్లో నివేదిక అందజేయండి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కాలేజీల్లో మౌలిక వసతులు, అగ్నినిరోధక చర్యలు, శానిటేషన్, శుద్ధిచేసిన నీరు తదితర సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ గైడ్‌లైన్స్ (ఎన్‌డీఎంఏ) పేర్కొన్న పాఠశాల భద్రతా విధానం-2016 నిబంధనల మేరకు వీటిని ఏర్పాటు చేయాలని, దీనిపై 4 వారాల్లో నివేదిక అందజేయాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పాఠశాల, ఉన్నత విద్యా శాఖల ప్రధాన కార్యదర్శులు, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ కమిషనర్, డైరెక్టర్, ఇంటర్ బోర్డు, హోంశాఖ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల డీజీ, కేంద్ర మహిళా వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శికి నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కనీస భద్రతా సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని పేర్కొంటూ హైదరాబాద్‌కు చెందిన కీతినీడి అఖిల్ శ్రీగురు తేజ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. 'హైదరాబాద్‌లోని జవహర్‌నగర్, రాంనగర్, యూసుఫ్‌గూడ, మాసబ్‌ట్యాంక్, రాజ్‌భవన్, సోమాజిగూడ, నాంపల్లి, అమీర్‌పేట్, బోరబండ, విజయానగర్, ప్రభాత్‌నగర్‌లోని పాఠశాలలతోపాటు ఆలియా జూనియర్ కళాశాలలో 8,163 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ భవనాల్లో ఎక్కడా అగ్నిమాపక యంత్రాలు, బిల్డింగ్ పటిష్టత సర్టిఫికెట్ లేదు సరికదా కనీస తనిఖీలు లేవు. సుప్రీంకోర్టు గతంలో పేర్కొన్న విధంగా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో వసతులు కల్పించేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలి'అని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. మందులు, ప్రథమ చికిత్స కిట్లు, తాగునీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు అగ్నిమాపక శిక్షణ అందించాలని, ప్రతీ మూడు నెలలకు ఒకసారి అధికారులు పాఠశాలలు, కాలేజీల్లో తనిఖీలు చేపట్టాలని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. వసతుల ఏర్పాటుపై నివేదిక అందజేయాలని ఆదేశిస్తూ విచారణ వాయిదా వేసింది.

పత్తి కొనుగోళ్లలో జీరో దందా!

- ఐటీ దాడులతో ఆ వ్యాపారుల్లో ఆందోళన
- అక్రమాలకు పాల్పడుతూ రూ. కోట్లలో పన్ను ఎగవేత



ఆసిఫాబాద్‌లో ఓ మిల్లులో కొనుగోలు చేసిన పత్తి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పత్తి రైతుల పొట్టగొట్టి రూ. కోట్లు సంపాదించిన కొందరు వ్యాపారుల అక్రమాల డొంక కదులుతోంది. రాష్ట్రంలో మూడు రోజులపాటు ఆదాయపన్ను (ఐటీ) దాడులచేసిన విషయం తెలిసిందే. కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్‌లో పత్తి వ్యాపారి రఫీక్, కాగజ్‌నగర్ కాటన్‌మిల్లు యజమాని చిలువేరు గంగన్న, కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం రేపల్లెవాడలోని మహేశ్వరి జిన్నింగ్‌మిల్లు, కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో ఆదిత్య పత్తి మిల్లు యజమానుల ఇళ్లు, కార్యాలయాలు, భాగస్వాములు, అనుమానం ఉన్న ప్రతీచోట తనిఖీలు చేపట్టారు. పెద్దయెత్తున నగదు, ఆస్తులు, బంగారం, విలువైన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. లెక్కల్లో చూపని మొత్తాన్ని తమ ఖాతాల్లో జమ చేసుకున్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు విడతల వారీగా తనిఖీలు జరిగాయి. ఐటీ శాఖ నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

మిల్లుల్లో జీరో దందా...

పత్తి సీజన్‌లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మద్దతు ధరకు రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తోంది. కానీ నగదు త్వరగా ఇస్తారన్న ఉద్దేశంతో రైతులు ఎక్కువగా ప్రైవేటు వ్యాపారులకే ఎక్కువగా విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు వ్యాపారులు అక్రమాలకు తెరతీస్తున్నారు. కొనుగోలు చేసిన మొత్తంలో కొంత పత్తిని లెక్కల్లోకి రాకుండా జీరో దందా చేస్తున్నారు. మరికొందరు దళారులతో చేతులు కలిపి తక్కువ ధరకు రైతుల నుంచి కొని మిల్లులకు తరలిస్తున్నారు. ప్రభుత్వానికి లెక్కల్లో చూపకుండా రూ. వందల కోట్లలో కొనుగోళ్లు చేస్తూ పన్నులు ఎగవేస్తున్నారు. కొందరు వ్యాపారులు తేమ, రంగు, నాణ్యత, తూకంలో మోసాలతో రైతులను ముంచుతున్నారు. నల్లగొండ, వరంగల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లా జమ్మికుంట, పత్తి మార్కెట్లు ప్రసిద్ధి గాంచాయి. చాలా చోట్ల కొద్ది మంది చేతిలోనే పత్తి పరిశ్రమలు ఉన్నాయి. భాగస్వామ్య పద్ధతిలో అనేక జిల్లాల్లో వాటాదారులుగా ఉన్నారు. ఎక్కడ మార్కెట్ అవకాశం ఉంటుందో అక్కడ వ్యాపారం చేస్తున్నారు. గత నెలలో నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో తూకంలో మోసం పాల్పడుతున్నారని రైతులు నిరసన చేపట్టారు. గతేడాది పత్తి వ్యాపారం సరిగ్గా సాగక, రైతులు అమ్ముకోలేక నిల్వ ఉంచుకోలేక అవస్థలు పడ్డారు. ప్రస్తుతం పత్తి తీత మొదలైంది. ఈ సీజన్‌లో సీసీఐ మద్దతు ధర క్వింటాల్‌కు దూది పింజను బట్టి క్వింటాల్‌కు రూ. 7,020, రూ. 6,970, రూ. 6,920 ధర నిర్ణయించి 8 శాతం నుంచి 12 శాతం వరకు తేమ, నాణ్యత ఆధారంగా ధర చెల్లించనున్నారు.

వ్యాపార, రాజకీయ సంబంధాలు...

చాలా మంది పత్తి మిల్లుల యజమానులకు రాజకీయ సంబంధాలు ఉన్నాయి. కొందరు పార్టీల్లో, మరికొందరు మద్దతుగా ఉన్నారు. ఐటీ దాడులు జరిగిన వారిలో ఆసిఫాబాద్, మంచిర్యాల, కాగజ్‌నగర్‌కు చెందిన వ్యాపారులందరికీ రాజకీయ లింకులు ఉన్నాయి. పత్తి కొనుగోళ్ల సీజన్‌లో వ్యాపారుల చేతిలో రూ. వందల కోట్లతోపాటు రైతులతో నేరుగా సంబంధాలు ఉంటాయి. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో తనిఖీలు జరిగిన మిల్లు యాజమాన్యం ఓ రాజకీయ నాయకుడికి ఉపఎన్నిక సందర్భంగా డబ్బు సమకూర్చినట్లు సమాచారం. ఇలా నియోజకవర్గాల్లోనే ఎక్కడికక్కడ ఎన్నికల్లో డబ్బు పంపిణీకి మిల్లర్లు సహకరిస్తున్నారనే కోణంలో కట్టడి చేసేందుకు ఈ దాడులు జరిగాయని కూడా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.